
గురువారం 2-5-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 40
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

నిప్పుల కొలిమి!


వాతావరణ శాఖ రాష్ట్రంలో ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాలివీ..

- రాష్ట్రవ్యాప్తంగా దంచికొడుతున్న ఎండలు.. చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటేసిన గరిష్ట ఉష్ణోగ్రతలు
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణశాఖ
- రాష్ట్రంలోని 11 జిల్లాలకు రెడ్ అలర్ట్.. మిగతా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ - 18లో


హైదరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా. చిత్రంలో మాధవీలత, కిషన్‌రెడ్డి

400 సీట్లలో బీజేపీ గెలవాలి.. అందులో హైదరాబాద్ ఉండాలి

- 40 ఏళ్లుగా రజాకార్లు ఏలుతున్నారు.. ఈసారి బీజేపీకి మంచి అవకాశం
- మేం ఏ వర్గానికీ వ్యతిరేకం కాదు.. అందరికీ అండగా ఉంటాం
- హిందూ ముస్లింలు కలిసి బీజేపీకి ఓటు వేయాలి
- పాతబస్తీ రోడ్ షోలో హోం మంత్రి అమిత్ షా
- చేతిలో కమలం పువ్వు.. విజయ సంకేతం చూపుతూ ర్యాలీ
- మర్ఫా వాయిద్యాలతో ముస్లింల ఘన స్వాగతం
- హోరెత్తిన 'జై శ్రీరామ్, వందేమాతరం, భారత్‌మాతాకీ జై' నినాదాలు..
- లాల్ దర్వాజా మహంకాళీ అమ్మవారికి పూజలు

5లో

కేసీఆర్ ప్రచారంపై నిషేధం

సిరిసిల్లలో ఆయన చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫిర్యాదుతో ఎన్నికల సంఘం చర్యలు

బుధవారం రాత్రి 8 నుంచి 48 గంటల పాటు ప్రచారానికి దూరంగా ఉండాలని ఆదేశం

ఊరేగింపులు, ర్యాలీలు వద్దని.. మీడియాకు ఇంటర్వ్యూలు కూడా ఇవ్వొద్దని సూచన

మానుకోట బస్సుయాత్ర మార్గంలో కేసీఆర్‌కు ఆర్డర్ కాపీ

జమ్మికుంట యాత్ర రద్దు చేసుకుని ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్లిన మాజీ సీఎం

రేవంత్ ఎన్ని వ్యాఖ్యలు చేసినా ఈసీ స్పందించలేదేం: కేసీఆర్

రేవంత్ బూతులు ప్రవచనాల్లా ఉన్నాయా?: కేటీఆర్

బీజేపీ, కాంగ్రెస్ మీద కొట్లాడుతున్నందుకే నిషేధం: హరీశ్‌రావు

రేవంత్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

2లో


మహబూబాబాద్‌లో నిర్వహించిన బస్సు యాత్రలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

48 గంటలు నిషేధిస్తే.. 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తరు

లక్షలాదిగా ఉన్న బీఆర్ఎస్ బిడ్డలు పోరాడుతారు
మానుకోట రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

2లో

నా పేగులు మెడలో వేసుకుంటా, గుడ్లు పీకేస్తానన్న రేవంత్‌రెడ్డిపై నిషేధం లేదు

బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ఎలా ఉండేది? ఇప్పుడెలా ఉంది?

బీజేపీ ఎజెండా రిజర్వేషన్ల రద్దే..

జాతీయ స్థాయిలో చర్చ జరగడంతో కప్పిపుచ్చుకునే ప్రయత్నం: సీఎం రేవంత్‌రెడ్డి

రిజర్వేషన్ల రద్దు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం

గతంలో రాష్ట్రపతి నారాయణన్‌తో పార్లమెంటులో చెప్పించారు

వెంకటాచలయ్య కమిషన్ వేశారు..

గోల్వాల్కర్, ఎన్‌జీ వైద్య వంటివారు రిజర్వేషన్ల రద్దుపై ప్రకటనలూ చేశారు

ఆ విషయాలను ప్రస్తావించినందుకే నాపై కేసులు.. నేను ప్రచారంలో పాల్గొనకుండా కుట్ర జరుగుతోంది

లొంగిపోతానని ఢిల్లీ సుల్తానులు అనుకుంటున్నారా అని ప్రశ్న


కూకట్‌పల్లి సభలో రేవంత్ అభివాదం. చిత్రంలో సునీతారెడ్డి, మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతమని, దాన్ని అమలు చేయడమే బీజేపీ ఎజెండా అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ వేసుకున్న ప్రణాళికలను మాత్రమే తాను ప్రస్తావించానని.. ఆధారాలతో సహా తాను చెప్తున్న అంశాలపై కేంద్రం వివరణ ఇవ్వడంగానీ, సవరించుకోవడం గానీ చేయాలని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''సమయం, సందర్భం, అవకాశం వచ్చిన ప్రతీ సందర్భంలో రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేయాలనే ఎజెండాతోనే బీజేపీ పనిచేస్తోంది. ఆ విషయాన్నే నేను ప్రస్తావించడంతో దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. తమ ఎన్నికల ప్రయోజనాలకు

మిగతా 3వ పేజీలో ▶

మే 13న తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్‌ను డకౌట్ చేస్తాం..

- సునీతారెడ్డికి ఓటు వేస్తే నాకు వేసినట్టే
- దేశాన్ని కార్పొరేట్లకు అమ్మేకుట్ర
- శేరిలింగంపల్లి, మూసాపేట, జగిత్యాల జిల్లా కోరుట్ల సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి - 3లో

తప్పుడు ప్రచారంతో బురదచల్లే ప్రయత్నం

- పదేళ్ల యూపీఏ, తొమ్మిదిన్నరేళ్ల మోదీ పాలనలో రాష్ట్రానికి మేలుపై చర్చకు రావాలి
- ఫేక్ వీడియోకు బాధ్యత సీఎందే.. ఆయనే మొదటి ముద్దాయి
- మార్ఫింగ్ వీడియోలో ఎవరి ప్రమేయమున్నా జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి - 5లో


తలపై గాడిద గుడ్డు పెట్టుకొని రేవంత్ ఊరేగుతున్నారంటూ మీడియాకు చెబుతున్న కిషన్‌రెడ్డి

రిజర్వేషన్ల రద్దు నాటకం కాంగ్రెస్ కుట్రే

- కరీంనగర్‌లో రెండోస్థానం కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ
- కేంద్రమంత్రి మురుగన్‌తో కలిసి బండి సంజయ్ రోడ్‌షో - 5లో

ఫేక్ వీడియోలపై విచారణ

- క్షేత్ర స్థాయి నుంచి నివేదిక రాగానే చర్యలు
- రెండు రోజుల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి
- 5, 6 తేదీల్లో ఇంటి వద్దే పోలింగ్ సదుపాయం: సీఈఓ వికాస్‌రాజ్

11లో

రాష్ట్రంలో పోలింగ్ సమయం పెంపు

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహణ

11లో

పాయకరావుపేటలో జరిగిన ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం..



వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న ఏపీ సీఎం జగన్ ▶



ఇవ్వడమే జగన్‌కు తెలుసు

బొబ్బిలి, పాయకరావుపేట, ఏలూరు సభల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్

- జగన్ భూములిచ్చేవాడే కానీ.. నీలా లాక్కునేవాడు కాదు చంద్రబాబూ
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం
- దేశంలో వందేళ్ల తర్వాత ఈ సర్వే జరుగుతోంది
- రికార్డులు అప్‌డేట్ చేసి రైతన్నలకు అందజేస్తున్నాం

- వివరాలు 14లో

సాక్షి ఎలక్షన్ 2024

జాతీయం.. 12లో

బారామతి నుంచి మెయిన్‌పురి దాకా...

హోరాహోరీ

తెలంగాణ 11లో

నల్లమల నాయకుడెవరు?

- తొలిసారి నాగర్‌కర్నూల్ సెగ్మెంట్‌లో త్రిముఖ పోటీ
- సిట్టింగ్ స్థానంపై బీఆర్ఎస్ గురి
- ఆది నుంచీ కాంగ్రెస్‌దే ఆధిపత్యం

ఆంధ్రప్రదేశ్ 13లో

మోసం.. వంచన..

- అప్పుడూ, ఇప్పుడూ చంద్రబాబు మేనిఫెస్టో అదే
- 2014 తరహాలోనే అడ్డగోలు హామీలతో 2024 ఎన్నికల మేనిఫెస్టో

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ నేత విజయేందర్‌రెడ్డి నివాసంలో ఐటీ సోదాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ పార్టీ కీలక నాయకుడు శాంకరి విజయేందర్‌రెడ్డి నివాసంలో బుధవారం ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా పాత్తిపల్లిచౌరస్తాలోని ఆయన నివాసంలో ఐటీ అధికారుల బృందం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి వరకు సోదాలు చేసింది. కాగా, విజయేందర్‌రెడ్డి సతీమణి సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. సోదాలు నిర్వహిస్తున్న ఐటీ అధికారులు లోపలికి ఎవరినీ అనుమతించలేదు.

దర్యాప్తు సంస్థల్ని కీలుబొమ్మగా మార్చారు: బీఆర్‌ఎస్

విజయేందర్‌రెడ్డి నివాసంలో జరిగిన ఐటీ సోదాలను బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ, ఐటీ వంటి సంస్థలను కీలు బొమ్మలుగా చేసుకుని ప్రతిపక్ష పార్టీల నేతలపై వేధింపులకు పాల్పడుతోందని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతప్రభాకర్ విమర్శించారు.

స్మార్ట్ ఫ్లైట్-టెస్ట్ విజయవంతం



అబ్దుల్ కలాం ద్వీపంలో స్మార్ట్ ఫ్లైట్-టెస్ట్

భువనేశ్వర్: ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం నిర్వహించిన సూపర్ సోనిక్ మిస్సైల్ అసిస్టెడ్ రిలీజ్ ఆఫ్ టార్పెడో (స్మార్ట్) వ్యవస్థ పరీక్ష విజయవంతమైంది. స్మార్ట్ తదుపరి తరం క్షిపణి ఆధారిత తేలికపాటి టార్పెడో డెలివరీ వ్యవస్థ. ఇది తేలికపాటి టార్పెడో సంప్రదాయ శ్రేణికి మించి, భారత నావికాదళం యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించి, అభివృద్ధి చేసింది.

48 గంటలు నిషేధిస్తే.. 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తరు

- లక్షలాదిగా ఉన్న బీఆర్‌ఎస్ బిడ్డలు పోరాడుతారు
- మానుకోట రోడ్ షోలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్
- నా పేగులు మెడలో వేసుకుంటా, గుడ్లు పీకేస్తానన్న రేవంత్‌రెడ్డిపై నిషేధం లేదు
- బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ ఎలా ఉండేది? ఇప్పుడెలా ఉంది?
- ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగమాగం చేశారు
- ఇలా అన్యాయం జరుగుతుంటే ఊరుకునే ప్రసక్తే లేదని వ్యాఖ్య
- కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపు



మహబూబాబాద్‌లో రోడ్‌షో ముగిసిన అనంతరం ఎన్నికల కమిషన్ ఇచ్చిన 48 గంటల ప్రచార నిషేధ ఉత్తర్వులను కేసీఆర్‌కు అందజేస్తున్న కురవి తహసీల్దార్ సునీల్‌రెడ్డి

సాక్షి, మహబూబాబాద్: ''నా మీద ఎలక్షన్ కమిషన్ నిషేధం పెట్టింది. 48 గంటలు కేసీఆర్ ప్రచారం చేయవద్దని నిషేధం విధించింది. అందరికీ మనవి చేస్తున్నా.. రేవంత్‌రెడ్డి నన్ను ఉద్దేశించి.. నీ పేగులు మెడలో వేసుకుంటా.. నీ గుడ్లు పీకుతానంటూ అడ్డగోలుగా మాట్లాడితే ఎలక్షన్ కమిషన్ నిషేధం పెట్టలేదు. నామీద నిషేధం పెట్టింది. 48 గంటలు నా ప్రచారం నిషేధిస్తే.. లక్షలాదిగా ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తరు..''అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర బుధవారం మహబూబాబాద్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''కేసీఆర్ ఉన్నదే తెలంగాణ కోసం. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నేనేం చేశానో మీ అందరికీ తెలుసు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో తెలంగాణ ఎలా ఉండేది? కాంగ్రెస్ సర్కారు ఐదు నెలల్లో తెలంగాణను ఆగం చేసింది.

ఊరుకునే ప్రసక్తే లేదు..

సాగునీరు, తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉన్న తెలంగాణ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగమైంది. ప్రధాని మోదీ గోదావరి జలాలు తరలించుకుపోయే ప్రయత్నాలు చేస్తున్నారు. కృష్ణా జలాలను కేఆర్‌ఎంబీకి అప్పగించారు. ఇంత జరిగినా సీఎం రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదు. వారేం చేస్తారో.. రాష్ట్రానికి ఏ నష్టం తీసుకొస్తారో..! ఎంతకాలం చూస్తాం? రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదు. నా ప్రాణం ఉన్నంత వరకు తెలంగాణకు అన్యాయం జరగనివ్వను.

అరచేతిలో వైకుంఠం చూపించి..

ఎన్నికల సమయంలో ఇది ఇస్తాం.. అది ఇస్తామంటూ కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను మోసం చేసింది. ఒక్క ఉచిత బస్సు మినహా మరేదైనా వచ్చిందా? రైతుబంధు లేదు. కల్యాణ లక్ష్మి లేదు. తులం బంగారం లేదు. రాష్ట్రంలో రైతుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన చొప్ప దొండి రైతు అక్కడ ఇబ్బందులకు తట్టుకోలేక గుండె ఆగి చనిపోయారు.

కాంగ్రెస్ వచ్చింది.. కరువు వచ్చింది

పదేళ్లుగా సుభిక్షంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చింది.. కరువు వచ్చింది. సాగు, తాగునీరు లేక రాష్ట్రం ఎడారిగా మారింది. కాళేశ్వరం నీళ్లు ఎందుకు రావడం లేదో ఆలోచించాలి. ఖమ్మం జిల్లాలో మురికి నీరు తాగుతున్నారు. మహబూబాబాద్, నర్సంపేట, డోర్నకల్ నియోజకవర్గాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఇచ్చిన కరెంట్, మిషన్ భగీరథ నీళ్లు ఎటుపోయాయి? ఆటో కార్మికుల జీవితాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది. వారి కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది.

గిరిజనులను అక్కున చేర్చుకున్నది బీఆర్‌ఎస్సే..

తరతరాలుగా వెనుకబడిన గిరిజనులను అక్కున చేర్చుకుని, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ సర్కారు నిధులు కేటాయించింది. ఏడు దశాబ్దాలుగా ఏ పార్టీ చేయని విధంగా వారి అస్తిత్వానికి నిదర్శనమైన సేవాలాల్ బంజారా భవనం కట్టుకున్నాం. రిజర్వేషన్ పెంచి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించాం. బీఆర్‌ఎస్‌కు గిరిజనులు, ఆదివాసీలు అండగా ఉండాలి. ప్రతీ క్షణం, ప్రతీ అడుగు, ప్రతీ మాట ప్రజల కోసమే పనిచేసే బీఆర్‌ఎస్‌ను దీవించాలి. అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలి..''అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

కేసీఆర్ ఆనవాళ్లు ఎవరూ చెరపలేరు

- ఆయన పాత బాస్‌తో మాట్లాడుకుని తెలంగాణ లేకుండా చేస్తే తప్ప.. రేవంత్ జేజమ్మ దిగొచ్చినా కేసీఆర్‌ను ఏమీ చేయలేరు
- కార్పొరేట్లకు మోదీ రుణమాఫీ చేయలేదని కిషన్, బండి నిరూపిస్తే రాజీనామా చేస్తా
- మాజీ మంత్రి కేటీఆర్



మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారు.. అయితే కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసేసత్తా రేవంత్‌కి గానీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి గానీ లేదు. రేవంత్ రెడ్డి ఆయన పాత బాస్‌తో మాట్లాడుకుని తెలంగాణ లేకుండా చేస్తే తప్ప కేసీఆర్ ఆనవాళ్లు చెరపడం జేజమ్మతో కూడా సాధ్యం కాదు'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. పెట్రోలు డీజిల్ ధరలపై సెస్సు రూపంలో రూ.30లక్షల కోట్లు వసూలు చేసిన మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు రూ.14లక్షల కోట్లు రుణమాఫీ చేసింది. తాను చేస్తున్న ఆరోపణలు తప్పని బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా'అని కేటీఆర్ సవాల్ చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న బీజేపీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు కానీ మోదీ మిత్రుడు ఆదానీ ప్రపంచ కుబేరుల్లో 609 నుంచి రెండో స్థానానికి చేరుకున్నారని ఆరోపించారు. కార్పొరేట్లకు రద్దు చేసిన రుణమాఫీతో దేశ వ్యాప్తంగా రైతులకు పదేళ్ల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చన్నారు. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా జరిగిన మే డే వేడుకల్లో కేటీఆర్ మాట్లాడారు. 'కరోనా సమయంలో కార్మికులు సొంతూర్లకు వెళ్లేందుకు కనీసం రైళ్లు కూడా నడపకుండా చావగొట్టింది బీజేపీ ప్రభుత్వం. కానీ మోదీ కారణంగానే మనందరమూ బతికున్నామని బీజేపీ సిగ్గులేకుండా ప్రచారం చేస్తోంది. కార్మికులు, కర్షకుల మరణాలకు కారణమైన మోదీ దేవుడా'అని కేటీఆర్ ప్రశ్నించారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం సెస్ వసూలు చేశామని చెప్తున్న బీజేపీ టోల్ టాక్స్ ఎందుకు రద్దు చేయడం లేదని నిలదీశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే సింగరేణితో పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా అమ్మకానికి పెడుతుందని ఆయన ఆరోపించారు.

పదేళ్లలో ఉపాధి అవకాశాలు పెంచాం

'పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు భారీగా వేతనాలు పెంచడంతో పాటు చేనేత, గీత , బీడీ కార్మికులకు పింఛన్ అందజేశాం. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు 73శాతం వేతనం పెంచాం. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో ఉపాధి అవకాశాలు పెంచిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే''అని కేటీఆర్ వివరించారు. రేవంత్ పాలనలో నాలుగు నెలల్లోనే సిరిసిల్ల చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తలెత్తిందన్నారు. ఉచిత బస్సు స్కీంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేసిన కేటీఆర్ సిరిసిల్ల నేత కార్మికులకు అండగా ఉంటామని ప్రకటించారు. 'బీఆర్‌ఎస్ కార్మిక విభాగం కార్యకలాపాలను ఇకపై తానే స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పిన ఆయన భవిష్యత్తులో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ యూటీ వాదనలు ఆగాలంటే..

ఈ లోక్‌సభ ఎన్నికల్లో 10 నుంచి 12 సీట్లు వస్తే రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారని కేటీఆర్ అంచనా వేశారు. హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం చేస్తామనే వాదనలు, గోదావరి జలాలను ఇతర రాష్ట్రాలకు మళ్లింపు ప్రతిపాదనలు, రిజర్వేషన్ల రద్దు వంటివి ఆగాలంటే బీఆర్‌ఎస్ ఎంపీలు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీని చూస్తుంటే ఏవగింపు కలుగుతోందన్న కేటీఆర్ యాదగిరిగుట్ట ఆలయాన్ని అత్యంత వైభవంగా పునర్నిర్మించిన కేసీఆర్ ఏనాడూ దాన్ని రాజకీయాల కోసం వాడుకోలేదని గుర్తు చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నాయకులు రూప్‌సింగ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రచారంపై నిషేధం

సిరిసిల్లలో ఆయన చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫిర్యాదుతో ఎన్నికల సంఘం చర్యలు

- బుధవారం రాత్రి 8 నుంచి 48 గంటల పాటు ప్రచారానికి దూరంగా ఉండాలని ఆదేశం
- ఊరేగింపులు, ర్యాలీలు వద్దని.. మీడియాకు ఇంటర్వ్యూలు కూడా ఇవ్వొద్దని సూచన
- మానుకోట బస్సుయాత్ర మార్గంలో కేసీఆర్‌కు ఆర్డర్ కాపీ
- జమ్మికుంట యాత్ర రద్దు చేసుకుని ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్లిన మాజీ సీఎం
- రేవంత్ ఎన్ని వ్యాఖ్యలు చేసినా ఈసీ స్పందించలేదేం: కేసీఆర్
- రేవంత్ బూతులు ప్రవచనాల్లా ఉన్నాయా?: కేటీఆర్
- బీజేపీ, కాంగ్రెస్ మీద కొట్లాడుతున్నందుకే నిషేధం: హరీశ్‌రావు
- రేవంత్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఈసీకి బీఆర్‌ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు 48 గంటల పాటు లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. మే ఒకటో తేదీ బుధవారం రాత్రి 8 గంటల నుంచి మే 3వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటల వరకు రెండు రోజుల పాటు ఎన్నికల ప్రచారం చేయకుండా నిషేధం విధించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని, మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు కూడా ఇవ్వకూడదని స్పష్టం చేసింది. బస్సు యాత్రలో భాగంగా మానుకోటలో ఉన్న కేసీఆర్‌కు అధికారులు ఈసీ ఆదేశాలను అందజేశారు. దీంతో మహబూబాబాద్ రోడ్ షోలో రాత్రి 7.45 గంటలలోపు ప్రసంగాన్ని ముగించిన కేసీఆర్.. ఈసీ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ప్రచారాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. అక్కడి నుంచి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలోని తన నివాసానికి వెళ్లిపోయారు. ఈసీ విధించిన గడువు ముగిశాక కేసీఆర్ తిరిగి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ ఫిర్యాదు నేపథ్యంలో..

ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు కేసీఆర్ ఏప్రిల్ 5న 'పొలం బాట'పేరిట కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో.. నేత కార్మికులను ఉద్దేశించి స్థానిక కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేసీఆర్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి పలు వ్యాఖ్యలు చేశారు. వరి ధాన్యానికి క్వింటాల్ రూ.500 చొప్పున బోనస్ ఇవ్వకుంటే కాంగ్రెస్‌ను వేటాడతామంటూ మాట్లాడారు. ఇలా సిరిసిల్లలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్.. ఏప్రిల్ 6న కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌పై కేసీఆర్ అవమానకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు.. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విచారణ జరిపి ఏప్రిల్ 10న నివేదిక సమర్పించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆ నివేదిక ఆధారంగా వివరణ ఇవ్వాలంటూ కేసీఆర్‌కు ఏప్రిల్ 16న షోకాజ్ నోటీసు జారీ చేసింది. ''విలేకరుల సమావేశంలో మాట్లాడిన కొన్ని వ్యాఖ్యలను మాత్రమే కాంగ్రెస్ ప్రత్యేకంగా పేర్కొంటూ ఫిర్యాదు చేసింది. తెలంగాణ, సిరిసిల్ల ఎన్నికల ఇన్‌చార్జులుగా పనిచేస్తున్న అధికారులకు తెలంగాణ మాండలికం పూర్తిగా అర్థం కాదు. నేను చేసిన వ్యాఖ్యలను ఇంగ్లిషులోకి తప్పుగా అనువదించడంతోపాటు వక్రీకరించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ విధానాలు, పథకాలను మాత్రమే విమర్శించాను''అని కేసీఆర్ ఈసీకి సమాధానం ఇచ్చారు. కానీ ఈ సమాధానంతో సంతృప్తి చెందని ఈసీ.. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కరీంనగర్‌లో, 2023 అక్టోబర్‌లో బాన్సువాడ సభలో చేసిన వ్యాఖ్యలపైనా హెచ్చరికలు చేశామని గుర్తు చేసింది. రెండు రోజుల పాటు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఆదేశించింది.

సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ ఫిర్యాదు

సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నకిలీ పత్రాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ కోరింది. ఈ మేరకు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లు, మెస్‌ల మూసివేతకు సంబంధించి గతేడాది మే 12న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లోని అంశాలను వక్రీకరిస్తూ.. నకిలీ సర్క్యులర్‌ను ఉద్దేశపూర్వకంగా 'ఎక్స్'లో పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకు, ఓటర్లను ప్రభావితం చేసేందుకు రేవంత్‌రెడ్డి తప్పుడు సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న అబద్ధపు ప్రచారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సుయాత్ర రీ షెడ్యూల్‌పై కసరత్తు

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 24 నుంచి మే 10 వరకు 17 రోజుల బస్సుయాత్రను కేసీఆర్ చేపట్టారు. మిర్యాలగూడలో మొదలైన యాత్ర వరుసగా 8 రోజుల పాటు సాగి బుధవారం రాత్రి మహబూబాబాద్‌కు చేరుకుంది. కానీ ఈసీ ఆదేశాలతో రెండు రోజులపాటు బస్సుయాత్రను నిలిపివేశారు. షెడ్యూల్ ప్రకారం.. కేసీఆర్ బుధవారం రాత్రి వరంగల్‌లో బస చేసి.. గురువారం జమ్మికుంట, వీణవంకలలో, శుక్రవారం రామగుండంలో రోడ్ షోలు నిర్వహించాల్సి ఉంది. ఈసీ నిషేధం నేపథ్యంలో కేసీఆర్ ఎన్నికల ప్రచారాన్ని రీషెడ్యూల్ చేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. మార్పులపై గురువారం స్పష్టత ఇస్తామని ప్రకటించింది.

తెలంగాణ గొంతుపై నిషేధమా?: కేటీఆర్

కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై ఈసీ నిషేధాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తప్పుపట్టారు. 'ఎక్స్'వేదికగా తన స్పందనను పోస్ట్ చేశారు.''ఇదెక్కడి అరాచకం? తెలంగాణ గొంతు కేసీఆర్‌పైనే నిషేధమా? ప్రధాని మోదీ విద్వేష వ్యాఖ్యలు ఎన్నికల కమిషన్‌కు కమిషన్‌కు వినిపించలేదా? వేలాది మంది పౌరులు ఆయనకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. రేవంత్ బూతులు ఎన్నికల కమిషన్‌కు ప్రవచనాల్లా అనిపించాయా? అసభ్య పదజాలం వాడుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌పై ఎలాంటి చర్యలూ ఉండవా? బడే భాయ్.. చోటే భాయ్ కలసి చేసిన కుట్ర కాదా ఇది. కేసీఆర్ పోరుబాటతో బీజేపీ, కాంగ్రెస్ ఎందుకు వణికిపోతున్నాయి? మీ అహంకారానికి, వ్యవస్థల దుర్వినియోగానికి తెలంగాణ ప్రజలు దీటైన సమాధానం ఇస్తారు''అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రశ్నిస్తే ప్రచారం వద్దంటున్నారు: హరీశ్‌రావు

''కాంగ్రెస్, బీజేపీల మీద కేసీఆర్ గట్టిగా కొట్లాడుతున్నారనే రెండు రోజులు ప్రచారం ఆపారు. మోదీ మత విద్వేషాలు రెచ్చగొడితే.. రేవంత్ బూతులు మాట్లాడితే ఎన్నికల కమిషన్‌కు కనిపించవా? ప్రశ్నించే కేసీఆర్‌ను మాత్రం ప్రచారం చేయొద్దు అంటున్నారు. రెండు రోజులు కేసీఆర్ ప్రచారం ఆగినంత మాత్రం జరిగేదేంటి?''అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెలో ఉంటారని చెప్పా రు. కేసీఆర్ బస్సుయాత్ర చేస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ గజగజ వణుకుతున్నాయన్నారు. కేసీఆర్ అంతటి వ్యక్తిని దుర్భాషలు ఆడుతున్న రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగదీశ్‌రెడ్డిని జైలుకు పంపిస్తాం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

తుంగతుర్తి: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసి కోట్లాది రూపాయలు సంపాదించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని జైలుకు పంపించడం ఖాయమని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలసి మాట్లాడారు. సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం, యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణాల్లో జగదీశ్‌రెడ్డి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కిరాయి ఇంట్లో ఉండే వ్యక్తికి ఇన్ని కోట్లు ఎక్కడినుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని పూర్తిగా దివాలా తీయించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. లిక్కర్ కుంభకోణంలో పీకల లోతు మునిగిపోయిన కవిత ప్రస్తుతం జైల్లో ఉన్నారని, ఆమె వచ్చే బతుకమ్మ కూడా జైల్లోనే ఆడతారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దోచుకుని దాచుకున్నది సరిపోక మళ్లీ కేసీఆర్ బస్సు యాత్ర పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం కొనసాగుతుందని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకొని సత్తా చాటుతుందని అన్నారు. రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు అడ్డగోలుగా మాట్లాడుతున్నాయని, ఆగస్టు 15వ తేదీలోగా తమ ప్రభుత్వం రైతుల రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని స్పష్టం చేశారు.


బీజేపీపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం..

మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటలో వాకర్స్‌తో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో వెంకట్రామిరెడ్డి

సిద్దిపేటజోన్: 'బీజేపీకి ఓటమి ఖాయం. అందుకే ఫేక్ వీడియోలు, అబద్ధాలు, గోబెల్స్ ప్రచారంతో లబ్ధి పొందాలని కుట్ర చేస్తోంది. మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై దొంగ వీడియో తయారు చేసి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు, పోలీసులకు పార్టీ పక్షాన ఫిర్యాదు చేస్తాం'అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటి చెరువు నెక్లెస్‌రోడ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి పార్టీ అభ్యర్థిని బలపర్చాలని కోరారు. అనంతరం పట్టణంలో పాదయాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గతంలో దుబ్బాక ఉప ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు ఫేక్ వీడియో ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేసి ప్రజలను అయోమయంలో పడేసిన చరిత్ర బీజేపీకి ఉందని విమర్శించారు. ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మీద సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసి మళ్లీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఫేక్ వీడియోలు, ఫేక్ వార్తలు నమ్మొద్దని ఆయన ప్రజలకు సూచించారు.



సారు.. కారు.. రావాలి!

- మానుకోటలో కేసీఆర్‌కు ఘన స్వాగతం ఉద్యమ కాలాన్ని తలపించిన ప్రసంగం
- మళ్లీ మీరే రావాలి.. సీఎం కావాలంటూ కార్యకర్తలు, అభిమానుల నినాదాలు
- కేసీఆర్ ప్రచార నిషేధంపై ప్రజల్లో తీవ్ర చర్చ

సాక్షి, మహబూబాబాద్: ఉద్యమాల కోట మానుకోటలో గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్తేజం నింపింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ బుధవారం రాత్రి మానుకోటలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణమంతా గులాబీమయంగా మారింది. మానుకోట పార్లమెంట్ పరిధిలోని డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ఇల్లెందు, ములుగు తదితర ప్రాంతాల నుంచి వేల మంది ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. వారితో కార్నర్ మీటింగ్ నిర్వహించిన ఇందిరాగాంధీ సెంటర్ కిక్కిరిసిపోయింది. భారీగా జనం తరలిరావడంతో.. కేసీఆర్ కూడా మరింత ఉత్సాహంగా ప్రసంగించడం కనిపించింది. 'మానుకోట జిల్లాగా ఉండాలా.. వద్దా? వద్దన్న సీఎం రేవంత్‌ను ఏం చేద్దాం? కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం వస్తోందా? ధాన్యానికి రూ.500 బోనస్ వస్తుందా?'అని ప్రశ్నిస్తూ ఉత్సాహపర్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు 'కేసీఆర్ సార్.. మళ్లీ సీఎంగా రావాలి.. సీఎం .. సీఎం'అంటూ నినాదాలు చేయడం కనిపించింది. కేసీఆర్ ప్రసంగం ఉద్యమకాలాన్ని గుర్తు చేసిందని ప్రజల్లో, కార్యకర్తల్లో అభిప్రాయం వ్యక్తమైంది.

ప్రచార నిషేధంపై చర్చ

ఎన్నికల కమిషన్ 48 గంటల పాటు కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించడంపైనా ప్రజలు, పార్టీ శ్రేణులు చర్చించుకోవడం కనిపించింది. ''ఇదేం పని.. ఇది సరికాదు.. సారు జనాల్లో ఉండాలే..''అని కార్యకర్తలు, అభిమానులు పేర్కొన్నారు. ఇక ''నా ప్రసంగం ఆగినా మీరు మాత్రం ప్రచారం ఆపొద్దు.. 96 గంటలు రెట్టింపు ప్రచారం చేయాలి''అని కేసీఆర్ పిలుపునివ్వడంతో సిద్ధమేనంటూ ఉత్సాహంగా సమాధానమిచ్చారు.

కేసీఆర్ హయాంలోనే ప్రజలకు మేలు



కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఎలాంటి పథకాలు అమలు కావడం లేదు. మాటలు చెప్తున్నారే తప్ప హామీలు అమలు చేయడం లేదు.
– సాదనాల పద్మ, అయోధ్య, మహబూబాబాద్

కేసీఆర్ సారే మళ్లీ రావాలి..



బీఆర్‌ఎస్ హయాంలో నీళ్లు ఉన్నాయి.. పంటలు బాగా పండాయి. పథకాలు మంచిగా అమలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి. పథకాల జాడ లేదు. రుణమాఫీ లేదు. కేసీఆర్ సారే మళ్లీ రావాలి. – బోగోజు శ్రవణ్‌కుమార్, రామన్నగూడెం, నర్సింహులపేట

బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ అరెస్టు



క్రిశాంక్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (వృతంలోని వ్యక్తి)

సాక్షి, హైదరాబాద్/లాలాపేట/చౌటుప్పల్: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని మెస్‌ల మూసివేతపై సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేశారంటూ బీఆర్‌ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపిన వివరాల మేరకు.. వేసవి సెలవుల సందర్భంగా యూనివర్సిటీ హాస్టల్స్, మెస్‌ల మూసివేతపై వర్సిటీ అధికారులు ఇటీవల ఓ సర్క్యులర్ జారీ చేశారు. దానిపై బీఆర్‌ఎస్ నేతలు యూనివర్సిటీలో విద్యుత్ కొరత, నీటి సమస్యలతో యూనివర్సిటీ హాస్టల్స్, మెస్‌లను మూసివేస్తున్నారంటూ ప్రచారం చేశారు. దీనిపై యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారంటూ విశ్వవిద్యాలయ అధికారులు ఇటీవల ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు క్రిశాంక్ కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా పంతంగి టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

క్రిశాంక్ అరెస్టు దుర్మార్గం: కేటీఆర్

క్రిశాంక్ అరెస్టు అన్యాయం, దుర్మార్గమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు మండిపడ్డారు. క్రిశాంక్ అరెస్టుపై బుధవారం ఆయన 'ఎక్స్'లో స్పందించారు. 'క్రిశాంక్ ఉద్యమ గొంతుక.. చైతన్య ప్రతీకఅని, గల్లీ కాంగ్రెస్ వైఫల్యాలపై, ఢిల్లీ బీజేపీ అరాచకాలపై గళమెత్తినందుకే ఆయనపై ఈ దౌర్జన్యం' అని ఆయన ఆరోపించారు. ఈ నియంతృత్వ, నిర్బంధాలకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.



ఆ వీడియోకు.. నాకు సంబంధం లేదు

• ఢిల్లీ పోలీసులకు న్యాయవాది ద్వారా సమాధానం పంపిన రేవంత్

సాక్షి, హైదరాబాద్: అమిత్ షా మాటలతో సోషల్ మీడియాలో వీడియో పెట్టిన ఘటనకు, తనకు సంబంధం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్య క్షుడు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీ పోలీసులిచ్చిన నోటీసులకు తన న్యాయవాది ద్వారా ఆయన సమాధానం పంపారు. ఐఎన్‌సీ తెలంగాణ అనే ట్విటర్ ఖాతాను తాను నిర్వహించడం లేదని, సీఎంఓ తెలంగాణతో పాటు తన వ్యక్తిగత ఖాతాలను మాత్రమే తాను వినియోగిస్తున్నానని ఆ సమా ధానంలో ఆయన స్పష్టం చేశారు. రేవంత్ తరఫు న్యాయవాది సౌమ్యగుప్త ద్వారా ఈ సమాధానాన్ని ఆయన ఢిల్లీ పోలీసులకు చేరవేసినట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

కాంగ్రెస్ నేత గీతకు ఢిల్లీ పోలీసుల నోటీసులు

అడ్డగుట్ట (హైదరాబాద్): లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన కాంగ్రెస్ నేత గీతకు బుధవారం ఢిల్లీ పోలీసులు నోటీసులిచ్చారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను మార్చేసి సామాజిక మాధ్యమాల్లో రిజర్వేషన్లు రద్దు చేస్తామని అన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో గీతకు నోటీసులివ్వడం కలకలం రేపింది. శాంతినగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పరిసరాల్లోని ఆమె నివాసంలో వీటిని అందజేసి ఆమె సెల్‌ఫోన్‌ను కూడా సీజ్ చేశారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయానికి సంబంధించి ఎలాంటి సమాచారం స్థానిక లాలాగూడ పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

గాంధీభవన్‌లో మేడే వేడుకలు

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో కార్మిక దినోత్స వాలు ఘనంగా జరిగాయి. మేడే పురస్కరించుకుని బుధవారం టీపీసీసీ లేబర్ సెల్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ జెండాను ఆవి ష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్య క్షుడు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.





కోరుట్లలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు. మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

బీజేపీ, బీఆర్ఎస్‌ను డకౌట్ చేస్తాం

శేరిలింగంపల్లి, మూసాపేట, కోరుట్ల సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి,కరీంనగర్/శేరిలింగంపల్లి/మూసాపేట: మే 13న తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్‌లను డకౌట్ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి తారానగర్‌లోని తుల్జాభవానీ మాత ఆలయం ముందున్న ప్రధానరోడ్డులో బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 3న సెమీ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌ను తొడగొట్టి చిత్తు చేసి ఓడించాం ..మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తు చేయడం ఖాయమని చెప్పారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్ రెడ్డిని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పదేళ్ల కాలంలో ప్రధాని మోదీ ఇచ్చింది ఏమీ లేదని.. ఏపీకి పాచిపోయిన రెండు లడ్లు, కర్ణాటకకు చెంబు, తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఐటీఐఆర్ ప్రకటించిందని, ఐఐఎం, ఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీ, ఐటీ సంస్థలు, ఫార్మా కంపెనీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు.

సునీతారెడ్డికి ఓటు వేస్తే నాకు వేసినట్టే

మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి వేసే ప్రతి ఓటు తనకు వేసినట్టే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గపరిధిలోని మూసాపేటలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఎంపీగా సునీతమ్మను గెలిపిస్తే తనను గెలిపించినట్టే అన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ దొర పాలనను తుంగలో తొక్కి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చారని చెప్పారు. అర్ధరాత్రి పోలీసులతో తలుపులు కొట్టించి అరెస్టు చేయించి కొడంగల్‌లో ఓడించాడని, సోనియమ్మ ఆశీస్సులతో మల్కాజ్‌గిరి ఎంపీగా నిలబడితే ఇక్కడి ప్రజలే ప్రశ్నించే గొంతుక ఉండాలని తనను గెలిపించారని చెప్పారు.

దేశాన్ని కార్పొరేట్లకు అమ్మే కుట్ర..

రాజ్యాంగాన్ని మార్చి, దళితులు, బీసీల రిజర్వేషన్లు తొలగించి మొత్తం దేశాన్నే అంబానీ, అదానీలాంటి కార్పొరేట్ కంపెనీలకు అమ్మేసే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం జగిత్యాల జిల్లా కోరుట్లలో నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా 'కోరుట్ల జనజాతర' పేరిట ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బీజేపీ, ప్రధాని మోదీ విధానాలపై విరుచుకుపడ్డారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్న ఈ సభలో రేవంత్ ఏమన్నారంటే.. 'ముందుగా కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు. సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్, ఆటో రిక్షా కార్మికులు, సకల జనుల సమ్మెలో పోరాడితేనే తెలంగాణ కల సాకారమైంది. ఈసారి దేశంలో జరుగుతున్న ఎన్నికలు ఆషామాషీ కావు. 400 సీట్లు గెలవడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయి. ఈడీ, సీబీఐ తరహాలో ఢిల్లీ పోలీసులతో కేసులు పెట్టిస్తే నేను, కాంగ్రెస్ కార్యకర్తలు భయపడం. ఇలాగే పదేళ్ల కేసులు పెట్టి కాంగ్రెస్ కార్యకర్తలను వేధించిన కేసీఆర్‌ను మొన్న ఎన్నికల్లో ప్రజలు నడుం విరగ్గొట్టి మూలకు కూర్చోబెట్టారు. కొమురంభీం, చాకలి ఐలమ్మలు పుట్టిన గడ్డ అని మర్చిపోవద్దు. ఇక్కడ ప్రజలను అణచాలని చూసిన నిజాం, రజాకార్లకు ఏం గతిపట్టిందో తెలుసుకుంటే బీజేపీకే మంచిది' అని వ్యాఖ్యానించారు.

75 ఏళ్లు అవుతున్నా మార్పురాలేదు

'అంబేడ్కర్‌లాంటి మహనీయుల చొరవతో సమాజంలో వెనకబడ్డ దళితులు, బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించింది. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా దళిత, గిరిజన, బలహీన వర్గాల జీవితాల్లో పూర్తిస్థాయిలో మార్పు రాలేదు. 150 రోజులు 4000 కి.మీ భారత్ జోడో పేరిట పాదయాత్ర చేసిన సమయంలో బలహీనవర్గాలకు చెందిన డాక్టర్లు, ఇంజినీర్లు ఇతర మేధావులు రాహుల్‌గాంధీని కలిసి ఈ దేశంలో 52శాతం ఉన్న తమకు జనాభా దామాషా ప్రకారం రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీ గణనకు కేబినెట్ తీర్మానం చేశాం. ఉమ్మడి రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దే.

మామిడి పరిశోధన కేంద్రం మంజూరు చేస్తా

జీవన్‌రెడ్డి.. 43 ఏళ్లుగా ఆరుసార్లు ఎమ్మెల్యే, మంత్రి, ఎమ్మెల్సీగా నిర్వహించిన ప్రతీ పదవికీ వన్నె తెచ్చారు. జగిత్యాలకు జీవన్‌రెడ్డి అడిగిన మామిడి పరిశోధన కేంద్రాన్ని నేను మంజూరు చేస్తా. కానీ, కోరుట్ల, జగిత్యాలలో ఆయనకు లక్ష మెజారిటీ ఇవ్వాలి' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

కాంగ్రెస్‌లోకి ఇంద్రకరణ్‌రెడ్డి

• దీపాదాస్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరిక



దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు డాక్టర్ వెన్నెల అశోక్, సంచార జాతులకు చెందిన ముఖ్య నేతలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత సంగిశెట్టి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్ర

• నిరసనగా 4న ధర్నా: మాజీ మంత్రి చంద్రశేఖర్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం మార్చడం కోసమే పీఎం మోదీ 400 సీట్లు కావాలని అడుగుతున్నారని, రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్రను నిరసిస్తూ ఈనెల 4న ధర్నా చేస్తామని మాజీ మంత్రి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం గాంధీ భవన్‌లో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్‌తో దళిత నాయకులు చంద్రశేఖర్, దళిత కాంగ్రెస్ చైర్మన్ ప్రీతమ్, నాయకులు గజ్జెల కాంతం, సతీశ్ మాదిగ తదితరులు సమావేశం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని, అందుకే 400 సీట్లు అంటూ హంగామా చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేసిందని, ఇప్పుడు కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలని ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఇది బీజేపీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీకి మధ్యన జరుగుతున్న యుద్ధమన్నారు.

బీజేపీవి చట్టవ్యతిరేక విధానాలు

• టీపీసీసీ లీగల్‌సెల్ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని టీపీసీసీ లీగల్ సెల్ ఇన్‌చార్జిరామచంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లా డారు. రెండు రోజుల కిందట ఢిల్లీ పోలీసులు గాంధీభవన్‌కు వచ్చి నోటీసులు ఇచ్చారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ కావడంతో ఆయన హాజరుకావడానికి 15 రోజుల సమయం ఇవ్వాలని కోరినట్లు వివరించారు. అలాగే పోలీసులు ఇచ్చిన యూఆర్ఎల్‌ను పూర్తిగా పరిశీలించడానికి నాలుగు వారాల సమయం కోరినట్లు తెలిపారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్త గీత ఇంటికి వెళ్లి ఫోన్‌ని సీజ్ చేశారని, ఆమెను భయభ్రాంతులకు గురి చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మహిళ దగ్గరికి మహిళా పోలీసులు మాత్రమే వెళ్లాలని, కానీ మగ పోలీసులు వెళ్లడం మహిళల హక్కులకు భంగం కలిగించే విషయమని అన్నారు. 41సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చి కాంగ్రెస్ కార్యకర్తలను భయపెడుతున్నారని, పరిధిదాటి ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని చెప్పారు. కోదండరెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోదీ పరుష పదజాలం వాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి బీజేపీ ఉద్దేశ పూర్వకంగా నోటీసులు పంపిందన్నారు. నిరంజన్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ గెలుపుకోసం బీజే పీ నేతలు ఇలాంటి కుట్రలు చేస్తున్నార న్నారు. అమిత్ షా మీద ఫేక్ వీడియో.. బీజేపీ సృష్టి అని, నోటీ సుల్లో కాంగ్రెస్ కార్యకర్త గీత పేరు లేదని, మరి ఆమె ఫోన్ ఎందుకు సీజ్ చేశా రో స్పష్టం చేయాలని డిమాండ్ చేశా రు. ఎన్నికల సమయంలో ఢిల్లీ పోలీ సులు రాష్ట్రానికి వస్తుంటే తెలంగాణ పోలీసులు ఏమి చేస్తున్నారో డీజీపీ సమాధానం చెప్పాలన్నారు.

50 వేల డిగ్రీ సీట్లకు కోత!

గ్రామీణ ప్రాంతాల్లో పలు కళాశాలల మూత?

- గత ఏడాది లక్ష సీట్లు తగ్గింపు...
- కొత్త కోర్సులకే ప్రాధాన్యం
- లైఫ్‌సైన్స్ వైపు మళ్లించే ప్రయత్నం..
- ఈఏపీసెట్ తర్వాతే దోస్త్ నోటిఫికేషన్
- ఉన్నత విద్యా మండలి నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కళాశాలల్లో డిగ్రీ సీట్లు ఈ ఏడాది దాదాపు 50 వేలు తగ్గే అవకాశం ఉంది. డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించే దోస్త్‌లో సీట్లను తగ్గించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొన్నేళ్ళుగా సీట్ల భర్తీ లేకపోవడమే దీనికి కారణంగా ఉన్నత విద్యా మండలి చెబుతోంది. గత విద్యా సంవత్సరంలో కూడా దాదాపు లక్ష సీట్లను కుదించారు.

వంద కాలేజీల్లో ఆర్ట్స్ కోర్సుల్లో జీరో ప్రవేశాలు: రాష్ట్రంలో ఉన్న 1050 డిగ్రీ కాలేజీల్లో 4.60 లక్షల డిగ్రీ సీట్లున్నాయి. కానీ ప్రతీ సంవత్సరం గరిష్టంగా 2.25 లక్షల సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి. ఇందులోనూ బీకాం కోర్సులోనే ఎక్కువగా చేరుతున్నారు. తర్వాత స్థానంలో బీఎస్సీ ఉంటోంది. బీఏ కోర్సులో ప్రవేశాలు 40 శాతం మించడం లేదు. దాదాపు వంద కాలేజీల్లో ఆర్ట్స్ కోర్సుల్లో జీరో ప్రవేశాలు నమోదు అవుతున్నాయి. మరో 150 కాలేజీల్లో కనీసం 15 శాతం విద్యార్థులు కూడా చేరడం లేదు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీలే విద్యార్థులు ఇష్టపడుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత కాలేజీల్లో సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి. ఇటీవల ఉన్నత విద్యా మండలి ఈ పరిస్థితిని సమీక్షించింది. డిమాండ్ లేని కోర్సులకు సంబంధించిన బ్రాంచీలకు అనుమతించకూడదని సూత్రప్రాయంగా నిర్ణయించింది. 15 శాతం కన్నా విద్యార్థులున్న కాలేజీల్లోనూ ప్రవేశాలకు అనుమతించే అవకాశం కన్పించడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పలు కాలేజీలు ఈ ఏడాది మూతపడే అవకాశాలున్నాయని అధికార వర్గాలు అంటున్నాయి.

కొత్త కోర్సులకే ప్రాధాన్యం..

డిగ్రీ తర్వాత విద్యార్థులు ఉపాధి అవకాశాలను కోరుకుంటున్నారు. మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సుల్లో కొన్నేళ్ళుగా మార్పులు తెస్తున్నారు. కొన్ని కాంబినేషన్ కోర్సులను ప్రవేశపెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా 19 రకాల స్కిల్ కోర్సులను సిఫార్సు చేసింది. రిటైల్ మార్కెటింగ్, కార్పొరేట్ సెక్టార్‌లో అవసరమైన సేవలు అందించే టెక్నికల్ కోర్సులు, స్టార్టప్స్ పెట్టుకోగల కోర్సులను అందించాలని సూచించింది. కామర్స్‌లో ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్, బీఎస్సీలో బయో మెడికల్ వంటి కొత్త కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది.

రూరల్‌లో కొత్త కోర్సులు తెచ్చినా..?

హైదరాబాద్ నగర పరిసరాల్లో ఉన్న ప్రైవేటు కాలేజీలు కొత్త కోర్సులపై ఆసక్తి చూపుతున్నాయి. కానీ గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోని డిగ్రీ కాలేజీలు మాత్రం ముందుకు రావడం లేదు. దీనివల్ల మౌలిక వసతుల కల్పన, అధ్యాపకుల కొరతతో పాటు ఫీజులు పెంచితే విద్యార్థులు చేరేందుకు అవకాశం లేదని ఆ కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. మరోవైపు ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ సకాలంలో ప్రభుత్వం అందించడం లేదని కాలేజీల యాజమాన్యాలు వాపోతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని కొత్త కోర్సులకు వెళ్ళలేమని గ్రామీణ ప్రాంత డిగ్రీ కాలేజీల నిర్వాహకులు అంటున్నారు. లైఫ్‌సైన్స్ కోర్సులను గత కొన్నేళ్ళుగా అందుబాటులోకి తెచ్చినా కూడా గ్రామీణ ప్రాంత డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు 30 శాతం మించడం లేదు.

మార్పులు అనివార్యం




డిగ్రీ కోర్సుల్లో మార్పులు అనివార్యం. మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్త కోర్సులు తీసుకొస్తున్నాం. కాలేజీల్లో అన్ని విధాల మౌలిక వసతులు ఉంటేనే అనుమతులు ఇస్తాం. డిమాండ్ లేని కాలేజీల్లో సీట్లు తగ్గించే ఆలోచన చేస్తున్నాం. ఏపీఈసెట్ తర్వాతే దోస్త్ నోటిఫికేషన్ ఇస్తాం.కొత్త కోర్సులను కూడా ఇందులో చేర్చే ఆలోచనలో ఉన్నాం.

– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి (ఉన్నత విద్యా మండలి చైర్మన్)

రిజర్వేషన్లు ఎత్తేస్తామన్నవారు వర్గీకరణ ఎలా చేస్తారు?

• ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లను ఎత్తివేస్తామని చెప్తున్న బీజేపీ నేతలు ఎస్సీలను ఎలా వర్గీకరిస్తారని ఏఐసీసీ కార్య దర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్ కుమార్ ప్రశ్నించారు. పదేళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎస్సీల వర్గీకరణ విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్న విషయాన్ని తెలంగాణ మాదిగలు గమనించాలని బుధవారం మీడియాతో మాట్లాడుతూ సంపత్ కోరారు. దళితులు, ముఖ్యంగా మాదిగలు మెరుగైన స్థాయిలో ఉన్నారంటే కాంగ్రెస్ పార్టీ అందించిన సంక్షేమ ఫలాలే కారణమని వ్యాఖ్యానించారు. కొందరు మాదిగ ప్రతినిధులుగా చెప్పుకునే నాయకులు మాదిగలను అణగదొక్కిన బీజేపీకి మద్దతు తెలపడం దురదృష్టకరమన్నారు. ఎస్సీల వర్గీకరణను మొదలుపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని, ఉషామెహ్రా కమిషన్‌ను నియమించడం, కమిషన్ నివేదిక వర్గీకరణకు అనుకూలంగా రావడమే కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమని సంపత్ చెప్పారు. దళిత వ్యతిరేక ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతున్న నాయకులు మాదిగల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర పెడితే సహించేది లేదన్నారు. అది మంద కృష్ణమాదిగ అయినా, మోత్కుపల్లి నర్సింహులు అయినా ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఎస్సీల వర్గీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, రాహుల్ చెప్పిన విధంగా కులగణన జరిగితే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెరుగుతాయని, మాదిగలు ఈ విషయాలను గ్రహించాలని కోరారు.

బీజేపీ ఎజెండా రిజర్వేషన్ల రద్దే..

▶ మొదటి పేజీ తరువాయి

దెబ్బతగులుతుందనే భయంతో కప్పి పుచ్చుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే కేంద్ర హోంశాఖ ఫిర్యాదు చేసి నాపై అక్రమ కేసు నమోదు చేసింది. కాంగ్రెస్ సోషల్ మీడియా బృందానికి కూడా నోటీసులు ఇచ్చారు. మోదీ, అమిత్ షా, బీజేపీ నేతలు గతంలో చేసిన వ్యాఖ్యలను పరి గణనలోకి తీసుకోకుండా కేసు నమోదు చేశారు. 2000వ సంవత్సరంలో బీజేపీ ప్రధాని వాజ్‌పేయి, 2002లో జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ చేసిన సూచనలను బీజేపీ ప్రస్తుతం రహస్య ఎజెండాగా మార్చుకుంది. వాటి ఆధారంగా 2024 పార్లమెంటు ఎన్నికల్లో మూడింట రెండొంతుల మెజారిటీ వస్తే అమలు చేసేందుకు బీజేపీ వేసుకున్న ప్రణాళికలను మాత్రమే నేను ప్రస్తావించా. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా నేను చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం ఇవ్వాల్సింది పోయి.. విపక్షాలపై ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించిన తరహాలో నాపై ఢిల్లీ పోలీసులను ప్రయోగిస్తున్నారు.

లొంగిపోతానని అనుకుంటున్నారా?

ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం కొట్లాడే నేను లొంగిపోతానని ఢిల్లీ సుల్తానులు ఎలా అనుకుంటున్నారు? బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికే నేను ప్రయత్నం చేస్తున్నా. రిజర్వేషన్ల రద్దుకు సంబంధించి గతంలో పార్లమెంటులో రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ప్రసంగంలో చెప్పించడంతోపాటు, కమిషన్ నియమిస్తున్నట్టు గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. వెంకటాచలయ్య కమిషన్ రాజ్యాంగాన్ని ఎలా సవరించాలో నివేదిక కూడా ఇచ్చింది. 2004లో యూపీఏ–1 అధికారంలోకి రావడంతో రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం నిలిచిపోయింది. ఆర్ఎస్ఎస్ మూలాలున్న గోల్వాల్కర్, సిద్ధాంతకర్త ఎస్‌జీ వైద్య, లోక్‌సభ మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర మాజీ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే తదితరులు రిజర్వేషన్ల రద్దుపై పలు సందర్భాల్లో ప్రకటనలు కూడా చేశారు. దళితులకు హక్కులు, కుల ఆధారిత రిజర్వే షన్లు అవసరం లేదని.. రిజర్వేషన్లు రద్దు చేయాలనేది బీజేపీ ఉద్దేశంగా ఉంది. బీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలనే మండల్ కమిషన్ సిఫారసు అమలుకు వీపీ సింగ్ ప్రభుత్వం ప్రయత్నిస్తే.. అద్వానీ నేతృత్వంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఉద్యమం చేశాయి. ఆ రిజర్వేషన్లు న్యాయ సమ్మతమేనని, అయితే 50శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు చెప్పింది. ఆ 50శాతం పరిమితిని తొలగించాలంటే.. బీసీ జనాభాను లెక్కించాలన్న కోర్టు సూచన మేరకే భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ కుల గణనకు హామీ ఇచ్చారు. తెలంగాణలో బీసీ జనగణన కోసం మా ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది.



రిజర్వేషన్ల రద్దుకు ప్రణాళికలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన చోట కులగణన చేస్తామనే విధానం తీసుకోవడంతో బీజేపీ అప్రమత్తమైంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు పెంచుతుందనే ఉద్దేశంతో లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నిస్తోంది. మరోవైపు పార్టీలను చీల్చి ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంది. 17వ లోక్‌సభలో ఆర్టికల్ 370రద్దు, సీఏఏ అమలు వంటి ఆర్ఎస్ఎస్ ఎజెండాను పూర్తి చేసింది. 18వ లోక్‌సభలో హిందూ దేశంగా భారత్, రిజర్వేషన్ల రద్దుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. ఈ విషయాలను ప్రస్తావించినందునే కేంద్ర ప్రభుత్వం నాపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసింది. అమిత్ షా నియంత్రణలో పనిచేసే ఢిల్లీ పోలీసులను ప్రయోగించి, నాపై ఒత్తిడి తెచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా కుట్ర జరుగుతోంది.

ఎటువైపు నిలవాలో తేల్చుకోండి

బీజేపీకి వేసే ప్రతీ ఓటు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల రద్దు కు దారితీస్తుంది. ప్రస్తుత ఎన్నికలు సంక్షేమం, అభివృద్ధి చుట్టూ జరగడం లేదు. రాజ్యాంగాన్ని మార్చాలా, వద్దా అనే అంశం చుట్టూనే తిరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎటు వైపు నిలబడాలో దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు తేల్చుకోవాలి. పోలీసులతో బెదిరించాలని మోదీ, అమిత్ షా చూస్తే అది కుదరని పని. గతంలో రిజర్వేషన్లు రద్దు చేయాలనే బీజేపీ ఆలోచనల అమలుకు రాజ్యాంగ పరిమితులు అడ్డుపడ్డాయి. అందుకే ఇప్పుడు 400 సీట్ల కోసం అరాచకాలు, అభ్యర్థులను భయపెట్టి ఏకగ్రీవం చేసుకుంటున్నారు..'' అని రేవంత్ ఆరోపించారు.

అభివృద్ధి కోరితే.. 'గాడిద గుడ్డు' ఇచ్చింది

• కేంద్ర ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా అడిగితే బీజేపీ ప్రభుత్వం గాడిద గుడ్డు ఇచ్చింది. రాష్ట్రానికి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కృష్ణా, గోదావరి నదుల్లో వాటాల పంపకం, మేడారం సమ్మక్క–సారక్క జాతరకు జాతీయహోదా వంటివి అడిగితే గాడిద గుడ్డు ఇచ్చింది. మొత్తంగా 'తెలంగాణ అభివృద్ధికి బీజేపీ ప్రధాన అడ్డు.. పదేండ్ల మోదీ పాలనలో తెలంగాణకు ఇచ్చింది పెద్ద గాడిద గుడ్డు'' అని పోస్ట్ చేశారు.

> పూర్తిచేయకుండా వదిలేసినది రెండు చోట్లా చేయనట్టు – దాని నిజ కార్య స్థానంలో, మీ తలలో! అసంపూర్ణంగా వదిలేసిన పనులు మీ ఆత్మవైపు నిరంతరం చూస్తూ మీ తలలోని శక్తిని పీల్చేస్తాయి.
>
> – బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 2 మే 2024

సత్యానికి సవాల్!

కంటికి కనిపిస్తున్నదంతా నిజమేనా? ఏది సత్యం? ఏదసత్యం? వేసవి తాపానికి తోడు సార్వత్రిక ఎన్నికల ప్రచారపు వేడి ఎక్కువై, నేతలు పరస్పరం మాటల ఈటెలు విసురుకుంటున్న వేళ... కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో ఇష్టారాజ్యపు మార్పుచేర్పుల నకిలీ వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నందున... ఇప్పుడు అందరూ అప్రమత్తం కావాల్సిన పరిస్థితి. సాక్షాత్తూ కేంద్ర హోమ్‌మంత్రి రిజర్వేషన్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు వీడియో ప్రచారమవుతుంది. ప్రముఖ నటుడు ఆమిర్‌ఖాన్ కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడినట్టు మరో వీడియో ప్రత్యక్షమవుతుంది. మరో ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కాశీలోని గంగాతీరంలో తన పుణ్యక్షేత్ర దర్శనానుభూతిని పంచుకుంటే ఆ మాటలు మోదీ, బీజేపీలకు మద్దతు పలికినట్టుగా నకిలీ వీడియోలో మారిపోతాయి. ఇదీ వర్తమాన ఎన్నికల్లో రాజకీయ వీడియోల వైచిత్రి. గడచిన 2019 సార్వత్రిక ఎన్నికలప్పుడు వాట్సప్ యూనివర్సిటీల్లో తప్పుడు సమాచారం వీరవిహారం చేస్తే, ఈసారి ఏఐ ఆధారిత విశ్వామిత్ర సృష్టి వీడియోలు నేతలకూ, ఓటర్లకూ సరికొత్త సవాళ్ళు విసురుతున్నాయి. నాటి ఐటీ బాట్ల నుంచి నేటి ఏఐ డీప్‌ఫేక్‌ల దాకా మన ఎన్నికల్లో అసత్య సమాచార వ్యాప్తి వెనక్కి రాలేనంత దూరం వెళ్ళిపోయింది.

తాజాగా ఈ నకిలీ వీడియోల సెగ అధికార బీజేపీ నేతలకు గట్టిగానే తగిలింది. సాక్షాత్తూ ప్రధాని మోదీ, హోమ్ మంత్రి అమిత్‌షాలు ఈ అంశంపై తీవ్ర వ్యాఖ్యలు చేయడమే అందుకు నిదర్శనం. రిజర్వేషన్ల అంశంపై హోమ్ మంత్రి అనని మాటలను అన్నట్టుగా మార్చి చూపించిన ఫేక్ వీడియో ఇప్పటికే దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారమైంది. సంచలనం రేపింది. తమతో సహా పలువురు బీజేపీ నేతల నకిలీ వీడియోలను ప్రచారంలో పెట్టి, శాంతియుత ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడానికి ప్రతిపక్షాల వారు ప్రయత్నిస్తున్నారంటూ మోదీ ఆరోపించారు. ఎన్నికల వేళ పెద్ద తలనొప్పిగా మారిన ఈ అబద్ధపు వీడియోల వ్యాప్తిపై బీజేపీ ఇప్పటికే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. పోలీసులకూ ఫిర్యాదు చేసింది. అమిత్‌షాకు సంబంధించిన మార్ఫింగ్ వీడియోను 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో షేర్ చేశారనే ఆరోపణపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురికి ఢిల్లీ పోలీసులు సమన్లు ఇవ్వడంపై సవాళ్ళు, ప్రతి సవాళ్ళ పర్వం నడుస్తోంది. మరోపక్క ఈ వీడియో వ్యవహారంపై అసోమ్‌లో ఒకరితో పలువురు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

మొత్తం ఏడు విడతల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ మంత్రం ఆశించినంతగా ఫలించడం లేదనీ, 'ఈసారి 400 సీట్ల పైనే' (అబ్ కీ బార్ 400 పార్) అన్న బీజేపీ నినాదం మంచి కన్నా చెడు చేస్తోందనీ ఒక విశ్లేషణ. ఈ పరిస్థితుల్లో ఈ డీప్ ఫేక్ వీడియోలు మరిన్ని వర్గాలను అధికార పార్టీకి దూరం చేసే ప్రమాదం లేకపోలేదు. అయితే, ఈ నకిలీ వీడియోల ముప్పు అధికార పార్టీకే కాదు... ప్రతిపక్షం సహా అన్ని పార్టీలకూ ఉంది. ఇంకా చెప్పాలంటే, గడచిన 2019 ఎన్నికలు 'సోషల్ మీడియా ఎన్నిక'లైతే, ఈ 2024 ఎన్నికలు 'ఏఐ యుగపు ఎన్నికల'ని నిపుణులు అభివర్ణిస్తున్నారు. సగటు ఓటరుకు మునుపెన్నడూ లేనంతగా తప్పుడు సమాచారమందే ప్రమాదం ఈసారి పెరిగింది. చేతిలో ప్రపంచాన్ని ఇమిడ్చిన స్మార్ట్‌ఫోన్‌లో వస్తున్నదంతా నిజమని నమ్మే ధోరణిని మార్చుకోకపోతే కష్టమే. వాట్సప్ సహా వివిధ మాధ్యమాల్లో షేర్ అవుతున్న వాటిలో ఏది అసలో, ఏది ఏఐతో మార్చిన నకిలీయో తెలుసుకోవడం తెలీక సామాన్యులు మోసపోయే ప్రమాదం మరీ ఎక్కువైంది.

గతంలోనూ విద్వేషపూరిత వ్యాఖ్యలు, ప్రత్యర్థిని దెబ్బతీసే ప్రచారాలు లేకపోలేదు. కాకపోతే ఫలానా వర్గం ఎక్కువ మంది పిల్లల్ని కంటోంది, ఫలానా పార్టీ అధికారంలోకి వస్తే మంగళ సూత్రాలను సైతం లాగేసుకుంటుంది లాంటి మాటలు ఈ తడవ మాత్రమే ఏలికల నోట వినిపిస్తున్నాయి. సాంకేతికత వెర్రితలలు వేయడంతో ఈసారి మరింత చిక్కొచ్చి పడింది. మొత్తం మన రాజకీయ సమాచార ప్రసార, ప్రచారాలు శరవేగంతో మారిపోయాయి. 2019 ఎన్నికల ముందు మన 'జనగణమన'ను ప్రపంచ అత్యుత్తమ జాతీయ గీతంగా యునెస్కో ప్రకటించిందనే మెసేజ్ వాట్సప్‌లో తెగ తిరిగితే... ఇప్పుడు జనరేటివ్ ఏఐ సాయంతో మోదీ పెదాల కదలికకు అచ్చుగుద్దినట్టు సరిపోయేలా మూడు భాషల్లో ఆయన ప్రసంగపు యూట్యూబ్ షార్ట్ వంతు వచ్చింది. జనాన్ని ఎలాగోలా బురిడీ కొట్టించి, బుట్టలో వేసుకోవాలనే తపన, తాపత్రయం గడచిన అయిదేళ్ళలో కొత్త పుంతలు తొక్కింది. నిజానికి, సోషల్ మీడియా సంస్థలు సైతం ఫేక్ న్యూస్, ప్రాపగాండాలను అరికట్టడానికి కిందా మీదా పడుతున్నాయి. ఆన్‌లైన్‌లోనూ డీప్‌ఫేక్‌ను అడ్డుకొనేందుకు ప్రస్తుత చట్టాలను నవీకరించేందుకు భారత ప్రభుత్వమూ ప్రయత్నిస్తోంది.

ఓట్లు, సీట్లు, అధికారమే పరమావధిగా మారిన కాలంలో ప్రతి పార్టీ ఒక సోషల్ మీడియా సైన్యాన్ని పెంచి పోషిస్తోంది. ఆన్‌లైన్ అసత్య ప్రచారాన్ని సైతం ఎన్నికల వ్యూహంలో ఒక భాగంగా అందరూ అనుసరిస్తున్న రోజులొచ్చిపడ్డాయి. సమాచారాన్ని వైరల్ చేసే బాట్లకు ఇప్పుడు విశ్వామిత్ర సృష్టి జనరేటివ్ ఏఐ కూడా జతపడేసరికి అగ్నికి ఆజ్యం తోడైంది. ఉచితంగా, కాదంటే కారుచౌకగా ఏఐ సహా రకరకాల ఉపకరణాలు అందుబాటులోకి రావడం ఆకతాయిలకూ వరమైంది. ఓ డీప్‌ఫేక్ వీడియో సృష్టికి మూడేళ్ళ క్రితం పది రోజులు పడితే, ఇప్పుడు మూడు నిమిషాల్లో చేయగలుగుతున్నారు. ఇవన్నీ సత్యాన్వేషణలో నేటి సవాళ్ళు. ఎన్నికల్లో అనియంత్రిత ఏఐ వినియోగానికి తక్షణం అడ్డుకట్ట వేయకుంటే అనర్థం తప్పదు. నేతలు, జర్నలిస్టులు, నటీనటులు ప్రధాన లక్ష్యంగా సాగుతున్న విషం చిమ్ముడుకు విరుగుడు వెతకాలి. లేదంటే, వ్యవస్థపైనే నమ్మకం పోతుంది. యావత్ సమాజం, ప్రజాస్వామ్యం నకిలీలతో నిండిపోతుంది.

గ్రహం అనుగ్రహం


శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, **తిథి:** బ.నవమి రా.10.45 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.11.06 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.38 వరకు తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృత ఘడియలు:** ప.1.16 నుండి 2.34 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ప్రభుత్వ ఉద్యోగులతో మరో మాట!

ఏపీలో ప్రైవేటీకరణ అభిమాని చంద్రబాబు జాతీయ ప్రైవేటీకరణ అభిమాని బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. అన్ని ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటు ఏకస్వామ్య కంపెనీలకు అప్పజెప్పాలన్నది వారి ఆలోచన. ఇక్కడ రిజర్వేషన్లు అమలు కావు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ కూటమికి ఓటు వేయడమంటే, ప్రైవేటీకరణకు ఓటు వేయడమే. కానీ నిరుపేదలకు ప్రభుత్వ విద్య, ప్రభుత్వ ఉద్యోగ అవకాశం మొదటి తరంలో చాలా ముఖ్యం. మన దేశ భవిష్యత్తుకు పునాది స్కూలు విద్యను పూర్తిగా ప్రభుత్వ రంగంలోకి తెచ్చి, ప్రైవేట్ స్కూలు విద్యను రద్దు చెయ్యడంలో ఉంది. ఉద్యోగస్థులు మొత్తం సమాజ భవిష్యత్ గురించి ఆలోచించకుండా ప్రైవేటీకరణకు, మత తత్వానికి ఓటు వేస్తే ప్రజాస్వామ్యం కాదుకదా, మానవీయ విలువలు కూడా బతకవు.

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటీకరణ అభిమాని చంద్రబాబు నాయుడు జాతీయ ప్రైవేటీకరణ అభిమాని బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. దేశంలోని మొత్తం కేంద్ర ప్రభుత్వ కంపెనీలను, అతి పెద్దదైన రైల్వేతో సహా ప్రైవేట్ 'మోనోపలి' (ఏకస్వామ్య) కంపెనీలకు అప్పజెప్పి ప్రభుత్వం కేవలం సూపర్‌వైజ్ చెయ్యాలనేది ఆరెస్సెస్/బీజేపీ సిద్ధాంతం. దేశంలో రిజర్వేషన్ వ్యవస్థను కూడా క్రమంగా రద్దు చెయ్యాలన్నది వారి సిద్ధాంతం. నరేంద్ర మోదీ ఓబీసీ పేరుతో ప్రధానమంత్రి అయ్యారు కనుక గత పదేండ్ల పాలనలో వాళ్ళు రిజర్వేషన్ పట్ల కాస్త జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ రిజర్వేషన్ వ్యతిరేక విధానం రిజర్వేషన్ ద్వారా కాక జనరల్ కోటాలో ఉద్యోగాలు తెచ్చుకున్న వారికి నచ్చవచ్చు కూడా. కానీ విద్యా అసమాన వ్యవస్థ ఉండగా రిజర్వేషన్లు ఎత్తేస్తే దేశంలో అంతర్యుద్ధం జరుగుతుందని చాలామందికి అర్థం కాని విషయం. దేశంలోని ఉత్పత్తి కులాలు రిజర్వేషన్లు రద్దు చెయ్యడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తాయి.

బీజేపీతో పొత్తుతో చంద్రబాబు అధికారంలోకి వస్తే మొట్టమొదట ప్రైవేట్ స్టీల్ కంపెనీకి అప్పజెప్పే అతిపెద్ద స్టీల్ కంపెనీ 'విశాఖ ఉక్కు'. ఆ తరువాత బీజేపీ తెలంగాణలోని బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్ వంటి అతిపెద్ద కంపెనీలను ప్రైవేట్ గుజరాతీ, ముంబై కంపెనీలకు అమ్మకానికి పెడుతుంది. బీజేపీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ చేతుల్లోని సంస్థల్లో దొడ్డిదారిన ఏ సెలక్షన్ కమిటీని ఫేస్ చెయ్యకుండా అధికారులను, యూనివర్సిటీ ప్రొఫెసర్లను సైతం నియమిస్తోంది.

ఈ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు బీజేపీకి ఓటు వేయడమంటే ప్రైవేటీకరణకు అనుకూలంగా ఓటు వేయడమే. చంద్రబాబు 2014 నుండి 2019 వరకు చూపిన స్వతంత్రతను కూడా చూపలేడు. ఆయన పూర్తిగా బీజేపీ ఏమి చెబితే అది చెయ్యాల్సిందే. ఈ స్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఈ కూటమికి ఓటేస్తే ముందు ప్రైవేటీకరణ సమస్యను కొని తెచ్చుకుంటారు.

బీజేపీ ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టారు ఎంప్లాయిమెంట్‌ను అమెరికా మోడల్‌లోకి మార్చాలనే ఆలోచనతో ఉన్నట్లు వాళ్ళ ఆర్థికవేత్తల రచనలు చదివితే స్పష్టంగా అర్థమౌతుంది. ఆంధ్రప్రదేష్ సుదీర్ఘ తీర ప్రాంతం గల రాష్ట్రం. విశాఖ పోర్టు మాత్రమే కాక క్రమంగా ఇతర సీ–పోర్టులను అక్కడ అభివృద్ధి చేసుకోవచ్చు. ఇప్పటికే కొన్ని కొత్త పోర్టుల నిర్మాణం జరుగుతోంది. అయితే బీజేపీ ప్రభుత్వం వాటి నిర్మాణం మాత్రమే కాక వాటి మేనేజ్‌మెంట్ మొత్తాన్ని ప్రైవేట్ సెక్టారుకు అప్పజెప్పే ఆలోచనలో ఉన్నది. ఈ పని ఇప్పటికే ఎయిర్‌పోర్టుల విషయంలో చేశారు. దేశంలోని పెద్ద, పెద్ద ఎయిర్‌పోర్టులన్నిటినీ ప్రైవేటు మేనేజ్‌మెంట్‌కు – అదీ పెద్ద పెద్ద మోనోపలి కంపెనీలకు అప్పజెప్పారు. ఇక్కడి ఉద్యోగాలన్నీ ప్రైవేట్ కంపెనీల చేతిలోనే ఉన్నాయి. ఇక్కడ ఉద్యోగాలన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలే. అక్కడ పెద్ద



ఉద్యోగాలన్నీ పెద్ద కంపెనీల బంధువులకు మాత్రమే వస్తాయి. యూపీఎస్సీ పరీక్షల్లో పోటీపడి ఎవరైనా ఉద్యోగం తెచ్చుకునేది అక్కడ ఉండదు. కమ్మ, రెడ్డి కులాలకు కూడా పెద్ద ఉద్యోగాలు రావు.

ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నాన్ని రాజధానిగా చేసుకొని తీరాన్నంతా అభివృద్ధి చేసుకుంటే అది ముంబైకి మించిన నగరమయ్యే అవకాశముంది. కోల్‌కతా కూలిపోతున్న నగరం. ఇటు చెన్నై దేశపు చివరి మూలన ఉంది. దానికి ఇంకా అభివృద్ధి అవకాశం తక్కువ. ఇంగ్లిష్ విద్యలో ఆదివాసులు, దళితులు, బీసీలు, ఇతర బీద పిల్లలు చదువుకుంటే వైజాగ్ నగరాన్ని అత్యాధునిక నగరంగా మార్చే అవకాశం వారికొస్తుంది. ప్రభుత్వ రంగంలో ఇంగ్లిష్ విద్య నాణ్యంగా కొనసాగితే అడవుల్లోని ఆదివాసులు పక్షులుగా ఎదిగి విమానాలుగా మారుతారు. వారికి ఎంత పోడు భూమి ఇచ్చినా, ఎంత పంట సహాయం చేసినా ఒక్క తరంలో అడవి నుండి విశాఖ నగరంలోకి, అక్కడి నుండి అమెరికాకో, ఆస్ట్రేలియాకో పోలేరు. అయితే ఈ ఆదివాసులకు ప్రభుత్వ విద్య, ప్రభుత్వ ఉద్యోగ అవకాశం మొదటి తరంలో చాలా ముఖ్యం. ప్రైవేట్ సెక్టారు వీరికి అవకాశాలివ్వదు. వారిని ఉన్నత ఉద్యోగాల్లోకి రానివ్వదు. ఆంధ్రలో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాణ్యమైన ఇంగ్లిష్ విద్య ఈ ఆదివాసుల్లో కొనసాగితే, 20–30 సంవత్సరాల్లో అమెరికాలో నల్లజాతీయులను మించిన మేధావులు ఆదివాసుల నుండి వచ్చి విశాఖ పట్టణాన్ని ప్రపంచ నగరంగా మారుస్తారు. ఈ ఆదివాసుల నుండి ఎంతోమంది ఎలాన్ మస్క్‌లు వచ్చే అవకాశముంది. ఇటువంటి మార్పు భారతదేశపు గుజరాతీ క్యాపిటలిస్టులకు, నరేంద్ర మోదీ ప్రభుత్వానికి, ఆరెస్సెస్‌కు ఏ మాత్రం ఇష్టం లేదు. వీరికి ప్రభుత్వ ఉద్యోగులు ఓటువేసి గెలిపించే ప్రయత్నం చేస్తే వ్యవస్థనంతా గుజరాత్–ముంబై క్యాపిటలిస్టులకు అప్పజెప్పడమే.

భారతదేశం అమెరికా కాదు, యూరప్ కాదు, ఆస్ట్రేలియా కాదు, కెనడా కాదు. ఇది 140 కోట్ల జనాభా కలిగిన చిన్న దేశం. దీన్ని చిన్న దేశం అని ఎందుకు అంటున్నానంటే భూపరిమాణంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, చైనాతో పోలిస్తే ఇది చాలా చిన్న భూమి కలిగిన దేశం. ఈ దేశ జనాభా ఇంకా ముందు, ముందు పెరుగుతుంది. ఆధునిక సైన్స్‌ను ఇంగ్లిష్ భాషతో ముడేసి గొప్ప, గొప్ప శాస్త్ర పరిశోధనల ద్వారానే మనం ఇంతమందికి తిండి, బట్ట, ఇల్లు ప్రపంచంలో తలెత్తుకుని బతికే ఆత్మ గౌరవాన్ని ఇవ్వగలం. అందుకు భావితరాలు – ముఖ్యంగా ఆదివాసులు, దళితులు, ఓబీసీలు – ఇంగ్లిష్‌లో చదువుకొని ప్రపంచ జ్ఞానాన్ని సాధించకుండా ఈ దేశానికి మనుగడ ఉండదు. మన దేశ భవిష్యత్తుకు పునాది స్కూలు విద్యను పూర్తిగా ప్రభుత్వ రంగంలోకి తెచ్చి, ప్రైవేట్ స్కూలు విద్యను రద్దు చెయ్యడంలో ఉంది; అన్ని రకాల ఎంట్రెన్స్‌లను, కోచింగ్‌లను రద్దు చేసి నేరుగా 12వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా, విద్యార్థి శ్రమ గౌరవ పనుల్లో పాల్గొన్న సర్టిఫికెట్ల ఆధారంగా ఉన్నత చదువులకు పోవడంలో ఉంది. అమెరికా, యూరప్ ఇదే చేస్తాయి. బీజేపీ, చంద్రబాబు ఇటువంటి విద్యకు పూర్తిగా వ్యతిరేకం. కనుక ఇప్పుడు ఉద్యోగాలు ఏ కులస్థులైనా మొత్తం సమాజ భవిష్యత్ గురించి ఆలోచించకుండా ప్రైవేటీకరణకు, కుల తత్వానికి, మత తత్వానికి, వర్గ తత్వానికి ఓటు వేసుకుంటే సమాజంలో తిరుగుబాటు మొదలైతే దేశం కుప్పకూలుతుంది.

భారతదేశపు ప్రైవేట్ రంగం అమెరికాలో, యూరప్‌లో ఉన్నట్టు మానవతా విలువలతో ఏర్పడినది కాదు. గ్రామాల్లో రైతులను, కూలీలను దోచుకొని వారితో బడిలో, గుడిలో ప్రేమతో పెరిగిన మనుషులుగా కాక మేం కులానికి ఎక్కువ, మేం కంచం–మంచం పొత్తును అంగీకరించం అనే వారి చేతిలో పెరిగింది. ఈ దేశంలో అతిపెద్ద పెట్టుబడిదారులు కుష్ఠు రోగులకు, కుంటి వారికి, గుడ్డి వారికి ఒక ఆశ్రమం కట్టించి ఆదుకున్నట్టు చూశామా! అమెరికా తెల్లజాతి ధనవంతులు, నల్లజాతి స్త్రీలను తమ ఇంట్లో వంట మనిషిగా పెట్టుకొని వారి పిల్లలను చదివించి మేధావులను చేసిన ఘటనలు చాలా ఉన్నాయి. నల్లవారికి ప్రత్యేక స్కూళ్ళు, కాలేజీలు పెట్టి ముందు చదివించింది తెల్లజాతి పెట్టుబడిదారులు. ఈ దేశంలో అతిపెద్ద పెట్టుబడిదారులు దళితుల కోసం, ఆదివాసుల కోసం ఒక్క స్కూలు కట్టి చదివించారా!

అందుకే దిక్కులేని రోడ్డుమీద బతికే పిల్లల్ని దగ్గరకు తీసి 'నిన్ను ఇంగ్లిష్ మీడియం బడిలో చదివిస్తాన'ని హామీ ఇచ్చిన వ్యక్తిని దింపేసి నారాయణ స్కూలును వెనుక ఉండి నడిపించే వ్యక్తికి ఓటు వేస్తే, ప్రజాస్వామ్యం కాదు గదా మానవ విలువలే బతకవు. అందరికంటే ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నేను చెప్పే ఈ మాట గురించి ఆలోచించండి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



రికార్డు బద్దలయ్యేనా?



భారత మహిళల లాంగ్ జంప్‌లో 6.83 మీటర్లతో అంజూ బాబీ జార్జ్ నెలకొల్పిన జాతీయ రికార్డు ఇప్పటికీ ఉంది. చాలాకాలంగా ఉన్న(2004) ఈ రికార్డును ఈ 2024లో శైలీ సింగ్ బద్దలుకొట్టగలదేమో!

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

విదేశీవే బెస్ట్!



అత్యంత ఉత్తమ పది చిత్రాలను నేను గనక జాబితా చేస్తే, ఒక్క 'సిటిజన్ కేన్' (1941) మినహాయించి, అందులో ఒక్కటి కూడా అమెరికన్ సినిమా ఉండదు.

– వూడీ అలెన్, దర్శకుడు

కొత్త భాష



మా అబ్బాయి నుంచి ఇప్పుడే నేర్చుకున్నది ఏమంటే, 'ఓకే' అని బదులిస్తే అది దురుసుగా ఉంటుందట; అదే 'ఓకేకే' అంటే ఉత్సాహపూరితంగా ధ్వనిస్తుందట. బాస్! జెనరేషన్–జెడ్, జెనరేషన్– ఆల్ఫా వాళ్ల ఆన్‌లైన్ మర్యాదలు నేర్చుకోవడంలో నా మెదడు కిందిమీదవుతోంది.

– స్మితా బరూవా, అడిక్షన్ కౌన్సిలర్

ముందది గ్రహించండి!



విమాన టికెట్ కొనుక్కోగానే అది వ్యక్తిగత సేవకులను పొందడంతో సమానంగా కొందరు పొరపడుతుంటారు – ముఖ్యంగా సిబ్బంది మహిళలు అయినప్పుడు! ఫ్లైట్ అటెండెంట్స్‌గా ఉండేవాళ్లు వ్యక్తిగత సేవకులు కాదు, ఉద్యోగులు. వాళ్లను అవమానించేట్టుగా ప్రవర్తించడం సహించలేనిది.

– రతన్ ఢిల్లోఁ, ర్యాలీ డ్రైవర్

ఇంత దిగజారుడా?



భారత ఎన్నికలను యాభై ఏళ్లుగా చూస్తున్న వాడిగా ఇంత నీచమైన, ద్వేషపూరిత ఉపన్యాసాలను చూడలేదు. ప్రతిరోజూ అధికార పార్టీకి చెందిన అగ్ర నాయకులు మరింత కిందికి దిగజారుతున్నారు. అందరికీ మించి హిందువులు నిలబడి చెప్పాలి: ఈ మతోన్మాదులు మాకు ప్రతినిధులు కారు అని!

– రామచంద్ర గుహ, రచయిత

అంకెలేం చెబుతాయి?



1947లో పాకిస్తాన్‌లో మైనారిటీలు– 25 శాతం (హిందువులు, సిక్కులు, క్రైస్తవులు కలిసి). 2023లో – 2 శాతం. 1947లో ఇండియాలో మైనారిటీలు– 14 శాతం (ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు కలిసి.) 2023లో– 24 శాతం. అయినా కొందరు ఇండియా మైనారిటీలు ప్రమాదంలో ఉన్నారని మాట్లాడుతుంటారు.

– రిషీ బాగ్రీ, సాధారణ పన్ను చెల్లింపుదారు

అందరూ అందరే!



అంటే, 2023లోనే ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దుర్వర్తన దృష్ట్యా జేడీఎస్‌తో పొత్తు పెట్టుకోవద్దని ఒక బీజేపీ అభ్యర్థి హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అయినా పొత్తుకు ముందుకెళ్లారు. ఇక, నెలల ముందుగానే కాంగ్రెస్‌కు ఈ విషయం తెలిసినా ఆయన మీద ఏ చర్యా తీసుకోకుండా, వ్యూహాత్మకంగా ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా వాడాలనుకున్నారు. ఈ నాయకులందరూ ఎంత నయవంచకులు!

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

అత్యంత పవిత్ర నదికి పుష్కరాలు

భారతదేశంలో తూర్పు నుంచి పడమరకు ప్రవహించే ప్రత్యేకత సంతరించుకున్న నదుల్లో నర్మదా నది ఒకటి. ఈ నది 2024 మే 1 నుంచి 12 వరకు పుష్కరాలు జరుపుకుంటున్నది. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుష్కరాల సందర్భంగా నర్మద విశిష్టత గురించి మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నర్మదా నది శివుని దేహం నుంచి పుట్టిందనీ, అందుకే 'రుద్రదేహ' అనే పేరు కూడా దీని కున్నదంటారు భక్తులు. శివుని కుమార్తె అని భావిస్తూ 'శాంకరి' అని కూడా పిలుస్తారు. నర్మదా నదిపై ఆది శంకరాచార్యులు 'నర్మదాష్టకం' రచించారు.

మధ్యప్రదేశ్‌లోని అనుప్పూర్ జిల్లాలో ఎత్తైన కొండలు, పచ్చటి అరణ్యాల మధ్య ఉన్న అమర్ కంటక్ నర్మదా నది జన్మస్థానం. ఇక్కడే నర్మదా మాత గుడి కూడా ఉంది. నర్మదా నది మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల గుండా ప్రవహించి గుజరాత్‌లోని బరూచ్ జిల్లాలో అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది మొత్తం దేశంలో 1,289 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. మూడేళ్లు సరస్వతి నదిలో, ఏడు రోజులు యమునా నదిలో, ఒక్క రోజు గంగా నదిలో స్నానం చేయడం వల్ల వచ్చే పుణ్యం... ఒక్కసారి ఈ నదిలో స్నానం చేస్తే వస్తుందని భక్తుల నమ్మకం. నర్మదా తీరంలో గల పుణ్యక్షేత్రాల్లో అత్యంత ప్రసిద్ధమైనది ఓంకారేశ్వర్. ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి.

నర్మదా నదిపై భారీ ఆనకట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా 1985లో ప్రారంభమైన 'నర్మదా బచావో ఆందోళన' అత్యంత శక్తిమంతమైన ప్రజా ఉద్యమం. భారీ నర్మదా ప్రాజెక్టులకు వ్యతిరేకంగా స్థానిక గిరిజనులు (ఆదివాసీలు), రైతులు, పర్యావరణవేత్తలు, మానవ హక్కుల కార్యకర్తలు వంటివారందరూ పాల్గొన్న భారతీయ సామాజిక ఉద్యమం ఇది. సుదీర్ఘ ఆందోళన, ఉద్యమకారుల వ్యతిరేకతల నడుమ పూర్తయిన ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడంతో ఈ వివాదం సమసిపోయింది. ప్రస్తుతం పుష్కరాలు ప్రారంభమవ్వడంతో భక్తులు పుష్కర స్నానాలకు సిద్ధమవుతున్నారు.

– పగిడి రంగారావు

(మే 1 నుండి 12 వరకు 'నర్మదా' నది పుష్కరాలు)

దీనికి జవాబు లేదా బాబూ?

అభిప్రాయం



ఎస్. అబ్దుల్ ఖాలిక్

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి కొత్త చిక్కు వచ్చిపడింది. ముస్లిం మైనారిటీలకు అమలు చేస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ బీజేపీ అగ్రనేత ఒకరు ప్రకటించడం ఇందుకు కారణం. బీజేపీతో పొత్తులో ఉన్న టీడీపీ ఈ ప్రకటనను ఖండించకపోవడం ముస్లిమ్ మైనారిటీలు గమనిస్తున్నారు. అందుకే ఇప్పటికే అరకొరగా ఉన్న ముస్లిమ్‌ల మద్దతు తమ పార్టీ పూర్తిగా కోల్పోతుందని టీడీపీ భయపడుతోంది.

ఇటీవల ఓ బహిరంగ సభలో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ముస్లిమ్ మైనారిటీలకు అమలు చేస్తోన్న నాలుగు శాతం రిజర్వేషన్లను తప్పుపట్టారు. ఈసారి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముస్లిమ్‌ల రిజర్వేషన్లను రద్దు చేస్తామని తెగేసి చెప్పారు. లోక్‌సభకు ఇప్పటికే జరిగిన రెండు విడతల పోలింగ్‌లో బీజేపీకి నిరాశే ఎదురైనట్లు సంకేతాలు అందుతున్నాయి. దీంతో కులాలకతీతంగా యావత్ హిందూ ఓటు బ్యాంకును కమలం పార్టీ వైపు మళ్లించడానికి బీజేపీ అగ్రనేతలు ముస్లిమ్‌ల రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించారని భావిస్తున్నారు.

ముస్లిమ్‌ల వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేయడానికి 2005లో కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేందర్ సచార్ నాయకత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం ఏడుగురు సభ్యులున్న సచార్ కమిటీ 2006లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సచార్ కమిటీ నివేదిక ప్రకారం భారతదేశ జనాభాలో ముస్లిమ్‌లు 14 శాతం ఉన్నారు. అయితే అధికార యంత్రాంగంలో ముస్లిమ్‌ల శాతం కేవలం 2.5 శాతం మాత్రమే. దళితులు, ఆదివాసీల కంటే దారుణ పరిస్థితుల్లో ముస్లిమ్‌లు ఉన్నారు. చదువు లేకపోవడమే ముస్లిమ్



సమాజం ఎదుర్కొంటున్న సకల సమస్యలకు ప్రధాన కారణమని జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ కుండబద్దలు కొట్టింది. ముస్లిమ్ సమాజం మేలు కోసం మొత్తం 76 సిఫార్సులు చేసింది ఈ కమిటీ. అయితే వీటిలో అమలుకు నోచుకున్నవి అతి తక్కువ.

వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ముస్లిమ్‌ల జీవితాల్లో వెలుగులు నింపడానికి నాలుగు శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. విభజన తరువాత కూడా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిమ్‌లకు నాలుగుశాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. ఇప్పుడు బీజేపీ అగ్రనేతలు ఈ రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నా చంద్రబాబు నోరు మెదపకపోవడం విడ్డూరం. నెత్తి మీద టోపీ పెట్టుకుని... ముస్లిమ్‌లతో ఆత్మీయ సమావేశాలంటూ సందడి చేసే చంద్రబాబు అసలు రంగు బయటపడింది.

వాస్తవానికి రాయలసీమలో ముస్లిమ్ మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. కర్నూలు, నంద్యాల, కడప, రాయచోటి, కదిరి లాంటి అనేక ప్రాంతాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేయగల స్థాయిలో ముస్లిమ్‌లు ఉన్నారు. రాయలసీమే కాదు కోస్తా జిల్లాల్లో కూడా వీరి జనాభా భారీగానే ఉంది. గుంటూరు తూర్పు, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావు పేట, చిలకలూరిపేట, విజయవాడ పశ్చిమం, బందరు, పెడన వంటి అనేక ప్రాంతాల్లో కూడా ముస్లిమ్ మైనారిటీలు అభ్యర్థుల జయాపజయాలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తారు.

అటువంటి ముస్లిమ్‌ల రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ అంటే తెలుగుదేశం నిశ్శబ్దంగా ఉండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ముస్లిమ్‌ల రిజర్వేషన్ రద్దు ఖాయం అని ముస్లిమ్‌లు బలంగా నమ్ముతున్నారు. దీంతో ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో టీడీపీకి అనుకూలంగా ఉన్న ముస్లిమ్‌లు పోలింగ్ నాటికి జగన్‌కి జై కొడతారని టీడీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 63001 74320

మార్గాలు అనేకం – లక్ష్యం ఒకటే!

మన శాస్త్రాల్లో సాధకులకు ఉపయోగపడే వందలాది మార్గాలు ఉన్నాయి. ప్రపంచంలో వేలాదిమంది బోధకులు ఉన్నారు. మన సంప్రదాయాలను అనుసరించి భగవంతునికి కోట్లాది రూపాలు ఉన్నాయి. సాధకులు తమ మార్గాలను, గురువులను, వారు పూజించే దేవుళ్ళను మార్చుకోవడం తెలిసిందే. అయితే ఆ విధంగా చేయుటం సరియైనదే కావచ్చు లేదా తప్పూ కావచ్చు. కాని లక్ష్యాన్ని చేరుకోవడానికి వారు చూపించే ఉత్సాహము మెచ్చుకోదగింది. అటువంటి వారి దృష్టి అంతా ఎప్పుడూ ఆదర్శ మార్గం, ఆదర్శ గురువు, ఆదర్శప్రాయమైన భగవత్ స్వరూపం పైనే ఉంటుంది. వారు ఏ మార్గాన్ని అనుసరించినప్పటికీనీ, ప్రయాణం మాత్రం అంతరాత్మ లోనికే అనే విషయాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. గురువులందరూ బోధించే సత్యం ఒక్కటే. భగవంతుని ఏ రూపాన్ని పూజించినప్పటికీ, అది సర్వేశ్వరుని పూజించినట్లే. వారు ఎంచుకొనిన మార్గం, అనుసరించు గురువు, ఆరాధించు భగవత్ స్వరూపం – ఇవన్నీ సాంకేతికంగా భగవంతుని సూచిస్తాయి. నువ్వు నీ మార్గాన్ని గంభీరంగా, భక్తిపూర్వకంగా నిశ్చిత బుద్ధితో అనుసరించడమే ముఖ్యం.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

అన్ని మతాల వారికీ 'ప్రార్థన' ఉంది. ఇది కేవలం మనుషులకు మాత్రమే ఉన్న దేవుని వరం. అయితే మనకు ఆపదలు, దుఃఖం కలిగినప్పుడు మాత్రమే ప్రార్థన చేయడం సరికాదు. అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లో కూడా భగవంతుని ప్రార్థించడం అలవరచుకోవాలి. ఆత్మవికాసమే ప్రార్థన ముఖ్య ఉద్దేశ్యంగా ఉండాలి. భౌతిక అవసరాలు లేక కోరికలను తీర్చుకోవడానికి భగవంతుని ప్రార్థించకూడదు. బంధ విముక్తి కోసం మాత్రమే ప్రార్థించాలి. ఎట్టి పరిస్థితిలో అయినా దేవదేవుని మరచిపోకుండా ఉండేలా ఉంచమని ఆయననే ప్రార్థించాలి.

సంసార బంధాల నుండి విముక్తిని పొంది, ఆత్మవికాసం కావించు కోవడానికి గీతాచార్యులు నాలుగు మార్గాలను చెప్పారు. అవి జ్ఞాన యోగము, భక్తి యోగము, కర్మయోగము, ప్రపత్తి లేక శరణాగతి. ఇందులో శరణాగతి అత్యంత ముఖ్యమైనది. దీని ప్రకారం తనువు, మనస్సు, బుద్ధిని భగవంతుని పాద పద్మాలకు సంపూర్ణంగా సమర్పించుకోవాలి. శరణాగతి కోరువాడికి ఏమాత్రం 'అహం' ఉండకూడదు. భగవంతుని ద్వారమును చేరదలచిన వారు 'అహా'న్ని విడిచిపెట్టాలి. 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'.

ఎక్కువ ఎంపీ సీట్లు గెలవాలి

రాష్ట్ర ముఖ్య నేతలకు అమిత్ షా దిశానిర్దేశం

- తెలంగాణలో 10 నుంచి 12 సీట్లు గెలిచే అవకాశం..
- ఇంకా గెలిచే ప్రయత్నం చేయాలని ఆదేశం
- రాబోయే వారం పదిరోజులు కీలకమని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో వచ్చే వారం, పది రోజులు చాలా కీలకమని, ఎక్కువ ఎంపీ సీట్లు సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర నాయకులకు బీజేపీ అగ్రనేత, కేంద్రహోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశం చేశారు. జాతీయ నాయకత్వం చేయించిన వివిధ సర్వే నివేదికల ఆధారంగా తెలంగాణలో ఈసారి 10 నుంచి 12 సీట్లు గెలుస్తామని.. ఇంకా అదనంగా గెలిచేలా ముందుకు సాగాలని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్ షా.. మే 11న వరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టాల్సిన కార్యాచరణ, అనుసరించాల్సిన రోడ్‌మ్యాప్, ప్రచారం కొనసాగుతున్న తీరుపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సమీక్షించారు. పోలింగ్ నాటికల్లా అన్ని వర్గాల ఓటర్ల మద్దతు కూడగట్టాలని రాష్ట్ర నేతలకు సూచించారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటర్‌ను మూడుసార్లు కలవాలనే లక్ష్యాన్ని అన్ని స్థాయిల నాయకులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీబోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నేతలు పి.మురళీధర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు, ఎంపీ అభ్యర్థులు ఈటల రాజేందర్, మాధవీలత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోనే బసచేసిన అమిత్ షా గురువారం ఉదయం బయలుదేరి వెళ్లనున్నారు.



వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం రావులకొలనులో ప్రచారం నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ



అనారోగ్యంతో బాధపడుతున్న కొండారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ భారతమ్మ



అవ్వ ఆదిలక్ష్మమ్మతో ఆప్యాయంగా వైఎస్ భారతమ్మ

ఫేక్ వీడియోలను ప్రజలు విశ్వసించరు

- బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



మీడియాతో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్‌కు సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి కల్పిత కథనాలను ప్రజలు విశ్వసించడం లేదని, ఫేక్ వీడియోలను తయారు చేస్తున్నారని బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. కేంద్ర హోంమంత్రిపైనే మార్ఫింగ్ వీడియోలు చేస్తున్నారంటే, దీని వెనకాల ఎవరున్నారో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఖండించారు. అమిత్‌షా 4 శాతం ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ,ఎస్టీ, బీసీలకు పంచుతామంటే కాంగ్రెస్ నాయకులకు కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సీఎం స్థాయికి తగ్గట్టుగా వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి భయంతో ఫేక్ వీడియోలు తయారు చేసి బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిపై రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతిని వెలుగులోకి రానియ్యకుండా వార్తాపత్రికలు, విలేకరులు, ప్రతిపక్షాల మీద ఆంక్షలు విధించిన చరిత్రను రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. భవిష్యత్ బీజేపీది కాబట్టే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడి చేసి నిలువరించడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు.

400 సీట్లలో బీజేపీ గెలవాలి.. అందులో హైదరాబాద్ ఉండాలి

- 40 ఏళ్లుగా రజాకార్లు ఏలుతున్నారు
- ఈ సారి బీజేపీకి మంచి అవకాశం
- మేం ఏ వర్గానికీ వ్యతిరేకం కాదు.. అందరికీ అండగా ఉంటాం
- హిందూ ముస్లింలు కలిసి బీజేపీకి ఓటు వేయాలి
- పాతబస్తీ రోడ్ షోలో హోం మంత్రి అమిత్ షా
- చేతిలో కమలం పువ్వు..విజయ సంకేతం చూపుతూ ర్యాలీ
- మర్ఫా వాయిద్యాలతో ముస్లింల ఘన స్వాగతం
- కదం తొక్కిన కమల దళం
- హోరెత్తిన 'జై శ్రీరామ్, వందేమాతరం, భారత్‌మాతాకీ జై'నినాదాలు..
- దారి పొడవునా భోనాలు..డప్పు దరువులు, పూల వర్షం
- లాల్ దర్వాజా మహంకాళీ అమ్మవారికి పూజలు



హైదరాబాద్ పాత బస్తీ బేల లైబ్రరీ ప్రాంతంలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న కేంద్రహోం మంత్రి అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని అన్ని రంగాల్లోనూ విజయపథంలో తీసుకువెళ్తున్న నరేంద్ర మోదీని మూడో సారి ప్రధానిని చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొంపెల్లి మాధవీలత గెలుపు కోసం బుధవారం రాత్రి పాతబస్తీలో రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో అమిత్ షా మాట్లాడుతూ బీజేపీ దేశవ్యాప్తంగా 400 సీట్లలో గెలవాలని, అందులో హైదరాబాద్ సీటు తప్పనిసరిగా ఉండాలని ఆకాంక్షించారు. 40 ఏళ్లుగా రజా కార్లు హైదరాబాద్‌ను ఏలుతున్నారనీ, ఈ సారి బీజేపీకి మంచి అవకాశం ఉందని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి మాధవీలత గెలుపుతో ఈ రజాకార్ల పాలన నుంచి విముక్తి లభిస్తుందన్నారు. బీజేపీ ఏ వర్గానికి వ్యతిరేకం కాదన్న అమిత్‌షా తాము అందరికీ అండగా ఉంటామని భరోసానిచ్చారు. హిందువులతో పాటు ముస్లింలు కూడా బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే హైదరాబాద్ ప్రజలను ఎవ్వరూ టచ్ చేయలేరని వ్యాఖ్యానించారు. అప్పటికే సమయం రాత్రి పదిగంటలవడంతో అమిత్‌షా ప్రసంగాన్ని మధ్యలోనే ముగించారు. ముందుగా మాధవీలత మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మీ అమ్మవారి దయ, ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి ఆశీస్సులతో ఈసారి తప్పకుండా పాతబస్తీలో బీజేపీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా ఇక్కడ అణిచివేతకు గురవుతున్న ప్రజలందరిలోని ఆవేశం ఓటు కింద మారాలని పిలుపునిచ్చారు.

మహంకాళీ అమ్మవారికి అమిత్ షా పూజలు

బుధవారం రాత్రి 9.24 గంటలకు అమిత్‌షా లాల్‌దర్వాజా మహంకాళీ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలతతో కలిసి ఐదు నిమిషాల పాటు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివాదం చేస్తూ..విజయ సంకేతం చూపుతూ..

పూజల అనంతరం అమిత్ షా 9.31 గంటలకు ప్రచార రథం ఎక్కి.. కార్యకర్తలకు అభివాదం చేస్తూ..లాల్ దర్వాజా నుంచి వెంకట్రావ్ స్కూల్, లాల్ దర్వాజ్ మోడ్, సుధా టాకీస్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్‌షోలో కమలనాధులు కదం తొక్కారు. వందేమాతరం ...భారత్ మాతాకీ జై..జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. దారి పొడవునా పార్టీ శ్రేణులు అమిత్‌షాపై పూల వర్షం కురిపించారు. మహిళలు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఆయన ఒక చేత్తో విజయ సంకేతం, మరో చేత్తో కమలం పువ్వును చూపిస్తూ ముందుకు సాగారు. సుమారు 25 నిమిషాల పాటు ఓపెన్‌టాప్ జీప్‌పై నిలబడి రోడ్ షో నిర్వహించారు. యాకుత్‌పుర, చాంద్రాయణగుట్ట, చార్మినార్, బహదూర్‌పుర, మలక్‌పేట్, ఘోషామహల్, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు ఈ రోడ్ షోకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

వాజ్‌పేయి తర్వాత.. షానే

పాతబస్తీలో బీజేపీ అభ్యర్థుల తరపున గతంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి ప్రచారం చేయగా, ఆ తర్వాత దేశ హోంశాఖామంత్రి హోదాలో అమిత్‌షా ఇక్కడికి రావడం విశేషం. ఎంఐఎంకు కంచుకోటలా ఉన్న పాతబస్తీలో అమిత్‌షా రోడ్ షో నిర్వహించడం ఆ పార్టీ శ్రేణులలో జోష్ నింపింది. కాగా, అమిత్‌షాకు పలువురు ముస్లింలు మర్ఫా వాయిద్యాలతో ఘన స్వాగతం పలకడం విశేషం. ఇక నిన్న మొన్నటి వరకు ఎడమొఖం .. పెడముఖంగా ఉన్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎంపీ అభ్యర్థి మాధవిలతతో కలిసి ప్రచారం నిర్వహించడం గమనార్హం.

రిజర్వేషన్ల రద్దు నాటకం కాంగ్రెస్ కుట్రే

- కరీంనగర్‌లో రెండోస్థానం కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ
- కేంద్రమంత్రి మురుగన్‌తో కలిసి బండి సంజయ్ రోడ్‌షో



రోడ్‌షోలో మాట్లాడుతున్న బండి సంజయ్, కేంద్రమంత్రి మురుగన్

కరీంనగర్ టౌన్: తెలంగాణలో ఏ సర్వే చూసినా బీజేపీ అత్యధిక సీట్లు సాధిస్తుందని తేలడంతో రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని, సీఎం సీటు పోతుందనే భయంతో రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చి నట్లు మాట్లాడుతున్నా రని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ను బద్నాం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు. రిజర్వేషన్ల రద్దు కోసమే 2000లో జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్‌ను బీజేపీ ప్రభుత్వం నియమించిందన్నారు. ఆయనిచ్చిన రిపోర్టును కూడా తొక్కిపెట్టారని చెబుతున్న రేవంత్‌రెడ్డికి 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ అని తెలీదా? మరి ఆ రిపోర్టును ఎందుకు బయటపెట్టలేదని సంజయ్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లోని కమాన్‌చౌరస్తా వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోకు వేలాది మంది తరలివచ్చారు. కేంద్రమంత్రి మురుగన్‌తోపాటు సంజయ్ పాల్గొని మాట్లాడారు. తమిళనాడులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి పార్టీని విస్తరించిన నాయకుడు మురుగన్ అని, ఆయన ఎంపీ కాకపోయినా దళితుడైన మురుగన్ సేవలను గుర్తించి నేరుగా కేంద్రమంత్రిని చేసిన ఘనత ప్రధాని మోదీదే అని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు డిపాజిట్లు రావని, రెండోస్థానం కోసమే పోటీ పడుతున్నారని ఎద్దేవాచేశారు. పొన్నం, వినోద్‌కుమార్ కరీంనగర్‌కు ఏంచేశారో చెప్పాలన్నారు. ఇవి దేశ ప్రధానిని నిర్ణయించే ఎన్నికలని, ఈ దేశం అభివృద్ధి చెందాలంటే, సంక్షేమ పథకాలు అందాలంటే, దేశ రక్షణ కావాలంటే మోదీనే మళ్లీ ప్రధాని కావాలని సంజయ్ తెలిపారు. దేశమంతా కరీంనగర్‌లో బండి సంజయ్‌ను ఎంత మెజారిటీతో గెలిపిస్తారనే చర్చ జరుగుతోందన్నారు. తనను ఎంపీగా గెలిపించి మోదీని ప్రధానిగా ఎన్నుకునే అవకాశం కల్పించాలని కోరారు.

తప్పుడు ప్రచారంతో బురదచల్లే ప్రయత్నం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



కేంద్రం ఇచ్చిన నిధుల గురించి వివరిస్తున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని దాడులు చేసినా, తప్పుడు ప్రచారాలతో బురదజల్లే ప్రయత్నం చేసినా, మాకు కవచం తెలంగాణ ప్రజలే. నరేంద్రమోదీ నాయకత్వం పట్ల తెలంగాణ ప్రజలకు అభిమానం ఉంది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణగడ్డపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను పాతరేయడం ఖాయం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్ కల్పన, డివిజన్ అధ్యక్షులు, ఇతర నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. 'బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహారాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం లేదని ప్రజలు తిరస్కరిస్తున్నారు. మోదీ మాత్రమే సమగ్రమైన, సుస్థిరమైన, సమర్థవంతమైన పాలన ఇవ్వగలరనే ఉద్దేశంతో తెలంగాణవ్యాప్తంగా ప్రజలంతా ఆదరిస్తున్నారు. దీంతో, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బెంబేలెత్తిపోయి బీజేపీపై ముప్పేట దాడికి ప్రయత్నిస్తున్నాయి. ఓటుకు నోట్లు కేసులో బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్‌కు సపోర్ట్ చేసినట్టుగానే.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి కేసుల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తోంది. బీజేపీని గెలవనీయొద్దనే దుర్మార్గపు ఆలోచనతో కాంగ్రెస్–బీఆర్ఎస్ దూప్ ఫైట్ చేస్తున్నాయి. బీఆర్ఎస్–కాంగ్రెస్ రాజకీయ డ్రామా కార్యక్రమాలు సమాంతరంగా నడుస్తున్నాయి. వారంరోజులుగా సీఎం వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉంది. పూర్తిగా అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి నిజస్వరూపాన్ని రాష్ట్ర ప్రజలు తెలుసుకుంటున్నారు. ఎన్నికల వేళ తలపై గాడిద గుడ్డు పెట్టుకొని ఊరేగుతున్నడు. ఆ గుడ్లు తలపై పెట్టుకొని 5 నెలల పాలనలో తాను ప్రజలకిచ్చేది ఇదేనంటూ ప్రజలకు వివరిస్తున్నడు. ఆస్థాయికి దిగజారిండు. ఎన్నికలకు వెళ్లేటప్పుడు ఏ పార్టీ అయినా ప్రజలకు చేసిన పనులు చేయాల్సిన పనులను వివరిస్తుంది. కానీ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను గాలికొది లేసింది. మళ్లీ ఆగస్టు 15న రుణమాఫీ అంటూ ఊదరగొడుతున్నారు. మిగతా గ్యారంటీల గురించి మాట్లాడటం లేదు' అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

కాంగ్రెస్‌ది దిగజారుడుతనం

'రాష్ట్రంలో మోదీ, బీజేపీకి ఆదరణ, మద్దతు పెరుగుతోంది. దీనిని తట్టుకోలేక మార్ఫింగ్ వీడియోలతో బీజేపీపై బురదజల్లుతూ కాంగ్రెస్ అత్యంత దిగజారుడు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు. టెలిఫోన్ ట్యాపింగ్‌తోపాటు హోంమంత్రి వీడియో మార్ఫింగ్ అంశాలు రెండు నేరమే. రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతుంటే, హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ ఫేక్ వీడియోలు సృష్టించింది కాంగ్రెస్ పార్టీ. దానికి పూర్తి బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రిదే. ఈ విషయంలో మొదటి ముద్దాయి సీఎం. మార్ఫింగ్ వీడియోలు సృష్టించిన వారిలో ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తేలేదు. అందులో ఏ వ్యక్తి ప్రమేయమున్నా జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదు. రేవంత్‌రెడ్డికి దమ్ముధైర్యం ఉంటే పదేళ్ల యూపీఏ హయాంలో, తొమ్మిదిన్నరేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో తెలంగాణకు ఎన్ని నిధులిచ్చారనే దానిపై చర్చకు సిద్ధం కావాలి. ప్రెస్‌క్లబ్‌లో లేదా తెలంగాణ అమరవీరుల స్థూపంలేదా చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయం..ఏ చోటనైనా రేవంత్‌రెడ్డితో చర్చకు నేను సిద్ధం. గాడిద గుడ్లు నెత్తిన పెట్టుకోవడం కాదు.. తెలంగాణకు ఇచ్చిన నిధులపై చర్చకు రావాలి' అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డి.. ఏరోజైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవా..?

'పార్లమెంటు ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామంటూ మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. ఈరోజు తన కాళ్లకింద భూమి కదిలిపోతుంటే ఏమీ చేయలేని స్థితిలో రోజుకో విధంగా మాట్లాడుతున్నాడు. గుజరాత్ పెత్తనానికి.. తెలంగాణ పౌరుషానికి పోటీ అని రేవంత్‌రెడ్డి అంటున్నడు. రేవంత్‌రెడ్డి అసలు ఏరోజైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవా? టీడీపీలో ఉండి ఉద్యమానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తి రేవంత్‌రెడ్డి. ఇక్కడుండే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బీజేపీ పౌరుషం చాలు. మీ ఇటలీ పౌరుషానికి, అవినీతి పౌరుషానికి వ్యతిరేకంగా తెలంగాణ బీజేపీ పౌరుషం చాలు. గుజరాత్ దాకా వెళ్లాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏనే ఇటలీది. ఐఎన్‌సీ అంటేనే ఇటలీ నేషనల్ కాంగ్రెస్. ఒకరికొకరం తోడు అంటూ కేసీఆర్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ బీజేపీపై దుష్ప్రచారం చేస్తోంది. తెలంగాణ ప్రజల సొమ్మును కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ బాసులకు తాకట్టు పెడుతున్నారు. ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో ఢిల్లీకి సూట్‌కేసులు పంపుతున్నరు' అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

అంగన్‌వాడీల రిటైర్మెంట్లు షురూ!

- 65ఏళ్లు పూర్తయిన టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణకు రంగం సిద్ధం
- వారి వయోపరిమితి వివరాలను తెప్పించుకున్న రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ
- ప్యాకేజీపై అంగన్‌వాడీ ఉద్యోగ సంఘ నేతల అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పదవీ విరమణ ప్రక్రియకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రంగం సిద్ధం చేసింది. కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ ప్యాకేజీపై నిర్ణయం తీసుకోవడం.. మరోవైపు వయోపరిమితి సడలింపు తర్వాత ఈ ఏడాది నుంచి ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ల ప్రక్రియ షురూ కావడంతో అంగన్‌వాడీల రిటైర్మెంట్ల పర్వానికి తెరలేచింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమాచార సేకరణను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చేపట్టింది. ఉద్యోగంలో చేరిన తేదీ మొదలు, జిల్లా, ప్రాజెక్టు వివరాలు, వారి పుట్టిన తేదీ, వయసు తదితర వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో క్షేత్రస్థాయిలో జిల్లా సంక్షేమాధికారి(డీడబ్ల్యూఓ), శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి(సీడీపీఓ)ల నుంచి తెప్పించుకుంది.

గత నెలాఖరు నుంచే రిటైర్మెంట్లు

ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితి మూడేళ్ల పెంపు తర్వాత రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పదవీ విరమణలు మార్చి నెల నుంచే మొదలయ్యాయి. అయితే నూతన వార్షిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కావడంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు మాత్రం ఏప్రిల్ నెలాఖరు నుంచి రిటైర్మెంట్లు అమలు చేయాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో ఏప్రిల్ నెలతో 65 సంవత్సరాలు పూర్తయిన టీచర్లు, హెల్పర్ల వివరాలను ఆ శాఖ సేకరించింది. 65ఏళ్లు పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్యాకేజీ రూపంలో ప్రభుత్వం అందించనుంది. అదేవిధంగా మినీ అంగన్‌వాడీ సెంటర్ టీచర్, అంగన్‌వాడీ హెల్పర్‌కు రిటైర్మెంట్ ప్యాకేజీ కింద రూ.50వేలు అందించనుంది. రిటైర్మెంట్ సమయం నుంచి వారికి ఆసరా పింఛన్ ఇచ్చేలా ప్యాకేజీలో ఉంది.

ఏడాది చివరికల్లా 5వేల మంది...

రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు దాదాపు 50వేల మంది పనిచేస్తున్నారు. వీరికి ఇప్పటివరకు పదవీ విరమణకు సంబంధించి ప్రత్యేకంగా ఆర్థిక సాయం అందించే అంశం లేదు. తాజాగా



ప్యాకేజీని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చి పదవీ విరమణ ప్రక్రియను చేపడుతోంది. ఈ క్రమంలో ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 5వేల మంది టీచర్లు, హెల్పర్లు రిటైర్మెంట్ కానున్నట్లు సమాచారం.

రిటైర్మెంట్ ప్యాకేజీ సమ్మతంగా లేదు

రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల రిటైర్మెంట్ ప్యాకేజీ ఏమాత్రం న్యాయసమ్మతంగా లేదు. టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష ఇవ్వాలని గత ప్రభుత్వం ఎదుట డిమాండ్ పెట్టాం. కానీ అందులో సగానికి తగ్గించి ప్యాకేజీ అంటూ చెప్పడం అన్యాయం. ప్రభుత్వం ఇచ్చే రిటైర్మెంట్ ప్యాకేజీ వారి జీవితానికి ఏమాత్రం సరిపోదు. డిమాండ్ల సాధన కోసం మళ్లీ న్యాయపోరాటం చేస్తాం.

– టేకుమల్ల సమ్మయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు



చైనాలో కొట్టుకుపోయిన ఎక్స్‌ప్రెస్ వే..
24 మంది దుర్మరణం

బీజింగ్: చైనాలో ప్రధాన రహదారి కొట్టుకుపోయిన ఘటనలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని మెయిజౌ నగరంలో బుధవారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. చైనాలో 'లేబర్ డే'సందర్భంగా ఐదు రోజుల సెలవులు బుధవారం నుంచే మొదలయ్యాయి. దీంతో గ్వాంగ్‌డాంగ్-ఫుజియాన్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. భారీ వర్షాల కారణంగా మెయిజౌ నగరంలోని కొండప్రాంతంలో ఉన్న 18 మీటర్ల రహదారి కొట్టుకుపోయింది. అనూహ్య పరిణామంతో 20 వరకు వాహనాలు అందులో పడిపోయాయి. కొన్ని వాహనాల్లో మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి. వాటిలో ఉన్న 54 మందిలో 24 మంది చనిపోగా మరో 30 మంది గాయాలపాలయ్యారు.

సల్మాన్ నివాసం వద్ద కాల్పుల కేసు..
కస్టడీలో నిందితుడి ఆత్మహత్య



ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద ఏప్రిల్ 14వ తేదీన జరిగిన కాల్పుల ఘటన నిందితుల్లో ఒకరు పోలీసు కస్టడీలో ఆత్మహత్య చేసుకున్నారు. కాల్పులు జరిపిన నిందితులకు ఆయుధాలు సరఫరా చేసినట్లు అనూజ్ తపన్(32)పై ఆరోపణలున్నాయి. పోలీసులు ఇతడిని పోలీస్ కమిషనర్ కార్యాలయ భవనం ఆవరణలోని మొదటి అంతస్తు లాకప్‌లో ఉంచారు. బుధవారం ఉదయం టాయిలెట్‌కని వెళ్లిన ఇతడు ఎంత సేపటికీ బయటకు రాలేదు. తలుపు బద్దలు కొట్టి చూడగా బెడ్‌షీట్‌తో ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే గోకుల్‌దాస్ తేజ్‌పాల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటన సమయంలో ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురు కూడా లాకప్‌లో ఉన్నారని అధికారులు తెలిపారు. తపన్ స్వస్థలం పంజాబ్.

150 స్కూళ్లకు
బాంబు బెదిరింపు

- దేశ రాజధాని ఢిల్లీలో కలకలం
- హుటాహుటిన పోలీసు బృందాల తనిఖీలు
- వట్టివేనని తేలడంతో ఊపిరి పీల్చుకున్న జనం

సాక్షి, న్యూఢిల్లీ: పాఠశాలలను బాంబులతో పేల్చేస్తామంటూ ఆగంతకులు పంపిన హెచ్చరికలు దేశ రాజధాని ఢిల్లీలోని బుధవారం ఉదయం తీవ్ర కలకలానికి కారణమయ్యాయి. ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్ ప్రాంతాల్లోని 150 పైచిలుకు స్కూళ్లకు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు మెయిల్స్ పంపారు. స్కూళ్లలో బాంబులు పెట్టామంటూ మెయిల్స్ అందడంపై ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో తమకు 97 ఫోన్ కాల్స్ వచ్చాయని ఢిల్లీ ఫైర్ సర్వీస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. మధ్యాహ్నం తర్వాతా కొన్ని కాల్స్ అందాయన్నారు. తూర్పు ఢిల్లీలోని 24 ప్రైవేట్ స్కూళ్లు, దక్షిణ ఢిల్లీ ప్రాంతంలోని 18 స్కూళ్లు, పశ్చిమ ఢిల్లీ ప్రాంతంలోని 21, షాదారాలోని 10 పాఠశాలలకు బెదిరింపులు వచ్చినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. ఈ సమాచారం బయటకు పొక్కడంతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో స్కూళ్ల వద్దకు చేరుకుని, తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లడం, పాఠశాలల నిర్వాహకులు మైక్‌ల ద్వారా తల్లిదండ్రులు సూచనలు ఇవ్వడం కనిపించింది.

సోదాల్లో 20 బృందాలు

ఢిల్లీ క్రైం బ్రాంచి పోలీసు బృందాలు సీపీ రవీందర్ యాదవ్ నేతృత్వంలోని బెదిరింపులు అందిన స్కూళ్లలో ప్రొటోకాల్ ప్రకారం పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కూడిన 20 బృందాలను రంగంలోకి దించారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించక పోవడంతో అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని హోం శాఖ ప్రకటించింది.

డార్క్‌నెట్ నుంచి మెయిళ్లు

ఎటువంటి ఆధారాలు చిక్కకుండా డార్క్‌నెట్‌ను ఉపయోగించుకుని దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేసింది. sawariim@mail. ru. అనే ఈ మెయిల్ ఐడీ నుంచి వచ్చిన ఈ మెయిళ్లన్నిటిలోనూ..'మీరు ఎక్కడ కలుసుకున్నా వారిని చంపండి, వారు మిమ్మల్ని తరిమికొట్టిన ప్రదేశాల నుంచి వారినీ తరిమికొట్టండి. స్కూళ్లలో చాలా పేలుడు పదార్థాలున్నాయి..'అనే విషయమే ఉందని వెల్లడించింది. ఇందులోని సవరిమ్ అనే అరబిక్ పదాన్ని ఉగ్ర సంస్థ ఐఎస్ తరచూ వాడుతుంటుందని ఓ అధికారి తెలిపారు. బెదిరింపుల్లో పవిత్ర ఖురాన్‌ను కూడా ఉటంకించారని చెప్పారు. ఎన్నికల వేళ ప్రజల్లో భయాందోళనలను సృష్టించడానికి ఉగ్ర సంస్థలు పన్నిన కుట్రగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా భావిస్తూ లోతుగా దర్యాప్తు చేపడతామని కేంద్ర హోంశాఖ తెలిపింది. విచారణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొంది.



ఢిల్లీలోని ఓ స్కూలు నుంచి తమ చిన్నారులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



ఎన్నికల విచిత్రం

అస్సాంలోని ధుబ్రి జిల్లాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో సంప్రదాయ టోపీని ధరిస్తున్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా

కమలానికి పెనుసవాళ్లు

- బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగం మార్పు తప్పదంటూ విపక్షాల ప్రచారం
- రాజస్తాన్, యూపీలో బీజేపీపై రాజ్‌పుత్‌ల తీవ్ర అసంతృప్తి
- కర్ణాటకలో మిత్రపక్షమైన జేడీ(ఎస్) నేత ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు
- విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టడంలో విఫలమవుతున్న బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు శాయశక్తులా కృషిచేస్తున్న కమల దళానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితర కీలక నేతలు సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు విపక్షం నుంచి ఎదురుదాడి, మిత్రపక్షాల కారణంగా తలెత్తుతున్న చిక్కులు, కొన్ని వర్గాల్లో నానాటికీ పెరుగుతున్న అసంతృప్తి వంటివి బీజేపీలో అలజడి సృష్టిస్తున్నాయి.

రిజర్వేషన్ల రద్దు అంశంపై రగడ

ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఇప్పటిదాకా సొంతంగా 432 మంది అభ్యర్థులను బరిలో నిలిపింది. మరో పది నుంచి పదిహేను మంది అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయి. మొత్తం 445 మంది అభ్యర్థులను బరిలో నిలిపినా, 370 సీట్ల లక్ష్యం సాధించాలంటే 80 శాతానికి పైగా స్థానాల్లో కచ్చితంగా నెగ్గాల్సి ఉంటుంది. కానీ, అందుకు ప్రతిబంధకాలు లేకపోలేదు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారని, రాజ్యాంగాన్ని మార్చేస్తారని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. రిజర్వేషన్లు, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకమని పదేపదే ఆరోపిస్తున్నాయి. ఇదే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక, ఆప్ నేత సంజయ్ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్, ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ రిజర్వేషన్లు, రాజ్యాంగంపై బీజేపీని ఇరుకున పెడుతున్నారు. దీనికి తోడు కాంగ్రెస్ ఇటీవల వైరల్ చేసిన అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో తర్వాత రిజర్వేషన్ల రద్దు అంశంపై జనంలో చర్చ మొదలైంది. రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తే లేదని, అలాంటి ఆలోచనే లేదని నరేంద్ర మోదీ, అమిత్ షా ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇస్తున్నప్పటికీ, దేశంలో 80 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీల్లో అనుమానాలు పూర్తిగా తొలగిపోవడం లేదు. మరో ఐదు విడతల్లో 350కి పైగా స్థానాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. రిజర్వేషన్ల రద్దు వ్యవహారం ఓటర్లపై తప్పనిసరిగా ప్రభావం చూపుతుందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

అందుకేనా 400 సీట్లు?

మళ్లీ బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చేయడం ఖాయం అంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. రాజ్యాంగంతోపాటు కీలకమైన చట్టాలను మార్చడానికే 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్' నినాదాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని కాంగెరస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. న్యాయం, సమానత్వం, పౌర హక్కులు, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ద్వేషిస్తోందని, నియంతృత్వ పాలన తీసుకురావడమే ఆ పార్టీ లక్ష్యమని విపక్షాలు మండిపడుతున్నాయి. దీనిపైనా ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాల్సి వచ్చింది. సాక్షాత్తూ బాబాసాహెబ్ అంబేడ్కర్ దిగివచ్చినా రాజ్యాంగాన్ని మార్చలేరని ఆయన పలు సభల్లో చెప్పారు. అయినప్పటికీ రాజ్యాంగ మార్పుపై బీజేపీ నేతలు అనంతకుమార్ హెగ్డే, అరుణ్ గోవిల్ చేసిన వ్యాఖ్యలు బీజేపీకి సంకటంగా మారాయి. రాజ్యాంగాన్ని మార్చే ఉద్దేశం తమకు లేదని మోదీ పదేపదే స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా విపక్షాల దాడిని సమర్థంగా తిప్పికొట్టడంలో బీజేపీ విఫలమవుతోంది. రాజ్యాంగం మార్పుపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను కొన్ని వర్గాల ప్రజలు నమ్ముతున్నట్లే కనిపిస్తోంది. ఇంకోవైపు రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో తమ జనాభా ఉన్న స్థానాల్లోనూ తమ వర్గం వారికి టిక్కెట్లు ఇవ్వలేదని రాజ్‌పుత్‌లు బీజేపీపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. మహాపంచాయతీలు నిర్వహించి బీజేపీకి వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తున్నారు.

ప్రజ్వల్ రేవణ్ణ వీడియోలతో వివాదం

కర్ణాటకలో బీజేపీ మిత్రపక్షమైన జేడీ(ఎస్) సిట్టింగ్ ఎంపీ, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. యువతులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ సంబంధిత వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. కర్ణాటకలో రెండో విడత పోలింగ్‌కు రెండు రోజుల ముందు ప్రజ్వల్ రేవణ్ణ వీడియోలు బయటకు వచ్చాయి. ఈ వ్యవహారంపై బీజేపీ ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతోంది. ప్రజ్వల్ రేవణ్ణను జేడీ(ఎస్) నుంచి బహిష్కరించినప్పటికీ వివాదం ఇప్పట్లో ఆగేలా లేదు.

ఎలక్షన్ బీట్

మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వబోమని రాసివ్వగలరా?: మోదీ



బనస్కాంత: మతం ఆధారంగా ఎప్పటికీ రిజర్వేషన్లు కల్పించబోమని కాంగ్రెస్‌తో పాటు విపక్ష కూటమిలోని భాగస్వామ్య పార్టీలు లిఖితపూర్వకంగా గ్యారంటీ ఇస్తాయా? అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సవాలు విసిరారు. రాజకీయ లబ్ధి కోసం మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. బుధవారం గుజరాత్‌లోని దీసా, హిమ్మత్‌నగర్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. తాను, తమ పార్టీ బీజేపీ ఉన్నంతకాలం విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లకు పూర్తి రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. మతం పేరిట రిజర్వేషన్లను దుర్వినియోగం చేయబోమంటూ కాంగ్రెస్ హామీ ఇవ్వగలదా? అని ప్రశ్నించారు. స్వార్థం కోసం రిజర్వేషన్లతో ఆటలు ఆడుతామంటే సహించబోమని హెచ్చరించారు. ఇక్కడ మోదీ ఉన్నాడన్న సంగతిని కాంగ్రెస్ నాయకులు గుర్తుపెట్టుకోవాలని అన్నారు. రాజ్యాంగం ముసుగులో రిజర్వేషన్ల జోలికి రావొద్దని చెప్పారు.

రద్దు చేయం.. చేయనివ్వం: అమిత్ షా



కోర్బా: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేసే ప్రశ్నే లేదని, ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రద్దు చేయాలని చూస్తే తాము కచ్చితంగా అడ్డుకుంటామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు. రిజర్వేషన్లు రద్దు చేయమని, చేయనివ్వబోమని పేర్కొన్నారు. అబద్ధాలు పదేపదే బిగ్గరగా చెబితే అవే నిజమవుతాయన్నదే కాంగ్రెస్ ఉద్దేశమని మండిపడ్డారు. ఒక కుటుంబం కోసం అబద్ధాలు చెప్పొద్దని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు హితవు పలికారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే చివరకు ఖర్గేను బలిపశువును చేస్తారని అన్నారు. బుధవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా జిల్లాలోని కాట్‌ఘోరా పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా మాట్లాడారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయితే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం సాగిస్తోందని మండిపడ్డారు. తాను అనని మాటలు అన్నట్లుగా ఫేక్ వీడియో సృష్టించారని ధ్వజమెత్తారు. బీజేపీ గత పదేళ్లుగా అధికారంలో కొనసాగుతోందని, రిజర్వేషన్లను తొలగించిందా? అని ప్రశ్నించారు.

నేరగాళ్లకు ప్రధాని మోదీ రక్షణ: రాహుల్

న్యూఢిల్లీ/బెంగళూరు: నేరగాళ్లకు ప్రధాని నరేంద్ర మోదీ రక్షణ కల్పిస్తున్నారని, 'రాజకీయ కుటుంబాన్ని' కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కర్ణాటకలో జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ప్రధాని మోదీ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు రాహుల్ గాంధీ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కర్ణాటకలో మహిళలపై అత్యంత ఘోరమైన నేరాలు జరిగితే ప్రధానమంత్రి మాట్లాడకపోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ప్రజ్వల్ రేవణ్ణ అరాచకాలకు పాల్పడ్డాడని తెలిసినప్పటికీ ఎన్నికల్లో అతడికి మద్దతుగా ఎందుకు ప్రచారం చేశారని మోదీని నిలదీశారు. ప్రజ్వల్ రేవణ్ణ దేశం నుంచి అంత సులభంగా ఎలా తప్పించుకొని పారిపోయాడని ప్రశ్నించారు. దేశంలో మహిళలపై ఎక్కడ నేరాలు జరిగినా ప్రధానమంత్రి మౌనంగా పాటిస్తున్నారని, నేరగాళ్లకు అండగా నిలుస్తున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. నేరస్తులను కాపాడుతానంటూ మోదీ గ్యారంటీ ఇస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఈవీఎంలపై అనుమానాలు: మమత



ఫరక్కా/బహరంపూర్: లోక్‌సభ మొదటి రెండు దశల్లో పోలింగ్ శాతాలు పెరిగాయంటూ ఎన్నికల కమిషన్(ఈసీ) వెల్లడించిన గణాంకాలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అనుమానం వ్యక్తం చేశారు.తుది పోలింగ్ శాతాలను ఆలస్యంగా విడుదల చేసిన ఈసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు దశల్లోనూ పోలింగ్ శాతాలు అనూహ్యంగా పెరగడంతో ఈవీఎంల పనితీరుపై ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. బుధవారం మమత మల్డా, ముర్షిదాబాద్ జిల్లాల్లో టీఎంసీ ఎన్నికల ప్రచార ర్యాలీల్లో పాల్గొన్నారు. 'ఏప్రిల్ 19, 26వ తేదీల్లో జరిగిన రెండు విడతల పోలింగ్ శాతాలను ఆ వెంటనే ఈసీ ప్రకటించింది. కానీ, తాజాగా ఈసీ విడుదల చేసిన గణాంకాలను మొదట్లో ప్రకటించిన వాటితో పోల్చి చూస్తే అకస్మాత్తుగా పోలింగ్ శాతం 5.75 మేర పెరిగినట్లు కనిపిస్తోంది. ఇది ఆందోళన కలిగించే విషయం. బీజేపీకి అనుకూలంగా లేని ప్రాంతాల్లోనే ఇలా పెరగడంపై మాకు ఎన్నో అనుమానాలున్నాయి. ఈసీ వీటిని నివృత్తి చేయాల్సిందే'అని ఆమె కుండబద్దలు కొట్టారు.

తృణమూల్ కంటే బీజేపీకి ఓటేయడం బెటర్

కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ వివాదాస్పద వ్యాఖ్య



కోల్‌కతా: విపక్ష 'ఇండియా' కూటమి భాగస్వామ్యపక్షమైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత, పశ్చిమ బెంగాల్ పీసీసీ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి విరుచుకుపడ్డారు. తృణమూల్ కంటే బీజేపీకి ఓటు వేయడమే ఉత్తమం అన్నారు. బుధవారం పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ''ఈసారి బీజేపీ కూటమికి 400 సీట్లు రావు. ఇప్పటికే 100 సీట్లు ప్రధాని మోదీ చేతుల నుంచి జారిపోయాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను, సీపీఎంను గెలిపించడం చాలా అవసరం. కాంగ్రెస్, సీపీఎం ఓడిపోతే లౌకికవాదానికి ముప్పు తప్పదు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కంటే బీజేపీకి ఓటు వేయడమే బెటర్. అందుకే తృణమూల్ కాంగ్రెస్‌ను, బీజేపీని పక్కనపెట్టి కాంగ్రెస్‌ను గెలిపించండి'' అని కోరారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



బాలరాముని సన్నిధిలో రాష్ట్రపతి ముర్ము పూజలు

అయోధ్యలో రాష్ట్రపతి

బాలరామున్ని దర్శించుకున్న ముర్ము ● ఆలయ ప్రారంభం తర్వాత తొలిసారి రాక

అయోధ్య: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం అయోధ్య సందర్శించారు. నూతన మందిరంలో ఇటీవలే కొలువుదీరిన బాలరామున్ని తొలిసారిగా దర్శించుకున్నారు. స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి హారతిచ్చారు. అంతకుముందు సరయూ నది హారతి కార్యక్రమంలో కూడా రాష్ట్రపతి పాల్గొన్నారు. అంగవస్త్రం ధరించి సంప్రదాయబద్ధంగా హారతిచ్చారు. అనంతరం నదికి పూలమాలలు సమర్పించి మొక్కుకున్నారు. తర్వాత ప్రఖ్యాత హనుమాన్ గఢి ఆలయాన్ని సందర్శించారు. పూజల్లో పాల్గొని ఆంజనేయునికి హారతిచ్చారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం రామాలయానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. రామజన్మభూమి ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్రదాస్ రాష్ట్రపతికి దగ్గరుండి దర్శనం చేయించారు. రామ్ లల్లా పట్ల ఆమె భక్తిశ్రద్ధలు అపూర్వమని కొనియాడారు. ''స్వామికి రాష్ట్రపతి హారతిచ్చారు. సాష్టాంగం చేసి భక్తిని చాటుకున్నారు. రాష్ట్రపతి, ప్రధాని ఇద్దరూ గొప్ప రామ భక్తులు కావడం నిజంగా గొప్ప విషయం'' అని సత్యేంద్రదాస్ అన్నారు.

అప్పట్లో విపక్షాల రగడ...

అయోధ్యలో నూతన రామాలయం నిర్మాణానంతరం రాష్ట్రపతి అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఆలయం జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమవడం తెలిసిందే. బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం కూడా ఆయన ఆధ్వర్యంలోనే జరిగింది. దేశవ్యాప్తంగా అన్ని రంగాలకు చెందిన వేలాది మంది ప్రముఖులను కార్యక్రమానికి ఆహ్వానించారు. రాష్ట్రపతి మాత్రం అందులో పాల్గొనలేదు. దీనిపై విపక్షాల నుంచి తీవ్ర అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తాయి. ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతిని పూర్తిగా పక్కన పెట్టి సర్వం మోదీమయంగా కార్యక్రమం జరిపించారని కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ తదితరులు దుయ్యబట్టారు. ముర్ము ఆదివాసీ కాబట్టే రాష్ట్రపతి అని కూడా చూడకుండా కావాలనే కార్యక్రమానికి దూరంగా ఉంచారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ బుధవారం ఆమె అయోధ్య వెళ్లి నూతన ఆలయాన్ని, బాలరామున్ని దర్శించుకోవడం విశేషం.

సారీ పప్పా..
ఈసారీ సాధించలేను..!

కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం

కోటా(రాజస్తాన్): రాజస్తాన్‌లోని కోటా నగరంలో 48 గంటల వ్యవధిలో మరో విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. రాష్ట్రానికే చెందిన భరత్ కుమార్ రాజ్‌పుత్ ఇప్పటికే రెండుసార్లు నీట్ కోసం ప్రయత్నించాడు. మూడోసారి ఈనెల 5న మళ్లీ పరీక్ష రాసేందుకు ప్రిపేరవుతున్నాడు. నీట్‌కు ప్రిపరేరవుతున్న తన బంధువుతో కలిసి స్థానిక రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఓ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం బంధువు బయటకు వెళ్లిన సమయంలో బెడ్ షీట్‌తో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అతడి వద్ద సారీ పప్పా..ఈఏడాది కూడా నీట్ సాధించలేను..'అని ఉన్న సూసైడ్ నోట్ లభించింది. తీవ్ర ఒత్తిడికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నామని పోలీసులు అంటున్నారు. సోమవారం హరియాణాకు చెందిన సుమిత్ పాంచాల్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తెల్సిందే.

రాయ్‌బరేలి నుంచి రాహుల్!

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి, అమేథీ స్థానాల నుంచి ఎవరు పోటీచేస్తారనే దానిపై కాంగ్రెస్ ఇంకా సస్పెన్స్‌ను కొనసాగిస్తూనే ఉంది. నామినేషన్ల ప్రక్రియ ముగియడానికి మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. తాజాగా విశ్వసనీయ వర్గాల సమాచారమేమిటంటే రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగే అవకాశాలున్నాయి. దీనిపై వారి కుటుంబం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సమాచారం. రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగడానికి ప్రియాంక ఆసక్తిగా ఉన్నారట. అయితే రాహుల్ వద్దని వారిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నాయకత్వానివి వారసత్వ రాజకీయాలనే ప్రధాని మోదీ విమర్శలను దృష్టిలో పెట్టుకొని ప్రియాంకను వద్దంటున్నట్లు ఈ వర్గాలు వెల్లడించాయి.

జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడికీ సమన్లు

రాంచీ: అమిత్ షా ఫేక్ వీడియో కేసులో జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్‌కు ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. గురువారం విచారణకు హాజరు కావాలని కోరారు. 'ఢిల్లీ పోలీసుల నుంచి మంగళవారం నాకు నోటీసు అందింది. నాకెందుకు నోటీసు ఇచ్చారో అర్థం కావడం లేదు. ఇది అరాచకమే. నిర్ధారించుకోకుండా సమన్లు ఇవ్వడం సమంజసం కాదు' అని ఠాకూర్ స్పందించారు. జార్ఖండ్ కాంగ్రెస్ ఎక్స్ ఖాతాను కూడా స్తంభింపజేశారు.

కాలిఫోర్నియా వర్సిటీలో ఉద్రిక్తత

- ఇజ్రాయెల్, పాలస్తీనా అనుకూల విద్యార్థుల ఘర్షణలు భారీగా అరెస్టులు



లాస్‌ఏంజెలిస్: పాలస్తీనా-ఇజ్రాయెల్ రగడ అమెరికాలో మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. లాస్ ఏంజెలిస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పాలస్తీనా, ఇజ్రాయెల్ అనుకూల వర్గాల విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. బైడెన్ ప్రభుత్వ ఇజ్రాయెల్ అనుకూల విధానాలను నిరసిస్తూ పాలస్తీనా వర్గం వర్సిటీలో టెంట్లు వేసుకుని నిరసనలను సాగిస్తున్న విషయం తెలిసిందే. హెల్మెట్లు, మాస్కులు ధరించిన కొందరు కర్రలు చేతబట్టుకుని మంగళవారం అర్ధరాత్రి టెంట్లపైకి దాడికి దిగారు. బాణసంచా కూడా కాల్చినట్లు లాస్‌ఏంజెలెస్ టైమ్స్ తెలిపింది. ఈ సందర్భంగా ఇరువర్గాల వారు పిడిగుద్దులు కురిపించుకున్నారు. కుర్చీలతోపాటు అందిన వస్తువులను విసురుకున్నారు. వర్సిటీని పాలస్తీనా అనుకూల వర్గాలు ఆక్రమించుకుని తమను లోపలికి రానివ్వడం లేదన్న ఇజ్రాయెల్ అనుకూల విద్యార్థుల ఆరోపణల నేపథ్యంలో ఈ దాడి జరగడం గమనార్హం. హింసాత్మక ఘటనల కారణంగా వర్సిటీలో బుధవారం తరగతులు రద్దయ్యాయి. సోమవారం కొలంబియా వర్సిటీ కూడా ఈ ఘర్షణలకు వేదికవడం తెలిసిందే. హామిల్టన్ హాల్‌లో దాదాపు 20 గంటలపాటు తిష్టవేసిన పాలస్తీనా అనుకూల విద్యార్థులను పోలీసులు బలవంతంగా బయటకు పంపించారు. వర్సిటీతోపాటు సిటీ కాలేజీలో ఆందోళనలకు దిగిన దాదాపు 300 మందిని అరెస్టు చేశారు. నార్తర్న్ ఆరిజోనా యూనివర్సిటీలో టెంట్లు వేసి నిరసన సాగిస్తున్న పాలస్తీనా అనుకూల విద్యార్థులను పోలీసులు ఖాళీ చేయించారు. కొద్ది వారాలుగా అమెరికాలో పాలస్తీనా, ఇజ్రాయెల్ విద్యార్థుల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయి. దేశవ్యాప్తంగా పలు వర్సిటీలకు విస్తరిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. రోడ్ ఐలాండ్స్ క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న పాలస్తీనా అనుకూల విద్యార్థి వర్గంతో బ్రౌన్ యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే అక్టోబర్ నుంచి వర్సిటీలోకి ఇజ్రాయెల్ వ్యక్తుల పెట్టుబడులను స్వీకరించరాదనేది వారిలో ప్రధాన షరతు. ఆందోళనకారుల డిమాండ్‌కు ఇలా ఒక యూనివర్సిటీ తలొగ్గడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారని చెబుతున్నారు!



కొలంబియా వర్సిటీలో ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



కాలిఫోర్నియా వర్సిటీ వద్ద ఇరువర్గాల విద్యార్థుల ఘర్షణలు

అమెరికాలో గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ హతం

కాలిఫోర్నియా: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ప్రధాన నిందితుడు, గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ అమెరికాలో హత్యకు గురయ్యాడు. అతడిని తామే చంపినట్లు అర్ష్ దల్లా-లఖ్‌బీర్ గ్యాంగ్ ప్రకటించుకుంది. మంగళవారం సాయంత్రం ఫ్రెస్నో ప్రాంతంలో మరో వ్యక్తితో మాట్లాడుతున్న బ్రార్‌పైకి దుండుగులు కాల్పులు జరిపారు. ఘటనలో బ్రార్ చనిపోగా మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. ఘటనపై పోలీసులు స్పందించలేదు.

సాదిక్ ఖాన్‌పై తరుణ్ గులాటి పోటీ..
నేడు లండన్ మేయర్ ఎన్నిక

లండన్: యూకే రాజధాని లండన్ నగర మేయర్ పదవికి జరగనున్న ఎన్నికల్లో పాక్ సంతతికి చెందిన సాదిక్ ఖాన్‌తో ఢిల్లీలో జన్మించిన తరుణ్ గులాటి తలపడుతున్నారు. మేయర్ పదవికి గురువారం పోలింగ్ జరగనుంది. ప్రతిష్టాత్మక మేయర్ పదవి కోసం 13 మంది బరిలో ఉన్నారు. ప్రస్తుత మేయర్ సాదిక్ ఖాన్ లేబర్‌పార్టీ తరఫున పోటీ చేస్తుండగా తరుణ్ గులాటి(63) ఇండిపెండెంట్ అభ్యర్థి. తరుణ్‌తోపాటు భారత సంతతికి చెందిన శ్యామ్ బాత్రా అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కూడా పోటీ పడుతున్నారు. కాగా, ప్రధాన పోటీ సాదిక్ ఖాన్‌కు, కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థిని సుసాన్ హాల్‌కు మధ్యే ఉంది.

7

సాక్షి హైదరాబాద్

గురువారం । 2 । మే । 2024







కార్నర్ మీటింగ్ అదరహో..

చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థులు రంజిత్‌రెడ్డి, పట్నం సునీతా మహేందర్‌రెడ్డిలకు మద్దతుగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ఇది నగరవాసుల కనీస బాధ్యత

వచ్చే వానాకాలం నాటికి సమాయత్తమవుదాం

జలమండలి సరఫరా చేసే నీటిలో 40%కి పైగా వృథా

కృష్ణా, గోదావరి నుంచి తరలించేవాటిలో రోజుకు 260 కోట్ల లీటర్ల నీరు శుద్ధి

నగరంలో 80% ప్రాంతాల్లో ప్రస్తుతం భూగర్భ జలాల లభ్యతలో క్షీణత

రోజుకు 100-150 కోట్ల లీటర్ల భూగర్భ జలాల ఉపయోగం

కుళాయిలకు ఎయిరేటర్ల వినియోగంతో నీటి వృథాను 30-50% తగ్గించవచ్చు

నగరంలో కురుస్తున్న వర్షపు నీటి పరిమాణం ఇలా..

మొత్తం వైశాల్యం: సుమారు 1000 చ.కి.మీ

సగటు వర్షపాతం: 0.7 మీ.

వర్షపు నీటి పరిమాణం: 70,000 కోట్ల లీటర్లు



నీటిని దాచేద్దాం

వర్షపు చుక్కను ఒడిసిపడదాం!!

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) సుదూరంలోని కృష్ణా, గోదావరి నదుల నుంచి తరలించి రోజుకు 260 కోట్ల లీటర్ల శుద్ధి చేసిన నీటిని హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగర ప్రజలకు సరఫరా చేస్తోంది. బోర్డు సరఫరా చేసే నీటిలో 40–45% వినియోగదారులకు చేరే లోపే లీకేజీల ద్వారా, ఇతరత్రా విధాలుగా వృథా అవుతోంది. కుళాయి నీటితో పాటు జంట నగరాల ప్రజలు రోజుకు మరో 100 -150 కోట్ల లీటర్ల భూగర్భ జలాలను ఉపయోగిస్తున్నారు. నగరంలో 80% ప్రాంతాల్లో ప్రస్తుతం భూగర్భ జలాల లభ్యత క్షీణించింది.

'నీటి పాదముద్ర'ను తగ్గించుకుందాం..

- మనం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయోగించే నీటి పరిమాణాన్ని కొలిచే ఒక పద్ధతే 'వాటర్ ఫుట్‌ప్రింట్' ('నీటి పాదముద్ర').
- మనం తాగటానికి, ఇతర పనులకు నేరుగా వాడే నీటి పరిమాణం మాత్రమే కాకుండా తినే ఆహార పదార్థాలు కూడా మన నీటి పాదముద్రను పెంచుతాయి.
- మనం వినియోగించే వస్తువులు, యంత్రాల తయారీకి ఖర్చయ్యే నీరు కూడా మన ఖాతాలోకే వస్తుంది. ఈ నీటిని కూడా కలుపుకొని మన 'నీటి పాదముద్ర'ను లెక్కించుకోవాలి.
- **అధిక (నీటి పాదముద్ర కలిగిన) నీటితో ఉత్పత్తయ్యే వస్తువులు:** బియ్యం, బీరు, చక్కెర, జీన్స్ దుస్తులు, సిమెంట్, మాంసం, కాగితం, కాఫీ మొదలైనవి.
- **తక్కువ నీటి పాదముద్ర కలిగిన వస్తువులు:** చిరుధాన్యాలు, బెల్లం, ఇటుకలు, టీ మొదలైనవి.
- మన జీవన శైలిలో మార్పులతో నీటి పాదముద్రలను తగ్గించుకోవాలి.

వాన నీటి సేకరణ, రీచార్జ్ ఎలా?

- ఇంటి పైకప్పు నుంచి వర్షపు నీటిని సేకరించి, నిల్వ చేసుకుంటే.. ఫిల్టర్ చేసి నేరుగా ఉపయోగించుకోవచ్చు.
- ఇంటి పైన కురిసే వర్షపు నీటిని వృథా పోనీయకుండా రీఛార్జ్ పిట్ ద్వారా భూమి లోపలికి ఇంకేలా ఏర్పాటు చేసుకోవచ్చు. వాన నీటిని భూమి లోపలికి ఇంకింపజేసే ముందు ఆ నీటిని ఫిల్టర్ ద్వారా శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం అనేక ఫిల్టర్లు అందుబాటులో ఉన్నాయి.
- నీరు ఎండిపోయి పనికిరాని బోరు బావులను వృథాగా వదిలేయకుండా.. వాన నీటిని భూమి లోపలికి రీచార్జ్ చేసే నిర్మాణాలు (రీచార్జ్ పిట్స్)గా మార్చుకోవచ్చు.
- మేడపై ట్యాంక్ నిండి ఓవర్‌ఫ్లో అయ్యే నీరు కూడా ఇంటి పైకప్పుపైనే పడేలా చేస్తే.. ఆ నీరు కూడా వృథా కాకుండా రీచార్జ్ పిట్‌లోకి వెళ్తాయి.

చేయకూడని పనులు:

- ఇంటి ఆవరణలో, ఇంటి ముందు ఖాళీ ప్రదేశాలన్నిటినీ నేల కనిపించకుండా సిమెంటు చేయటం. దీనివల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకకపోగా, నీటి ముంపునకు కారణమవుతుంది.
- ఇంటి పైకప్పుపై కురిసే వర్షపు నీటిని మురుగు నీటి లైన్లలోకి వెళ్లేలా కనెక్ట్ చేయటం.
- కుళాయి నీటితో కార్లు కడగటం.
- నీట కరిగిన ఘనపదార్థాలు (టీడీఎస్) 100 పీపీఎం కంటే తక్కువ ఉండే విధంగా తాగునీటిని ఆర్.ఓ. ఫిల్టర్‌తో శుద్ధి చేయటం (దీనికి బదులు.. యూవీ ఫిల్టర్‌ను/అతి తక్కువ నీటిని వృథా చేసే ఆర్‌ఓ ఫిల్టర్‌ని ఉపయోగించండి).
- నీటి సరఫరా పైపునకు వాల్వ్‌ను బిగించకుండా ఉండటం.
- వాషింగ్ మెషీన్లు, అంట్లు కడిగే డిష్ వాషర్ల వంటి నీటి ఉపకరణాలను అసమర్థంగా ఉపయోగించటం.

నీటి సంక్షోభాన్ని అధిగమించడంలో సమాజం పాత్ర

కేంద్రీకృత నీటి యాజమాన్య వ్యవస్థలు రంగంలోకి వచ్చిన ఫలితంగా నీటి నిర్వహణలో వ్యక్తులు, సమూహాల పాత్ర తగ్గింది. నీటి భద్రత సాధించే బృహత్ కృషిలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయటానికి తీసుకోవాల్సిన ముఖ్యమైన మూడు చర్యలు:

1. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యలు: వృథాను తగ్గించటం. నీటిని తెలివిగా వినియోగించటం. ఇంటి స్థాయిలో నీటి లీకేజీలను అరికట్టటం.
2. వర్షపు నీటిని సంరక్షణ, భూమి లోపలికి ఇంకింపజేయడం (రీచార్జ్): వర్షపు నీటిన్ని ఒడిసి పట్టుకొని ఉపయోగించటం.
డాబాపైన కురిసే వర్షపు నీటిని సేకరించడం.
సాంప్రదాయ వాన నీటి సంరక్షణ నిర్మాణాలను పరిరక్షించుకోటవటం.. పునరుద్ధరించడం.
రీచార్జ్ చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచటం.
3. నీటి సంరక్షణకు హాని కలిగించే పనులు మానుకోవటం.



సమర్థ నీటి వినియోగం అంటే?

- ఇంట్లో కొన్ని అవసరాలకు కుళాయి నీరు, మరికొన్ని అవసరాలకు భూగర్భ జలాలను ఉపయోగించండి. స్నానానికి వేడి నీటిగా కుళాయి నీటిని వాడండి. మరుగుదొడ్లలో ఫ్లషింగ్‌కు బోర్ నీటిని వాడండి.
- వంట పాత్రలను శుభ్రం చేసేటప్పుడు ముందు భూగర్భ జలాలతో, తర్వాత పైపు నీటితో కడగాలి.
- ఇంట్లో కుళాయిలకు ఎయిరేటర్లు వినియోగిస్తే.. నీటి వినియోగాన్ని 30–50% తగ్గించుకోవచ్చు.
- వ్యర్థ జలాలను శుద్ధి చేసి, తిరిగి వాడుకోవాలి. క్లోరినేషన్ చేయకుండా ఉపయోగించవద్దు.
- ఇంటిని నిర్మించేటప్పుడే పెద్ద సంప్‌ను నిర్మించండి. చిన్న సంప్ నిర్మిస్తే అది నిండిన తర్వాత నీరు వృథాగా బయటికి పోతుంది.
- నీటికి కటకటగా ఉన్నప్పుడు రెయిన్ డ్యాన్స్‌లు, వాటర్ స్పోర్ట్స్ వంటి విలాసాలకు దూరంగా ఉండండి. హోలీ వంటి పండుగల సమయంలో నీటిని పొదుపుగా ఉపయోగించుకోండి.

పంతంగి రాంబాబు

గత జూన్– సెప్టెంబర్‌లో రుతు పవనాల వైఫల్యం వల్ల ఈ ఏడాది నదులు, చెరువులు, రిజర్వాయర్లు వేసవికి ముందే ఎండిపోయాయి. తక్కువ వర్షాల వల్ల భూగర్భ జలాలు భూమిలోకి ఇంకటం తగ్గింది. అందువల్ల భూగర్భ జల మట్టం కూడా వేగంగా క్షీణించింది. భూగర్భ జలాలను అతిగా తోడెయ్యటంతో పాటు నీటిని భూమిలో నుంచి తోడుకోవటమే కానీ తిరిగి నింపకపోవటం ఇప్పుడు హైదరాబాద్ మహా నగరం ఎదుర్కొంటున్న నీటి కరువుకు ఓ ముఖ్య కారణం. మరోవైపు సరఫరా అయ్యే నీటిలో 40%కి పైగా వృథా అవుతోంది. కాబట్టి, నీటి నిర్వహణలో మన అసమర్థత వల్ల సంక్షోభం మరింత తీవ్రమైంది. నీటి సంరక్షణ, పొదుపు నగరవాసులందరి బాధ్యత. నీటి వనరులను సంరక్షించడానికి మీ వంతు కృషి చేయండి. నీటి సంరక్షణ కృషిని ప్రారంభించడానికి మీరు నిపుణులు కానవసరం లేదు. ప్రాథమిక విషయాలు తెలుసుకోండి.. ఆచరించండి! ఎందుకంటే.. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రజల సంపూర్ణ భాగస్వామ్యం అత్యవసరం!!

చిన్న ఇంకుడుగుంత ఖర్చు రూ.10 వేలే..



'నేను సీనియర్ హైడ్రాలజిస్టును. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని రాఘవేంద్ర కాలనీలోని మా ఇంటి వద్ద నాలుగేళ్ల క్రితం ఇంకుడుగుంత నిర్మించాను. 1,200 చదరపు అడుగుల ఇంటిపై కురిసే ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టి భూగర్భంలోకి రీచార్జ్ చేస్తున్నాను. ఇంటి ప్రహరీకి – రోడ్డుకు మధ్యలో మెట్ల పక్కన ఉన్న ఖాళీలో 4×4 అడుగుల విస్తీర్ణంలో 4.5 అడుగుల లోతున ఇంకుడుగుంత నిర్మించాను. గుంతలో 3 అడుగుల మేరకు 20 ఎం.ఎం. చిప్స్‌ను నింపాను. ఎక్కువ నీరు వచ్చినప్పుడు కూడా నీరు పొర్లిపోకుండా ఉండేందుకు గుంతపై ఒక అడుగు ఖాళీ ఉంచా. మిద్దె మీద నుంచి వచ్చే వర్షపు నీటితో పాటు ఇంటి చుట్టూ ప్రదేశాన్ని కడిగినప్పుడు వచ్చే నీరు కూడా ఈ ఇంకుడుగుంతలోకి వచ్చేలా ఏర్పాటు చేశా. చిప్స్, మట్టి మధ్యలో ఉండే గాలి సులువుగా బయటకు వచ్చేందుకు 5 అడుగుల ఎత్తు గల ఒక ఎయిర్‌పైప్‌ను కూడా ఏర్పాటు చేశా. దీనికి కింది నుంచి 2 అడుగుల ఎత్తు వరకు.. 2 అంగుళాలకు ఒక చోట 5 ఎం.ఎం. బెజ్జాలు చేశాం. ఈ బెజ్జాల్లో నుంచి పైప్ ద్వారా గాలి పైకి వచ్చి బయటికి వెళ్లిపోతుంది. కాబట్టి, వాననీరు సులువుగా భూమిలోకి ఇంకుతోంది. కుండపోత వర్షం కురిసినప్పుడు కూడా ఈ ఇంకుడుగుంత ఓవర్ ఫ్లో కాదు. '1,000 – 1,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే చిన్న ఇండిపెండెంట్ ఇంటికి ఇంతకన్నా పెద్ద ఇంకుడుగుంత అవసరం లేదు. దీనికి మహా అయితే రూ. 10 వేల కన్నా ఎక్కువ ఖర్చు కాదు. ఇంటి ఆవరణ లోపలే ఇంకుడుగుంత కట్టాలనేమీ లేదు. నేను కట్టినట్లు రోడ్డు మార్జిన్‌లో కూడా ఇలా కట్టుకోవచ్చు' అన్నారు రామ్మోహన్.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు


'ఇంకుడు గుంతలను కాలనీలలో ఉండే ఖాళీ ప్రదేశాలలో నిర్మించేటప్పుడు, మరిన్ని ముఖ్యమైన జాగ్రత్తలు అవసరం. భూమిపై పడి ప్రవహించే నీటితో పాటు మట్టి, నలకలు కూడా ఉంటాయి. కాబట్టి, ఇంకుడు గుంతల్లో పై పొరగా ఇసుకను నింపుకోవాలి. కానీ, ఆ ఇసుక కిందకు దిగిపోకుండా ఉండటానికి గులకరాళ్లపై ఒక నైలాన్ లేదా వైర్ జాలీని తప్పకుండా వేసి, దానిపైన ఇసుకను నింపాలి. అలా చేస్తే, భవిష్యత్తులో మట్టి, ఇసుకను తీసివేసి మెష్ / జాలీని శుభ్రం చేసి సులువుగా ఇంకుడు గుంతను బాగు చేసుకోవచ్చు' అన్నారు రామ్మోహన్.

నిపుణులు కానవసరం లేదు!



వాన నీటిని సంరక్షించటం, నీటిని పొదుపుగా ప్రతి ఒక్కరి బాధ్యత. నీటి వనరులను సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చెయ్యాలి. ఇంటిని ఘనంగా నిర్మించడానికి పెద్ద మొత్తంలో డబ్బు పెట్టుబడి పెడుతుంటారు కదా.. ఆ ఇంటి ఆవరణలో కురిసే వాన నీటిని ఒడిసి పట్టుకునే ఏర్పాట్ల కోసం కూడా కొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టండి. నీటి సంరక్షణ పనులు మొదలు పెట్టటానికి మీరు నీటి నిర్వహణలో నిపుణులు కానవసరం లేదు. ఇప్పుడు మనం చెప్పుకున్న ప్రాథమిక విషయాలను తెలుసుకొని, వాటిని శ్రద్ధగా ఆచరిస్తే చాలు!

– ఆర్.వి. రామ్మోహన్, వాటర్ అండ్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్, తార్నాక, సికింద్రాబాద్



హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులకు మెనింజైటీస్ టీకాలతో పాటు పోలియో చుక్కలు వేస్తున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వహణాధికారి షేక్ లియాఖత్ చెప్పారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. ఇప్పటికే కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారికి కేంద్ర హజ్ కమిటీ ఆదేశాలతో టీకాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు ఖైరతాబాద్, మలక్‌పేట్, నాంపల్లి, కింగ్‌కోఠి, గోల్కొండ ప్రభుత్వాస్పత్రులతో పాటు అమీర్‌పేట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో టీకాలు ఇస్తున్నట్లు తెలిపారు. నిర్ధారించిన కవర్ నంబర్‌ను ఆస్పత్రి సిబ్బందికి చూపించి టీకాలు తీసుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీకాలు వేయించుకోవచ్చని ఆయన సూచించారు.

'ఎర్లీబర్డ్' చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే అధికం

సాక్షి, సిటీబ్యూరో: అరచేతిలోంచే పనులు పూర్తి చేసేందుకే నగర పౌరులు ప్రాధాన్యమిస్తున్నారు. తమకు అందుబాటులో సదుపాయం ఉంటే చాలు ఆన్‌లైన్ ద్వారా సులభంగా పనులు పూర్తి చేసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీకి 'ఎర్లీబర్డ్' ద్వారా వసూలైన ఆస్తిపన్ను చెల్లింపుల్లోనూ ఈ విషయం వెల్లడైంది. ఆస్తిపన్ను చెల్లించేందుకు వివిధ మార్గాలున్నప్పటికీ, ప్రజలు తాము ఉన్నచోటు నుంచే ఆన్‌లైన్ ద్వారానే ఎక్కువ మంది, ఎక్కువ మొత్తంలో ఆస్తిపన్ను చెల్లించారు. ఈ స్కీమ్ ద్వారా జీహెచ్‌ఎంసీకి రూ.827.31 కోట్లు వసూలు కాగా.. ఇందులో తమ కంప్యూటర్ నుంచో మొబైల్ ఫోన్ నుంచో అరచేతి నుంచే చెల్లింపులు చేసిన వారే ఎక్కువగా ఉన్నారు. అలా 5,04,306 మంది ఆస్తిపన్ను చెల్లింపుదారులు చెల్లించిన మొత్తం రూ.411.79 కోట్లు. వసూలైన మొత్తం ఆస్తిపన్నులో దాదాపు సగం వీరే చెల్లించారు. మిగతా సగం ఇతర మార్గాల ద్వారా వసూలైంది. సిటిజెన్ సర్వీస్ సెంటర్ల ద్వారా 74,034 మంది రూ.85.84 కోట్లు, మీ సేవ కేంద్రాల ద్వారా 72,890 మంది రూ.48.80 కోట్లు చెల్లించారు. బిల్‌కలెక్టర్లకు నేరుగా నగదు చెల్లింపులు చేసినవారు 83,607 మంది ఉన్నారు. వారు రూ.280.85 కోట్లు చెల్లించారు.

ఎర్రదండు



ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడలోని వైఎంసీఏ నుంచి ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ వరకు జరిగిన ఈ ర్యాలీలో సీపీఎం నేత బీవీ రాఘవులు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

గ్రేటర్ @88.75 ఎంయూలు

సాక్షి, సిటీబ్యూరో: మండుతున్న ఎండలతో విద్యుత్ వినియోగం రెట్టింపవుతోంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చరిత్రలోనే తొలిసారిగా మంగళవారం గ్రేటర్ పరిధిలో 4,214 మెగావాట్ల (88.75 మిలియన్ యూనిట్ల) విద్యుత్‌ను వినియోగించారు. 2022 ఏప్రిల్ 27న 3,435 మెగావాట్ల (72.02 ఎంయూ) విద్యుత్ వినియోగం నమోదు కాగా.. 2023లో మే 19న అత్యధికంగా 3,756 మెగావాట్లు (79.33 ఎంయూ) విద్యుత్ వినియోగం రికార్డు అయింది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని చూసి ఇంజినీర్లు ఆందోళన చెందుతున్నారు. తరచూ జంపర్లు కట్ అవుతుండటం, ఇన్సులేటర్లు ఫెయిల్ అవుతుండటం, ఆయిల్ లీకేజీల కారణంగా డీటీఆర్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోని పలు ఫీడర్ల పరిధిలో అంతరాయాలు తప్పడం లేదు.

రికార్డులు బ్రేక్..

2022 మార్చిలో నమోదైన విద్యుత్ వినియోగంతో పోలిస్తే, 2023 మార్చిలో 0.68 శాతం అధికంగా రికార్డ్ అయింది. 2022 ఏప్రిల్‌తో పోల్చితే 2023 ఏప్రిల్‌లో 0.97 శాతం అధికంగా నమోదైంది. 2023 మార్చితో పోల్చితే 2024 మార్చిలో 24.52 శాతం, ఏప్రిల్ నెలలో 19.66 శాతం అధికంగా విద్యుత్ వినియోగం జరిగింది.

మేయర్ ఇంట్లోకి ఆగంతకుడి చొరబాటు

- తాను ముంబై కిల్లర్‌నంటూ హల్‌చల్
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12 ఎన్‌బీటీ నగర్‌లోని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంట్లోకి ఓ ఆగంతకుడు ప్రవేశించి బీభత్సం సృష్టించాడు. ఈ మేరకు మేయర్ వంట మనిషి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్‌బీటీనగర్‌లో నివసించే మేయర్ విజయలక్ష్మి ఇంట్లోకి మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఓ వ్యక్తి ప్రవేశించాడు. నేరుగా ఆమె వ్యక్తిగత గదిలోకి వెళ్లాడు. ఆ సమయంలో మేయర్ ఇంట్లో లేరు. ఓ యువకుడు లోనికి ప్రవేశించిన విషయాన్ని గమనించిన మేయర్ వంట మనిషి బాలాజీ.. ఆగంతకుడిని నువ్వెవరు అంటూ ప్రశ్నించాడు. మేడమ్ ఇంట్లో లేరని బాలాజీ చెప్పినా వినకుండా ఆగంతకుడు అక్కడే భైఠాయించి న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. 'నేను మేయర్‌తో మాట్లాడాలి. ఆమెను వెంటనే పిలిపించండి. మేయర్‌ను పిలిపించకపోతే బాగుండదు. నేను ముంబై కిల్లర్‌ను అంటూ హెచ్చరించాడు. దీంతో ఆందోళన చెందిన బాలాజీ అక్కడున్న వారిని అప్రమత్తం చేశాడు. వారంతా అక్కడికి వచ్చే లోగానే నిందితుడు అక్కడి నుంచి పరారవడానికి యత్నించగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇంట్లోకి ప్రవేశించిన యువకుడు తన పేరు లక్ష్మణ్ అంటూ పరిచయం చేసుకున్నాడని, అనుమానిత కదలికలు ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆగంతకుడిపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 448, 506 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. మేయర్ ఇంట్లోకి ఆగంతకుడు ఎలా వచ్చాడు? ఎందుకు వచ్చాడు? అనే వాటిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

రైజర్స్ వర్సెస్ రాయల్స్







క్రికెట్ అభిమానులను అలరించేందుకు నగరంలో మరో ఐపీఎల్ పోరుకు రంగం సిద్ధమైంది. నేడు జరిగే మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడుతుంది. సొంత మైదానంలో గత గురువారం జరిగిన మ్యాచ్‌లో ఓటమి పాలైన సన్‌రైజర్స్ ఇప్పుడు తమదైన శైలిలో సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. మరోవైపు లీగ్‌లో గ్రూప్ టాపర్‌గా ఉన్న రాజస్తాన్ అమితోత్సాహంతో బరిలోకి దిగుతోంది. సీజన్‌లో ఇక్కడ జరుగుతున్న నాలుగో మ్యాచ్ కూడా రాత్రి గం. 7.30కే ప్రారంభం కానుండటం హైదరాబాద్ అభిమానులకు ఊరట.

–సాక్షి, హైదరాబాద్

షా షో



కమలోత్సాహం కదం తొక్కింది. కాషాయ దళంలో అమితోత్సాహం వెల్లివిరిసింది. బుధవారం రాత్రి పాతబస్తీ లాల్‌దర్వాజ రోడ్డులో బీజేపీ పండుగ వాతావరణం కనిపించింది. బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్ షా చేపట్టిన రోడ్డు షో విజయవంతమైంది.

– చార్మినార్

బుధవారం ఉష్ణోగ్రతలు ఇలా..	కుత్బుల్లాపూర్	ఖైరతాబాద్	మెహిదీపట్నం	యాకుత్‌పురా	గచ్చిబౌలి	రామాంతపూర్	బండ్లగూడ	వెంగళరావునగర్	జీడిమెట్ల	రాజేంద్రనగర్	మెట్టుగూడ	దూద్‌బౌలి
	43.4	43.1	43.0	43.0	43.0	42.9	42.9	42.9	42.9	42.8	42.7	42.6



అడ్రస్ అడిగి అంతం చేశారు

- యువకుడి ఫోన్ లాక్కున్న దుండగులు
- అడ్డగించాడని కత్తితో దాడి
- బాధితుడు మృతి



అబిడ్స్: ఓ యువకుడు తన స్నేహితుడితో సరదాగా మాట్లాడుతుండగా అక్కడకు వచ్చిన ఇద్దరు యువకుడు ఓ అడ్రస్ గురించి అడిగారు. యువకుడు చెప్పబోతుండగా అతని చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కొని పారిపోబోయారు. అప్రమత్తమైన యువకుడు వారిని ప్రతిఘటించాడు. దీంతో దుండగులు అతని ఛాతిపై కత్తితో మూడు సార్లు పొడిచి పరారయ్యారు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడని వైద్యులు తెలిపారు. గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ బైరి రాజు తెలిపిన మేరకు.. మెహిదీపట్నం మురాద్‌నగర్‌కు చెందిన సనుల్లా (24) తన స్నేహితుడితో కలిసి మంగళవారం రాత్రి గుడిమల్కాపూర్‌లో ఉన్న తన సోదరుడి దుకాణం వద్ద ఉన్నాడు. పీవీ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెం.66 వద్ద సనుల్లా తన స్నేహితుడితో మాట్లాడుతున్న సమయంలో బ్లాక్ కలర్ స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అడ్రస్ అడిగినట్లు నటించి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోబోయారు. ప్రతిఘటించిన సనుల్లా ఛాతిపై కత్తులతో మూడు సార్లు పొడిచి పరారయ్యారు. తీవ్రగాయాలపాలైన బాధితుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే సనఉల్లా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిందితులని పట్టుకునేందుకు పోలీసులు వివిధ కోణాల్లో గాలిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికంగా కలకలం

యువకుడిని కత్తితో పొడవడంతో స్థానికంగా కలకలం రేగింది. మొబైల్, చైన్ స్నాచర్లు వీధుల్లో పేట్రేగిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకొని పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

శభాష్.. ఆఫీసర్

- రూ.400కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- అక్రమంగా పాస్‌బుక్‌ల కేటాయింపు
- జిల్లా కలెక్టర్‌కు నివేదించిన తహసీల్దార్
- పాస్‌బుక్‌లు రద్దు చేసిన కలెక్టర్
- తిరిగి ప్రభుత్వ పరమైన భూమి

మణికొండ: అది ఎకరం రూ. 75 కోట్లకు పైగా విలువ చేసే ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి. దానిపై కొందరు కోర్టుకు వెళ్లటం, తమ ఆధీనంలో ఉంచుకోవటం చేశారు. వారికి అనుకూలంగా ఎలాంటి ఆదేశాలు, తీర్పులు లేక పోయినా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారికి ఏకంగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి. వాటిని గమనించిన ప్రస్తుత తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్‌రెడ్డి వాటిని పరిశీలించి వారికి అక్రమంగా పాస్ బుక్‌లను జారీ చేశారని గమనించి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. దాంతో ఆయన పరిశీలించి అక్రమ పాస్‌బుక్‌ల జారీ విషయంలో అపుడే క్రిమినల్ కేసును నమోదు చేయించటంతో పాటు బుధవారం పాస్ బుక్‌లను రద్దు చేశారు. దాంతో ఏకంగా రూ. 400 కోట్ల విలువైన భూమి తిరిగి ప్రభుత్వ స్వాధీనమైంది. వివరాలు.. గండిపేట మండల పరిధిలోని మణికొండ పోకల్‌వాడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 4లో(ది లైఫ్ చర్చి పక్కన) ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దానిని అనాదిగా తాము సాగు చేసుకున్నామని, దానిపై హక్కులు కల్పించాలని పూసల రవీందర్, పూసల ప్రహ్లాద్‌లు జిల్లా కలెక్టర్‌తో పాటు కోర్టులను ఆశ్రయించారు. వారికి అనుకూలంగా ఎలాంటి ఆదేశాలు రాకపోవటంతో అది ప్రభుత్వ భూమిగానే రికార్డులలో ఉంది.

ఎన్నికల సమయంలో గోల్‌మాల్...

గత అసెంబ్లీ ఎన్నికల సమయం నవంబర్ నెలలో కేసులు వేసిన ఇరువురికి రెండున్నర ఎకరాల చొప్పున కేటాయిస్తూ పాస్ బుక్‌లను అప్పటి రెవెన్యూ అధికారులు జారీ చేశారు. దాంతో వారు తమకు అనుకూలంగా కోర్టులో తీర్పు వచ్చిందని, తమకు పాస్‌బుక్‌లు జారీ అయ్యాయని సదరు భూమిని మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. విషయం తెలుసుకున్న ప్రస్తుత తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్‌రెడ్డి విషయాన్ని ఏప్రిల్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్ శశాంక దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ఆయన భూమి పూర్వాపరాలను పరిశీలించి పాస్‌బుక్‌లు జారీ విషయంపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశంతో పాస్ బుక్‌లు పొందిన ఇద్దరితో పాటు వాటిని జారీ చేసిన అధికారులపైనా క్రిమినల్ కేసు నమోదై విచారణ కొనసాగుతోంది.

పాస్‌బుక్‌లను రద్దు చేసిన కలెక్టర్...

మణికొండ పోకల్‌వాడ సర్వేనెంబర్ 4లోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఇద్దరి పేర్లతో జారీ అయిన పాస్ బుక్‌లను బుధవారం జిల్లా కలెక్టర్ శశాంక రద్దు చేశారు. దాంతో వారికి అక్రమంగా వచ్చిన హక్కులను తొలగించటంతో సదరు భూమి తిరిగి ప్రభుత్వ పరమైంది. సదరు భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవటంతో పాటు ప్రభుత్వ భూమిగా పేర్కొంటు బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించటంతో బుధవారం వెంటనే ప్రహరీగోడలపై ప్రభుత్వ భూమిగా పేర్కొంటు పేయింటింగ్స్ వేయించారు. గత ప్రభుత్వ హాయాంలో కొందరు భూ కబ్జారాయుళ్లు, రెవెన్యూ అధికారులు కలిసి ఆడిన నాటకానికి తెరదించటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


ప్రభుత్వ భూమి అని సూచిస్తూ రాయిస్తున్న అధికారులు

వీఎస్టీ కంపెనీ తరలింపుపై కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్టీ కంపెనీని తూప్రాన్‌కు తరలిస్తున్న నేపథ్యంలో కార్మికులకు చట్టప్రకారం షిఫ్టింగ్ బెనిఫిట్స్, ఇంక్రిమెంట్ ఇవ్వాలని కార్మిక నాయకులు కోరారు. యాజమాన్యం, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అన్యాయం చేసిందని పేర్కొంటూ బుధవారం బాగ్‌లింగంపల్లిలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో వీఎస్టీకి చెందిన ఐఎన్‌టీయూసీ విభాగం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యానికి, యూనియన్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ విభాగం నాయకులు కె.రాజు, ఎల్‌డీ పాల్, శ్రీనివాస్ యాదవ్, సమద్, ప్రభాకర్, సాయిప్రసాద్‌రెడ్డి, జానకిరాములు మాట్లాడారు. 2017లో వీఎస్టీ కంపెనీకి చెందిన సీఎండీ విభాగం తూప్రాన్‌కు తరలిస్తున్న సందర్భంగా ప్రతి కార్మికుడికి నెలకు రూ.4 వేలు షిఫ్టింగ్ బెనిఫిట్స్, నాలుగు ఇంక్రిమెంట్స్ కల్పిస్తామని తెలిపారని గుర్తు చేశారు. కంపెనీని పూర్తిగా తూప్రాన్‌కు తరలిస్తున్నందున కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మికులు వెళ్లడానికి బస్సు సౌకర్యం కూడా కల్పించడం లేదని వాపోయారు. తమ సమస్యలు పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చెన్నై షాపింగ్ మాల్‌లో అక్షయ తృతీయ వేడుకలు

- ప్రారంభించిన సుమ



అల్విన్‌కాలనీ: మహిళా లోకాన్ని మైమరపించి, యువతరానికి నచ్చిన, మెచ్చిన సరికొత్త డిజైన్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో అతి తక్కువ ధరలతో చెన్నై షాపింగ్‌మాల్‌లో బంగారు నగలు లభిస్తున్నాయని ప్రముఖ సినీ యాంకర్ సుమ పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఏఎస్ రాజు నగర్ ప్రధాన రహదారిలోని చెన్నై షాపింగ్ మాల్‌లో బుధవారం అక్షయ తృతీయ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యాంకర్, నటి సుమ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వస్త్ర, స్వర్ణ వ్యాపారంలో సరికొత్త ఒరవడితో చెన్నై షాపింగ్ మాల్ యాజమాన్యం సొంత తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి కస్టమర్లకు అద్భుతమైన డిజైన్లతో అందిస్తున్నారని అన్నారు. మే 10వ తేదీ వరకు అక్షయ తృతీయ సందర్భంగా అతి తక్కువ తరుగు చార్జీలతో బంగారం అందించడానికి చెన్నై షాపింగ్ మాల్ యాజమాన్యం ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వెంకట్, శిధర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఐడీకార్డులతో మోసం


- నిందితుడి అరెస్ట్


నిందితుడు నాగరాజు

మాదాపూర్: పోలీస్ అధికారి ముసుగులో వసూళ్లకు పాల్పడున్న వ్యక్తిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ బుధవారం తెలిపిన మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా అగ్రహారం గ్రామానికి చెందిన నాగరాజు రఘువర్మ, అలియాస్ కార్తీక్ (వరుణ్ కల్నల్), కార్తీకేయసింగ్ (25) బజాజ్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఏపీ కమిషనర్ ఆఫ్ పోలీస్, సైబరాబాద్ నెం.2 పీడీసెల్ ఎస్‌బీ సైబరాబాద్-2024 పేరుతో నకిలీ ఐడీ కార్డులను తయారు చేశాడు. తనను అధికారిగా చెప్పుకుంటూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. గతంలోనే నిందితుడిపై కిడ్నాప్, అక్రమ ఆయుధాల సరఫరా సహా 9 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేశామని, ఏపీ, హైదరాబాద్‌లలో నిందితుడిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి.

అందాల ఫొటోలు ఎరవేసి..

- డేటింగ్ యాప్‌ల్లో అమ్మాయి పేరుతో అకౌంట్లు
- పురుషులకు వల వేసి మోసం
- కొట్టేసిన సొమ్ముతో బెట్టింగ్‌లు, జల్సాలు
- నిందితుడిని అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: డేటింగ్ యాప్‌లలో అమ్మాయిల పేరుతో నకిలీ ఖాతాలు తెరిచి, వాటి నుంచి అబ్బాయిలకు రిక్వెస్టులు పంపించి, మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. వనస్థలిపురానికి చెందిన మెగారాజ్ దినేష్ క్వాక్‌క్వాక్, టిండర్, బంబుల్, క్యూపిడ్, ఇండియన్ డేటింగ్ వంటి డేటింగ్ యాప్‌లలో శ్వేతా శెట్టి పేరుతో నకిలీ ప్రొఫైల్స్‌ను సృష్టించాడు. ఆ అకౌంట్ల నుంచి పురుషులకు రిక్వెస్టులు పంపిస్తుంటాడు. అమ్మాయి ఫొటో చూసి స్పందించిన వారితో స్నేహం పేరుతో మాయమాటలు చెబుతుంటాడు. కొద్ది రోజుల చాటింగ్ చేశాక.. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుందామని నమ్మిస్తాడు. బాధితులను నమ్మించేందుకు అమ్మాయి ఫొటో, నగ్న వీడియోలను పంపించి వారిని వలలో వేసుకుంటాడు. అదును చూసుకొని ఆర్థిక అవసరాలు ఉన్నాయని చెప్పి బాధితుల నుంచి అందినకాడికి లాగేస్తాడు. ఈ క్రమంలో సైబరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు దినేష్ వలలో చిక్కి రూ.4.09 లక్షలు మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడు దినేష్‌ను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే దినేష్‌పై శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఠాణాలో కేసు, సైబరాబాద్ సైబర్ ఠాణాలో కేసులున్నాయి. బాధితుల నుంచి కొట్టేసిన సొమ్ముతో తీన్ పత్తి గోల్డ్, 1ఎక్స్‌బెట్, బెట్ విన్నర్, డాష్ రమ్మీ, మెల్‌బెట్ వంటి గేమింగ్ యాప్‌లలో బెట్టింగ్‌లు, జల్సాలు చేస్తుంటాడు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

- బీజేపీ నుంచి ఒకరు, బీఆర్ఎస్ నుంచి మరొకరు


సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్

వనస్థలిపురం/గచ్చిబౌలి: గ్రేటర్ పరిధిలోని ఇద్దరు కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వనస్థలిపురం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కొండాపూర్ బీఆర్ఎస్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్‌లు సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

- ఎల్‌బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు సన్నిహితుడిగా పేరొందిన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం వరకు బీజేపీ తరపున ప్రచారం నిర్వహించి బుధవారం అకస్మాత్తుగా కాంగ్రెస్ పార్టీలో చేరడంపై బీజేపీ శ్రేణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- కొండాపూర్ బీఆర్ఎస్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం రాత్రి హమీద్ పటేల్‌కు సీఎం రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో శేరిలింగంపల్లి డివిజన్‌లో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ల సంఖ్య నాలుగుకు చేరింది.


బీజేపీ కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

మరో ప్రపంచ స్వాప్నికుడు మహాకవి శ్రీశ్రీ


శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త, దర్శకుడు వడ్డేపల్లి కృష్ణ, ఆకృతి సుధాకర్ తదితరులు

నాగోలు: తెలుగు సాహిత్యంలో మహాప్రస్థానం కవితా సంపుటి శ్రీశ్రీని శిఖరాగ్ర కవిగా నిలిపిందని తెలంగాణ టూరిజం శాఖ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. బుధవారం నాగోలులోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. భావ కవిగా, విప్లవ కవిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించన శ్రీశ్రీ సంప్రదాయ కవిత్వానికి భిన్నంగా వాడుక భాషలోని పదాలతో గొప్ప భావాలను పలికించారని అన్నారు. సినీ కవిగా ఎన్నో ఆణిముత్యాలలాంటి పాటలను అందించారన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కోర్టు సొసైటీ అధ్యక్షులు బాజిరెడ్డి శాయిరెడ్డి, బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు పిల్లల మర్రి రమేష్, సాహితీ కిరణం సీనియర్ ప్రాతికేయలు రామచంద్ర రావు, మదర్ థెరీసా ఫౌండేషన్ అధ్యక్షులు చేపూరి శంకర్ పాల్గొన్నారు.

శ్మశానంలో వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఓ వ్యక్తి శ్మశానవాటికలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వివరాలు.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని ధోబీఘాట్ బస్తీలో నివసించే రేవల్లి కాశయ్య (65) సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తుంటాడు. మద్యానికి బానిసైన కాశయ్య కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా కూతురుకు పెళ్లి సంబంధాలు వెతకడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో భార్య ఎల్లమ్మ పలుమార్లు నిలదీసింది. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కోపంతో కాశయ్య ఇంట్లోని తాడు తీసుకుని బయటకు వెళ్లిపోయాడు. ఎంతకూ రాకపోయేసరికి కొడుకు మహేష్‌తో పాటు స్థానికులంతా గాలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున పంజగుట్ట శ్మశానవాటికలో చెట్టుకు శవమై కనిపించాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నైజీరియన్లు నివసించే ఇళ్లలో పోలీసుల తనిఖీ


సన్‌సిటీలో పోలీసుల కార్డన్ సెర్చ్

బండ్లగూడ: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాజేంద్రనగర్, నార్సింగి పోలీస్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 5 నుంచి 8గంటల వరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. డ్రగ్స్ దందాపై దృష్టి పెట్టిన పోలీసులు సన్‌సిటీ, హైదర్షాకోట్ ప్రాంతాలలోని పీఎన్‌టీ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, హీరానగర్ కాలనీలలో నైజీరియన్లు నివసించే ఇంటింటికి వెళ్లి వారి వివరాలపై ఆరా తీశారు. సరైన వాహన ధృవపత్రాలను, పాస్‌పోర్టులు, వీసాలను పరిశీలించారు. వీసా గడువు ముగిసినా కొందరు నైజీరియన్లు అక్రమంగా రాష్ట్రంలో ఉంటున్నట్లు గుర్తించారు. సూడాన్ దేశానికి చెందిన ఒక మహిళ వీసా గడువు ముగిసినా కూడా ఇక్కడ నివాసం ఉంటున్నందున అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఖాతా నుంచి నగదు మాయం

బంజారాహిల్స్: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ఎస్ గోయెల్‌కు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 24,000 మాయం చేశారు. దీంతో బాధిత విశ్రాంత ఐఏఎస్ అధికారి సంబంధిత బ్యాంక్ అధికారులతో పాటు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో ఆర్ఎస్ గోయెల్ నివాసముంటున్నారు. ఎస్‌బీఐ జూబ్లీహిల్స్ బ్రాంచ్‌లో ఆయన పెన్షన్‌కు సంబంధించిన ఖాతా ఉంది. గత నెల 10న సదరు బ్యాంక్ ఖాతా నుంచి రూ.24,000 డెబిట్ అయ్యి, మరొకరి ఖాతాకు క్రెడిట్ అయినట్లుగా గోయెల్ మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. నగదు డెబిట్ కాకముందు బ్యాంక్ నుంచి ఎలాంటి ఓటీపీ గానీ, అధికారిక మెసేజ్ గానీ రాలేదు. దీంతో గోయెల్ తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లో ఉన్న నెంబర్‌ను సంప్రదించి అనధికారిక నగదు బదిలీపై ఆరా తీశారు. అలాగే మరుసటి రోజు ఏప్రిల్ 11న ఎస్‌బీఐ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. 12వ తేదీన నేరుగా తన హోమ్‌బ్రాంచ్‌ను సంప్రదించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనధికారికంగా నగదు బదిలీ అయిన దృష్ట్యా తిరిగి క్రెడిట్ అయ్యేలా చూడాలని కోరారు. బ్యాంక్ అధికారులు పరిశీలించి సైబర్ నేరంగా సూచించడంతో గోయెల్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జలమండలిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: 2022 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ బృందం బుధవారం జలమండలిని సందర్శించింది. ఈ సందర్భంగా ఎండీ సుదర్శన్ రెడ్డి.. బోర్డు పనితీరు, నగరానికి నీటి సరఫరా చేసే విధానం, ఎస్టీపీలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు.. భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల వివరాలు తెలిపారు. మహా నగరానికి భారీ పైపు లైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న పద్ధతి, నీటి శుద్ధి, వివిధ దశలలో నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియ, క్లోరినేషన్, తుది దశగా హైదరాబాద్‌కు భారీ మోటర్లతో పంపింగ్ వంటి అంశాల గురించి వివరించారు. రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్.. జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ, ఐటీ, ట్యాంకర్ బుకింగ్- డెలివరీ, మెట్రో కస్టమర్ కేర్, స్కాడా సిస్టం, పని చేసే ప్రాంతాల్లో కార్మికుల కోసం జలమండలి చేపట్టే రక్షణ చర్యలతో పాటు.. ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్- 1, 2 ప్రాజెక్టులు, వంద శాతం మురుగు శుద్ధి కోసం చేసే ఎస్టీపీల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మినీ జెట్టింగ్, సిల్ట్ కార్టింగ్, ఎస్పీటీ వాహనాలతో పాటు.. రోబోటిక్ సీవర్ క్రాక్ తదితర యంత్రాల పని తీరును డైరెక్టర్ ఆపరేషన్స్ - 1 అజ్మీరా కృష్ణ వివరించారు.

మున్షీతో దానం, నర్సింగరావు భేటీ



బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల ఏజెంట్ మామిడి నర్సింగరావుతో పాటు ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ కలిసి ఎన్నికల ప్రచారం, కాంగ్రెస్‌కు పెరుగుతున్న గ్రాఫ్‌పై వివరించారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని 40 డివిజన్లల బూత్ కమిటీ సమావేశాలు ఏర్పాటుచేసి సభ్యులకు దిశా నిర్దేశం చేసినట్లు మామిడి నర్సింగరావు తెలిపారు. బూత్ కమిటీ వ్యవస్థ కాంగ్రెస్‌కు పటిష్టంగా ఉందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రోజురోజుకు కాంగ్రెస్ పట్ల ఆదరణ పెరుగుతుందని వారు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి: లంకల



శ్రీనగర్‌కాలనీ: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని, కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్‌లో చేసిన సంక్షేమాభివృద్ధిని చూసి బీజేపీకి ఓటు వేయాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇంచార్జ్ లంకల దీపక్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని ప్రేమ్‌నగర్, ఆనందన్‌నగర్, ఓల్డ్‌సుల్తాన్‌నగర్‌లతో పాటు పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నా బీజేపీకి ఓటు వేయాలని కోరారు. నేతలు ప్రేమ్, కుంబాల గంగరాజు, ఈదులగంటి రాజేష్, డాక్టర్ గాయత్రిదేవి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌మూర్తికి ప్రతిష్టాత్మక అవార్డు



శ్రీనగర్‌కాలనీ: దేశంలో కాలిన గాయాలకు చేపల చర్మాన్ని అంటుకట్టడం చేస్తూ అద్భుత ఫలితాలను సాధిస్తున్న నగరానికి చెందిన పాడియాటిక్ ప్లాస్టిక్ అండ్ బర్న్స్ సర్జన్ డాక్టర్ కె.వి.ఎస్.ఎన్.సంతోష్‌మూర్తికి ఊండ్ కేర్ కాన్-2024లో అవార్డు లభించింది. లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీలో సొసైటీ ఫర్ ఊండ్ కేర్ అండ్ రీసెర్చ్ నిర్వహించిన 16వ వార్షికోత్సవ సదస్సులో కాలిన రోగులకు చేపల చర్మాన్ని గ్రాఫ్టింగ్ చేస్తూ వాటి సామర్థ్యాన్ని తెలుపుతూ సర్జరీ విజయాలను వివరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... అతితక్కువ ఖర్చుతో చేస్తున్న రోగులకు అందుబాటులో ఉండే ఈ సర్జరీ రానున్న రోజుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తుందన్నారు. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందని, మరింత పరిశోధనలు చేయడానికి ఇలాంటి అవార్డులు దోహదపడతాయన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల విస్తృత ప్రచారం



వెంకటేశ్వరకాలనీ: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ కార్పొరేటర్ భారతినాయక్ పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బుధవారం బంజారాహిల్స్‌రోడ్ నెం. 5లోని దేవరకొండ బస్తీలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ఎన్నికల అనంతరం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. నేతలు రాములు, చౌహాన్, బాబా నాయక్, డివిజన్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ యాదవ్, జావెద్ పాల్గొన్నారు.

లిఫ్ట్ దిగలేదని మహిళపై దాడి

వెంగళరావునగర్: లిఫ్ట్ దిగలేదని మహిళపై ఇద్దరు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... అమీర్‌పేటలో రిసెప్షనిస్ట్‌గా పనిచేసే అంబ్రీన్ సుల్తానా గత నెల 30న డ్యూటీకి వెళ్లే నిమిత్తం బిల్డింగ్‌లోని లిఫ్ట్ ఎక్కింది. ఓవర్‌లోడ్ అయిందంటూ ఓ మహిళ ఆమెను దుర్భాషలాడింది. డ్యూటీ అయిన తర్వాత సాయంత్రం ఇంటికి వెళ్తుండగా అదే మహిళ, మరో యువకుడు ఆమెను ఆపి దాడి చేశారు. ఈ ఘటనలో ఆమెకు గాయలయ్యాయి. బాధిత మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

మామిడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి సభ నిర్వహించిన కాంగ్రెస్ నేత మామిడి నర్సింగరావుపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... మంగళవారం మామిడి నర్సింగరావు ఫిలింనగర్ రోడ్డు నెంబర్-41లో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా సభ నిర్వహించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, ఎఫ్ఎస్‌టీ-1(బి) బృందం అధికారి శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు మామిడిపై కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై లైంగికదాడి

వెంగళరావునగర్: ఓఎల్ఎక్స్‌లో ఫ్రిజ్ అమ్మకానికి పెట్టిన మహిళపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన మహిళ తన ఇంట్లోని ఫ్రిజ్‌ను అమ్మకానికి ఓఎల్ఎక్స్‌లో పెట్టింది. దీనిని చూసిన ప్రీతం అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాను కొంటానని, ఫోన్ పే నెంబర్ అడిగి తీసుకున్నాడు. వాట్సాప్‌లో డీపీ చూసి అందంగా, డీసెంట్‌గా ఉన్నావంటూ పొగిడాడు. తనకు విడాకులయ్యాయని, పెళ్లి చేసుకుంటానని ఆమెకు చెప్పి మణికొండలోని తన ఫ్లాట్‌లో రెండుసార్లు శారీరకంగా కలిశాడు. విషయం ప్రీతం భార్యకు తెలిసి తన భర్తను కలిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆమెను హెచ్చరించింది. ప్రీతం ఆమె ఫోన్‌ను బ్లాక్ చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం దీనిని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయనున్నట్టు పోలీసులు తెలియజేశారు.

‘సేవాలాల్ సేన ఏ పార్టీకీ అనుబంధం కాదు’

పంజగుట్ట: సేవాలాల్ సేన ఏ పార్టీకి, అనుకూలంగా, వ్యతిరేకంగా పనిచేయదని, అది కేవలం గిరిజన జాతి సంస్కృతి, సంప్రదాయాలు రక్షిస్తూ, సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేస్తుందని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్ పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లాకావత్ భాస్కర్ నాయక్‌తో కలిసి మాట్లాడుతూ... ఇటీవల సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తాము బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నామని రాంబాబు నాయక్ ప్రకటించారని ఇది రాష్ట్ర కమిటీని, సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు సంజీవ్ నాయక్‌ను సంప్రదించకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని వారు పేర్కొన్నారు. రాంబాబు పదవీ కాలం కూడా అయిపోయిందన్నారు. అతని ప్రకటనకు సేవాలాల్ సేనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అతని వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీల వద్దకు వెళ్లాడని అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో 68.. ఖైరతాబాద్‌లో 46... బైండోవర్!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తూనే పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా పెట్టారు. ఆయా వ్యక్తులను బైండోవర్ చేశారు.

అనుమానితులను బైండోవర్ చేసిన పోలీసులు



అనుమానితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

- రౌడీషీటర్ల బైండోవర్ పూర్తి
- అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా
- ప్రచారాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై దృష్టి

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రౌడీషీటర్ల బైండోవర్ పూర్తికాగా అనుమానితులు, పాత నేరస్తులు, వివిధ నేరాల్లో పాల్గొన్న వారి బైండోవర్లు కూడా పూర్తయ్యాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో కొట్లాటకు దిగినవారు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారు, పాత నేరాలకు పాల్పడ్డ 68 మందిని గుర్తించి వారందరినీ బైండోవర్ చేశారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో అనుమానిత లక్షణాలతో తిరుగుతున్న పాత నేరస్తులు 46 మందిని బైండోవర్ చేశారు. వీరికి హెచ్చరికలు కూడా జారీ చేశారు. సత్ప్రవర్తన హామీ విస్మరిస్తే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, అటు రౌడీషీటర్లకు, ఇటు అనుమానితులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.
- ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్ (బైండోవర్) చేస్తున్నారు.

అతిక్రమిస్తే బౌండ్‌డౌన్..

- బైండోవర్‌లో భాగంగా రౌడీషీటర్లు, వివిధ నేరాల్లో పాల్గొన్న అనుమానితులు ఆర్డీఓ ఎదుట రాసిచ్చిన దానిని బైండోవర్ అంటారు. దీని కింద రూ. లక్ష పూచీకత్తుతో పాటు ఆరు నెలల వరకు అమలులో ఉంటుంది. బైండోవర్ జరిగిన ఏడాది లోపల రాసిచ్చిన హామీని అతిక్రమిస్తే దానిని బౌండ్ డౌన్ అంటారు. బాండ్ రాసిచ్చిన రోజు నుంచి ఆరు నెలల వరకు నేరాలకు పాల్పడకూడదు. ఏదైనా నేరం చేసినా, వారిపై కేసు నమోదైనా పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేస్తారు. ఇచ్చిన హామీ ప్రకారం పైన పేర్కొన్న మొత్తాన్ని సదరు వ్యక్తి నుంచి వసూలు చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తారు. బైండోవర్ పత్రాలు ఆరు నెలల పాటు పోలీసుల దగ్గరే ఉంటాయి.

జైలుకు పంపించే అవకాశం...

ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు, అనుమానితులు గుంపులుగా తిరిగినా, నేరాలకు పాల్పడినా ఆర్డీఓ ఎదుట పోలీసులు హాజరుపరుస్తారు. ప్రవర్తనలో మార్పు రాకపోతే జైలుకు పంపిస్తారు. హత్యలు, తరచూ నేరాలకు పాల్పడేవారు, సమాజంలో అశాంతిని రేకెత్తించేవారు, ఎన్నికల సమయంలో రిగ్గింగ్‌కు పాల్పడడం, పోలింగ్ స్టేషన్లలో హడావిడి చేయడం, అధికారులపై దౌర్జన్యాలకు దిగిన వారిపై రౌడీషీట్ తెరుస్తారు.

- ఇలా జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో 105 మందిపై, ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో 49 మందిపై రౌడీషీట్ తెరిచారు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో 154 మంది రౌడీషీటర్లు ఉన్నారు.

బైండోవర్ అంటే..

ఎన్నికల సమయంలో బెల్టు షాపులు నిర్వహించేవారు, రౌడీషీటర్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు, గొడవలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను సంబంధిత ఆర్డీఓ ఎదుట హాజరు పరుస్తారు. ఒక్కొక్కరితో రూ. లక్ష బాండ్ పేపర్ రాయించుకుంటారు. చట్ట వ్య తిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని లిఖితపూర్వక హామీ తీసుకుంటారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేస్తారు. ఈ ప్రక్రియను సత్ప్రవర్తనకు హామీ (బైండోవర్) అంటారు. ఇటీవల ఓ రౌడీషీటర్‌ను వెస్ట్‌జోన్ పరిధిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంకో రౌడీషీటర్ కోసం గాలింపు చేపట్టారు.

బీసీ–సీకి రిజర్వేషన్ల శాతం పెంచాలి



మాట్లాడుతున్న రెవరెండ్ డాక్టర్ సెబాస్టియన్

వెంగళరావునగర్: బీసీ-సీ ఉప కులానికి అన్ని రంగాల్లో ఐదు శాతానికి పైగా రిజర్వేషన్లను పెంచాలని ఆలిండియా ఇండిపెండెంట్ చర్చిస్ డయాసిస్ (ఏఐఐసీడీ) నిర్వాహకులు, ఇండియన్ బిలీవర్స్ పార్టీ (ఐబీపీ) జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ సెబాస్టియన్ కోరారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఈఎస్ఐ ఎదురుగా ఉన్న ఏఐఐసీడీ ప్రధాన కార్యాలయంలో బుధవారం పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసే కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటి వరకు బీసీ-సీ వర్గానికి కేవలం రెండు శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేస్తున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం దీనిని పెంచడానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్నామని తెలిపారు. క్రైస్తవులకు క్రిస్టియన్ భవన్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... ఎన్నికల్లో దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌ను బలపరచాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించి నిర్ణయించారు. ఈ విషయాన్ని ఏడు నియోజకవర్గాల్లోని చర్చిల్లో తెలియజేస్తున్నామన్నారు. బిషప్‌లు వినోద్, రాజేంద్రప్రసాద్, అరుణ్, బాలస్వామి, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, శ్యామ్యూల్ రెడ్డి, కళ్యాణ్‌దాస్, పార్లమెంట్ నియోజకవర్గంలోని అనేక చర్చిలకు చెందిన పాస్టర్లు హాజరయ్యారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ఫిలింనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపును కాంక్షిస్తూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ మామిడి నర్సింగరావు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాళ్ నగర్, వినాయక్‌నగర్, బాల్‌రెడ్డినగర్‌లలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ పథకాలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఫిలింనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో నర్సింగరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిందన్నారు. దానం నాగేందర్ గెలుపుతోనే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు ఆకుల రాజు, కాటూరి రమేష్, వంశీ, రవి నాయక్, బస్వరాజ్, చందు, పెంటయ్య, కిరణ్, రాములు, దయానంద్ పాల్గొన్నారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి, నవయుగ్ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకుడు నవీన్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఎస్పీఆర్‌హిల్స్‌లో పలు బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు మన్సూర్, ఎక్బాల్, రవీందర్‌రెడ్డి, శాంతకుమార్, సంజీవ్‌రావు, అందాళు, జ్ఞానేశ్వర్, పల్లెసాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే సంబురం



హైదర్‌గూడలో ఏఐటీయూసీ నేతలు

హిమాయత్‌నగర్: కార్మిక హక్కుల కోసం ఎందరో మహా నాయకులు చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితమే మే డే అని తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు అన్నారు. బుధవారం హైదర్‌గూడలోని టూరిజం శాఖ ప్రధాన కార్యాలయంలో ఘనంగా మేడే ఉత్సవాలను నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి కె.యాదగిరి, బి.కిషన్‌లతో కలిసి సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బు రాజమౌళి ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు నర్సింగరావు, చంద్రమౌళి, కమలాకర్, కృష్ణారెడ్డి, రాంచద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, గోపి పాల్గొన్నారు.

లక్డీకాపూల్: నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిమ్స్ గేటువద్ద కార్మిక జెండాను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేష్ ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహులు, నర్సుల యూనియన్ అధ్యక్షురాలు ఆశాలత పాల్గొన్నారు.

రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హబీబ్ ఫాతిమానగర్ జోన్ కమిటీ ఆధ్వర్యంలోని జెండాను కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, టీ హోప్ సంస్థ వ్యవస్థాపకుడు ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

అగ్నికి నెయిలాషెస్ స్టోర్ ఆహుతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం .4లోని నెయిలాషెస్ స్టోర్‌లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం ఏసీలో తలెత్తిన సాంకేతిక సమస్యతో అగ్గిరాజుకుంది. దీతో మంటలు స్టోర్ మొత్తం వ్యాపించాయి. స్థానికులు, స్టోర్ నిర్వాహకులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జూబ్లీహిల్స్ అగ్నిమాపక అధికారులు స్పందించి వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్టోర్ మొత్తం అగ్నికి ఆహుతైనట్లు అధికారులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

రహమత్‌నగర్: ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బోరబండ నాట్కో స్కూల్‌లోనే ఉంటూ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యోహోన్ కూతురు నిఖిత(17) ఇదే నాట్కో కాలేజ్‌లో ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. మంగళవారం సాయంత్రం నిఖిత ఇంటి నుంచి బయటికి వెళ్లింది. బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యతిరేక ఉద్యమం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: పొగాకు వాడటం వల్ల ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోవడం, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులను పూర్తిగా నిషేధించాలని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.జయలత అన్నారు. మే 31 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్, డాక్టర్ ఒ.నాగేశ్వర రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నెలరోజులు పొగాకు వ్యతిరేక ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర రావు తెలిపారు. బుధవారం ఉద్యమాన్ని ప్రారంభిస్తూ పొగాకు వాడటం వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ... నెల రోజులపాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఆస్పత్రి రిటైర్డ్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిట్టిబాబు, దైవజ్ఞశర్మ, డాక్టర్ మృత్యుంజయ రావు, మ్యూజిక్ డైరెక్టర్ బల్లిపల్లి మోహన్, కుసుమ భోగరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగస్వామ్యం కావాలి



పోలీసులకు బారికేడ్లను అందజేస్తున్న మెడికవర్ ఆస్పత్రి ప్రతినిధులు

బంజారాహిల్స్: ప్రతి సంస్థా ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగస్వామ్యమై తమవంతు బాధ్యతను నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగర ఇన్‌చార్జి అదనపు ట్రాఫిక్ కమిషనర్ సుబ్బరాయుడు అన్నారు. గురువారం గ్రీన్‌ల్యాండ్స్‌లోని మెడికవర్ ఆస్పత్రి ట్రాఫిక్ నియమ నిబంధనలతో తీర్చిదిద్దిన వంద బారికేడ్లను వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. వాటి స్వీకరణ కార్యక్రమంలో సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెచ్చరికలతో కూడిన ఈ బారికేడ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ బారికేడ్లపై సీటు బెల్టు ధరించండి.. హెల్మెట్ ధరించండి.. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రాణాలకే ముప్పు, రాంగ్‌రూట్‌లో రావడం వల్ల ప్రమాదం.. అనే హెచ్చరికలను రాశారు. దీని వల్ల వాహనదారుల్లో కొంత చైతన్యం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మెడికవర్ ఆస్పత్రి లాగే మిగతా సంస్థలు కూడా సీఎస్ఆర్ ప్రాజెక్ట్ కింద ఇలాంటి మంచి కార్యక్రమాలకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, మెడికవర్ ఆస్పత్రి చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మహేష్ దిగ్గోర్కర్, రాజ్‌కుమార్, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో ప్రభుత్వ ఇంజనీర్‌కు టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ప్రభుత్వ ఇంజనీర్‌ను సైబర్ నేరగాళ్లు మోసగించారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన ప్రభుత్వ ఇంజనీర్‌కు ఓ కంపెనీ కస్టమర్ సర్వీస్ ప్రతినిధి పేరుతో సైబర్ కేటుగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. బాధితుడిని వారు 66 మంది సభ్యులున్న వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేశారు. ఈ గ్రూప్‌లో స్టాక్ మార్కెట్ టిప్స్ ఇస్తామని నమ్మించారు. గ్రూప్ సభ్యుల పేరుతో ట్రేడింగ్‌లో లాభాలు వచ్చినట్లు కేటుగాళ్లు బ్యాంక్ స్టేట్‌మెంట్లు గ్రూప్‌లో పెడుతూ నమ్మించారు. అతను పూర్తిగా నమ్మాడని నిర్ధారించుకున్నాక ఎలైస్ డి2 పేరుతో ఓ నకిలీ ట్రేడింగ్ యాప్‌ను బాధితుడికి లింక్ పంపించి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయించారు. అనంతరం ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాలని చెప్పారు. బాధితుడి పేరుతో ఉన్న నకిలీ ట్రేడింగ్ యాప్‌లో షేర్లు కేటాయించినట్లు చూపించారు. దానికి డబ్బులు చెల్లించాలన్నారు. ఐపీఓ లిస్టింగ్ తేదీ సమీపిస్తుందని డబ్బు డిపాజిట్ చేయమన్నారు. వొడాఫోన్ ఎఫ్‌పీఓ, క్రియేటివ్ గ్రాఫిక్స్ సొల్యూషన్స్ షేర్లు కేటాయించినట్లు యాప్‌లో చూపించారు. దీంతో విడతల వారిగా బాధిత ఇంజనీర్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా మొత్తం రూ.14,18,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. మూడు రోజుల అనంతరం బాధితుడి మొబైల్ నుండి ట్రేడింగ్ యాప్ డిలీట్ అవడంతో పాటు వాట్సాప్ గ్రూప్ నుండి తొలగించారు. తాను మోసపోయానని నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు. అధిక లాభాలను ఆశ చూపి సైబర్ కేటుగాళ్లు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఈ తరహా ట్రేడింగ్ మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లెతే వెంటనే 1930కి కాల్ చేయడం గానీ, సైబర్ క్రైమ్ వెబ్ సైట్‌లో పిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు.

విద్యార్థులకు మంత్రి అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రేడియంట్ స్కూల్ విద్యార్థుల సంబురాలు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత పదవులు పొంది రాష్ట్రానికి, దేశానికి ఖ్యాతి తీసుకురావాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం శ్రీనగర్‌కాలనీ క్వీన్స్ స్కూల్ వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంత్రి అభినందించారు. విద్యార్థినులు లీషా సాహితి, సంజనలు 9.8 జీపీఏ సాధించారు. స్కూల్ చైర్మన్ రామలింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేడియంట్ స్కూల్‌లో...

ఎల్లారెడ్డిగూడ రేడియంట్ స్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. స్కూల్ చైర్మన్ షరీఫ్, ప్రిన్సిపాల్ ఎస్.కె.నాయర్ విద్యార్థులను బుధవారం స్కూల్‌లో అభినందించారు.

బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఫిలింనగర్: కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పని చేసి బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.ఎస్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ డివిజన్ 54 బూత్ కమిటీ నేతలు, కార్యకర్తలు, ముఖ్య కార్యకర్తల సమావేశం కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. నేతలు పెరుక కిరణ్‌కుమార్, నర్సింహ, శంకర్, విష్ణు నాయక్, జ్యోతి, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో బూత్ కమిటీలు కీలకం



మాట్లాడుతున్న సూరి

రహమత్‌నగర్: ఎన్నికల ప్రక్రియలో బూత్ కమిటీలే కీలకంగా వ్యవరిస్తాయని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు బండా సూరి అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ బూత్ కమిటీల సమావేశం నగర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ నేతృత్వంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూరి మాట్లాడుతూ... సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపుకోసం ప్రతి కార్యకర్తా కృషి చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో బూత్ కమిటీ పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నాయకులు అరవింద్, గ్యార నాగరాజు, జాఫర్ హుస్సేన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి రవీందర్‌రెడ్డి, మేఘన పద్మ, సువర్ణ, పర్వీన్ బేగం పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



దరువు వేస్తున్న కె.నారాయణ

హిమాయత్‌నగర్: కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని లోక్‌సభ ఎన్నికల్లో గద్దె దించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. ×మేడే¥ సంధర్భంగా ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సంఘటిత, అసంఘటిత కార్మికులు బుధవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి నారాయణగూడ చౌరస్తా, అక్కడి నుంచి తిరిగి ఎఐటియుసి కార్యాలయం వరకు కార్మికులు ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సయ్యద్ అజీజ్‌పాషా, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావులు పాల్గొన్నారు.

‘గట్కా’కు ప్రాచుర్యం కల్పించాలి

పంజగుట్ట: సిక్కుల ప్రాచీన మార్షల్‌ఆర్ట్స్ అయిన గట్కా క్రీడకు రాష్ట్రంలో తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రంచ గట్కా ఫెడరేషన్ అధ్యక్షుడు సర్దార్ హర్జిత్ సింగ్ గ్రేవాల్ అన్నారు. ఈ విద్యను 600 సంవత్సరాలకు పూర్వం తమ సిక్కు పెద్దలు కనుక్కొన్నారని ఇందులో 18 రకాల యుద్ధ విన్యాసాలు ఉంటాయన్నారు. వాటిని కేవలం కర్రతో ఆడే విధంగా చేసి జాతీయ క్రీడల జాబితాలో చేర్చినట్లు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గట్కా క్రీడల కరపత్రాన్ని తెలంగాణ గట్కా అసోసియేషన్ అధ్యక్షుడు సర్దార్ సుఖ్‌దేవ్ సింగ్, ప్రధాన కార్యదర్శి సర్దార్ విశాల్ సింగ్‌తో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... ఈ విద్య బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్‌కు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం అవకాశం ఇస్తే అన్ని పాఠశాలల్లో ఉచితంగా తాము విద్యను నేర్పిస్తామని తెలిపారు. సర్దార్ గుర్వీందర్ పాల్ సింగ్, సర్దార్ హర్మేష్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, గుర్వీందర్ సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

● అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత



ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న ఆలియాస్ జిసు(66), కాసరబోయిన వి నయ్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చి రోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పొడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

● ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహి స్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

● మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
● మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
● విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు




సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిర్ధ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చేల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

➡ 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పుర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

నగర వార్తలు

సరికొత్త రూపంలో ఓయూ వెబ్‌సైట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వెబ్‌సైట్‌ను (రీ డిజైన్) ఆధునీకరించారు. ఇటీవల జరిగిన 107వ ఫౌండేషన్ డేకు ముఖ్యఅతిథిగా హాజరైన నీతిఆయోగ్ సభ్యులు, ఓయూ పూర్వవిద్యార్థి, పద్మభూషణ్ డాక్టర్ విజయ్ కుమార్ సారస్వత్ ఆధునీకరించిన ఓయూ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. మౌలిక వసతుల విభాగం రూపొందించిన రీ డిజైన్ వెబ్‌సైట్లో గతంలో లేని అనేక సమాచారాలను పొందపరిచినట్లు డైరెక్టర్ ప్రొ.నవీన్ కుమార్ తెలిపారు. సెక్యూరిటీని పెంచడంతో పాటు ఓయూ కాలేజీలతో పాటు ప్రవేటు, అనుబంధంగా ఉన్న 741 కళాశాలల వివరాలు, ర్యాంకింగ్, వీడియోలు, వర్చువల్ టూర్ సమాచారం తదితర అనేక అంశాలను చూడవచ్చన్నారు.

రేపు హైదరాబాద్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పో -2024

సాక్షి, సిటీబ్యూరో: విద్యా రంగంలో సరికొత్త ఆవిష్కరణల కోసం నగరంలోని మెహదీపట్నం కింగ్స్ క్రౌన్ కోహినూర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 3,4 తేదీల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పో–2024 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఐజాజ్ అహ్మద్, ఇర్ఫాన్ అజీజ్ తెలిపారు. ఈ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓయూ లా పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లా సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఈ నెల 13 నుంచి వచ్చే నెల 3 వరకు జరగాల్సిన 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సుల ఫైనల్ పరీక్షలను పెరిగిన ఎండ తీవ్రత కారణంగా వాయిదా వేశారు. తిరిగి పరీక్షలను నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఓంకార్ పేరిట బంగారు పతకం

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత అధ్యాపకులు డాక్టర్ ఓంకార్ పేరు మీద బంగారు పతకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు తెలిపారు. బుధవారం ఓయూ జాగ్రఫీ విభాగంలో డాక్టర్ ఓంకార్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాజరై ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం..ఆయన సేవలను కొనియాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి జాగ్రఫీ విభాగంలో అధిక మార్కులు తెచ్చుకునే విద్యార్థికి డాక్టర్ ఓంకార్ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను అందచేయనున్నట్లు తెలిపారు. కంట్రోలర్ ప్రొ.రాములు, ప్రొ.రాజేందర్, సివిల్ అకాడమీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'షా' షో అదుర్స్

● దారిపొడవునా పూల వర్షం కురిపించిన అభిమానులు
● సమయాభావంతో త్వరగా ముగిసిన రోడ్డు షో

భారీగా తరలివచ్చిన బీజేపీ శ్రేణులు



పాతబస్తీలో అమిత్ షా రోడ్డు షోకు హాజరైన జనం



చార్మినార్: పాతబస్తీలో కేంద్ర హోం మంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా పర్యటనకు మంచి స్పందన వచ్చింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్డు షోకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వాస్తవానికి సాయంత్రం 5 గంటలకు అమిత్ షా వస్తున్నట్లు చెప్పినప్పటికీ ఆయన రాత్రి 9 గంటల తర్వాత వచ్చారు. రాత్రి 9.24 గంటలకు ఇక్కడి లాల్‌దర్వాజ సింహవాహిణి ఆలయంలో హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలతతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు అమిత్‌షాపై పూల వర్షం కురిపించారు. కాగా ప్రచార సమయం ముగుస్తుండడంతో ఆయన త్వరగా రోడ్డు షోను ముగించి బేలా లైబ్రరీ వద్ద జరిగిన మీటింగ్‌లో ప్రసంగించారు.

సాయంత్రం నుంచే సందడి

కాగా రోడ్డు షో కన్నా ముందు లాల్‌దర్వాజ రోడ్డులో భారీ సందడి కనిపించింది. వీధులన్నీ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో రద్దీగా మారాయి. ఎటుచూసినా బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలు, స్వాగత వేదికలే కనిపించాయి. నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు పాతబస్తీ లాల్‌దర్వాజకు తరలి వచ్చాయి. సాయంత్రం 4 గంటల నుంచే ఇక్కడ సందడి మొదలైంది.

వేడుకగా 'పద్మశాలి వనం పరివార్' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పద్మశాలి పరివార్ సభ్యులు

కాచిగూడ: పద్మశాలి వనం పరివార్ ఆధ్వర్యంలో బుధవారం కర్నాటి గార్డెన్స్‌లో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పద్మశాలీ వనం పరివార్ సభ్యులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆత్మీయత, అనురాగాలను ఒకరికొకరు పంచుకుని అభిమానాన్ని చాటుకున్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, వనం విశ్వనాథం, వనం జయశ్రీ, సుమన్, జయరాజ్, యాదగిరి, చంద్రమౌళి, పద్మనాభం, నర్మద, మహేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బేబీ వనం తనిష్క తన కూచిపూడి నాట్యంతో అందరినీ ఆకట్టుకున్నారు. బేబి జాహ్నవి, బేబీ ద్వారకాశ్రీ నృత్యప్రదర్శన అలరించింది. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తీర్మానించినట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అంబాదాస్

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మిరియాల అంబాదాసును నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర పద్మశాలి సంఘానికి చెందిన అంబాదాస్‌కు బుధవారం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని అందరికీ అందేలా పాటుపడతానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జగ్గారెడ్డికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గూడురు శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న అంబాదాసు

సోషల్ మీడియా ప్రచారాన్ని నిశితంగా గమనించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను బుధవారం హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్ పరిశీలించారు. ఈ సెంటర్ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలపై తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రకటనలు, చెల్లింపు వార్తల గుర్తింపు, అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి అనుమతులు, రిజిస్టర్ల నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న ప్రచారాల్ని మరింత పకడ్బందీగా పర్యవేక్షించాలని ఎంసీఎంసీ నోడల్ అధికారికి ఆయన సూచించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎన్నికలతో ముడిపడిన అంశాలను నిత్యం నిశితంగా పరిశీలించాలని సూచించారు. బల్క్ ఎస్ఎంఎస్‌లకు సంబంధించి అభ్యర్థులు ఎంసీఎంసీ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సీపీఆర్ఓ ముర్తుజా అలీ, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారి శరత్ చంద్ర, సోషల్ మీడియా పర్యవేక్షిస్తున్న కమిటీ మెంబర్, డిప్యూటీ ఈఈ నరసింగరావు పాల్గొన్నారు.

ఉప్పల్ స్టేడియం సిబ్బంది మెరుపు ధర్నా



స్టేడియం ఎదుట ధర్నాకు దిగిన సిబ్బంది

ఉప్పల్: ఉప్పల్ స్టేడియం సిబ్బంది బుధవారం మెరుపు ధర్నా చేపట్టారు. ఆరు నెలలుగా బోనస్, ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరిలో జరిగిన ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన టెస్టులో మ్యాచ్ సమయంలో అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు పాలకవర్గంలోని సిబ్బందికి బోనస్, ఇక్రిమెంట్లు ఇస్తామనే హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని ఆరోపించారు.

నేటి మ్యాచ్‌పై ప్రభావం?

గురువారం రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగనున్న ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో స్టేడియం సిబ్బంది ధర్నాకు దిగడం చర్చనీయాంశమైంది. వీరి ఆందోళన మ్యాచ్‌పై ఏమైనా ప్రభావం చూపిస్తుందా? అనే అంశం తెరమీదకు వస్తోంది. ఇటీవల చైన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌కు ముందు బకాయిలు చెల్లించలేదని స్టేడియానికి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై తీవ్ర విమర్శలు వచ్చిన విషయం విదితమే. టికెట్ల అమ్మకాలు, కాంప్లిమెంటరీ పాసుల జారీ, మ్యాచ్‌ల సమయంలో స్టేడియం మెయింటెన్స్ తీరుపైనా కొత్త పాలకవర్గంపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం స్టేడియం సిబ్బంది ధర్నాకు దిగడంతో హెచ్‌సీఏ పెద్దల వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

తెలంగాణ భాష సంస్కారవంతమైంది

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



మళయశ్రీకి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ భాష ఇంతకు ముందు పాలకులు ఉపయోగించినది కాదని, సంస్కారవంతమైనదని సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ ఆడిటోరియంలో డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హాజరై..తొలిదశ ఉద్యమకారుడు, రచయిత డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి పేరుతో ఆయన సతీమణి డాక్టర్ విజయలక్ష్మి సారస్వత పరిషత్‌లో నెలకొల్పిన సాహిత్య పురస్కారాన్ని శతాధిక గ్రంథకర్త డాక్టర్ మళయశ్రీకి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా తెలంగాణ భాషపై చర్చ జరిగిందని, అప్పటి ఉద్యమ నాయకుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆంధ్ర ప్రాంతపు వారిని నొప్పించకూడదని, మనకు మన రాష్ట్రం కావాలే తప్పా.. ఆంధ్ర వారితో విబేధం లేదని చెప్పేవారని గుర్తుచేశారు. శ్రీధర్‌రెడ్డితో కలిసి తాము తొలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న రోజులను సుదర్శన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. శ్రీధర్‌రెడ్డి చివరి రోజుల్లో ఆశించిన తెలంగాణ కాదని, ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని బాధపడినట్లు వివరించారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, బి.విజయలక్ష్మీ, డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.

హీరో వెంకటేశ్ కుమార్తె ఆశ్రిత ప్రచారం



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న వెంకటేశ్ కుమార్తె, రఘురాంరెడ్డి కోడలు ఆశ్రిత (ఎడమ)

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తరఫున ఆయన వియ్యంకుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబీకులు ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. రఘురాంరెడ్డి పెద్ద కుమారుడి భార్య, హీరో వెంకటేశ్ కుమార్తె ఆశ్రిత కూడా ప్రచారంలోకి దిగారు. ఖమ్మంలో బుధవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి పొంగులేటితో కలిసి పాల్గొని రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నీటి సమస్య పరిష్కరిస్తేనే ఓటు వేస్తాం

సరసనపల్లి గ్రామస్తుల తీర్మానం



వాటర్ ట్యాంకు వద్ద బిందెలతో లైన్‌లో ఉన్న సరసనపల్లి గ్రామ మహిళలు

కొత్తగూడ (మహబూబాబాద్): నీటి సమస్యను పరిష్కరిస్తేనే గానీ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయబోమని మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ మండలం సరసనపల్లి గ్రామస్తులు బుధవారం ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ...గ్రామంలో నీళ్ల లేక చెరువునుంచి బురద నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. తాగునీటికి మిషన్ భగీరథ నీరు ఇంటికి రెండు బిందెలు మాత్రమే వస్తుండటంతో ట్యాంక్ వద్ద బిందెలు లైన్‌లో పెట్టుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర అవసరాలకు ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువు నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. నీళ్ల లేక గ్రామంలో పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయారు. శాఖ మంత్రి సీతక్క మంజూరుచేసిన బోర్లు తమ గ్రామంలో వేయలేదని, తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అందుకే తమ నీటి సమస్యను పరిష్కరించేంతవరకూ వచ్చే ఎన్నికల్లో ఓటు వేసేది లేదని తీర్మానించుకున్నామని తెలిపారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



సమావేశంలో అభివాదం చేస్తున్న రాఘవులు, దానం నాగేందర్ తదితరులు

ముషీరాబాద్ (హైదరాబాద్): బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లను తొలగించే ప్రమాదం ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు ప్రజలను హెచ్చరించారు. బుధవారం గోల్కొండ చౌరస్తాలోని సీపీఎం నగర కార్యాలయంలో దానం నాగేందర్‌కు మద్దతుగా సంఘీభావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ ముఖ్యమంత్రులను, ప్రతిపక్షాలను, జర్నలిస్టులను జైళ్లలో వేసి నిరంకుశ పాలన సాగిస్తోందన్నారు. గత పదేళ్లలో ట్రైలర్ మాత్రమే చూశారని, అసలు సినిమా అధికారంలోకి వచ్చాక చూపిస్తామంటున్న ప్రధాని మోదీ మాటల్లో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. దానం నాగేందర్ మాట్లాడుతూ...మతోన్మాద బీజేపీని దేశంలో గద్దెదించి ప్రజాపాలనను దేశ వ్యాప్తంగా అధికారంలోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీకి సీపీఎం మద్దతును ప్రకటించడం శుభపరిణామమన్నారు. సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఆ పార్టీ నాయకులు పాలడుగు భాస్కర్, డీజీ నర్సింగ్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, నాగర్‌కర్నూల్: ఓవైపు నల్లమల అభయారణ్యం, మరోవైపు కృష్ణానది పరీవాహక ప్రాంతాన్ని పెనవేసుకొని ఉన్న నాగర్‌కర్నూల్ ఎంపీ సెగ్మెంట్‌లో ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన నాగర్‌కర్నూల్‌పై పట్టు సాధించేందుకు మూడు ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ బలమైన అభ్యర్థులను బరిలో నిలిపాయి. కాంగ్రెస్ నుంచి మల్లురవి, బీజేపీ నుంచి పోతుగంటి భరత్‌ప్రసాద్, బీఆర్ఎస్ తరఫున ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పోటీలో ఉన్నారు. . 1952, 1957లలో ద్విసభ్య నియోజకవర్గంగా ఉండగా, 1962లో నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంగా ఏర్పడింది. 8 సార్లు కాంగ్రెస్, ఐదుసార్లు టీడీపీ, ఒక్కోసారి తెలంగాణ ప్రజాసమితి, బీఆర్ఎస్ గెలిచాయి. 4.5 లక్షలకు పైగా ఉన్న ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఈ స్థానంలో గెలుపోటములపై ప్రభావం చూపనున్నారు. వీరిలో అగ్రభాగం మాదిగ సామాజికవర్గానికి చెందినవారే. ఈ ఎన్నికల్లో వారి ఓట్లే కీలకం కానున్నాయి.

నల్లమల నాయకుడెవరు?

తొలిసారి నాగర్‌కర్నూల్ ఎంపీ సెగ్మెంట్‌లో త్రిముఖ పోటీ	సిట్టింగ్ స్థానంపై బీఆర్ఎస్ గురి	ఆది నుంచీ కాంగ్రెస్‌దే ఆధిపత్యం	సిట్టింగ్ ఎంపీని చేర్చుకొని బలం పెంచుకున్న బీజేపీ	గెలుపులో మాదిగ సామాజికవర్గ ఓట్లే కీలకం

సిట్టింగ్ స్థానంపై బీఆర్ఎస్ పట్టు



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
బీఆర్ఎస్

సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు బీఆర్ఎస్ శ్రమిస్తోంది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను రంగంలోకి దింపి తమ అభ్యర్థి గెలుపునకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అలంపూర్‌కే చెందిన తాను విద్యావంతుడిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని, ఒకసారి తనకు అవకాశం కల్పించాలని ఆర్ఎస్.ప్రవీణ్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గానూ 12స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. అలంపూర్, గద్వాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోగా, ఈ రెండు నియోజకవర్గాలు నాగర్‌కర్నూల్ ఎంపీ పరిధిలోనే ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పునరావృతం చేసి పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

బలం పెంచుకున్న బీజేపీ..

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఈ స్థానంలో 13.03 శాతం ఓట్లను మాత్రమే సాధించింది. బీజేపీ అభ్యర్థి బంగారు శ్రుతికి 1,29,021 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములును తమ పార్టీలోకి చేర్చుకున్న బీజేపీ, ఆయన కొడుకుభరత్‌ప్రసాద్‌కు పార్టీ అభ్యర్థిత్వాన్ని కేటాయించింది. నియోజకవర్గంలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా ఏపీలోని నంద్యాల వరకు జాతీయ రహదారి నిర్మాణం పనులు ఇప్పటికే మొదలయ్యాయి. రహదారి నిర్మాణ పనులు తమ పార్టీకి అనుకూలంగా మారుతుందని బీజేపీ ఆశిస్తోంది. ఇతర పార్టీల నేతలను చేర్చుకొని బలాన్ని పెంచుకున్న బీజేపీ మోదీ చరిష్మాతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఈ స్థానంలో పాగా వేసేందుకు పట్టుదలతో ఉంది.



పోతుగంటి భరత్‌ప్రసాద్
బీజేపీ

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్



మల్లు రవి
కాంగ్రెస్

ఈ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ ఇప్పటివరకు ఎనిమిదిసార్లు గెలిచింది. ప్రస్తుత ఎంపీ అభ్యర్థి మల్లు రవి 1991, 1998 ఎన్నికల్లో ఇక్కడి నుంచే రెండుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. చివరిసారిగా 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున నంది ఎల్లయ్య ఇక్కడి నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. ఈసారి ఎన్నికల్లో తమ అభ్యర్థిగా మల్లు రవిని మరోసారి బరిలోకి దింపిన కాంగ్రెస్ గెలుపుపై ఆశలు పెట్టుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి కాగా, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఆయన సొంత నియోజకవర్గం కావడంతో ఈ స్థానంలో కాంగ్రెస్ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.





ఇవీ ప్రభావితం చూపే అంశాలు

సాగునీటి కోసం చేపట్టిన పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి నీరందించాలన్న డిమాండ్ ఉంది.	పరిశ్రమలు స్థాపించి స్థానికంగా ఉన్న వారికి ఉపాధి కల్పించాలి.	గద్వాల నుంచి ఏపీలోని మాచర్ల వరకు నూతన రైల్వే లేన్ ప్రతిపాదనలకు 20 ఏళ్లుగా మోక్షం కలగడం లేదు.
నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటికీ విద్యారంగంలో వెనుకబాటే కన్పిస్తోంది. కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు ఇప్పటికీ కలగానే మారింది.	నల్లమలలోని చెంచులు, గిరిజనులకు ఉపాధి అవకాశాలు లేవు. వీరి జీవనోపాధికి పరిశ్రమలు స్థాపించాలన్న డిమాండ్ నెరవేరడం లేదు.	నల్లమల అటవీప్రాంతం, కృష్ణాతీర ప్రాంతాలు ఉన్నా పర్యాటకంగా అభివృద్ధి లేదు. పర్యాటకాభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్న డిమాండ్ ఉంది.

అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
నాగర్‌కర్నూల్	1,18,764	1,19,366	03	2,38,133
అచ్చంపేట(ఎస్సీ)	1,23,234	1,24,382	05	2,47,621
కల్వకుర్తి	1,22,805	1,20,148	09	2,42,962
కొల్లాపూర్	1,20,511	1,17,943	05	2,38,459
వనపర్తి	1,35,367	1,37,282	04	2,72,653
గద్వాల	1,25,356	1,30,499	11	2,55,866
అలంపూర్(ఎస్సీ)	1,17,997	1,21,074	08	2,39,079
మొత్తం	8,64,034	8,70,694	45	17,34,773

2019 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

టీఆర్ఎస్: పోతుగంటి రాములు
ఓట్లు: 4,99,672 - 50.48 శాతం

కాంగ్రెస్: మల్లు రవి
ఓట్లు: 3,09,924 - 31.31 శాతం

బీజేపీ: బంగారు శ్రుతి
ఓట్లు: 1,29,021 - 13.03 శాతం

మా కమ్యూనిటీలో పోలింగ్ బూత్ పెట్టండి!

ఈసీకు లేఖ రాసిన 35కు పైగా గేటెడ్ కమ్యూనిటీలు



సాక్షి, హైదరాబాద్: వెయ్యి నుంచి ఐదారు వేలమంది వరకు ఒకే చోట నివసించే గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ భవనాల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని ఆయా కమ్యూనిటీల అసోసియేషన్లు కోరుతున్నాయి. ప్రధానంగా గచ్చిబౌలి, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ కేంద్రాలకు నెలవైన పశ్చిమ హైదరాబాద్‌లోనే పెద్ద గేటెడ్ కమ్యూనిటీలు ఉన్నాయి. వీటికి దూరంగా పోలింగ్ కేంద్రాలు ఉండటంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు వృద్ధులు, మహిళలు నిరాసక్తి చూపిస్తున్నారు. దీంతో పోలింగ్ శాతం పడిపోతోంది. గత లోకసభ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలో 44.8 శాతం, సికింద్రాబాద్‌లో 46.5 శాతం, మల్కాజ్‌గిరిలో 49.6 శాతం, చేవెళ్లలో అత్యధికంగా 53.2 శాతం పోలింగ్ నమోదయింది. సిటీలో పోలింగ్ శాతం తగ్గడానికి ఇది కూడా కారణమని, ఎక్కువమంది ఓటర్లు ఉండే గేటెడ్ కమ్యూనిటీలకు దగ్గరగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తే పోలింగ్ శాతం కచ్చితంగా పెరుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ దిశగా ఆలోచించాలన్న వినతులు ఈసీకి అందుతున్నాయి. ఈ క్రమంలోనే తమ కమ్యూనిటీలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలంటూ అపర్ణా సైబర్ లైఫ్, మైహోమ్ అవతార్ వంటి 35కు పైగా అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు ఎన్నికల సంఘాన్ని లిఖితపూర్వకంగా కోరాయి. అపర్ణా సైబర్‌లైఫ్ అపార్ట్‌మెంట్‌లో వెయ్యిమందికి పైగా ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం వారికి కేటాయించిన పోలింగ్ బూత్ 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో పోలింగ్ రోజున ఓటు వేసేందుకు సీనియర్ సిటిజన్లు వెళ్లాలంటే ఇబ్బందులు ఉన్నాయని అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. ఇక మైహోమ్ అవతార్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఆరు వేల మంది ఓటర్లున్నారని, ఇక్కడి ఓటర్లకూ ఇదే తరహా సమస్యలున్నాయని అంటున్నారు.

హోర్డింగ్‌లు, పోస్టర్ల ధ్వంసంపై డీజీపీకి బీజేపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో తమ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార పోస్టర్లను పలుచోట్ల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడం, హోర్డింగ్‌లను ధ్వంసం చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తాకు బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మార్ఫింగ్ వీడియోలతో ప్రమేయముందన్న ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ దాఖలయ్యాకే హోర్డింగ్‌లు, పోస్టర్ల ధ్వంసం చోటుచేసుకోవడంతో ఈ ఘటనల వెనక కాంగ్రెస్ హస్తం ఉందనే అనుమానాలను వారు వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జిల్లాలకు వ్యాపించడంతో పాటు, గుర్తుతెలియని వ్యక్తుల ముసుగులో కాంగ్రెస్ కార్యకర్తలు ఇటువంటి చర్యలకే పాల్పడే అవకాశమున్నందున వెంటనే నగరంలో జరిగిన ఘటనలకు బాధ్యులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. ఈ మేరకు బుధవారం డీజీపీకి పార్టీ నేతలు ఎన్.రామచంద్రరావు, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్, గోకుల రామారావు, ఆంథోనిరెడ్డి వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్రంలో పోలింగ్ సమయం పెంపు

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహణ

- 12 లోక్‌సభ స్థానాల్లోని అన్ని చోట్లా అదనపు సమయం
- మిగతా 5 ఎంపీ సీట్ల పరిధిలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పెంపు
- ఎండల తీవ్రత నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న 17 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ సమయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం పెంచింది. ఎండల తీవ్రత దృష్ట్యా పోలింగ్ సమయాన్ని పెంచాలంటూ పలు రాజకీయ పార్టీలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బుధవారం జారీ చేసిన ఆదేశాల్లో వెల్లడించింది. ఒక గంట పాటు అదనపు సమయం ఇస్తున్నట్టు తెలిపింది. సవరించిన సమయం ప్రకారం.. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించింది. రాష్ట్రంలోని 12 లోక్‌సభ స్థానాల పరిధిలో పూర్తిగా.. మిగతా 5 లోక్‌సభ సీట్ల పరిధిలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే ఈ సమయం పెంపు ఉంటుందని ప్రకటించింది.

పోలింగ్ సమయం పెరిగే ఎంపీ స్థానాలివీ

కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ (ఎస్సీ), నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలు

కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో సమయం పెంచిన స్థానాలివే..

- ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలోని ఖానాపూర్ (ఎస్టీ), ఆదిలాబాద్, బోథ్(ఎస్టీ), నిర్మల్, ముథోల్.
- పెద్దపల్లి లోక్‌సభ స్థానంలోని ధర్మపురి (ఎస్సీ), రామగుండం, పెద్దపల్లి.
- వరంగల్ లోక్‌సభ స్థానంలోని స్టేషన్ ఘన్‌పూర్ (ఎస్సీ), పాలకుర్తి, పరకాల, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, వర్ధన్నపేట.
- మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలోని డోర్నకల్ (ఎస్టీ), మహబూబాబాద్ (ఎస్టీ), నర్సంపేట.
- ఖమ్మం లోక్‌సభ స్థానంలోని ఖమ్మం, పాలేరు, మధిర, వైరా (ఎస్టీ), సత్తుపల్లి (ఎస్సీ).

ఫేక్ వీడియోలపై విచారణ

క్షేత్రస్థాయి నుంచి నివేదిక రాగానే చర్యలు

- రెండు రోజుల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి
- 5, 6 తేదీల్లో ఇంటి వద్దే పోలింగ్ సదుపాయం
- పట్టణాల్లో పోలింగ్ శాతం పెంపునకు చర్యలు
- మీడియా సమావేశంలో సీఈఓ వికాస్‌రాజ్



మీడియాతో మాట్లాడుతున్న సీఈఓ వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: ఫేక్ వీడియోల సర్క్యులేషన్‌పై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని, విచారణ జరుగుతోందని, నివేదిక అందిన తర్వాత చర్యలు ఉంటాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నట్టు వచ్చిన ఫేక్ వీడియోల ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయి అధికారుల నుంచి నివేదిక కోరామన్నారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు ఈ నెల 13న జరగనున్న ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ ఇప్పటికే 47 శాతం పూర్తయిందని, మరో రెండు, మూడు రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. బూత్ స్థాయిలో పార్టీలు, అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. తద్వారా పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు, అనుమానాలకు తావు ఉండదన్నారు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 1950

లోక్‌సభ ఎన్నికల విధుల్లో 2.94 లక్షల మంది ఉద్యోగులు, సిబ్బంది పాల్గొననున్నారని వికాస్‌రాజ్ వెల్లడించారు. ఏడు లోక్‌సభస్థానాల్లో 3 బ్యాలెట్ యూనిట్లు, 9 స్థానాల్లో 2 బ్యాలెట్ యూనిట్లు వాడాల్సి వస్తుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘానికి చెప్పి అదనపు బ్యాలెట్ యూనిట్లు రప్పిస్తున్నామని వెల్లడించారు. పోలింగ్‌కేంద్రాల వద్ద ఎండ తగలకుండా టెంట్లు..షెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 1950 ఏర్పాటు చేశామని చెప్పిన ఆయన టోల్ ఫ్రీ నంబరు ద్వారా 1,227 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. ఆన్‌లైన్‌లో వివిధ రకాలుగా 18 వేల ఫిర్యాదులు వచ్చాయని.. అందులో 16 వేలు పరిష్కరించామన్నారు.

రాష్ట్రంలో 3,32,32,318 మంది ఓటర్లు

రాష్ట్ర వ్యాప్తంగా 3,32,32,318 మంది ఓటర్లు ఉన్నారని వికాస్‌రాజ్ తెలిపారు. మొత్తం 35,809 పోలింగ్ స్టేషన్లు ఉండగా, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 9,900 ఉన్నట్లు చెప్పారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా 3,226 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు.

పోలింగ్‌శాతం పెంచాలని..

పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచడానికి ప్రయత్నం చేస్తున్నామని వికాస్‌రాజ్ వెల్లడించారు. 5 వేల పోలింగ్ కేంద్రాల్లో తక్కువ పోలింగ్ శాతం రికార్డు అవుతున్నట్టు గుర్తించామన్నారు. పోలింగ్ సమయంలో సెక్టార్‌ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని, ఎక్కడైనా పోలింగ్ ప్రక్రియ నిదానంగా జరిగినా, తక్కువ పోలింగ్ నమోదవుతున్నా వెంటనే అలర్ట్ అయి పరిస్థితిని చక్కదిద్దుతారన్నారు.

5, 6 తేదీల్లో హోం ఓటింగ్

ఇంటి వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు 23,248 మంది దరఖాస్తులను ఆమోదించినట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. ఇందులో వయోవృద్ధులు 10,362 మంది, దివ్యాంగులు 11,032 మంది, అత్యవసర సర్వీసుల్లో ఉండే ఓటర్లు 1,854 మంది ఉన్నారని వివరించారు. ఈ నెల 5, 6న వీరికి వారి ఇంటి దగ్గరే ఓటేసే సదుపాయం కల్పిస్తామన్నారు.

ఇప్పటికి 7,185 కేసులు

7185 కేసులు నమోదు చేసినట్టు వికాస్‌రాజ్ తెలిపారు. ఆబ్కారీ శాఖ 6560 కేసులు, డ్రగ్స్ అండ్ నార్కోటిక్స్ కింద 287 కేసులు, ఐపీసీ కేసులు 309, ప్రజాప్రాతినిధ్య చట్టం కింద 21 కేసులు నమోదైనట్లు వివరించారు. రూ. 81 కోట్లు నగదు, రూ.46 కోట్లు విలువైన లిక్కర్, రూ. 26 కోట్లు విలువైన డ్రగ్స్, రూ.27 కోట్లు విలువ చేస్తే ఇతర వస్తువులు కలిపి మొత్తం రూ.212 కోట్ల విలువైన నగదు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

బీఆర్ఎస్, బీజేపీకి ఓటేస్తే మూసీలో వేసినట్లే

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తదితరులు

నల్లగొండ: బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లేస్తే మూసీ నదిలో వేసినట్లేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అని, ఆ పార్టీలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని.. అమలు చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్ అన్నట్లుగా మీ ముందుకు రాబోమని చెప్పారు. హరీశ్‌రావు దొంగ రాజీనామాలతో మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. ఈసారి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. బీజేపీ నల్లగొండ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కదన్నారు. సర్పంచ్‌గా కూడా గెలువలేని వ్యక్తిని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పెట్టిందని ఎద్దేవా చేశారు. కాగా, ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన తరహాలో నల్లగొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మండలంలో వలంటీర్లను నియమిస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. ఆయా గ్రామాల్లోని వలంటీర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూస్తారని, ఎన్నికల తర్వాత దీనిని అమలు చేస్తామన్నారు. గుమ్మల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి, కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బారామతి నుంచి మెయిన్‌పురి దాకా...

హోరాహోరీ



లోక్‌సభ ఎన్నికల సుదీర్ఘ ఘట్టంలో మే 7న మూడో విడత పోలింగ్‌కు రంగం సిద్ధమవుతోంది. ఈ విడతలో రాజకీయ ఉద్ధండులతో పాటు కొత్త ముఖాలూ బరిలో ఉన్నారు. కొల్హాపూర్‌లో ఛత్రపతి శివాజీ వారసునికి బీజేపీ టికెటిచ్చింది. శివమొగ్గలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ భార్య బరిలోకి ఉన్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ టికెట్ తీసుకున్నారు. మెయిన్‌పురిలో డింపుల్ భాభీ మరోసారి మేజిక్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా మూడో దశ బరిలో ఆసక్తి రేపుతున్న కీలక స్థానాలపై ఫోకస్...

బారామతి వదినా మరదళ్ల వార్!

దేశమంతటా ఆసక్తి రేపుతున్న నియోజకవర్గమిది. మరాఠా రాజకీయ యోధుడు శరద్ పవార్ ముద్దుల తనయ సుప్రియా సులేపై వదిన సునేత్రా పవార్ పోటీకి సై అంటున్నారు. బాబాయి శరద్ పవార్‌పై తిరుగుబావుటా ఎగరేసి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని దక్కించుకున్న అజిత్ పవార్ తన చెల్లెలిపై ఏకంగా భార్యనే రంగంలోకి దించారు. సుప్రియ ఇక్కడ సిట్టింగ్ ఎంపీ. ఎన్సీపీ (శరద్) వర్గానికి సారథ్యం వహిస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ నేత కంచన్ రాహుల్ కూల్‌పై 1,55,774 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారి వదినా మరదళ్ల మధ్య హై ఓల్టేజ్ పోటీ నెలకొంది. సునేత్రకు బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్)లతో కూడిన మహాయుతి కూటమి బలమైన దన్నుంది. ఇక సుప్రియ కాంగ్రెస్, శివసేన (ఠాక్రే) ఎన్సీపీ (పవార్)తో కూడిన మహా వికాస్ అగాడీ తరఫున వదినకు సవాలు విసురుతున్నారు. బీఎస్పీ నుంచి ప్రియదర్శని కోక్రే కూడా రేసులో ఉన్నారు.

విదిశ మామాజీ ఈజ్ బ్యాక్

మధ్యప్రదేశ్‌కు 20 ఏళ్లకు పైగా సీఎం. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బంపర్ మెజారిటీ సాధించి పెట్టారు. ఇంతటి రికార్డున్నా శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మళ్లీ సీఎంగా చాన్స్ రాలేదు. అయితే బీజేపీ అనూహ్యంగా ఆయనను విదిశ నుంచి లోక్‌సభ బరిలో దింపింది. ''శివరాజ్‌ను ఢిల్లీకి తీసుకెళ్తా. కేంద్ర ప్రభుత్వంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారు' అన్న మోదీ ప్రకటనతో విదిశ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మామాజీగా ప్రసిద్ధుడైన శివరాజ్ ఇక్కడ 1991 నుంచి 2004 దాకా వరుసగా ఐదుసార్లు ఎంపీగా గెలవడం విశేషం. బీజేపీ దిగ్గజాలు వాజ్‌పేయి ఒకసారి, సుష్మా స్వరాజ్ రెండుసార్లు ఇక్కడ విజయం సాధించారు. ఈ బీజేపీ కంచుకోటలో కాంగ్రెస్ నుంచి ప్రతాప్ భాను శర్మ బరిలో ఉన్నారు. ఆయన కూడా 1980, 1984లో ఇక్కడ రెండుసార్లు గెలిచారు. ఏకంగా 40 ఏళ్ల తర్వాత మళ్లీ బరిలో దిగుతున్నారు!

ఆగ్రా త్రిముఖ పోరు

యూపీకి దళిత రాజధానిగా పేరొందిన ఆగ్రాలో ముక్కోణపు పోరు నెలకొంది. సిట్టింగ్ బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘెల్‌పై బీఎస్పీ నుంచి పూజా అమ్రోహి, సమాజ్‌వాదీ నుంచి సురేశ్ చంద్ర కర్దామ్ బరిలో ఉన్నారు. మోదీ–యోగీ ఫ్యాక్టర్, అయోధ్య రామమందిరం, సంక్షేమ పథకాలనే బఘెల్ నమ్ముకున్నారు. వైశ్యులు, బ్రాహ్మణులు, పంజాబీలు, యాదవేతర ఓబీసీలతో పాటు దళితుల్లో ఒక వర్గం కమలానికి మద్దతిస్తుండటం ఆయనకు కలిసి రానుంది. దళితుల ఓటు బ్యాంకుపై పూజ, జాతవ్‌లు, ముస్లిం ఓట్లపై కర్దామ్ ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడి 20.57 లక్షల ఓట్లలో 30 శాతం దళితులే. వారిలోనూ మూడొంతుల మంది జాతవ్ దళితులు! బీఎస్పీ, ఎస్పీ అభ్యర్థులిద్దరిదీ ఇదే సామాజికవర్గం. ప్రత్యర్థుల నాన్ లోకల్ విమర్శలను పూజ దీటుగా తిప్పికొడుతున్నారు. ఈ స్థానం ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోట. రామమందిర ఉద్యమంతో 1990 నుంచి బీజేపీ గుప్పిట్లోకి చేరింది. మధ్యలో రెండుసార్లు మాత్రం ఎస్పీ నుంచి బాలీవుడ్ నటుడు రాజ్ బబ్బర్ గెలిచారు.

శివమొగ్గ బీజేపీకి పక్కలో బల్లెం

కర్ణాటక దిగ్గజ నేత బీఎస్ యడ్యూరప్ప కుమారుడు బీవై రాఘవేంద్ర మరోసారి శివమొగ్గలో బరిలో నిలిచారు. కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ భార్య గీతకు కాంగ్రెస్ టికెటివ్వడంతో రాజకీయం వేడెక్కింది. పైగా బీజేపీతో 50 ఏళ్లకు పైగా అనుబంధమున్న అగ్ర నేత కేఎస్ ఈశ్వరప్ప స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి రాఘవేంద్రకు పక్కలో బల్లెంలా మారారు. ఈ ముక్కోణపు పోటీ అందరినీ ఆకర్షిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్న ఈశ్వరప్ప తన కుమారుడు కంతేశ్‌కు ఎంపీ టికెట్ కోసం విఫలయత్నం చేశారు. యడ్యూరప్పతో మొదట్నుంచీ ఉప్పు నిప్పుగా ఉన్న ఈశ్వరప్పకు ఈ పరిణామం తీవ్ర ఆగ్రహం కలిగించింది. రాష్ట్ర బీజేపీ చీఫ్, యడ్యూరప్ప కుమారుడు విజయేంద్రపై తీవ్ర విమర్శలకు దిగి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. తాను మోదీకి వీర విధేయుడినంటూ ఆయన బొమ్మతోనే ఈశ్వరప్ప జోరుగా ప్రచారం చేస్తుండటంతో బీజేపీ నేతలు తలపట్టుకుంటున్నారు!

కొల్హాపూర్ బరిలో ఛత్రపతి

ఛత్రపతి శివాజీ వంశీయుడిని కాంగ్రెస్ బరిలోకి దించడంతో కొల్హాపూర్‌లో పోటీ కాక పుట్టిస్తోంది. శివసేన సిట్టింగ్ ఎంపీ సంజయ్ మాండ్లిక్ ఈసారి శివసేన (షిండే) నేతగా మహాయుతి కూటమి తరఫున మళ్లీ బరిలో ఉన్నారు. దాంతో కాంగ్రెస్, శివసేన (ఠాక్రే) ఎన్సీపీ (శరద్)లతో కూడిన మహా వికాస్ అగాడీ వ్యూహాత్మకంగా ఛత్రపతి రాజర్షి సాహు మహారాజ్‌కు టికెటిచ్చింది. ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అయితే ఆయన శివాజీకి నిజమైన వారసుడు కాదన్న మాండ్లిక్ వ్యాఖ్యలతో అగ్గి రాజుకుంది. వీటిపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికార కూటమి వెనక్కు తగ్గింది. 'గాడీ (సింహాసనం)ని గౌరవించండి. కానీ ఓటు మాత్రం మోదీకే వేయండి' అంటూ కొత్త తరహా ప్రచారం మొదలుపెట్టింది. రెండు కూటముల మధ్య ఇక్కడ టఫ్ ఫైట్ జరుగుతోంది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, ఎన్సీపీలకు గట్టి పట్టుండటం సాహు మహారాజ్‌కు కలిసొచ్చే అంశం.

మెయిన్‌పురి భాభీ సవాల్

ఈ స్థానం ఎస్పీ దిగ్గజం దివంగత ములాయం సింగ్ యాదవ్ కంచుకోట. ములాయం మరణానంతరం 2022లో ఉప ఎన్నికలో ఆయన కోడలు, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ సత్తా చాటారు. 2.88 లక్షల ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి రఘురాజ్ సింగ్ శాక్యను ఓడించారు. ఈసారి మళ్లీ బీజేపీకి సవాలు విసురుతున్నారు. బీజేపీ నుంచి యూపీ పర్యాటక మంత్రి జైవీర్ సింగ్ ఠాకూర్ బరిలో ఉన్నారు. ఫిరోజాబాద్‌కు చెందిన ఠాకూర్ బలమైన నాయకుడు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచారు. బీఎస్పీ కూడా శివ ప్రసాద్ యాదవ్ రూపంలో బలమైన అభ్యర్థిని రంగంలోకి దించడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. బీఎస్పీ నుంచి మధ్యలో బీజేపీలోకి వెళ్లిన శివప్రసాద్ అనంతరం సొంత పార్టీ కూడా పెట్టి చివరికి బీఎస్పీ గూటికే చేరారు. ఇక్కడ మోదీ–యోగి ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదంతో సమాజ్‌వాదీకి ఎలాగైనా చెక్ పెట్టేందుకు కమలనాథులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ డింపుల్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఓటేస్తే డైమండ్ రింగ్

భోపాల్‌లో ఓటర్లకు కానుకలు



లక్కీ డ్రాలో బహుమతులు గెలుచుకోవచ్చంటే సామాన్యుల కాలు కదలకుండా ఉంటుందా..? మధ్యప్రదేశ్‌లోని భోపాల్ లోక్‌సభ స్థానంలో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు ఇలాంటి ఆఫరే ఇస్తున్నారు. మూడో దశలో భాగంగా ఈ నెల 7న భోపాల్‌లో పోలింగ్ జరుగుతోంది. ఆ రోజున ఓటేసే వారి పేర్లనుంచి ప్రతి మూడు గంటలకు ఒకసారి లక్కీ డ్రా తీయనున్నారు. విజేతలకు వజ్రపు ఉంగరాలు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు తదితర కానుకలిస్తారట! ''నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 10, మధ్యాహ్నం 3, సాయంత్రం 6 గంటలకు లక్కీ డ్రా తీసి విజేతలకు బహుమతులిస్తం. పోలింగ్ మర్నాడు మెగా డ్రా తీసి విజేతలకు మరింత పెద్ద బహుమతులిస్తాం''అని జిల్లా ఎన్నికల అధికారి కౌసలేంద్ర విక్రమ్ సింగ్ ప్రకటించారు.

ఓటింగ్ పెంచేందుకే..

మధ్యప్రదేశ్‌లో ఇప్పటిదాకా జరిగిన రెండు దశల్లో పోలింగ్ 2019తో పోలిస్తే సగటున 8.5 శాతం తగ్గింది. 2019లో భోపాల్‌లో 65.7 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి ఎండలు విపరీతంగా ఉన్నందున ఓటర్లు పెద్దగా ఇల్లు కదలకపోవచ్చన్న ఆందోళనలున్నాయి. దీంతో ఎలాగైనా ఓటింగ్‌ను పెంచాలని ఈసీ కృత నిశ్చయంతో ఉంది. భోపాల్ నియోజకవర్గంలో 3,097 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి బూత్ వద్ద ఒక బీఎల్‌వో, వలంటీర్‌ను లక్కీ డ్రా కోసం నియమించారు. ఓటేశాక అక్కడి కూపన్ బుక్‌లెట్‌లో పేరు, మొబైల్ నంబర్ రాసి రసీదు తీసుకోవాలి. బహుమతుల ఖర్చును కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కంపెనీలు భరిస్తున్నాయి. మెగా డ్రా కోసం డైమండ్ ఉంగరాలు, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిజ్‌లు ఎనిమిది డిన్నర్ సెట్లు, రెండు మొబైల్ ఫోన్లు రెడీగా ఉన్నాయి. దీంతోపాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో తొలి ఓటర్‌ను గౌరవించేందుకు ప్రత్యేకంగా ఏదైనా చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు!

- సాక్షి, నేషనల్ డెస్క్



సీట్లు రెండే... పోటీ సయ్యారే!

గోవాలో కాంగ్రెస్, బీజేపీ అమీతుమీ



ఈవీఎంలపై అనుమానాలు రేకెత్తించిన కాంగ్రెస్‌కు సుప్రీంకోర్టు తాజా తీర్పు చెంపపెట్టు. ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలి. అభివృద్ధికి పెద్దపీట వేసి, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న ఎన్డీఏ కూటమి ఒక వైపు... అవినీతి, వారసత్వ రాజకీయాలు, సొంత ప్రయోజనాలే పరమావధిగా ఉన్న ఇండియా కూటమి మరోవైపున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలను గోవా సంతృప్త స్థాయిలో అమలు చేస్తోంది. నిజమైన సెక్యులరిజం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తోంది.

- గోవా ఎన్నికల సభలో ప్రధాని మోదీ



అధికారంలోకి వస్తే గోవాలో మైనింగ్ కార్యకలాపాలను మూడు నెలల్లో ప్రారంభిస్తామని 2014లో మోదీ హామీ ఇచ్చారు. దాన్ని నెరవేర్చనందుకు గోవా ప్రజలకు క్షమాపణ చెప్పాలి. నదుల అనుసంధానం పేరుతో మా నదులపై కేంద్రం పెత్తనం చేస్తోంది. వాటి పేర్లు మార్చేస్తోంది. గోవా గుర్తింపు, సంస్కృతిని నాశనం చేస్తోంది.

- ఎన్నికల ర్యాలీలో గోవా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ పాట్కర్

సాగర తీర పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా పేరొందిన గోవాలో రాజకీయాలు అనిశ్చితిమయం. నేతల పార్టీ ఫిరాయింపులు ఇక్కడ పరిపాటి. దేశానికి 1947లోనే స్వాతంత్ర్యం వచ్చినా గోవా మాత్రం 1961 దాకా పోర్చుగీసు పాలనలో ఉంది. కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగి 1987లో రాష్ట్ర హోదా పొందింది. దేశంలోనే అతి చిన్న రాష్ట్రమైనా కొత్త కూటములు, కొత్త పార్టీలు, పదేపదే సీఎంల మార్పుకు మారుపేరుగా మారింది. కొందరు రెండు మూడు విడతలు పాలించగా, మరి కొందరు నెల రోజులు కూడా సీఎంగా కొనసాగలేదు. ఇక్కడ పోరు జాతీయ పార్టీల చుట్టూనే తిరుగుతున్నా ప్రాంతీయ పార్టీలూ చక్రం తిప్పుతున్నాయి...

గోవాలో రెండు లోక్‌సభ సీట్లే ఉన్నా ఈ రాష్ట్రాన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గతంలో కాంగ్రెస్‌కు బాగా పట్టున్న ఈ రాష్ట్రంలో ఇప్పుడు బీజేపీ ఆధిపత్యం నడుస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాషాయదళం ఇక్కడి రెండు సీట్లనూ దక్కించుకుని సత్తా చాటింది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా నిలిచినా బీజేపీ నాటకీయంగా అధికారం దక్కించుకుంది. మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ (ఎంజీపీ), కొత్తగా పుట్టుకొచ్చిన గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ), కాంగ్రెస్ నుంచి జంప్ చేసిన ఎమ్మెల్యే మద్దతుతో మనోహర్ పారికర్ సీఎంగా పగ్గాలు చేపట్టారు. 2019లో పారికర్ మరణానంతరం ప్రమోద్ సావంత్ సీఎం అయ్యారు. తర్వాత కూడా బీజేపీలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేల వలస కొనసాగింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరో సీటు దక్కించుకున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ ప్రాంతీయ పార్టీలతో కలిసి అధికారాన్ని నిలబెట్టుకుంది. కాంగ్రెస్‌లో ముసలం పుట్టి 11 మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురు బీజేపీలోకి జంప్ చేశారు. ఉత్తర గోవా లోక్‌సభ స్థానం బీజేపీకి, దక్షిణ గోవా కాంగ్రెస్‌కు కంచుకోటలుగా మారాయి.

సర్వేలు ఏమంటున్నాయి...

గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా కాంగ్రెస్, బీజేపీ చెరో సీటు గెలుచుకోవచ్చని మెజారిటీ సర్వేలు అంచనా వేస్తున్నాయి.

స్టేట్ స్కాన్



లోకల్ ఎఫెక్ట్

'ఇండియా' కూటమి దన్నుతో కాంగ్రెస్ బరిలోకి దిగింది. రెండు సీట్లలోనూ పోటీ చేస్తోంది. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, నిరుద్యోగం, ధరల పెరుగుదల తదితరాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తోంది. బీజేపీ మోదీ, అభివృద్ధి, అయోధ్య రామ మందిరం, హిందుత్వ నినాదాలతో బరిలోకి దిగుతోంది. సౌత్ గోవాలో బీజేపీ నుంచి పల్లవి డెంపో, కాంగ్రెస్ నుంచి మాజీ నేవీ అధికారి విరియాటో ఫెర్నాండెజ్ పోటీ చేస్తున్నారు. ఉత్తర గోవాలో సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్ బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరఫున రమాకాంత్ ఖలప్ తలపడుతున్నారు. ఇండియా కూటమి భాగస్వామి గోవా ఫార్వర్డ్ పార్టీ కాంగ్రెస్‌కు దన్నుగా ఉంది. ఎంజీపీ వంటి పార్టీలు కాంగ్రెస్, బీజేపీల్లో ఎవరి అవకాశాలకు గండి కొడతాయనేది ఆసక్తికరంగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సంపన్న పల్లవి

రాజకీయ వంట కుదిరేనా!

పల్లవి శ్రీనివాస్ డెంపో. దక్షిణ గోవా నుంచి బీజేపీ టికెట్‌పై లోక్‌సభ బరిలో ఉన్నారు. గోవాలో బీజేపీ తరఫున లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగిన తొలి మహిళగా నిలిచారు. అఫిడవిట్లో పల్లవి ప్రకటించిన ఆస్తులు చూసి అంతా నోరెళ్లబెట్టారు. భర్తతో కలిపి ఏకంగా రూ.1,361 కోట్ల ఆస్తులు వెల్లడించారు. మూడో దశలో రేసులో మొత్తం 1352 మంది అభ్యర్థుల్లో అత్యంత సంపన్నురాలిగా నిలిచారు. గోవా ఎన్నికల చరిత్రలో అత్యంత సంపన్న వ్యక్తి పల్లవే. ఏ రాజకీయానుభవం లేని కుటుంబానికి చెందిన ఆమెను ఎంపిక చేసుకోవడానికి ఆమె దాతృత్వ నేపథ్యమే కారణం కావచ్చంటున్నారు...



దాతృత్వం నుంచి రాజకీయాలకు

49 ఏళ్ల పల్లవి స్వస్థలం గోవాలోని మార్గావ్. టింబ్లో కుటుంబంలో జన్మించారు. రసాయన శాస్త్రంలో డిగ్రీ, పుణెలోని ఎంఐటీ నుంచి ఎంబీఏలో పీజీ చేశారు. 1997లో డెంపో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ శ్రీనివాస్ డెంపోను పెళ్లాడారు. వారి కుటుంబం ఎప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో లేదు. డెంపో గ్రూప్ మైనింగ్ వ్యాపారంతో మొదలుపెట్టి ఫుడ్ ప్రాసెసింగ్, షిప్ బిల్డింగ్, న్యూస్ పేపర్ పబ్లిషింగ్, పెట్రోలియం, కోక్, రియల్ ఎస్టేట్ తదితరాలకు విస్తరించింది. పల్లవి ప్రస్తుతం డెంపో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మీడియా, రియల్ ఎస్టేట్ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. డెంపో చారిటీస్ ట్రస్టీగా దశాబ్దాలుగా సేవా కార్యక్రమాల్లో ఉన్నారు. ప్రత్యేకించి గోవాలో బాలికల విద్యను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. కొత్త ప్రదేశాలను చూడటం, కొత్త వంటకాలను ప్రయత్నించడం తన అభిరుచి అంటారామె. ఇప్పుడు రాజకీయాల్లోకి దిగి మరో ప్రయోగం చేయబోతున్నారు.

ఎన్నికల బాండ్ల రగడ...

2022 జనవరిలో గోవాలో అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నెల ముందు పల్లవి భర్త శ్రీనివాస్ వ్యక్తిగతంగా రూ.1.25 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసినట్లు వెల్లడవడం కలకలం రేపింది. ఇక గోవా కార్బన్ లిమిటెడ్, దేవశ్రీ నిర్మాణ్ ఎల్ఎల్‌పి, నవ్‌హింద్ పేపర్స్ అండ్ పబ్లికేషన్స్‌తో సహా డెంపో, గ్రూప్ అనుబంధ సంస్థలు 2019 నుంచి 2024 మధ్య రూ.1.1 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేశాయి. ఇవన్నీ బీజేపీ ఖాతాలోకే వెళ్లాయి.

బీజేపీ సిద్ధాంతాలు నమ్మి...

దక్షిణ గోవా కాంగ్రెస్ కంచుకోట. 2019లో ఈ స్థానాన్ని బీజేపీ కేవలం 9 వేల పై చిలుకు ఓట్ల తేడాతో చేజార్చుకుంది. ఈ సారి ఎలాగైనా ఇక్కడ నెగ్గి తీరాలని పట్టుదలగా ఉంది. క్యాథలిక్ క్రిస్టియన్ల ఓట్లపై పల్లవి ప్రధానంగా దృష్టి పెట్టారు. కాంగ్రెస్ కూడా నాలుగు సార్లు గెలిచిన సిట్టింగ్ ఎంపీ ఫ్రాన్సిస్కో సార్దినాను అనూహ్యంగా పక్కనబెట్టి మాజీ నేవీ అధికారి కెప్టెన్ విరియాటో ఫెర్నాండెజ్‌ను బరిలోకి దించింది. అయితే ఏకంగా 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంప్ చేయడం వంటివన్నీ ఆ పార్టీకి కలిసొచ్చేలా ఉన్నాయి. ఆప్, గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ) వంటి ఇండియా కూటమి భాగస్వాముల దన్నుతో బీజేపీని కాంగ్రెస్ ఢీకొంటోంది. స్థానిక రివల్యూషనరీ గోవన్స్ (ఆర్‌జీ) పార్టీ అభ్యర్థి రూబర్ట్ పెరీరియా ఆ రెండింటికీ సవాలు విసురుతున్నారు. అయినా పల్లవి మాత్రం విజయంపై ధీమాగా ఉన్నారు. ''రాజకీయాలు నా మనసులో ఎప్పుడూ లేవు. మూడు దశాబ్దాలుగా కుటుంబ వ్యాపారాలు, సేవా కార్యకలాపాల్లో బిజీగా ఉన్నాను. అయితే దేనికైనా ఒక ఆరంభమంటూ ఉంటుంది. రాజకీయాల్లో ఇది నా తొలి అడుగు. బీజేపీ సిద్ధాంతాన్ని నమ్మి ముందడుగు వేస్తున్నాను'' అంటున్న ఆమె కాంగ్రెస్‌కు కంచుకోటలో చరిత్ర సృష్టిస్తారేమో చూడాలి!

- సాక్షి, నేషనల్ డెస్క్



ఇక్కడే దూరం

చంద్రబాబుపై నమ్మకం లేకే ఏపీలో ఉమ్మడి మేనిఫెస్టోకు బీజేపీ నో

మోదీ, కమలం గుర్తు ఫొటోల ముద్రణకూ నిరాకరణ

తమిళనాడులో కమలం గుర్తుతో పీఎంకే మేనిఫెస్టో

తమిళ మానిల కాంగ్రెస్ మేనిఫెస్టో కవర్ పేజీపై ప్రధాని ఫొటో

- ఇప్పటికే జాతీయ స్థాయిలో మేనిఫెస్టో విడుదల చేశారని టీడీపీ కవరింగ్
- ఇది ఉత్తి మాటేనని తేల్చిన తమిళనాడు మేనిఫెస్టో
- 2014లో రాష్ట్రం మేనిఫెస్టోలోనూ మోదీ ఫొటో
- పలు ఎన్నికల్లో రెండు మేనిఫెస్టోలు ఇచ్చిన బీజేపీ
- బాబు గత మోసం తెలిసే ఇలా చేశారని సర్వత్రా చర్చ

సాక్షి, అమరావతి: దేశమంతటా ఎన్డీయే మిత్రపక్షాలుగా కొనసాగుతున్న వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ గుర్తుతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో, బీజేపీ ఎన్నికల గుర్తు అయిన కమలం ఫొటో జత పరిచి ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేశాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు – పవన్‌కల్యాణ్‌లు అమలుకు సాధ్యం కాని ఆల్ ఫ్రీ హామీలు ఇస్తుండడంతో ఉమ్మడి మేనిఫెస్టోతో తమకు సంబంధం లేనట్లు బీజేపీ వ్యవహరించిందని స్పష్టమవుతోంది. అందువల్లే మంగళవారం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఉమ్మడిగా విడుదల చేసిన మేనిఫెస్టోలో మోదీ, కమలం ఫొటోలు చోటుచేసుకోలేదని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనప్పటికీ.. లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో బీజేపీ ఆ రాష్ట్రంలోని పీఎంకే, తమిళ్ మానిల కాంగ్రెస్ పార్టీ వంటి ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకొని పోటీ చేస్తోంది. ఈ నేపథ్యంలో తమిళ మానిల కాంగ్రెస్ పార్టీ ఇటీవల వేరుగా విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో ముఖచిత్రంపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ముద్రించింది. పీఎంకే కూడా విడిగా మేనిఫెస్టోను విడుదల చేయగా, దాని చివరి పేజీలో బీజేపీ గుర్తు కమలం సహా అన్ని మిత్రపక్ష పార్టీల గుర్తులను ముద్రించింది. ఇందుకు బీజేపీ కూడా అంగీకారం తెలిపింది. ఒక్క ఏపీలో మాత్రమే చంద్రబాబు, పవన్‌ల మేనిఫెస్టోపై తమ ముద్ర ఏదీ లేకుండా బీజేపీ జాగ్రత్త పడటం.. అసలు ఆ మేనిఫెస్టోను ముట్టుకోవడానికి కూడా బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్ సింగ్ ఇష్టపడక పోవడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

బాబు ఆల్ ఫ్రీ హామీలను నమ్మే పరిస్థితి లేదు

పదేళ్ల క్రితం 2014లో టీడీపీ–బీజేపీ–జనసేనలు ఉమ్మడిగా పోటీ చేసినప్పుడు ఇచ్చిన హామీలలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక దాదాపు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఇప్పుడు అదే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. మూడు పార్టీల పొత్తులో మళ్లీ అన్నీ ఆల్ ఫ్రీ హామీలనే ఇవ్వడంతో వాటి అమలులో సాధ్యాసాధ్యాలపై బీజేపీకి నమ్మకం కుదరలేదని తెలుస్తోంది. అందుకే పొత్తులో ఉన్నప్పటికీ ఉమ్మడి మేనిఫెస్టోకు దూరం జరిగింది. 'గత వారం బీజేపీ జాతీయ స్థాయిలో మేనిఫెస్టో విడుదల చేసింది. రాష్ట్రాలలో పొత్తులో ఉన్న ఎన్డీయే భాగస్వామ్య పార్టీలకు మా మద్దతు ఉంటుంది' అనే ప్రకటనకు మాత్రమే పరిమితమైంది. అయితే బీజేపీ కేవలం కంటితుడుపుగా మిత్రపక్షాలను సంతృప్తి పరిచేందుకే ఈ వ్యాఖ్యలు చేసిందని పరిశీలకులు చెబుతున్నారు. 2014లో ఈ మూడు పార్టీలు కలిసి పోటీ చేసినప్పుడు.. బీజేపీ జాతీయ స్థాయిలో మేనిఫెస్టోను ప్రకటించినప్పటికీ, రాష్ట్ర పార్టీ వేరుగా మేనిఫెస్టోను విడుదల చేసింది. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు ఒక మేనిఫెస్టోను, సీమాంధ్రకు మరొకటి బీజేపీ ప్రకటించింది. 2019 ఎన్నికల్లోనూ బీజేపీ జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో వేర్వేరుగా మేనిఫెస్టోను ప్రకటించింది. ఈ పరంపరలో కేవలం చంద్రబాబు–పవన్‌ల మేనిఫెస్టోలోని హామీలపై నమ్మకం లేకే బీజేపీ ఢిల్లీ పెద్దలు మద్దతు మాత్రమే ఇచ్చారని పార్టీలో చర్చ సాగుతోంది. ఈ అవమానకర విషయాన్ని ఎలా అధిగమించాలో తెలియక చంద్రబాబు అండ్ గ్యాంగ్ తల పట్టుకుంది.

మో(నో)దీ



గాజుల బేరం భోజనానికి సరి అన్నట్లుగా మారింది పొత్తు పార్టీల వ్యవహారం. ఉమ్మడి మేనిఫెస్టోను ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని గొప్పలకు పోయిన చంద్రబాబును కనీసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, తన వదినమ్మ కూడా దేకలేదు. వచ్చిన బీజేపీ ఎన్నికల పరిశీలకుడు కూడా మేనిఫెస్టోను ఛీ కొట్టారు. 2014లో మాదిరి బూటకపు హామీలకు వంతపాడి ప్రజల్లో చులకన కావొద్దనే అచ్చమైన బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్ర పార్టీ పెద్దలకు నివేదించారట. అందుకే తమది జాతీయ మేనిఫెస్టో తప్ప, రాష్ట్రాలకు విడిగా ఉండదంటూ తప్పించుకున్నారు. దీనికి తోడు మోదీ రాష్ట్ర పర్యటనపై కూడా టీడీపీ, జనసేన శ్రేణుల్లో నమ్మకం లేదట. ఇప్పటి వరకు పీఎంవో నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడమే కారణమని తెలిసింది.


ఏం తెలివి?



ఒక్క రోజు బాగోతానికి మూతి మీసాలు గొరుక్కున్నట్లుగా ఉంది జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరిస్థితి. స్వప్రకటిత మేధావిగా పేరు తెచ్చుకున్న ఆయన తాజాగా పోలవరం ప్రాజెక్టుపై తన ఆలోచనను బయటపెట్టారు. పొత్తుల పెద్దన్న బీజేపీ వల్లే ప్రాజెక్టులో స్తబ్ధత నెలకొందన్న విషయాన్ని మర్చిపోయినట్టున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ దాదాపు రూ. 36 వేల కోట్లను రాష్ట్ర ప్రజలందరి మీదా రుద్దేద్దామని వాక్రుచ్చారు మన మేధావి. తన దత్త తండ్రి చంద్రబాబు అమరావతి సెస్ మాదిరి, ఈయన పోలవరం సెస్ అని పెడతారేమో!? ఈ మహానుభావుడికి ఎవరిస్తున్నార్రా.. ఈ సలహాలు అంటూ అభిమానులు వాపోతున్నారు. తమ హీరో హాయిగా సినిమాలు చేసుకుంటే పోయేదని, ఈ పాటి రాజకీయాలకు తన సినీ కెరీర్‌ను బొంద పెట్టారంటూ తెగ ఫీలైపోతున్నారట.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మోసం... వంచన...



అప్పుడూ, ఇప్పుడూ చంద్రబాబు మేనిఫెస్టో అదే

2014 తరహాలోనే అడ్డగోలు హామీలతో 2024 ఎన్నికల మేనిఫెస్టో

2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్

→ 58 నెలల్లో నవరత్నాల పథకాల ద్వారా పేదల ఖాతాల్లో నేరుగా రూ.2,66,810 కోట్లు జమ
→ సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నాన్ డీబీటీ రూపంలో మరో రూ.95,001 కోట్లు
→ డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.3,61,811 కోట్లు.. ఏటా సగటున రూ.72,362 కోట్ల వ్యయం
→ సీఎం రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు అండ్ గ్యాంగ్
→ టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో అమలుకు ఏటా రూ.1.65 లక్షల కోట్లకుపైగా అవసరం
→ అంటే.. ఇప్పటి కంటే ఏటా రూ.92,638 కోట్లకుపైగా అదనంగా అవసరం
→ టీడీపీ మేనిఫెస్టో అమలుకు ఐదేళ్లలో మొత్తంగా రూ.8.25 లక్షల కోట్లకుపైగా అవసరం
→ డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు వ్యయం చేసిన దాని కంటే అదనంగా రూ.4,63,189 కోట్లు అవసరం
→ సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తానంటూ చంద్రబాబు ప్రగల్భాలు
→ పద్నాలుగేళ్ల బాబు పాలనలో ప్రతిఏటా రెవెన్యూ లోటేనని సాక్ష్యాలతో వివరించిన సీఎం జగన్
→ ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీ పేరుతో మురళీమోహన్ వంటి బినామీలకే సంపద సృష్టించిన చంద్రబాబు
→ 2014-19 మధ్య అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా బినామీలకు భూ సంపద సృష్టించిన వైనం
→ ఇప్పుడు అమరావతి నిర్మాణానికి ఖజానా నుంచి ఖర్చు పెట్టి బినామీలకు సంపద సృష్టించేలా ఎత్తుగడ
→ 2014 ఎన్నికల తరహాలోనే ఇప్పుడూ ప్రజలను మోసం చేస్తున్నారని మేనిఫెస్టోను ముట్టుకోని బీజేపీ
→ పథకాల అమలుకు నిధులు ఎలా తెస్తారో వివరణ ఇవ్వాలంటున్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు
→ వివరణ ఇవ్వకపోతే తాను మోసం చేస్తున్నట్లు చంద్రబాబు అంగీకరించినట్లేనని స్పష్టీకరణ

అప్పుడు అమెరికా అవుతుందా?

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా.. అవసరమైన మేరకు తక్కువగా అప్పులు చేస్తూ.. ప్రజలపై తక్కువగా పన్నుల భారం మోపుతూ.. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా సీఎం జగన్ పేదల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుంటే రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారంటూ చంద్రబాబు, ఎల్లో మీడియా గగ్గోలు పెట్టాయి. ఒకవేళ చంద్రబాబు అధికారంలోకి వచ్చి.. టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలకు ఐదేళ్లలో రూ.8.25 లక్షల కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రం అమెరికా అవుతుందా? అని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

నిధులు ఎలా తెస్తారో చెప్పండి

టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాల అమలుకు ఏటా రూ.1.65 లక్షల కోట్లు అవసరం. ప్రస్తుతం సీఎం జగన్ డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు చేస్తున్న వ్యయం కంటే రూ.92,638 కోట్లు అదనంగా అవసరం. ఈ లెక్కన ఐదేళ్లలో ఆ పథకాల అమలుకు అదనంగా రూ.4,63,189 కోట్లు అవసరం. ఆ నిధులను ఎలా తెస్తారో చంద్రబాబు స్పష్టం చేయాలని ఆర్థిక నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే.. 2014 ఎన్నికల తరహాలోనే ఇప్పుడూ ప్రజలను మోసం చేస్తున్నానని చంద్రబాబు అంగీకరించినట్లేనని స్పష్టం చేస్తున్నారు.

సాక్షి, అమరావతి

ఎన్నికల్లో అలవికాని హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మోసం చేసిన చరిత్ర ఉన్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈసారి విశ్వరూపం ప్రదర్శించారు. జనసేన, బీజేపీలతో జత కట్టినా ఘోర పరాజయం తప్పదనే నిర్ణయానికి వచ్చి.. ఉనికి చాటుకోవడం కోసం ఆచరణలో అమలుకు వీలుకాని రీతిలో హామీలతో ముంచెత్తుతూ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన తరహాలోనే ఈసారీ ప్రజలను వంచించడానికి సిద్ధమయ్యారని గ్రహించిన బీజేపీ.. మేనిఫెస్టోను ముట్టుకోవడానికి కూడా ముందుకు రాలేదని టీడీపీ వర్గాలే చర్చించుకుంటుండటం గమనార్హం. 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు. గత 58 నెలల్లో నవరత్నాలు–సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా.. ఎలాంటి వివక్ష చూపకుండా.. అవినీతికి తావు లేకుండా.. అత్యంత పారదర్శకంగా పేదల ఖాతాల్లో నేరుగా రూ.2,66,810 కోట్లను జమ చేశారు. నాన్ డీబీటీ పథకాల ద్వారా మరో రూ.95,001 కోట్లు వ్యయం చేశారు. డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ఇప్పటిదాకా రూ.3,61,811 కోట్లు వ్యయం చేశారు. అంటే ఏడాదికి సగటున రూ.72,362 కోట్లు ఖర్చు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి డబ్బులు జమ చేస్తుంటే.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి శ్రీలంకగా మార్చేస్తున్నారని చంద్రబాబు గగ్గోలు పెడితే.. ఎల్లో మీడియా అదే పల్లవి అందుకుంది.


కేంద్రం జీడీపీలో రాష్ట్ర వాటా (స్థూల దేశీయోత్పత్తిలో రాష్ట్ర భాగస్వామ్యం) ఇప్పుడే ఎక్కువ

	ఆర్థిక సంవత్సరం	జీడీపీ (దేశీయ స్థూల ఉత్పత్తి)	జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి)	జీడీపీలో రాష్ట్ర వాటా
చంద్రబాబు హయాం	2014-15	1,24,67,959	5,24,976	4.21
	2015-16	1,37,71,874	6,04,229	4.39
	2016-17	1,53,91,669	6,84,416	4.45
	2017-18	1,70,90,042	7,86,135	4.60
	2018-19	1,88,99,668	8,73,721	4.62
	(ఐదేళ్లలో జీడీపీలో రాష్ట్ర వాటా సగటు 4.47 శాతం)			
సీఎం జగన్ హయాం	2019-20	2,01,03,593	9,25,839	4.61
	2020-21	1,98,29,927	9,77,815	4.93
	2021-22	2,34,71,012	11,48,471	4.89
	2022-23	2,72,40,712	13,03,524	4.79
	2023-24	2,96,57,745	14,39,674	4.85
	(ఐదేళ్లలో జీడీపీలో రాష్ట్ర వాటా సగటు 4.82 శాతం)			

అదనంగా రూ.4,63,189 కోట్లు ఎలా తెస్తావ్ బాబూ?

టీడీపీ మేనిఫెస్టోలో సూపర్ సిక్స్‌తోపాటు పేర్కొన్న ఇతర హామీల అమలుకు ఏటా రూ.1.65 లక్షల కోట్లకుపైగా అవసరమని ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. అంటే.. ప్రస్తుతం సీఎం జగన్ డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు చేస్తున్న వ్యయం కంటే అదనంగా ఏటా రూ.92,638 కోట్లు అవసరం. ఐదేళ్లలో ఆ పథకాల అమలుకు మొత్తంగా రూ.8.25 లక్షల కోట్లు అవసరం. అంటే.. ప్రస్తుతం సీఎం జగన్ డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు ఐదేళ్లలో చేసిన వ్యయం కంటే అదనంగా రూ.4,63,189 కోట్లు కావాలి. ఈ డబ్బులు ఎలా తెస్తావని ప్రశ్నిస్తుంటే సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అమలు చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారు తప్పించి స్పష్టంగా లెక్క చెప్పలేక తప్పించుకుంటున్నారు.

మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్) ఇలా:



ఐదేళ్లలో ఏటా సగటున మూలధన వ్యయంగా చేసిన ఖర్చు

చంద్రబాబు హయాంలో	సీఎం జగన్ హయాంలో
15,227.80	17,757.10

గతంలో సంపద సృష్టించానని, ఇప్పుడూ సంపద సృష్టించి.. దాని ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చంద్రబాబు చెబుతోన్న మాటల్లో వీసమెత్తు నిజం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 1995–2004 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు.. హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో మురళీమోహన్ వంటి బినామీలు, వందిమాగధులతో భారీ ఎత్తున భూములు కొనుగోలు చేయించారు. ఆ తర్వాత హైటెక్ సిటీ పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి మౌలిక సదుపాయాలకు ఖర్చు చేసి బినామీలకు సంపద సృష్టించారు. విభజన తర్వాత 2014 ఎన్నికల్లో గెలిచి, అధికారంలోకి వచ్చాక.. విజయవాడ–గుంటూరు ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేసే చోటు గురించి బినామీలు, వందిమాగధులకు ముందుగా లీకులు ఇచ్చి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. వేలాది ఎకరాల భూములు తక్కువ ధరలకే కొల్లగొట్టారు. ఆ భూ సంపదను రెట్టింపు చేయడానికి రాజధానిగా అమరావతిని చేశారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే.. ప్రభుత్వ ఖజానా నుంచి అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు భారీ ఎత్తున నిధులు ఖర్చు చేసి.. బినామీలు, వందిమాగధులు కాజేసిన భూ సంపదను మరింతగా పెంచడానికి ఎత్తులు వేస్తున్నారు.

హైటెక్ సిటీలో, అమరావతిలో బినామీలకే సంపద సృష్టి

- ఉమ్మడి రాష్ట్రాన్ని, విభజన తర్వాత రాష్ట్రాన్ని 14 ఏళ్లు సీఎంగా చంద్రబాబు పాలించారు. ఆ 14 ఏళ్లు.. ప్రతి ఏటా రెవెన్యూ లోటే. ఎడాపెడా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని రుణాల ఊబిలోకి నెట్టింది చంద్రబాబే. 2014 నుంచి 2019 వరకు అప్పుల కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్‌రేట్ (సీఏజీఆర్) 21.87 శాతం. కానీ.. సీఎం జగన్ హయాంలో 2019 నుంచి 2024 వరకు చూస్తే అది 12.13 శాతం. దీన్ని బట్టి చంద్రబాబే ఎడాపెడా అప్పులు తెచ్చినట్లు స్పష్టమవుతోంది.
- అప్పుల మొత్తాన్ని చూసినా... చంద్రబాబు అధికారంలోకి రాక ముందు అంటే 2014 జూన్ 7 నాటికి రాష్ట్రానికి రూ.1,53,346 కోట్ల అప్పు ఉంటే.. 2019 మే 29 నాటికి అది రూ.4,12,288 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం ఆ అప్పులు రూ.7,03,471 కోట్లకు చేరాయి.
- సంపద సృష్టించానని చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ.. వాస్తవానికి చంద్రబాబు హయాం (2014–19)లో మూలధన వ్యయం ఏటా సగటున రూ.15,227 కోట్లు ఖర్చు చేస్తే.. సీఎం జగన్ గత ఐదేళ్ల ఏటా సగటున రూ.17,757 కోట్లు ఖర్చు చేశారు.
- జీడీపీలో రాష్ట్ర వాటా చంద్రబాబు హయాంలో సగటున 4.47 శాతం ఉంటే.. సీఎం జగన్ హయాంలో అది 4.83 శాతానికి పెరిగింది. కోవిడ్ లాంటి క్లిష్ట సమయాన్ని కలిపినా 4.83 శాతం మన వాటా ఉందంటే ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందన్నది స్పష్టమవుతోంది.
- చంద్రబాబు హయాంలో జీఎస్‌డీపీలో పన్నుల భారం సగటున 6.57 శాతం ఉంటే.. జగన్ హయాంలో అది 6.35 శాతమే. అంటే.. సీఎం జగన్ హయాంలోనే పన్నుల భారం తక్కువ. ఇది ఆర్బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా), కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) తేల్చిన లెక్క.

రాష్ట్రంలో ప్రజలపై పన్నుల భారం చంద్రబాబు హయాంలోనే ఎక్కువ

	ఆర్థిక సంవత్సరం	రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం	రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ)	జీఎస్‌డీపీలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వాటా
చంద్రబాబు హయాం	2014-15	29,857	4,37,480	6.82
	2015-16	39,922	6,04,229	6.61
	2016-17	44,181	6,84,416	6.46
	2017-18	49,813	7,86,135	6.34
	2018-19	58,107	8,73,721	6.65
	(ఐదేళ్లలో సగటున జీఎస్‌డీపీలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వాటా 6.57 శాతం)			
సీఎం జగన్ హయాం	2019-20	57,619	9,25,839	6.22
	2020-21	57,428	9,77,815	5.87
	2021-22	73,616	11,48,471	6.41
	2022-23	85,874	13,03,524	6.59
	2023-24	95,757	14,39,674	6.65
	(ఐదేళ్లలో సగటున జీఎస్‌డీపీలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వాటా 6.35 శాతం)			

చంద్రబాబు పాలనలో ప్రతి ఏటా రెవెన్యూ లోటే (రూ. కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	రెవెన్యూ లోటు, మిగులు	ఆర్థిక సంవత్సరం	రెవెన్యూ లోటు, మిగులు
		2005-06	-64
		2006-07	2810
1993-94	230	2007-08	159
1994-95	-730	2008-09	1004
1995-96	-740	2009-10	1230
1996-97	-3200	2010-11	2464
1997-98	-700	2011-12	3138
1998-99	-2680	2012-13	1128
1999-00	-1230	2013-14	344
2000-01	-3600	2014-15	-13776
2001-02	-2880	2015-16	-7302
2002-03	-3050	2016-17	-17231
2003-04	-2960	2017-18	-16151
2004-05	-2560	2018-19	-13889

బాబు హామీలను మహిళలు నమ్మరు





'చంద్రబాబు పాలనలో మోసపోయినంతగా మహిళలు మరెవరి పాలనలోనూ మోసపోలేదు. బాబు తన మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను మహిళలు నమ్మట్లేదు. 2014 ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తానన్నారు. అధికారం చేపట్టాక పట్టించుకోలేదు. బంగారం తాకట్టుపై రుణాలు తీసుకున్న మహిళలు చంద్రబాబును నమ్మి మోసపోయారు. తర్వాత వడ్డీలు కట్టేందుకు ముక్కుపుడకల్ని సైతం తాకట్టు పెట్టాల్సి వచ్చింద'ని పద్మావతి మహిళా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జమున దువ్వూరి అన్నారు. 'సాక్షి'తో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మహిళలకు జరిగిన అన్యాయం, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వారికి దక్కిన గౌరవం, మహిళా సాధికారత దిశగా పడిన అడుగులను వివరించారు.

– తిరుపతి సిటీ

ముక్కుపుడక సైతం తాకట్టు పెట్టి వడ్డీలు కట్టారు

- మహిళా సాధికారత ఓ యజ్ఞం.. దానికి అడుగు పడింది జగన్‌తోనే
- జగన్ పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబనలో ఏపీ రోల్‌మోడల్
- పద్మావతి మహిళా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జమున దువ్వూరి

2019లో మహిళా సాధికారత వైపు అడుగులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలను ప్రత్యక్షంగా గమనించారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో నవరత్నాలతో మేనిఫెస్టోను రూపొందించారు. సీఎం అయిన వెంటనే వాటిని అమలు చేశారు. గతంలో ఎంతో మంది రాజకీయ ఉద్దండులు రాష్ట్రాన్ని పాలించినా మహిళా సాధికారతవైపు అడుగులు పడలేదు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలతో మహిళలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకునేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నించేవి. సీఎం జగన్ ప్రతి పథకాన్ని మహిళలకు వర్తించేలా జాగ్రత్త పడ్డారు. దీంతో రానున్న ఎన్నికల కోసం సీఎం జగన్ మేనిఫెస్టోలో కొత్త పథకాలను ప్రవేశపెట్టకుండా, తాను గతంలో మహిళా సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాలనే మరింత మెరుగ్గా కొనసాగిస్తానన్నారు. తన పాలనలో ప్రతి ఒక్కరికీ మంచి జరిగింది. అందుకే జగన్ మేనిఫెస్టోను మహిళలు పూర్తి స్థాయిలో విశ్వసిస్తున్నారు.

ఆర్థిక స్వావలంబనలో రోల్ మోడల్

జగన్ పాలనలో అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి మహిళకు పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా సంక్షేమ లబ్ధి అందించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రతి ఇంటి తలుపు తడుతూ ప్రతి పథకానికి అర్హులను గుర్తించి లబ్ధి చేకూర్చడం ప్రగతికి నిదర్శనం. ఈ విధానంలో దేశంలోని పలు రాష్ట్రాలకు ఏపీ రోల్ మోడల్‌గా నిలుస్తోంది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలపై ఇప్పటికే పలు రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయి. సుమారు రూ.2.70 లక్షల కోట్ల నిధులను మధ్యవర్తుల ప్రమేయం, అవినీతికి తావులేకుండా నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేయడం ఆశ్చర్యమేస్తుంది. ఆసరా, చేయూత తదితర పథకాల లబ్ధిదారులు ప్రభుత్వ సాయంతో స్వయం ఉపాధి పొందుతున్నారు.

సాధికారత అంటే ఉచిత బస్సు ప్రయాణమా?

మరో మారు మహిళలను తప్పుదోవ పట్టించి, మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్లు అంటున్నారు. మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణిస్తే సాధికారత సాధించినట్లేనా..? పక్క రాష్ట్రాల పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టోగా రూపొందించారు. జగన్ ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకాన్నే తల్లికి వందనం అంటున్నారు. ఇది రాజకీయ పరిపక్వతలేని వ్యక్తులు చేసే పని. దీనిని ప్రజలు విశ్వసించరు.

మేనిఫెస్టో పవిత్ర గ్రంథం

సీఎం జగన్ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేసే హామీలను మాత్రమే పొందుపరిచారు. తన ఐదేళ్ల పాలనలో చెప్పిన ప్రతి హామీ నెరవేర్చారు. 'మీ కుటుంబానికి మేలు జరిగితేనే తనకు అండగా నిలబడండి' అంటూ ఓట్లు అడుగుతున్న ఏకైక నాయకుడు దేశంలో జగన్ ఒక్కరేనని చెప్పవచ్చు. కేవలం అధికారమే లక్ష్యంగా నోటికి వచ్చినట్లు అమలు చేయలేని హామీలతో మహిళలను మోసం చేయాలనుకుంటే గుర్తించలేని స్థితిలో ప్రస్తుత మహిళలు లేరు. చంద్రబాబు 14 ఏళ్ల పాలన ప్రజలకు బాగానే గుర్తుంది.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

సీఎం జగన్ పాలనలో నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయి. పేద పిల్లలు అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారంటే ప్రభుత్వ స్కూళ్లు ఎంత గొప్పగా ఉన్నాయో స్పష్టమవుతోంది. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలతో ఉన్నత విద్యను ప్రోత్సహించారు. గోరుముద్ద పథకంతో నాణ్యమైన పోషకాహారాన్ని పిల్లలకు అందిస్తున్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం విద్యపై ఇంత పెద్ద ఎత్తున దృష్టి సారించలేదు.


బొబ్బిలిలో ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


ఏలూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

ఇవ్వడమే జగన్‌కు తెలుసు

జగన్ భూములిచ్చేవాడే కానీ.. నీలా లాక్కునేవాడు కాదు చంద్రబాబూ! | బొబ్బిలి, పాయకరావుపేట, ఏలూరు ఎన్నికల సభల్లో సీఎం జగన్

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం
- దేశంలో వందేళ్ల తర్వాత ఈ సర్వే జరుగుతోంది
- రికార్డులు అప్‌డేట్ చేసి రైతన్నలకు అందజేస్తున్నాం

జగన్‌ను చంపేస్తే తప్పేమిటంటున్నాడు..

'మీ బిడ్డ జగన్‌ను ఓడించలేమని, ఆ పేద అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, వారి కుటుంబాలు మోసపోవడానికి సిద్ధంగా లేరని, ఎంత ప్రలోభపెట్టినా తన మాటలు నమ్మట్లేదని గ్రహించడంతో చంద్రబాబు నోట జగన్‌ను చంపేస్తే ఏమవుతుంది? అన్న మాట వినిపిస్తోంది. నాడు వైఎస్సార్ గాల్లో కలిసిపోతాడని అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు వ్యాఖ్యలు చేశాడు. నేడు జగన్‌ను చంపేస్తే తప్పేమిటని అంటున్నాడు. రాజకీయాల్లో ఇంతకన్నా సిగ్గుచేటు ఉంటుందా?'

– బొబ్బిలి సభలో...

ప్రతి పేదవాడికీ తెలుసు..

"ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ విషయంలో దుష్ప్రచారం జరుగుతోంది. జగన్ మీ భూములు కాజేస్తాడంటూ ప్రతి ఒక్కరికీ మెసేజ్‌లు పంపుతూ, ఫోన్లు చేసి చెబుతున్నారు. అయ్యా చంద్రబాబూ..! జగన్ ఎలాంటివాడో నీకు తెలియదేమో కానీ ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదకూ తెలుసు. జగన్ భూములు ఇచ్చేవాడే కానీ నీలా భూములు లాక్కునేవాడు కాదు"

– పాయకరావుపేట సభలో..

తట్టుకోలేకపోతున్నారు..

''పేదల గురించి జగన్ మాట్లాడుతుంటే పెత్తందారులైన చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు, వదినమ్మకు చాలా బాధగా, విపరీతమైన కోపంగా ఉంటుంది. జగన్ ఎప్పుడూ పేదలు.. పేదలు అంటుంటే విని తట్టుకోలేకపోతున్నారు. ఈ రోజు జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు. రాష్ట్రంలో క్లాస్ వార్ జరుగుతోంది. పేదలు ఒక ఒకవైపు, పెత్తందారులు మరోవైపు ఉన్నారు. కులం పరంగా, ఫలానా పార్టీ పట్ల అభిమానం వల్ల కావచ్చు.. గత ఎన్నికల్లో నాకు ఓటు వేయని వారికి కూడా విజ్ఞప్తి చేస్తున్నా. ఇంటికి వెళ్లాక మీ కుటుంబానికి ఎవరి వల్ల మంచి జరిగిందో మీ కుటుంబ సభ్యులతో కలసి కూర్చుని చర్చించండి. ఎవరు ఉంటే ఈ మంచి కొనసాగుతుందో ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా''

– ఏలూరు సభలో...

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/సాక్షి ప్రతినిధి, ఏలూరు: ''జగన్ ఎలాంటివాడో నీకు తెలియదేమో కానీ ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదకూ తెలుసు చంద్రబాబూ! జగన్ భూములు ఇచ్చేవాడే కానీ నీలా భూములు లాక్కునేవాడు కాదు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంటే చంద్రబాబుకు తెలియదు. వందేళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో జరిగిన సర్వే తర్వాత ఇప్పుడు చేపట్టిన సర్వేతో పక్కాగా రికార్డులు సృష్టించి రైతులకు ఇబ్బందులు లేకుండా చేయడమే దీని ఉద్దేశం. 15 వేల గ్రామ సచివాలయాల్లో 15 వేల మంది సర్వేయర్లను నియమించి ఇలా సర్వే చేసిన పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. రైతన్నలు కోర్టులు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ డబ్బులు ఖర్చు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని మార్చి ప్రతి ఒక్కరికీ వారి భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలనే లక్ష్యంతో రీ సర్వే ద్వారా సరిహద్దు రాళ్లను నాటించి రికార్డులు అప్‌డేట్ చేసి ఆ పత్రాలన్నీ రిజిస్ట్రేషన్ చేసి రైతన్నలకు ఇస్తున్నాం. ఇంత గొప్ప కార్యక్రమానికి చేతనైతే మద్దతు పలకాలేగానీ చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారు. మనం అమలు చేసిన పథకాల గురించి చెబుతుంటే చంద్రబాబుకు కోపం వస్తోంది. గత 59 నెలల కాలంలో ఎన్నడూ లేని విప్లవాత్మక సంస్కరణలను మీ బిడ్డ తెచ్చినందుకే ఆయనకు కోపం వస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటూ వచ్చే ఐదేళ్లల్లో ఇంటింటి అభివృద్ధి, పేదల భవిష్యత్తును నిర్ణయిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. బాబును ఓడించడమంటే పేదలను గెలిపించడమే'' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నేరప్రవృత్తికి చంద్రబాబు నిలువెత్తు నిదర్శనమని, వెన్నుపోట్లు, హత్యలతోనే ఆయన రాజకీయాలు ముడిపడి ఉంటాయని ధ్వజమెత్తారు. సొంతమామ ఎన్టీఆర్‌ను, వంగవీటి రంగాను, పింగళి దశరథరామయ్యను, ఐఏఎస్ అధికారి రాఘవేంద్రరావును కుట్రలతోనే కడ తేర్చారన్నారు. చంద్రబాబు మాదిరిగా తనకు జెడ్‌ప్లస్, జెడ్ డబుల్ ప్లస్ భద్రత లేదని, జగన్‌కు ప్రజల రక్షణ మాత్రమే ఉందన్నారు. బుధవారం విజయనగరం జిల్లా బొబ్బిలి, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, ఏలూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ మాట్లాడారు.

ఇంటింటి భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలివి...

మరో 13 రోజుల్లో ఎన్నికల యుద్ధం జరగబోతోంది. ఇది జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న యుద్ధం కాదు.. పేదలకు, చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. రాబోయే ఐదేళ్ల పాటు మీ ఇంటింటి భవిష్యత్తు, పథకాల కొనసాగింపును నిర్ణయించేవి. ఓటుతో మీ తలరాతలు మారతాయి. ఈ ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ముగింపే, మళ్లీ మోసపోవడమే. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. బాబుకు ఓటు వేయడమంటే కొండచిలువ నోట్లో తలకాయ పెట్టడమే. పేదలంటే బాబు ముఠాకు కోపం. గతంలో ఎప్పుడూ జరగని విధంగా రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాం. మీ బిడ్డ ఇచ్చింది ఏకంగా 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు. మేనిఫెస్టోలో చెప్పిన 99 శాతం హామీలను అమలు చేశాం. నేను వరుసబెట్టి మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌ల లిస్టు చదువుతుంటే చంద్రబాబుకు పిచ్చి కోపం వస్తోంది. మీరంతా చూస్తున్నారు కదా ఆ కోపాన్ని. ఆయనకు మనమీద ఎందుకంత పిచ్చికోపం వస్తోందంటే.. గతంలో ఎన్నడూ చూడని విధంగా మీ బిడ్డ విప్లవాలు తెచ్చాడు కాబట్టే. నేను చెబుతున్న విషయాలు గతంలో ఎప్పుడైనా అమలు జరిగాయో లేదో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయమని కోరుతున్నా.

జగన్‌ను చంపితే ఏమవుతుందంటున్న బాబు..

మీ జగన్ ప్రజలకు ఏం చేశాడో గుర్తుచేస్తూ ప్రచారం చేస్తున్నాడు. చంద్రబాబు మాత్రం ఏం మాట్లాడుతున్నాడో మీరంతా గమనిస్తూనే ఉన్నారు. రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఇదే పెద్దమనిషి రేపు జగన్‌ను చంపితే ఏం జరుగుతుంది? అని వ్యాఖ్యలు చేశాడు. ఆయన మానసిక పరిస్థితి, ఆ ఆలోచనలు ఎలా ఉన్నాయో గమనించాలని కోరుతున్నా. ఏమయ్యా చంద్రబాబూ..! ప్రజలు నీకు ఎందుకు ఓటు వేయాలి? అని నేను అడుగుతుంటే నీ సమాధానం అదా?

అక్కచెల్లెమ్మలే రక్షించుకుంటారు..

అయ్యా చంద్రబాబూ.. నువ్వు అనుకుంటే సరిపోదు. ఈ 59 నెలల్లో మంచి జరిగిన ఆ కోట్ల మంది అక్కచెల్లెమ్మల కుటుంబాలు జగన్‌కు తోడుగా ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ జగన్‌కు తోడుగా, అండగా ఉన్నారయ్యా చంద్రబాబూ! వారి జగన్‌ను వారే రక్షించుకుంటారు. నాకు నీ మాదిరిగా జెడ్ ప్లస్, జెడ్ డబుల్ ప్లస్ సెక్యూరిటీ అక్కరల్లేదయ్యా. అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మంచి చేస్తూ లంచాలు, వివక్ష లేకుండా ఇచ్చిన రూ.2.70 లక్షల కోట్ల డీబీటీ బటన్‌లే నాకు శ్రీరామరక్ష. పిల్లలు బాగుండాలని ఇచ్చిన అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, అక్కచెల్లెమ్మలు బాగుండాలని ఆరాటపడుతూ అందించిన చేయూత, ఆసరా, సున్నావడ్డీ, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం.. ఇవన్నీ నాకు రక్ష అని చంద్రబాబుకు చెబుతున్నా.

అవ్వాతాతల ప్రార్థనలే నాకు శ్రీరామరక్ష...


నా అవ్వాతాతలకు మంచి చేస్తూ ఇంటివద్దే అందించిన పెన్షన్లతో దేవుడికి చేస్తున్న ప్రార్థనలే నాకు శ్రీరామ రక్ష. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల ప్రార్థనలే వారి బిడ్డ జగన్‌కు శ్రీరామరక్ష. మంచిని అందుకున్న నా రైతన్నలు ఆ భూమాత, పంచ భూతాల సాక్షిగా చేస్తున్న ప్రార్థనే నాకు శ్రీరామ రక్ష.

బాబు వ్యాఖ్యలు నేరప్రవృత్తికి అద్దం...

ఆ రోజు నా తండ్రి రాజశేఖరరెడ్డి చేస్తున్న మంచి పనులు, ఆయనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్కసుతో అసెంబ్లీ సాక్షిగా నాన్ననుద్దేశించి ''నువ్వు ఆ గాలిలోనే కలిసిపోతావ్...!'' అన్న నీ వ్యాఖ్యలను నేను ఎప్పటికీ మర్చిపోలేను చంద్రబాబూ. నాడు నా తండ్రిని, నేడు నన్ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక నువ్వు మాట్లాడుతున్న మాటలు నీ దిగజారుడుతనానికి, నీ నేర ప్రవృత్తికి అద్దం పడుతున్నాయి.

'భృతి'.. అంతా భ్రాంతి

నిరుద్యోగులపై బాబు మరోసారి మాయా వల




యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని 2014లో టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న దృశ్యం

సాక్షి, అమరావతి : ''జాబు రావాలంటే బాబు రావాలి.. తమ్ముళ్లా మీ కలలు సాకారం చేయబోతున్నా.. ఇంటికొక ఉద్యోగం ఇస్తా.. ఉద్యోగం ఇవ్వకపోతే ఉపాధి కల్పిస్తా.. మీరేమీ చదువుకోకపోయినా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.2 వేలిస్తా''.. ఈ హామీ గుర్తుందా? 2014 ఎన్నికల్లో చంద్రబాబు సంతకంతో కూడిన కరపత్రాన్ని తెలుగుదేశం పార్టీ ఊరారా పంచుతూ ప్రచారం చేసింది. సీన్ కట్‌చేస్తే ఆ ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. చెప్పినట్లుగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలుచేశారా అంటే అనేకానేక హామీల్లాగే అదీ బాబు అటకెక్కించేశారు. ఇప్పుడు మళ్లీ అలాంటి హామీతోనే ఆయన మరోసారి యువతకు వల విసురుతున్నారు. ఆయన మాయలో పడొద్దని.. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మేధావులు, విద్యావేత్తలు యువతకు సూచిస్తున్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వబోమన్న అచ్చెన్న..

ఇక అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్ల పాటు చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. కానీ, నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మాత్రం సందర్భం వచ్చిన ప్రతీసారి ఈ అంశంపై చంద్రబాబు సర్కారును నిలదీస్తూనే ఉన్నారు. నిరుద్యోగ భృతి చెల్లిస్తానని యువతకు మాటిచ్చి ఎలా విస్మరిస్తారంటూ ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నకు నిరుద్యోగ భృతి అనే పథకమేలేదని, ఈ ప్రశ్న ఉత్పన్నమే కాదంటూ నాటి కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో అసలు విషయాన్ని కుండబద్దలు కొట్టారు. శిక్షణనిచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇవ్వబోమని, బాబు వస్తే జాబు వస్తుందనే నినాదంతో ఎన్నికల్లో వెళ్లిన మాట వాస్తవమేనని ఆయన చెప్పారు. అయినా, నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో జగన్ పట్టువిడవకుండా ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతుండడంతో 2017–18లో బడ్జెట్‌లో టీడీపీ ప్రభుత్వం కంటితుడుపుగా రూ.500 కోట్లు కేటాయించింది. దీనిపై జగన్ మండిపడుతూ.. జాబు రావాలంటే బాబు రావాలని, జాబు ఇవ్వకపోతే ఇంటికో ఉద్యోగం ఇస్తానంటూ ఎన్నికల ముందు ఇంటింటా ప్రచారం చేసి ఇప్పుడు గొప్పగా రూ.500 కోట్లు కేటాయించామని చెప్పడం నిరుద్యోగులను నిలువునా మోసం చేయడమేనని ఉతికి ఆరేశారు. అంతేకాక.. రాష్ట్రంలో 1.75 కోట్ల కుటుంబాలున్నాయని, ఒక్కో కుటుంబానికి నెలకు రెండువేల చొప్పున భృతి ఇవ్వాలని.. ఇందుకు నెలకు రూ.3,500 కోట్లు అవసరమని, అలాగే ఏడాదికి రూ.40 వేల కోట్లు అవసరమైతే రూ.500 కోట్లు ఏ మూలకు సరిపోతాయంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని వైఎస్ జగన్ చీల్చిచెండాడారు.

ఉన్న ఉద్యోగాలకు బాబు ఎసరు..

ఇలా నిరుద్యోగ భృతి ఇస్తానంటూ నాలుగున్నరేళ్ల పాటు ఎగమనామం పెట్టి ఎన్నికల ముందు ఆర్నెల్లపాటు యువతను మోసం చేయడానికి కంటితుడుపు చర్యగా ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో చంద్రబాబు ఎత్తుగడ వేశారు. కానీ, నిరుద్యోగ భృతి ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోగా ఆరోగ్య మిత్రలను, ఫీల్డ్ అసిస్టెంట్లను, గోపాల మిత్రలను ఉద్యోగాల నుంచి చంద్రబాబు తొలగించారు. దీంతో.. మళ్లీ ఇప్పుడు ఎన్నికల ముందు యువతను, నిరుద్యోగులను మోసం చేయడానికి చంద్రబాబు కుయుక్తులు, మోసపూరిత ప్రకటనలతో వస్తున్నారు తస్మాత్ జాగ్రత్త నిరుద్యోగులూ.. అంటూ మేధావులు, విద్యావేత్తలు యువతను అప్రమత్తం చేస్తున్నారు. నిరుద్యోగ భృతిపై 2014 ఎన్నికల ముందు ఇంటింటా ప్రచారం చేసి అధికారం దక్కాక ఎలా మోసం చేశారో అచ్చు అలాగే చంద్రబాబు మళ్లీ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అంటూ అరచేతిలో వైకుంఠం చూపెడుతున్నారని.. చంద్రబాబు వలలో పడి మరోసారి మోసపోవద్దని వారు సూచిస్తున్నారు.

ఇక 2017–18లో రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ చంద్రబాబు పైసా ఖర్చు పెట్టలేదు. ప్రతిపక్ష నేత జగన్ తన ఒత్తిడి కొనసాగిస్తుండడంతో ఇక 2019 ఎన్నికలకు ఆర్నెల్ల ముందు నాలుగు నెలల కోసం నిరుద్యోగ భృతి కాదు ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో నిరుద్యోగులకు నెలకు రూ.1,000 ఇస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. ఈ ఉపసంఘం సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించింది.

వైఎస్ జగన్ ఒత్తిడితో.. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు..

- టెన్త్, ఇంటర్ చదివిన వారు అనర్హులని ఆంక్షలు విధించింది.
- 22 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారు డిగ్రీ చదివిన వారికే భృతి వర్తిస్తుందని, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారు.. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని షరతులు విధించింది.
- దీంతో వచ్చిన దరఖాస్తుల్లో 12 లక్షల మందికి పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చింది.
- ఆ తరువాత అది పది లక్షలు, మళ్లీ మళ్లీ వడపోత తర్వాత 2.10 లక్షల మందే అర్హులంటూ వెల్లడించి మళ్లీ దానిని 1.62 లక్షలకు కుదించింది.
- అనంతరం 2018 అక్టోబరులో కేవలం రూ.40 కోట్లు విడుదల చేసి ఈ–కేవైసీ మెలిక పెట్టింది.
- అలాగే, ప్రతినెలా వేలిముద్ర వేస్తేనే నిరుద్యోగ భృతి అంటూ ఆంక్షలు పెట్టుకుంటూ పోయి ఎన్నికల ముందు నాలుగు నెలలపాటు కొన్ని వేల మందికి మాత్రమే భృతి ఇచ్చి మమ అనిపించింది.

వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకును చీల్చడమే షర్మిల లక్ష్యం

పాడేరు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థితో మంతనాలతో స్పష్టీకరణ

- చంద్రబాబు నాయుడుకు మేలు చేయడమే ఎజెండా
- ఆడియో లీక్‌తో అడ్డంగా దొరికిపోయిన వైనం
- పాడేరు కాంగ్రెస్ టికెట్ తొలుత వంతల సుబ్బారావుకు
- ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన బుల్లిబాబుకి కేటాయింపు
- పాడేరులో కాంగ్రెస్ రెబల్‌గా వంతల పోటీ
- పోటీ నుంచి తప్పుకోవాలని వంతలను ఆదేశించిన షర్మిల
- వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు కోసమే తాను బాధ్యతలు తీసుకున్నట్లు వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు చీల్చి, చంద్రబాబుకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్పష్టమైంది. పాడేరులో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి వంతల సుబ్బారావును విరమింపజేయడానికి షర్మిల చేసిన ప్రయత్నం షర్మిల ఎల్లో రాజకీయాన్ని తేటతెల్లం చేసింది. వైఎస్సార్‌సీపీ ఓట్లు కోసమే బుల్లిబాబుకి టికెట్ ఇచ్చామంటూ సుబ్బారావుతో షర్మిల మాట్లాడిన ఆడియో లీకవడంతో అడ్డంగా దొరికిపోయారు.

పాడేరు కాంగ్రెస్ అభ్యర్థిగా షర్మిల తొలుత వంతల సుబ్బారావును ఎంపిక చేశారు. ఇటీవల పాడేరులో జరిగిన సభలో కూడా సుబ్బారావే అభ్యర్థి అని ప్రకటించారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నుంచి బుల్లిబాబు కాంగ్రెస్‌లోకి రావడంతో షర్మిల ప్లేటు ఫిరాయించారు. సుబ్బారావును కాదని బుల్లిబాబుకు టిక్కెట్ ఇచ్చారు. దీంతో వంతల సుబ్బారావు రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. దీంతో షర్మిల సుబ్బారావుతో ఫోన్‌లో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓట్లు చీల్చేందుకే బుల్లిబాబుకి టికెట్ ఇస్తున్నామనీ.. పోటీ నుంచి తప్పుకోవాలని కోరారు. రెబల్‌గా బరిలో ఉంటే పార్టీలోకి మళ్లీ రాలేరంటూ హెచ్చరించారు. మీ సభలకంటే నా సభలకే జనాలు ఎక్కువ మంది వస్తున్నారంటూ సుబ్బారావు కూడా ఘాటుగా సమాధానమిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న ఆడియోలో ఏముందంటే..

షర్మిల: నమస్తే అన్నా.. ఇప్పటికి కూడా ఆలస్యం కాలేదన్నా. నెక్స్ట్ టైమ్ తప్పకుండా ఆపర్చ్యునిటీ ఇస్తాం. పార్టీలో సముచితమైన స్థానం, గౌరవమిస్తాను. మీరు నా సొంత అన్న లెక్క అన్నా. అర్థం చేసుకోకపోతే ఎలా అన్నా. నేనైతే మీకియ్యాలనే అనుకున్నానన్నా. కానీ రఘువీరారెడ్డి గారు ఆల్రెడీ అరకు సీపీఎంకు ఇచ్చేశారు. ఈ సీటు బల్లిబాబుకు ఇమ్మన్నారు. మీకు అన్నీ తెలిసి మేమేదో డబ్బుల కోసమో.. నా టీమ్ ఏదో డబ్బుల కోసమో బుల్లిబాబుకి ఇచ్చామని ప్రచారం చెయ్యడం కూడా కరెక్ట్ కాదు కదా మీరు. అది వాస్తవం కాదు కదా అన్నా..

సుబ్బారావు: నేనేమీ ప్రచారం చెయ్యలేదు. నేనైతే ఎక్కడా మీ గురించి కానీ, పార్టీ గురించి కానీ ప్రచారం చెయ్యలేదు.

షర్మిల: సరే అన్నా.. ఇప్పటికి కూడా ఆలస్యం కాలేదు. మీరు రెబల్ కావద్దు. నెక్స్ట్‌టైమ్ తప్పకుండా అవకాశం ఉంటుంది. కమ్ బ్యాక్.

సుబ్బారావు: ఇంత అన్యాయం ఏంటి మేడం. ఏ రోజూ జెండా మోయని వాడికీ, పార్టీలో లేనివాడికీ ఇచ్చెయ్యడం వల్ల నాకు బాధ ఉంది. మరొక్క విషయం.. మీరు వేలాది మంది జనం ముందు ప్రకటన చెయ్యకపోయినా బాగుండేది. మీరు ప్రకటన చెయ్యడం వల్ల నేను డిసప్పాయింట్ అయ్యాను. మా వాళ్లు కూడా ఫీలయ్యారు.

షర్మిల: అన్నా.. మీకు అన్నీ తెలుసు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు ముఖ్యం, మనకు వైసీపీ ఓటు బ్యాంకు కూడా ముఖ్యము. రెండూ కలిసొస్తాయనే కదా తీసుకుంది. నేను తీసుకుంది ఎందుకు? వైసీపీ ఓటు బ్యాంకు కోసమే కదా.

సుబ్బారావు: నేనిప్పుడు చూశాను.. మీరు మాట్లాడింది, మీరు ప్రచారం చేసింది. మొన్న నా జనాల్ని చూస్తే.. మీకంటే ఐదు రెట్లు ఎక్కువ మంది వచ్చారు. రూపాయి ఖర్చు పెట్టకుండా. వీడియోలు పెట్టమంటే పెడతాను. చూడండి. నేను ఓటు బ్యాంకు ఉన్నవాడిని. కానీ.. గ్రౌండ్ లెవల్‌లో రిపోర్ట్ లేదు అని అన్నారు. నా రిపోర్ట్ ఎంటో ఎవరికెన్ని ఓట్లు వస్తాయో చూడండి. నేను కాంగ్రెస్‌లోనే ఉంటాను.

షర్మిల: అన్నా.. మీరు ఇప్పుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే ఇంక కాంగ్రెస్ పార్టీ గురించి మర్చిపోండి.

సుబ్బారావు: మర్చిపోవాలంటే.. మర్చిపోతానిక.

షర్మిల: మర్చిపోండి.. మీకు ఇప్పుడు మాత్రమే అవకాశం ఉంది. మళ్లీ కుటుంబంలోకి రావడానికి. మీరు రెబల్‌గా పోటీ చేసినాక, కాంగ్రెస్ పార్టీకి డ్యామేజ్ చేసినాక మళ్లా మీరు కాంగ్రెస్‌లోకి రాలేరు.

సుబ్బారావు: నా భవిష్యత్తే డ్యామేజ్ అయ్యింది. నాకింకేముంది మరి.

షర్మిల: అదే అన్నా.. ఇప్పుడు ఆలోచించుకోండి. మళ్లీ మీకు కాంగ్రెస్ పార్టీ అవసరము అని వెనక్కొస్తే మీకిక్కడ స్థానం ఉండదు.

సుబ్బారావు: మంచిదే కదా.

ఫస్ట్ టైమ్

‘ఈ ప్రపంచంలో గొప్ప వృత్తులు ఏమిటి?’ అని చిన్నప్పుడు తండ్రిని అడిగితే ఆయన చెప్పిన సమాధానం జోయా మీర్జా మనసులో ముద్రించుకుపోయింది. ఆ తరువాత కలగా మారింది. కలను నెరవేర్చుకునే ప్రయత్నంలో పరాజయం పలకరించింది. నిరాశలో రెండడుగులు వెనక్కి వేసినా ఆ తరువాత మాత్రం ఆత్మవిశ్వాసం అనే ఇంధనంతో వేగంగా ముందడుగు వేసింది. ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ డాక్టర్‌గా ఎంపిక అయింది జోయా మీర్జా. చత్తీస్‌గఢ్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది జోయా....

జయహో జోయా



జోయా మీర్జా

కల కన్నప్పుడే విజయానికి దగ్గరవుతాం. ఏ కలా లేనప్పుడు ఏ విజయమూ ఉండదు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాకు చెందిన జోయా మీర్జా చిన్నప్పటి నుంచి పెద్ద కలలు కనేది. అయితే అవేమీ ఆకాశానికి నిచ్చెన వేయాలనుకునే కలలు కావు. ‘వైద్యురాలిగా సేవ అందించాలి, సైన్యంలో పనిచేయాలి’... ఇలా ఉండేవి ఆమె కలలు.

కన్న కలలు కాలానికి నిలబడతాయనే గట్టి నిబంధన లేదు. అయితే గట్టి పట్టుదల ఉంటే కల నెరవేర్చుకోవడం కష్టమేమీ కాదు అని చెప్పడానికి స్ఫూర్తి... జోయా మీర్జా. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ (ఏఎఫ్‌ఎంసీ)లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన మీర్జా ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ డాక్టర్‌గా నియామకం కావడం ద్వారా తన కలను నిజం చేసుకుంది.

అయితే జోయా మీర్జాది నల్లేరు మీద నడకేమీ కాదు.



తల్లిదండ్రులతో జోయా

కుటుంబ ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండేది.

ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఉన్నా ‘ఇక చదివింది చాలు’ అనే మాట తల్లిదండ్రుల నుంచి ఎప్పుడూ రాలేదు. చదువు విషయంలో కుమార్తెను ఎప్పుడూ ప్రోత్సహించేవారు.

జోయాను డాక్టర్‌గా చూడాలనేది అమ్మమ్మ కల.

‘నీట్’ పరీక్షలో జోయాను ఫెయిల్యూర్ పలకరించింది. బాధపడుతూ కూర్చోకుండా ‘యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ’లో గ్రాడ్యుయేషన్ చేయడంపై దృష్టి పెట్టింది. ఒక సంవత్సరం గ్యాప్ తీసుకొని రాజస్థాన్‌లోని కోటాలో ‘నీట్’ కోసం కోచింగ్ తీసుకోవడానికి జోయా మీర్జాను తల్లిదండ్రులు ఒప్పించారు. కోచింగ్ కోసం అప్పులు చేశారు.

‘తల్లిదండ్రుల కోరిక మేరకు కోటాకు వెళ్లాను. అయితే ప్రాక్టీస్ ఎగ్జామ్స్‌లో ఇతర విద్యార్థులు నా కంటే మెరుగ్గా ఉన్నారనే విషయం తెలిసినప్పుడు నాలో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. నీట్ పరీక్షకు ఇరవై రోజుల ముందు అమ్మమ్మ తీవ్రమైన అనారోగ్య సమస్య వల్ల నేను ఇంటికి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఆ తరువాత తిరిగి కోటాకు వచ్చాను. ఒకే ఒక్క ర్యాంకు తేడాతో సీటు సాధించే అవకాశాన్ని కోల్పోయాను’ అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది మీర్జా.

తల్లిదండ్రులు మొదట నిరాశ పడినా ‘మరో ప్రయత్నం’ అంటూ కుమార్తెను కోచింగ్ కోసం భిలాయ్‌కు పంపించారు.

‘భిలాయ్ కోచింగ్ సెంటర్‌లోని ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడంతో పాటు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. అది నాకు ఎంతగానో ఉపకరించింది’ అంటుంది మీర్జా. ఆ ఆత్మబలమే ‘నీట్’లో తగిన మార్కులు సాధించి ‘ఏఎఫ్‌ఎంసీ’ ఎంచుకునేలా చేసింది. పుణేలోని ‘ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ’లో ఎంబీబీఎస్ చేసింది.

‘గొప్ప వృత్తులు ఏమిటి?’ అని చిన్నప్పుడు తండ్రిని అడిగినప్పుడు...

‘సోల్జర్, డాక్టర్’ అని చెప్పేవాడు.

లెఫ్టినెంట్ డాక్టర్‌గా ఆ రెండు గొప్ప వృత్తులలో పనిచేసే అవకాశం తన అదృష్టం అంటుంది జోయా మీర్జా.

తన ఫస్ట్ పోస్టింగ్ జమ్ములో.

‘చదువుపై నాకు ఉన్న ఆసక్తిని గమనించి మా అమ్మమ్మ నన్ను డాక్టర్‌గా చూడాలనుకుంది. డాక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని కోరుకుంది. దురదృష్టవశాత్తు ఆమె ఏడాది క్రితం చనిపోయింది. నన్ను యూనిఫామ్‌లో చూడలేకపోయింది’ అమ్మమ్మను తలుచుకుంటూ బాధగా అంటుంది మీర్జా.

‘పరులకు సహాయం చేయాలనే తత్వం తనది. తన మనస్తత్వానికి సరిగ్గా సరిపోయే వృత్తి ఇది. మీర్జాకు ఎలాంటి సవాలైనా ఎదుర్కొనే శక్తి ఉంది’ అంటున్నాడు జోయా తండ్రి షమీమ్ మీర్జా.

మహిళాసాధికారతపై ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో ప్రసంగించడానికి భారతదేశం నుంచి ముగ్గురు సర్పంచులకు ఆహ్వానం అందింది. ఈ నెల 3న అమెరికాలోని న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి నిర్వహిస్తున్న సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి నుంచి సర్పంచ్ హేమకుమారి, త్రిపుర నుంచి సుప్రియాదాస్ దత్తా, రాజస్థాన్ నుండి నీరూ యాదవ్ పాల్గొంటున్నారు.

మన సర్పంచులు @ ఐరాస



నీరూ యాదవ్, సుప్రియాదాస్ దత్తా, హేమకుమారి



హేమకుమారి

‘భారతదేశంలో స్థానిక సంస్థల పాలనలో మహిళల భాగస్వామ్యం, వారు ఎలా దారి చూపుతున్నారు’ అనే అంశంపై ఐక్యరాజ్యసమితిలో చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశంలో భారతదేశం నుంచి ముగ్గురు మహిళా ప్రతినిధులతో ఒక ప్యానెల్ చర్చ ఉంటుంది. ఈ కార్యక్రమంలో వారు తమ విజయగాథలను పంచుకుంటారు. అలాగే లింగ సమానత్వం, అభివృద్ధి కోసం వారి వారి పంచాయితీలలో చేసిన కృషిని కూడా పంచుకుంటారు. వీరిని మూడు రాష్ట్రాల పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది.

మూడు కీలకమైన స్తంభాలు: హేమకుమారి

పశ్చిమగోదావరి జిల్లా పేకేరు గ్రామ పంచాయతీలో స్థిరమైన అభివృద్ధి, లింగ సమానత్వం కోసం కార్యక్రమాలను చేపట్టి, విజయవంతంగా పూర్తి చేసింది. సర్పంచ్‌గా హేమకుమారి 2021లో పదవిని చేపట్టినప్పటి నుంచి మూడు కీలకమైన స్తంభాలపై దృష్టి సారించి పరివర్తన కార్యక్రమాలకు నాయకత్వం వహించింది. అవి.. ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం. సరైన పోషకాహారం, ప్రసవానికి సంబంధించిన అవగాహన పెంచడానికి క్రమం తప్పకుండా హెల్త్ క్యాంపులు, విద్యాకార్యక్రమాలను చేపట్టింది. దీని ఫలితంగా ముప్పు అధికంగా గల గర్భధారణ కేసుల సంఖ్య, శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. ఈ విషయాలపై హేమకుమారి తాను చేసిన ప్రయోజనకరమైన పనులను, వచ్చిన ఫలితాలను తెలియజేయనుంది.

హాకీ సర్పంచ్: నీరూయాదవ్



నీరూ యాదవ్

రాజస్థాన్‌లోని బుహనా తహసీల్‌లోని లంబి అహిర్ గ్రామ సర్పంచ్ నీరూ యాదవ్ ‘నాయకత్వ అనుభవం’పై తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. నీరూ యాదవ్ 2020లో లంబి అహిర్ గ్రామపంచాయితీకి సర్పంచ్ అయ్యింది. బాలికలు, మహిళల సాధికారత కోసం నీరూ యాదవ్ ఎన్నోపనులు చేశారు. భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి ఐక్యరాజ్యసమితి నీరూని పిలవడానికి కారణం ఇదే. పంచాయితీ పనులతో పాటు రాష్ట్ర మహిళలకు స్ఫూర్తిదాయకంగా తన పంచాయితీలోని బాలికల హాకీ జట్టును తన సొంత ఖర్చుతో సిద్ధం చేసింది. ఈ చొరవ ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అందుకే ఆమెను హాకీ సర్పంచ్ అని పిలుస్తారు. గ్రామ పంచాయితీని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చొరవ తీసుకుంది. పాత బట్టల సంచులను తయారు చేయడం ద్వారా గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించింది. గ్రామ ప్రజలలో పర్యావరణం వైపుగా ప్రోత్సహించేలా కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రతి నెలా వృద్ధులకు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకే పింఛన్ వెళ్లేందుకు శ్రీకారం చుట్టింది. పంచాయితీ స్థాయి సర్పంచ్ పాఠశాలను ప్రారంభించి, బాలికలకు కంప్యూటర్ విద్యతో పాటు డిజిటల్ అంగన్‌వాడీ, మోడ్రన్ ప్లే స్కూల్స్‌ను ఏర్పాటు చేసింది. చిన్న పల్లెటూరిలో ఉండి కూడా గొప్ప పని చేయగలమని నీరూ నిరూపించింది.

చర్చావేదిక: సుప్రియా దాస్ దత్తా



సుప్రియా

ఫార్మసీలో డిప్లమా చేసిన సుప్రియా దాస్ దత్తా త్రిపుర నివాసి. సెపాహిజాల జిల్లా పంచాయితీ అధ్యక్షురాలు. ప్రజాతీర్పులో మహిళల భాగస్వామ్యాన్ని చాటడానికి సుప్రియ బలమైన న్యాయవాదిగా ఎదుగుతున్నారు. సుప్రియ తన జిల్లాలో మహిళల కోసం చర్చా వేదికను ప్రారంభించారు. ఇక్కడ ప్రజలు జిల్లా పంచాయితీ అధికారులకు ముఖ్యమైన గ్రామీణాభివృద్ధి సమస్యలపై తమ ఆందోళనలు, ఆలోచనలను తెలియజేయవచ్చు. సుప్రియ చేస్తున్న పనులను ప్రధాని మోదీనీ ఆకట్టుకున్నాయి. పిల్లల సంరక్షణ సౌకర్యాలను ప్రోత్సహించడంలో కూడా చురుకుగా పాల్గొంటున్నది. లోతుగా పాతుకుపోయిన సామాజిక నిబంధనలను పరిష్కరించడం ద్వారా లింగ సమానత్వాన్ని సాధించవచ్చని సుప్రియ గట్టిగా నమ్ముతోంది. సమాజంలో తాను పోషించే పాత్ర ద్వారా మహిళలు పురుషులకంటే ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించాలనుకుంటోంది.

సుమంతి... సంస్కృతికి వారధి

కళ కలకాలం నిలవాలంటే ఆ కళకు రాజపోషణ ఉండాలి. రాజరికాలు అంతరించి పోయాయి. ప్రజలే పాలకులయ్యారు. ఈ మార్పుతో కళల పరిరక్షణ బాధ్యత కూడా సామాన్యుల భుజాల మీదకు చేరింది. సామాన్యులుగా మనం అందరం తలా ఒక చెయ్యి వేస్తే తప్ప మనవైన మనదేశీయ సంప్రదాయ సాంస్కృతిక కళలు మనలేవు. పొలిటికల్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన సుమంతీదేవి ఆ బాధ్యతను తన భుజాల మీదకు తీసుకుంది. తమ ‘ఉరోన్’ ఆదివాసీల చేతిలో రూపుదిద్దుకున్న కళాకృతులను, కళానైపుణ్యాన్ని పరిరక్షించే బాధ్యత చేపట్టింది.



కాన్వాస్ మీద చేతితో ఆర్ట్ వేస్తున్న సుమంతీదేవి



ఉరోన్ తెగ ఆదివాసీలు బీహార్, ఛోటా నాగ్‌పూర్‌లో ఎక్కువగా నివసిస్తుంటారు. వారి చేతిలో రూపుదిద్దుకుంటున్న పెయింటింగ్‌లు, దుస్తులు, ఇతర హస్తకళాకృతులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అయితే ఆ కళానైపుణ్యం అంతరించే దశకు చేరింది. ఏ కళ అయినా ఆ కళాకారుడికి అది ఉపాధిని ఇవ్వగలిగినంత కాలమే మనుగడలో ఉంటుంది. ఆ పని అన్నం పెట్టలేకపోయినప్పటి నుంచి క్షీణదశ మొదలైనట్లే. ఆ కళాకారులు తమ తరువాతి తరాన్ని ఉపాధికి భరోసా ఉన్న ఇతర పనుల్లోకి పంపిస్తారు. అలా తమ వాళ్లు కొత్త తరాలను మైదానాల్లోకి పంపిస్తున్నారు. ఆ వలసలతో ఆదివాసీ గ్రామాలు బలహీనపడిపోతున్నాయి. ఆ కొత్త తరానికి వాళ్లు వెళ్లిన చోట తమ కళను కొనసాగించే అవకాశాల్లేకపోవడంతో అది వృద్ధతరంతోనే అంతరిస్తోంది. అలాంటి సమయంలో సుమంతీదేవి ఆ వలసలను నిలువరించడం, కళను పరిరక్షించడం అనే రెండు ప్రధాన బాధ్యతలను తన భుజాలకెత్తుకుంది. ‘‘కుటుంబ పోషణ కోసం మగవాళ్లు ఇతర పనులకు వెళ్లడాన్ని ఆపలేం. వృద్ధుల ద్వారా మహిళలకు శిక్షణ ఇప్పించగలిగితే నా వంతుగా మరో తరం వరకు మా కళలను బతికించగలుగుతాను. అందుకోసమే మహిళలను సంఘటితం చేశాను. గోడల మీద బొమ్మలు వేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. వాటినే కాన్వాస్ మీద వేయడంలో శిక్షణ ఇప్పించాను. హ్యాండ్ మేడ్ పేపర్ మీద పెయింటింగ్స్, మడ్ పెయింటింగ్స్, దుస్తులు నేయడంలో, వెదురు కళాకృతులు తయారు చేయడంలో కూడా వారికి చెయ్యి తిరిగింది. వాటన్నింటినీ మా ఆదివాసీ సమాజం నుంచి నాగరక సమాజంలోకి ప్రవేశపెట్టడం ఒక సవాల్ అయింది. పదిహేనేళ్ల కిందట భువనేశ్వర్‌లో జరిగిన ఇందిరా గాంధీ రాష్ట్రీయ మానవ్ సంగ్రహాలయలో స్టాల్ పెట్టాను. అప్పుడు కేవలం ఒక్క పెయింటింగ్ మాత్రమే అమ్మగలిగాను. కానీ ఆ ప్రదర్శన నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మార్కెట్ ట్రెండ్స్ తెలిశాయి. నాగరక సమాజం మా ఆదివాసీ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతోంది. కానీ వాటి అసలుకీ నకిలీకీ తేడా తెలుసుకోవడంలో వెనుకబడుతోందని గ్రహించాను. అప్పటి నుంచి స్టాల్‌లో ఉత్పత్తుల అమ్మకానికి మాత్రమే పరిమితం కాకుండా ఆదివాసీ హస్తకళాకృతుల గురించి వివరించడం మొదలు పెట్టాను. మా హస్తకళాకృతులను కశ్మీర్ నుంచి కేరళ వరకు విస్తరించగలిగాను’’ అని చెప్పింది సుమంతీదేవి.

గోడల మీద నుంచి కాన్వాస్‌కు



ఉరోన్ కళాకృతుల తయారీలో మట్టిదే కీలకమైన పాత్ర. వస్త్రం, మట్టి, చేతివేళ్లు... ఉంటే చాలు. గొప్ప కళాఖండం సిద్ధమైనట్లే. మట్టిలో షేడ్స్‌కి మా సృజనాత్మకత జోడిస్తాం. సాధారణంగా గోధుమ వర్ణం, ఎరుపు రంగు మట్టి లభిస్తుంది. నల్లమట్టి కోసం అడవుల్లో నేలను లోతుగా తవ్వి సేకరిస్తాం. తెలుపు రంగుకు సున్నాన్ని, ఆకు పచ్చ రంగును ఆకుల నుంచి సేకరిస్తాం. ఇది తరతరాలుగా వస్తున్న ప్రక్రియ. గోడల మీద నుంచి మా బొమ్మలను కాన్వాస్ మీదకు చేర్చే క్రమంలో నేను జిగురును జత చేశాను. మధుబని కళను కూడా మాతో కలుపుకున్నాం. ‘వాక్ విత్ మి’ పేరుతో సంఘటితమైన ఆదివాసీ మహిళలం మా సంప్రదాయాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం. ‘ఏవమ్ కళ’ పేరుతో మా కళలన్నింటికీ అక్షరరూపమిచ్చాను. మరొక్క తరం రక్షించగలిగితే చాలనుకున్నాను. కానీ అక్షరరూపం ఇవ్వడం ద్వారా ఇది శాశ్వతంగా ఉండిపోతుందనే నమ్మకం కలుగుతోంది.

– సుమంతీదేవి,
సంస్కృతి పరిరక్షకురాలు

సామాన్యురాలు... పార్లమెంట్ అభ్యర్థి...

‘మా ప్రాంతంలోని పేదల కష్టాలే నన్ను పెద్దలతో తలపడేలా చేస్తున్నాయి’ అంటోంది దాసరి భారతి. కోవిడ్ సమయంలో నర్స్‌గా పని చేసి ఎందరికో సేవ చేసిన భారతి బాధితులకు న్యాయం జరగాలంటే చట్టం తెలియాలని ఎల్.ఎల్.బి. చదువుతోంది. జోగులాంబ జిల్లా మేడికొండకు చెందిన 26 ఏళ్ల ఈ దళిత యువతి నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి అధికారికంగా పోటీలో ఉంది. ‘జనం కోసం గొంతెత్తకుండా ఉండలేకపోతున్నాను’ అంటున్న భారతి పరిచయం.



దాసరి భారతి

‘నేను హైదరాబాద్ అపోలో నర్సింగ్ కాలేజ్‌లో బీఎస్సీ నర్సింగ్ చదివాను. ఎమ్మెస్సీ నర్సింగ్ చేయాలని ఉండేది. నాకు మెరిట్ ఉన్నా సీట్ వచ్చినా కేవలం డబ్బుల్లేక ఒక సంవత్సరం ఆగాల్సి వచ్చింది. ఆ తర్వాత పాండిచ్చేరి జిప్‌మర్‌లో ఎమ్మెస్సీ నర్సింగ్ చదివాను. నాలా ఎందరో పేదింటి, దళిత, వెనుకబడ్డ వర్గాల యువతీ యువకులు చదువు కోసం బాధలు పడుతున్నారు. వారిని పట్టించుకునేది ఎవరు? వారి కోసం గొంతెత్తాలని ఎన్నికలలో నిలుచున్నాను’ అంటుంది దాసరి భారతి.

26 ఏళ్ల ఈ దళిత అమ్మాయి నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ‘విడుదలై చిరుతైగల్ కట్చి’ (వి.సి.కె.) పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనుంది. ఆమెకు ‘టీవీ రిమోట్’ను ఎన్నికల చిహ్నంగా కేటాయించారు. ‘పాండిచ్చేరిలో చదివేటప్పుడు వి.సి.కె. పార్టీ కార్యక్రమాలు గమనించాను. అది దళితుల అభ్యున్నతి కోసం పని చేస్తున్న పార్టీ. ఒక దళిత యువతిగా నేను ఆ పార్టీతో కలిసి పని చేయాలని భావించాను’ అని తెలిపింది భారతి.

జోగులాంబ జిల్లా మేడికొండ భారతి ఊరు. తండ్రి దాసరి రాములు కౌలు రైతు. తల్లి పద్మావతి గృహిణి. ‘మా నాన్న చనిపోయాడు. మేము నలుగురం పిల్లలం. చదువుకోవడానికి చాలా బాధలు పడాల్సి వచ్చింది’ అంది భారతి.

‘నా బాల్యం నుంచి చూస్తున్నాను. మా ఊరికి ఇప్పటికీ సరైన రోడ్డు లేదు. రోగాలొచ్చినా ఏమొచ్చినా చాలా కష్టం. ఒక నిండు చూలాలు అంబులెన్స్ ఎక్కి రోడ్డు గతుకుల వల్ల దారిలోనే డెలివరీ అయ్యి చనిపోయిన సంఘటన కళ్లారా చూశాను. నిధులన్నీ ఏమవుతున్నాయి? ఎం.ఎల్.ఏలు, ఎం.పి.లు, మంత్రులు ఏం చేస్తుంటారు? ఎందుకు పరిస్థితులు మార్చరు? కృష్ణ, తుంగభద్రల తీరంలో ఉండేదే మా ప్రాంతం. కాని పశువులు తాగడానికి కూడా చుక్క నీరు ఇప్పుడు లేదు. రాజకీయ చైతన్యం ఉన్న యువత ఈ పరిస్థితిని ప్రశ్నించే వరకు మార్పు రాదు. అందుకే నేను ఎన్నికలలో నిలుచున్నాను’ అంది భారతి.

నాగర్ కర్నూల్‌లో పార్లమెంట్ స్థానానికి ప్రవీణ్ కుమార్ (బి.ఆర్.ఎస్), మల్లు రవి (కాంగ్రెస్), భరత్ కుమార్ (బి.జె.పి) పోటీలో ఉన్నారు. భారతి దగ్గర మందీ మార్బలం లేకపోయినా కేవలం తన ధర్మాగ్రహంతో వీరితో తలపడనుంది.

‘కోవిడ్ కాలంలో టిమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేశాను. పేదలు సరైన వైద్యం అందక, కార్పొరేట్ ఆస్పత్రులకు పోలేక మరణించారు. నాకు ముందు నుంచి కూడా విద్యార్థి రాజకీయాలన్నా, ఉద్యమాలన్నా ఇష్టం. నా విస్తృతి పెరగాలంటే నర్స్‌గా ఉంటే సరిపోదనిపించింది. అందుకే ఇప్పుడు ఎల్.ఎల్.బి. చదువుతున్నాను. నేను ఎలక్షన్లలో పోటీ చేస్తున్నానని తెలిసి మావాళ్లంతా సంతోషపడుతున్నారు. నాలాంటి వాళ్లు గెలిచి పేదలకు మేలు జరిగినప్పుడే కదా నిజమైన సంతోషం’ అని ముగించింది భారతి.

బ్యూటిప్స్ / హెయిర్ కేర్

జుట్టు రాలకుండా జాగ్రత్త ఇలా...

జుట్టు రాలడానికి అనేక కారణాలుంటాయి. అయితే మనం మామూలుగా ఎలాంటి వైద్యసహాయం లేకుండా నివారించగల సమస్యల్లో ప్రొటీన్ల లోపం, శారీరక ఒత్తిడి ముఖ్యమైనవి. ఇలాంటి సమస్యలను మనకు మనంగా కొన్ని జాగ్రత్తలతో నివారించవచ్చు. అలాంటి సమస్యలూ... వాటిని అరికట్టగలిగే మార్గాలూ...

ప్రొటీన్ లోపాల వల్ల: చాలామందిలో జుట్టు రాలిపోవడానికి ప్రధాన కారణం... వారు తగినంతగా ప్రొటీన్ తో కూడిన ఆహారం తీసుకోకపోవడమే. ఈ ప్రొటీన్లే ప్రధానంగా జుట్టు పెరుగుదలకూ, దెబ్బతిన్న జుట్టు రిపేర్లకూ దోహదపడతాయి.



అరికట్టడం ఇలా: ఇలా జుట్టు ఎక్కువగా రాలుతున్నవారు ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. చేపలు, గుడ్లు, మాంసాహారంలో పుష్కలంగా ప్రొటీన్లు ఉంటాయి. శాకాహారులైతే ఆకుకూరలు, గ్రీన్ పీస్, నట్స్, శనగలు, పప్పుధాన్యాలు, సోయా తీసుకోవాలి. వీటిలో ప్రొటీన్లు చాలా ఎక్కువ.

శారీరక ఒత్తిడి: మనం నిత్యం ఎదుర్కొనే శారీరక ఒత్తిడులు మనలో భౌతికంగా మార్పులు తెచ్చి, జుట్టు రాలిపోయేలా చేస్తాయి. ఫలితంగా మాడుపైన జుట్టు పలచబడినట్లుగా కనిపిస్తుంది. ఈ దశలో రాలిన జుట్టు చివరి భాగంలోని తెల్లని పదార్థం పచ్చి పచ్చిగా కాకుండా, బాగా ఎండిపోయినట్లుగా ఉండటాన్ని మనం గమనించవచ్చు.

నివారణ ఇది: ఇలా రాలిపోయిన జుట్టు సాధారణంగా ఒత్తిడి తొలిగాక మళ్లీ మొలుస్తుంది. అందుకే ఒత్తిడి తొలగించుకోడానికి రిలాక్సేషన్ టెక్నిక్స్ అవలంబించడం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం, యోగా వంటివి ఉపకరిస్తాయి.



మెయిన్ 'డ్రా'కు సహజ అర్హత

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ100 టోర్నీ స్ప్రింగ్స్ ఓపెన్ టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి సహజ యామలపల్లి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరుగుతున్న ఈ టోర్నీలో సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో ప్రపంచ 309వ ర్యాంకర్ సహజ 6-4, 6-2తో క్రిస్టినా రోస్కా (అమెరికా)పై గెలిచింది. హైదరాబాద్‌కే చెందిన శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయింది. చివరి రౌండ్‌లో రష్మిక 4-6, 4-6తో విక్టోరియా (అమెరికా) చేతిలో ఓడిపోయింది.

సిరీస్ విజయంపై భారత్ గురి



వరుసగా మూడో విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో భారత మహిళల టి20 జట్టు ఉంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు సిల్హెట్‌లో బంగ్లాదేశ్‌తో హర్మన్‌ప్రీత్ బృందం తలపడనుంది. తొలి మ్యాచ్‌లో 44 పరుగులతో, రెండో మ్యాచ్‌లో 19 పరుగులతో భారత్ గెలిచింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం. 3:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రసారం చేస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌లోనే టి20 వరల్డ్‌కప్ జరగనున్న నేపథ్యంలో ఈ సిరీస్ భారత జట్టుకు సన్నాహకంగా ఉపయోగపడనుంది.

బోపన్న జోడీకి నిరాశ



మాడ్రిడ్: టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–7 (4/7), 5–7తో సెబాస్టియన్ కోర్డా (అమెరికా)–జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయి, రెండో సెట్‌లో ఒకసారి తమ సర్వీస్‌ను చేజార్చుకుంది. బోపన్న–ఎబ్డెన్ జంటకు 16,320 యూరోలు (రూ. 14 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

హార్దిక్ పాండ్యాపై రూ. 24 లక్షలు జరిమానా



లక్నో: ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 24 లక్షలు జరిమానా విధించింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై జట్టు స్లో ఓవర్‌రేట్ నమోదు చేసింది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ముంబై స్లో ఓవర్‌రేట్ నమోదు చేయడం ఇది రెండోసారి కావడంతో జరిమానా మొత్తాన్ని రెట్టింపు చేశారు. తొలిసారి ముంబై కెప్టెన్‌పై రూ. 12 లక్షలు పెనాల్టీ వేశారు. రెండోసారి హార్దిక్‌తోపాటు లక్నోతో మ్యాచ్‌లో ఆడిన ముంబై తుది జట్టులోని సభ్యులపై రూ. 6 లక్షల చొప్పున జరిమానా వేయడం గమనార్హం.

అర్జున్ గేమ్ 'డ్రా'



మాల్మో (స్వీడన్): టెపె సెజెమస్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ మూడో 'డ్రా' నమోదు చేసుకున్నాడు. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో బుధవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 39 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ తర్వాత అర్జున్ 3.5 పాయింట్లతో స్విడ్లెర్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు.

'కింగ్స్' పోరులో పంజాబ్‌దే గెలుపు



హర్‌ప్రీత్ బ్రార్‌కు సహచరుల అభినందన

డిఫెండింగ్ చాంపియన్ చెన్నైకు ఐదో ఓటమి

- 7 వికెట్లతో నెగ్గిన పంజాబ్ కింగ్స్
- రాణించిన బ్రార్, చహర్

చెన్నై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ టోర్నీలో మరో సంచలనం సృష్టించింది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టును వారి సొంతగడ్డపైనే ఓడించింది. గత శుక్రవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై 262 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ప్రపంచ రికార్డు నెలకొల్పిన పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌లోనూ ఆకట్టుకుంది. బుధవారం ఎంఎ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్లతో గెలిచింది. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ స్యామ్ కరన్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 162 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (48 బంతుల్లో 62; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో రాణించాడు. పంజాబ్ కింగ్స్ స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్ (2/17), రాహుల్ చహర్ (2/16) చెన్నై జట్టును కట్టడి చేశారు. అనంతరం పంజాబ్ కింగ్స్ 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసి విజయం సాధించింది. బెయిర్‌స్టో (30 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్), రిలీ రోసో (23 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి రెండో వికెట్‌కు 37 బంతుల్లో 64 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక శశాంక్ సింగ్ (26 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), స్యామ్ కరన్ (20 బంతుల్లో 26 నాటౌట్; 3 ఫోర్లు) పంజాబ్‌ను విజయతీరాలకు చేర్చారు. గత మూడు సీజన్‌లలో చెన్నైపై పంజాబ్ కింగ్స్‌కిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. 2022లో చెన్నైతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన పంజాబ్ 2023లో చెన్నైలోనే జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో గెలిచింది.

కట్టడి చేసిన బ్రార్, చహర్

చెన్నైకు ఓపెనర్లు రుతురాజ్, రహానే శుభారంభాన్నిచ్చారు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. దాంతో పవర్‌ప్లే ముగిసేసరికి చెన్నై వికెట్ నష్టపోకుండా 55 పరుగులు చేసింది. పవర్‌ప్లే ముగిశాక చెన్నై ఇన్నింగ్స్ తడబడింది. పంజాబ్ కింగ్స్ స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్, రాహుల్ చహర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్లో బ్రార్ మూడు బంతుల తేడాలో రహానే, శివమ్ దూబే (0)లను పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత పదో ఓవర్లో జడేజాను చహర్ అవుట్ చేశాడు. దాంతో చెన్నై జట్టు 64/0 నుంచి 70/3తో కష్టాల్లో పడింది. బ్రార్, చహర్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడ్డ చెన్నై జట్టు బ్యాటర్లు వరుసగా ఎనిమిది ఓవర్లపాటు ఒక్క బౌండరీ కూడా బాదలేకపోయారు. రబడ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్ రెండో బంతికి రిజ్వీ బౌండరీ కొట్టి ఆ తర్వాతి బంతికే అవుటయ్యాడు. స్యామ్ కరన్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్ రెండో బంతిని బౌండరీ దాటించిన రుతురాజ్, మూడో బంతికి సిక్స్ కొట్టి 44 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇదే ఓవర్ చివరి బంతిని రుతురాజ్ సిక్స్‌గా మలచడంతో ఈ ఓవర్లో చెన్నైకి 20 పరుగులు వచ్చాయి. ఇన్నింగ్స్ 18వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ లయ తప్పి మూడు వైడ్‌లు వేసినా రుతురాజ్‌ను బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లోనూ రెండు వైడ్‌లతో కలిపి ఎనిమిది బంతులు వేశాడు. ఈ ఓవర్లో ధోని ఒక ఫోర్, ఒక సిక్స్ కొట్టి చివరి బంతికి రనౌట్ అయ్యాడు. పంజాబ్ స్పిన్నర్లు బ్రార్, చహర్ ఒక్క బౌండరీ కూడా ఇవ్వకపోవడం విశేషం.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) రోసో (బి) బ్రార్ 29; రుతురాజ్ (బి) అర్ష్‌దీప్ 62; దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రార్ 0; జడేజా (ఎల్బీడబ్ల్యూ) (బి) చహర్ 2; రిజ్వీ (సి) హర్షల్ (బి) రబడ 21; మొయిన్ అలీ (బి) చహర్ 15; ధోని (రనౌట్) 14; మిచెల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1–64, 2–65, 3–70, 4–107, 5–145, 6–147, 7–162. **బౌలింగ్:** రబడ 4–0–23–1, అర్ష్‌దీప్ 4–0–52–1, స్యామ్ కరన్ 3–0–37–0, హర్‌ప్రీత్ బ్రార్ 4–0–17–2, రాహుల్ చహర్ 4–0–16–2, హర్షల్ 1–0–12–0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) రుతురాజ్ (బి) గ్లీసన్ 13; బెయిర్‌స్టో (సి) ధోని (బి) దూబే 46; రోసో (బి) శార్దుల్ 43; శశాంక్ (నాటౌట్) 25; స్యామ్ కరన్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (17.5 ఓవర్లలో 3 వికెట్లకు) 163; వికెట్ల పతనం:** 1–19, 2–83, 3–113. **బౌలింగ్:** దీపక్ చహర్ 0.2–0–4–0, శార్దుల్ 3.4–0–48–1, గ్లీసన్ 3.5–0–30–1, ముస్తఫిజుర్ 4–1–22–0, జడేజా 3–0–22–0, మొయిన్ అలీ 2–0–22–0, శివమ్ దూబే 1–0–14–1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	9	8	1	16	0.694
కోల్‌కతా	9	6	3	12	1.096
లక్నో	10	6	4	12	0.094
చెన్నై	10	5	5	10	0.627
హైదరాబాద్	9	5	4	10	0.075
ఢిల్లీ	11	5	6	10	-0.442
పంజాబ్	10	4	6	8	-0.062
గుజరాత్	10	4	6	8	-1.113
ముంబై	10	3	7	6	-0.272
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × రాజస్తాన్
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

చైనాతో భారత్ 'ఢీ'

- క్వార్టర్ ఫైనల్లో టీమిండియాకు క్లిష్టమైన ప్రత్యర్థి
- చివరి మ్యాచ్‌లో ఇండోనేసియా చేతిలో ఓడిన భారత్



ప్రణయ్

చెంగ్డూ (చైనా): ప్రతిష్టాత్మక థామస్ కప్ పురుషుల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు సెమీఫైనల్ బెర్త్ కోసం 10 సార్లు చాంపియన్ చైనాతో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. బుధవారం జరిగిన గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1–4తో 14 సార్లు చాంపియన్ ఇండోనేసియా చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 61 నిమిషాల్లో 13–21, 21–12, 21–12తో ప్రపంచ ఏడో ర్యాంకర్ ఆంథోనీ సినిసుక జిన్‌టింగ్‌ను ఓడించాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 77 నిమిషాల్లో 22–24, 24–22, 19–21తో షోహిబుల్ ఫిక్రి–మౌలానా బగస్ జంట చేతిలో ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 65 నిమిషాల్లో 18–21, 21–16, 17–21తో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీ చేతిలో ఓటమి పాలయ్యాడు. నాలుగో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల–సాయిప్రతీక్ జోడీ 20–22, 11–21తో లియో కార్నాండో–డేనియల్ మార్టిన్ జంట చేతిలో పరాజయం పాలైంది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో శ్రీకాంత్ 21–19, 22–24, 14–21తో ద్వి వర్దాయో చేతిలో ఓడిపోయాడు. గ్రూప్ 'సి'లో ఇండోనేసియా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి అగ్రస్థానంలో నిలువగా... భారత్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో చైనాతో భారత్; మలేసియాతో జపాన్; కొరియాతో ఇండోనేసియా; చైనీస్ తైపీతో డెన్మార్క్ తలపడతాయి. మరోవైపు మహిళల టీమ్ టోర్నీ ఉబెర్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లో నేడు జపాన్‌తో భారత్; డెన్మార్క్‌తో చైనా... శుక్రవారం ఇండోనేసియాతో థాయ్‌లాండ్; చైనీస్ తైపీతో కొరియా పోటీపడతాయి.

స్మిత్‌కు దక్కని చోటు

టి20 ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన



మెల్‌బోర్న్: కెరీర్‌లో ఐదో టి20 ప్రపంచకప్ ఆడాలని ఆశించిన ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ స్టీవ్ స్మిత్‌కు నిరాశ ఎదురైంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టును బుధవారం ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ సారథ్యం వహిస్తాడు. గత 14 ఏళ్లలో ప్రపంచకప్ జట్టులో స్మిత్‌కు చోటు దక్కకపోవడం ఇదే తొలిసారి. 2021లో టి20 ప్రపంచకప్‌ను తొలిసారి సాధించిన ఆస్ట్రేలియా జట్టులో స్మిత్ సభ్యుడిగా ఉన్నాడు. 34 ఏళ్ల స్మిత్ ఇప్పటివరకు ఆసీస్ తరఫున 67 టి20 మ్యాచ్‌లు ఆడి 125.45 స్ట్రయిక్‌రేట్‌తో 1094 పరుగులు సాధించాడు.

ఆస్ట్రేలియా జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), వార్నర్, ట్రావిస్ హెడ్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, నాథన్ ఎలిస్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ వేడ్, కమిన్స్, హేజల్‌వుడ్, స్టార్క్, ఆష్టన్ అగర్, ఆడమ్ జంపా.

ఓటమితో ముగించిన నాదల్



మాడ్రిడ్: స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ చివరిసారి బరిలోకి దిగిన మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయాడు. ప్రపంచ 31వ ర్యాంకర్ జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో నాదల్ 5–7, 4–6తో ఓడిపోయాడు. నాదల్ 2005, 2010, 2013, 2014, 2017లలో మాడ్రిడ్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. తుంటి గాయంతో బాధపడుతున్న 37 ఏళ్ల నాదల్ ఈ ఏడాది కేవలం మూడు టోర్నీల్లో మాత్రమే పాల్గొన్నాడు.

సినిమా



అల్లరి మాత్రం వదలను

\- 'అల్లరి' నరేశ్

''కంటెంట్ బాగుంటే మన సినిమా అయినా మలయాళం సినిమా అయినా ప్రేక్షకులు చూస్తారు. కోవిడ్ సమయంలో కొంతమంది ప్రేక్షకులు థ్రిల్లర్, హారర్ వంటి సినిమాలు చూసి ఉండొచ్చు. వారికి నచ్చి ఉండవచ్చు. ఇటీవల కాలంలో మన తరహా కామెడీ సినిమాలు తక్కువగా వచ్చాయి. అయితే అలా వచ్చిన 'సామజ వరగమన', 'డీజే టిల్లు 2' సినిమాలు సక్సెస్ అయ్యాయి. ఇప్పుడు మా సినిమా 'ఆ ఒక్కటీ అడక్కు' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని 'అల్లరి' నరేశ్ అన్నారు. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో 'అల్లరి' నరేశ్ పంచుకున్న విశేషాలు.

- 'ఆ ఒక్కటీ అడక్కు'లో ఓ మ్యారేజ్ బ్యూరోలో వర్క్ చేసే గణ అనే పాత్ర చేశాను. లైఫ్‌లో సెటిలయ్యాక గణ పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. ఈలోపు ఏజ్ బార్ అయిపోతుంది. పైగా మ్యారేజ్ బ్యూరోలో వర్క్ చేస్తున్న కారణంగా అందరూ అతన్ని నీ పెళ్లెప్పుడూ అని అడుగుతుంటారు. ఈ క్రమంలో వచ్చే హ్యూమర్, హీరో ఫ్రస్టేషన్ ఆడియన్స్‌కు నవ్వు తెప్పిస్తాయి. నేను చేసిన కొన్ని కామెడీ సినిమాలు సరిగా ఆడలేదు. కారణం విశ్లేషించుకుంటే కథలో కామెడీ ఉండాలి కానీ, కామెడీ కోసం కథ ఉండకూడదని తెలుసుకున్నాను. ఆ పొరపాటు ఈ సినిమాలో చేయలేదు. 'ఆ ఒక్కటీ అడక్కు'లో సందర్భానుసారంగానే కామెడీ వస్తుంది.
- ఈ చిత్రంలో కామెడీ మాత్రమే కాదు.. ఎమోషనల్, సందేశాత్మక అంశాలు కూడా ఉన్నాయి. పెళ్లి పేరుతో ఎలాంటి మోసాలు జరుగుతున్నాయి? మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మ్యారేజ్ బ్యూరోస్‌లో అమ్మాయి.. అబ్బాయిల ఫేక్ ప్రొఫైల్స్, పెళ్లిని వ్యాపారంగా చూడటం వంటి అంశాలను ఈ సినిమాలో చూపించాం. మంచి కథతో మల్లి బాగా డైరెక్ట్ చేశారు.
- నాన్న (ఈవీవీ సత్యనారాయణ) గారి 'ఆ ఒక్కటీ అడక్కు' (1992) సినిమాకు, నేను హీరోగా చేసిన ఇప్పటి 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాకు సంబంధం లేదు. ఆ సినిమాలో పెళ్లి జరిగినా లైఫ్‌లో సెటిల్ అవ్వాలనుకోని పాత్ర హీరోది. కానీ ఈ సినిమాలో సెటిలయ్యాకే పెళ్లి చేసుకోవాలనుకునే పాత్ర హీరోది. ఇక నాన్నగారి బ్యానర్‌లో సినిమాలు నిర్మించాలని ఉంది. 'ఎవడి గోల వాడిది' తరహా కథ కోసం చూస్తున్నాను. కామెడీ కథలు రాసే రైటర్స్ తగ్గిపోయారు. దేశంలో హిట్టైన అన్ని సినిమాల్లోని అంశాలను స్పూఫ్‌గా తీసుకుని 'సుడిగాడు 2' సినిమాకి కథ రాస్తున్నాను. నా కుమార్తె సెకండ్ క్లాస్ చదువుతోంది. కాసేపు డాక్టర్ అంటుంది... కాసేపు పైలెట్ అంటుంది. షార్ట్ స్టోరీస్ కూడా రాస్తోంది. భవిష్యత్‌లో తను డైరెక్టర్ అయితే బాగుంటుందని అనుకుంటున్నాను.
- వరుసగా నేను సీరియస్ రోల్స్ చేసిన 'నాంది', 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం', 'ఉగ్రం', 'నా సామిరంగ' సినిమాలు విడుదలయ్యాయి. ఇప్పుడు కామెడీ సినిమా వస్తోంది. ఇక కామెడీ, సీరియస్ తరహా సినిమాలను బ్యాలెన్స్ చేద్దామనుకుంటున్నాను. 'అల్లరి' (కామెడీ సినిమాలు) మాత్రం వదలను. అలాగే వెంకటేశ్‌గారితో ఓ మల్టీస్టారర్ మూవీ చేయాలని ఉంది. అమితాబ్ బచ్చన్‌గారితో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది.
- ఈ ఏడాది నేను నటించిన నాలుగు సినిమాలు విడుదలవుతాయి. 'నా సామిరంగ' (ఇందులో నరేశ్ ఓ లీడ్ రోల్‌లో నటించారు) చిత్రం విడుదలైంది. ఇప్పుడు 'ఆ ఒక్కటీ అడక్కు' రిలీజ్ అవుతోంది. నేను చేస్తున్న 'బచ్చలమల్లి' మూవీ ఆగస్టులో, డిసెంబరులో మరో సినిమా విడుదల కావొచ్చు. నేను హీరోగా కమిటైన రెండు కొత్త చిత్రాల ప్రకటన త్వరలో వస్తుంది.



అల్లు అర్జున్

దేశం దద్దరిల్లే...

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప: ది రూల్'. ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతదర్శకుడు. ఈ చిత్రం నుంచి తొలి లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'పుష్ప.. పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్...., నువ్వు గడ్డం అట్టా సవరిస్తుంటే దేశం దద్దరిల్లే, నువ్వు భుజమే ఎత్తి నడిచొస్తుంటే భూమే బద్దలయ్యే...' అంటూ ఈ పాట సాగుతుంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటకి విజయ్ పొల్లంకి, శ్రేష్ఠి వర్మ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటను తెలుగుతో పాటు హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ భాషల్లోనూ రిలీజ్ చేశారు. ''పుష్ప క్యారెక్టరైజేషన్, 'పుష్ప: ది రూల్'ను ఎలివేట్ చేసే విధంగా ఈ సాంగ్ ఉంటుంది'' అన్నారు మేకర్స్. ఆగస్టు 15న 'పుష్ప: ది రూల్' ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.



కొరటాల శివ, రాజమౌళి, సత్యదేవ్, అనిల్ రావిపూడి, గోపీచంద్, కృష్ణ కొమ్మాలపాటి, గోపాలకృష్ణ

కృష్ణమ్మతో సత్యదేవ్ స్టార్ అవుతాడు

\- రాజమౌళి

''చిన్న చిన్న హావభావాలతో అన్ని రకాల నటనని చూపించగల నటుల్లో సత్యదేవ్ కూడా ఒకడు. తను మంచి నటుడు అని ఇటు ఇండస్ట్రీకి అటు ప్రేక్షకులకు తెలుసు. కానీ, ఒక్క సినిమా సడెన్‌గా స్టార్‌ని చేస్తుంది.. నాకు తెలిసి 'కృష్ణమ్మ' మూవీ తనని స్టార్ చేస్తుందనుకుంటున్నాను'' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. సత్యదేవ్, అతీరా రాజ్ జంటగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. డైరెక్టర్ కొరటాల శివ సమర్పణలో అరుణాచల క్రియేషన్స్‌పై కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన 'కృష్ణమ్మ' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన **రాజమౌళి మాట్లాడుతూ–** ''కృష్ణమ్మ' టైటిల్ నాతో పాటు అందర్నీ ఆకర్షించిందంటే కారణం కొరటాల శివగారు సమర్పించడమే. ఆయన సమర్పిస్తున్న తొలి సినిమాతోనే పెద్ద విజయం అందుకోవాలని కోరుకుంటున్నాను. ఈ మూవీ టీజర్, ట్రైలర్ చూస్తే సినిమాని కచ్చితంగా థియేటర్లోనే చూడాలనిపించేలా తీశాడు గోపాలకృష్ణ. కాలభైరవని చూస్తుంటే గర్వంగా ఉంది. 'కృష్ణమ్మ' టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు.

కొరటాల శివ మాట్లాడుతూ– ''గోపాల్ చెప్పిన 'కృష్ణమ్మ' కథ నచ్చడంతో నేను కూడా భాగస్వామ్యం అవుతానని అడిగాను.. అంతే కానీ, ఈ కథలో నేను కల్పించుకోలేదు. నేను చూసిన మంచి నటుల్లో సత్యదేవ్ ఒకడు.. మంచి ప్రతిభ ఉంది. ఈ మూవీతో తన కెరీర్ మరో మెట్టు పైకి ఎక్కుతుందని నమ్ముతున్నాను. అలాగే నిర్మాత కృష్ణగారికి పెద్ద విజయం రావాలి'' అన్నారు. ''కొరటాల శివగారు తీసే సినిమాలు ఎలా ఉంటాయో మనకు తెలిసిందే. ఆయన సమర్పిస్తున్న 'కృష్ణమ్మ' కూడా అద్భుతంగా ఉంటుంది'' అన్నారు గోపీచంద్ మలినేని. ''సత్యదేవ్ హీరోగా బిజీగా ఉన్నా 'సరిలేరు నీకెవ్వరు'లో ఓ చిన్న పాత్ర చేశాడు.. ఎందుకంటే సినిమా అంటే అంత గౌరవం. ఈ వేసవిలో 'కృష్ణమ్మ' సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. **సత్యదేవ్ మాట్లాడుతూ–** ''రాజమౌళి, కొరటాల శివ, గోపీచంద్ మలినేని, అనిల్ రావిపూడి గార్లు ఉన్న ఈ వేదికపై నేను మాట్లాడటం ప్రపంచంలోనే ఖరీదైన వేదికగా భావిస్తున్నాను. 'కృష్ణమ్మ' విడుదల తర్వాత నేను బయట ఎక్కడ కనిపించినా ప్రేక్షకులు ఈ మూవీ గురించే నాతో మాట్లాడతారు.. అందుకు నాదీ గ్యారంటీ. క్రికెట్‌కి సచిన్ టెండూల్కర్ గారు ఎలాగో.. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి రాజమౌళి సార్ అలాగే. తెలుగు సినిమాని (ఆర్ఆర్ఆర్) అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి.. ఆస్కార్ తీసుకొచ్చారు'' అన్నారు. **వీవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ–** ''కృష్ణమ్మ' కథ నచ్చడంతో మమ్మల్ని ప్రోత్సహించిన కొరటాలశివగారికి థ్యాంక్స్. మా ట్రైలర్ నచ్చిన వారు మూవీని థియేటర్లో చూడండి'' అన్నారు.



లారా దత్తా

కైకేయి.. శూర్పణఖ... ఏదైనా ఓకే

''రామాయణ్' లాంటి ప్రతిష్టాత్మక చిత్రంలో నటించాలనే ఆసక్తి ఎవరికి మాత్రం ఉండదు? ఆ సినిమాలో నటించమని ఇప్పటివరకూ ఎవరూ నన్ను సంప్రదించలేదు. ఆ అవకాశం వస్తే మాత్రం నటించేందుకు నేను సిద్ధం'' అన్నారు బాలీవుడ్ బ్యూటీ లారా దత్తా. 'దంగల్' ఫేమ్ నితీష్ తివారి దర్శకత్వంలో హిందీలో 'రామాయణ్' మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. మూడు భాగాలుగా ఈ చిత్రం రూపొందుతోందని సమాచారం. కాగా ఈ చిత్రంలోని నటీనటులపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. కానీ, రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారని లీక్ అయిన ఒక ఫొటో స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో కైకేయి పాత్రలో లారా దత్తా నటించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై తాజాగా స్పందించారు లారా దత్తా. ''రామాయణ్'లో నేను కైకేయి పాత్ర చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అవి విన్నప్పుడు సంతోషంగానే ఉంది. ఎందుకంటే.. అంత గొప్ప సినిమాలో నటించాలని ఎవరు కోరుకోరు? ఒకవేళ ఈ మూవీలో నాకు అవకాశం వస్తే కైకేయి పాత్రే కాదు.. శూర్పణఖ, మండోదరి లాంటి క్యారెక్టర్స్ చేయడానికి కూడా నేను రెడీ. ఈ మూడు పాత్రల్లో దేనికైనా నేను చక్కగా సరిపోతాను'' అంటూ తన మనసులోని మాటని బయటపెట్టారు లారా దత్తా. మరి... ఈ మూడు పాత్రల్లో ఏదో ఒకటి చేసే చాన్స్ లారా దత్తాకి వస్తుందా? అనేది చూడాలి.



సుకృతి వేణి

పర్యావరణ పరిరక్షణ కోసం...

ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, శేష సింధు రావు నిర్మించారు. సుకుమార్ భార్య తబిత సమర్పకురాలిగా వ్యవహరించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''పర్యావరణ పరిరక్షణే ప్రధానోద్దేశంగా రూపొందిన సందేశాత్మక చిత్రం 'గాంధీ తాత చెట్టు'. ఈ చిత్రం ఇప్పటికే పలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై, అవార్డులు గెలుచుకుంది. సుకృతి వేణి నటనకుగాను ప్రశంసలతో పాటు అవార్డు కూడా వచ్చింది'' అన్నారు.

సినిమా బాగుందని క్లాప్స్ కొడతారు

\- సుహాస్



అర్జున్, మణికంఠ, సుహాస్

సుహాస్ హీరోగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'ప్రసన్న వదనం'. ఈ చిత్రంలో రాశీ సింగ్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లు. వైకే అర్జున్ దర్శకత్వంలో జీఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సమావేశంలో సుహాస్ మాట్లాడుతూ– ''ఫస్ట్ కాపీ చూశాను. బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ ఇది. ఏ మాత్రం సందేహం లేదు. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీ. సినిమా బాగుందని ఆడియన్స్ క్లాప్స్ కొడతారు'' అన్నారు. ''ఫన్, థ్రిల్, రొమాన్స్, ఎమోషన్స్... ఇలా అన్ని అంశాలు కలిసి ఉండి ఓ యునిక్ కాన్సెప్ట్‌తో రూపొందిన కమర్షియల్ ఫిల్మ్ ఇది'' అన్నారు అర్జున్. ''ఈ సమ్మర్‌కి పర్ఫెక్ట్ ట్రీట్ ఈ ఫిల్మ్. వందకు వంద శాతం ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు నిర్మాతలు–కథానాయికలు.

సాక్షి బిజినెస్

గురువారం
2-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)

	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	188	38
	74,482	22,604

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	15,595	▽	62
డోజోన్స్	37,915	△	99
ఎఫ్‌టీఎస్ఈ 100	8,162	△	17
డాక్స్ (మంగళవారం ముగింపు)	17,932	▽	186
షాంఘై (మంగళవారం ముగింపు)	3,105	▽	8
నికాయ్	38,274	▽	132


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	81.84	85.13
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	102.36	106.93
€	యూరో	ధామస్‌కుక్	87.44	91.55
¥	జపాన్ ఎన్ (100)	ధామస్‌కుక్	43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	52.71	56.97
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	59.29	63.53
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	21.85	23.62
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.39	12.39

అదానీ విల్మర్.. జూమ్

క్యూ4లో రూ. 157 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం అదానీ విల్మర్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 67 శాతం దూసుకెళ్లి రూ. 157 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో కేవలం రూ. 94 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 14,186 కోట్ల నుంచి రూ. 13,342 కోట్లకు క్షీణించింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 582 కోట్ల నుంచి భారీగా పడిపోయి రూ. 148 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 59,148 కోట్ల నుంచి రూ. 51,555 కోట్లకు బలహీనపడింది. ఫార్చూన్ బ్రాండుతో కంపెనీ వంట నూనెలు, ఫుడ్, ఎఫ్ఎంసీజీ ప్రొడక్టులను విక్రయించే సంగతి తెలిసిందే. ఫుడ్, ఎఫ్ఎంసీజీ బిజినెస్ గత రెండేళ్లలోనే దాదాపు రెట్టింపుకాగా.. రూ. 5,000 కోట్లకు చేరినట్లు కంపెనీ ఎండీ, సీఈవో అంగ్షూ మల్లిక్ వెల్లడించారు.

అదానీ గ్రీన్ లాభం డౌన్

రూ. 381 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం నీరసించి రూ. 381 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 440 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 3,495 కోట్ల నుంచి రూ. 4,855 కోట్లకు ఎగసింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,281 కోట్ల రూ. 1,196 కోట్లకు నీరసించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 13,840 కోట్ల నుంచి రూ. 17,218 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 991.6 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను విక్రయించింది. 2022–23లో విద్యుత్ అమ్మకాలు 906.2 కోట్ల యూనిట్లుగా నమోదయ్యాయి. విద్యుత్ పంపిణీ బిజినెస్‌పై రూ. 1,334 కోట్ల పెట్టుబడి వ్యయాలు వెచ్చించగా.. బాండ్ బైబ్యాక్ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక రుణ భారాన్ని రూ. 855 కోట్లకు తగ్గించుకున్నట్లు కంపెనీ పేర్కొంది.

అంబుజా సిమెంట్స్.. గుడ్

రూ. 1,526 కోట్లు

న్యూఢిల్లీ: అంబుజా సిమెంట్స్ గత చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో రూ. 1,526 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,966 కోట్ల నుంచి రూ. 8,894 కోట్లకు ఎగసింది. కంపెనీ గత త్రైమాసికంలో సంఘీ ఇండస్ట్రీస్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో క్యూ4సహా పూర్తి ఏడాదికి(15 నెలలకు) ఫలితాలు పోల్చి చూడతగదని కంపెనీ పేర్కొంది. కాగా.. కన్సాలిడేటెడ్ ఫలితాలలో కంపెనీకి 51 శాతం వాటాగల అనుబంధ సంస్థ ఏసీసీ పనితీరు సైతం కలసి ఉన్నట్లు వివరించింది. క్యూ4లో అంబుజా సిమెంట్స్ రూ. 532 కోట్ల స్టాండెలోన్ నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 4,780 కోట్లుగా నమోదైంది. ఇక కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 16.6 మిలియన్ టన్నుల(ఎంటీ) అమ్మకాలు సాధించగా.. విడిగా అంబుజా అమ్మకాలు 9.5 ఎంటీగా నమోదయ్యాయి. వాటాదారులకు షేరుకి రూ. 2 డివిడెండ్ ప్రకటించడం గమనార్హం.

పెట్రోల్ అప్- డీజిల్ డీలా



ఏప్రిల్ గణాంకాలు

న్యూఢిల్లీ: దేశీయంగా గత నెలలో పెట్రోల్‌కు డిమాండ్ పుంజుకోగా.. డీజిల్ అమ్మకాలు క్షీణించాయి. ఏప్రిల్‌లో పెట్రోల్ విక్రయాలు 12.3 శాతం పెరిగాయి. అయితే డీజిల్ సేల్స్ 2.3 శాతం నీరసించాయి. మార్చిలోనూ డీజిల్‌కు డిమాండ్ 2.7 శాతం తగ్గడం గమనార్హం! దేశవ్యాప్త సార్వత్రిక ఎన్నికల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తాజా గణాంకాలకు ప్రాధాన్యత ఏర్పడినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ రంగ దిగ్గజాలు ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ గణాంకాల ప్రకారం గత నెలలో 2.97 మిలియన్ టన్నుల పెట్రోల్ విక్రయమైంది. 2023 ఏప్రిల్‌లో ఇవి 2.65 ఎంటీ మాత్రమే. దేశీ ఇంధన అమ్మకాలలో ఇవి 90 శాతం వాటాను ఆక్రమించే సంగతి తెలిసిందే. ఇక డీజిల్ వినియోగం 7 మిలియన్ టన్నులకు పరిమితమైంది. కాగా.. రెండేళ్ల నిలకడ తదుపరి మార్చి మధ్యలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ. 2 చొప్పున దిగివచ్చాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-5-2024 ఫామ్ ధర...

విశాఖ	400–00
చిత్తూరు	478–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385–00
విజయవాడ	385–00
రిటైల్ ధర (డజను)	48.00
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

ఏప్రిల్‌లో 'ఆటో' అమ్మకాలు అంతంతే

సార్వత్రిక ఎన్నికల నేపథ్యం, అధిక బేస్ ప్రభావం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏప్రిల్‌లో వాహన విక్రయాలు అంతంత మాత్రంగా సాగాయి. 2024–25 తొలి నెలలో మొత్తం 3.38 లక్షల ఆటో మొబైల్ అమ్మకాలు జరిగాయి. అంతకు ముందు ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3.32 లక్షల యూనిట్లతో పోలిస్తే 1.77% మాత్రమే అధికంగా ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిమాండ్ తగ్గడం, అంతకు ముందు రెండేళ్ల అధిక బేస్ ప్రభావం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

- దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఏప్రిల్‌లో 168,089 కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదేనెలలో అమ్మకాలు 1,60,529 కార్లతో పోల్చితే 5% వృద్ధిని నమోదు చేసింది.
- హ్యుందాయ్ గతేదాది ఏప్రిల్‌లో మొత్తం 58,201 వాహనాలను విక్రయించగా, ఈ సంఖ్య 9.5% పెరిగి 63,701 యూనిట్లకి చేరింది.
- టాటా మోటార్స్ వాహన విక్రయాలు 11.5% వృద్ధి సాధించాయి. ఏప్రిల్‌లో 77,521 వాహనాలు అమ్ముడయ్యాయి. ఇవి ఏడాది ఏప్రిల్‌లో 69,599 యూనిట్లుగా ఉన్నాయి.

రెండుగా గోద్రెజ్ గ్రూప్..



- లిస్టెడ్ కంపెనీలు ఆది, నాదిర్ గోద్రెజ్‌ల చేతికి..
- మిగతావి దాయాదులు జంషీద్, స్మిత సొంతం

న్యూఢిల్లీ: గృహోపకరణాల నుంచి రియల్టీ, ఏవియేషన్ వరకు వివిధ రంగాల్లో విస్తరించి, వందేళ్ల పైగా చరిత్ర గల గోద్రెజ్ గ్రూప్ రెండుగా విడిపోనుంది. గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలు ఆది గోద్రెజ్ ఆయన సోదరుడు నాదిర్‌కు దక్కనుండగా మిగతావి వారి దాయాదులు జంషీద్ నౌరోజీ గోద్రెజ్, ఆయన సోదరి స్మితా కృష్ణ గోద్రెజ్‌లకు లభించనున్నాయి. రెండు వర్గాలు గోద్రెజ్ బ్రాండ్ పేరును ఉపయోగించుకుంటాయి. అయితే, ఒక గ్రూప్ వ్యాపారంలోకి మరొకటి ఆరేళ్ల పాటు విస్తరించకుండా ఇరు వర్గాలు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. అటు తర్వాత ఒకరి వ్యాపారంలోకి మరొకరు కార్యకలాపాలు విస్తరించవచ్చు. కానీ అందుకోసం గోద్రెజ్ పేరును ఉపయోగించుకోవడానికి ఉండదు. విభజన ప్రక్రియంతా వాటాల బదలాయింపు రూపంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒప్పందం ప్రకారం గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్‌లోని గోద్రెజ్ ఇండస్ట్రీస్, గోద్రెజ్ కన్జూమర్ ప్రొడక్ట్స్, గోద్రెజ్ ప్రాపర్టీస్, గోద్రెజ్ అగ్రోవెట్ మొదలైనవి ఆది గోద్రెజ్, నాదిర్‌లకు దక్కుతాయి. మరోవైపు గోద్రెజ్ అండ్ బాయిస్ మాన్యుఫాక్చరింగ్ తదితర సంస్థలు ఉన్న గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్‌కి జంషీద్ సారథ్యం వహిస్తారు. కోట్ల రూపాయల విలువ చేసే వేల కొద్దీ ఎకరాల స్థలాలు గోద్రెజ్ అండ్ బాయిస్ (జీఅండ్‌బీ) కిందే ఉంటాయి. దీనిపై మరో ఒప్పందం కుదిరే అవకాశం ఉంది.

జీఎస్‌టీ రికార్డు వసూళ్లు

ఏప్రిల్‌లో రూ.2 లక్షల కోట్ల పైకి ■ 2023 ఇదే నెల ఇప్పటి వరకూ టాప్ ■ సమీక్షా కాలంలో 12.4 శాతం వృద్ధి



సాక్షి, న్యూఢిల్లీ: భారత్ వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో చరిత్రాత్మక రికార్డు సృష్టించాయి. సమీక్షా నెల్లో 2.10 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇప్పటి వరకూ ఈ స్థాయి వసూళ్లు ఇదే తొలిసారి. 2023 ఇదే నెలలో నమోదయిన రూ.1.87 లక్షల కోట్లు ఇప్పటి రికార్డు. అంటే సమీక్షా నెల్లో వార్షిక ప్రాతిపదికన 12.4 శాతం పురోగతి నమోదయ్యిందన్నమాట. ఆర్థిక క్రియాశీలత, దిగుమతుల పురోగతి వంటి అంశాలు జీఎస్‌టీ రికార్డుకు కారణమయ్యింది.

విభాగాల వారీగా ఇలా...

- మొత్తం జీఎస్‌టీ వసూళ్లు రూ.2,10,267 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ రూ.43,846 కోట్లు.
- స్టేట్ జీఎస్‌టీ రూ.53,538 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.99,623 కోట్లు
- సెస్ రూ.13,260 కోట్లు (దిగుమతులపై రూ.1,008 కోట్లుసహా)

ఏపీలో 12%, తెలంగాణలో 11% వృద్ధి

కాగా, జీఎస్‌టీ ఇంటర్ గవర్నమెంట్ సెటిల్మెంట్‌లో భాగంగా ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ నుంచి కేంద్ర జీఎస్‌టీకి రూ.50,307 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీకి రూ.41,600 కోట్లు కేంద్ర ఆర్థిక శాఖ పంపిణీ చేసింది. దీంతో మొత్తంగా కేంద్ర జీఎస్‌టీగా రూ.94,153 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీగా రూ.95,138 కోట్ల ఆదాయం సమీక్షా నెల్లో సమకూరినట్లయ్యింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఏప్రిల్ నెలలో జీఎస్‌టీ వసూళ్లు వృద్ధిని కనబరిచాయి. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్‌టీ వసూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 12% వృద్ధితో రూ.4,850 కోట్లు, తెలంగాణలో 11% వృద్ధితో రూ.6,236 కోట్లు నమోదయ్యాయి. అయితే దేశంలోనే అత్యధిక జీఎస్‌టీ వసూళ్లు మహారాష్ట్రలో నమోదయ్యాయి. ఆ రాష్ట్రంలో వసూళ్లు 13 శాతం వృద్ధితో రూ.37,671 కోట్లకు ఎగశాయి.

గత ఆర్థిక సంవత్సరంలో నుంచి (అంకెలు రూ. లక్షల కోట్లలో)	
ఏప్రిల్ 2023	1.87
మే	1.57
జూన్	1.61
జూలై	1.60
ఆగస్టు	1.59
సెప్టెంబర్	1.63
అక్టోబర్	1.72
నవంబర్	1.67
డిసెంబర్	1.64
జనవరి 2024	1.74
ఫిబ్రవరి	1.68
మార్చి	1.78
ఏప్రిల్	2.10

2017జూలైలో తాజా పరోక్ష పన్ను వ్యవస్థ జీఎస్‌టీ ప్రారంభమైన తర్వాత 2024 ఏప్రిల్, 2023 ఏప్రిల్, 2024 మార్చి, 2024 జనవరి, 2023 అక్టోబర్ ఇప్పటి వరకూ టాప్-5 జీఎస్‌టీ నెలవారీ వసూళ్లను నమోదుచేశాయి.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపిందాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

» ఐసీఏఆర్, అనుబంధ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ ప్రోగ్రామ్స్
» ఐసీఏఆర్ ఏఐఈఈఏ(పీజీ) స్కోర్ ఆధారంగా ప్రవేశాలు
» అగ్రికల్చరల్, అనుబంధ రంగాల్లో కెరీర్స్‌కు సోపానం
» ఐసీఏఆర్-ఏఐఈఈఏ పీజీ-2024 నోటిఫికేషన్ విడుదల

అగ్రి కెరీర్.. ఎవర్ గ్రీన్!

అగ్రికల్చర్, సంబంధిత రంగాల్లో కెరీర్ అవకాశాలకు కొదవలేదు. పీజీ స్థాయిలో అగ్రికల్చర్, అనుబంధ విభాగాల్లో స్పెషలైజేషన్స్ పూర్తి చేస్తే ఈ రంగంలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అగ్రికల్చర్, అనుబంధ కోర్సులను అందించడంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)కు మంచి పేరుంది. ఈ ఇన్‌స్టిట్యూట్ తాజాగా.. ఐసీఏఆర్-ఏఐఈఈఏ (పీజీ)-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఐసీఏఆర్-ఏఐఈఈఏ(పీజీ) కోర్సుల వివరాలు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..



దేశంలో అగ్రికల్చర్ విద్య నిర్వహణ, పర్యవేక్షణ కోసం కేంద్ర వ్యవసాయ శాఖ పరిధిలో ఏర్పాటైన సంస్థ.. ఐకార్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్). ఈ సంస్థ పరిధిలో దేశవ్యాప్తంగా 74 అగ్రికల్చర్ యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్ వివిధ కోర్సులను అందిస్తున్నాయి. ఐకార్ పరిధిలోని యూనివర్సిటీలు, కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఏఐఈఈఏ(పీజీ) పరీక్షను నిర్వహిస్తున్నారు. ఆయా యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో 30 శాతం సీట్లకు ఏఐఈఈఏ పీజీలో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

ఇతర రాష్ట్రాల్లో ప్రవేశం

రాష్ట్రాల స్థాయిలోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు.. ఐసీఏఆర్-ఏఐఈఈఏ పీజీ అదనపు పరీక్షగా చెప్పొచ్చు. ఒక రాష్ట్రానికి చెందిన విద్యార్థి ఏఐఈఈఏ స్కోర్ ఆధారంగా ఇతర రాష్ట్రాల్లోని అగ్రికల్చరల్ యూని వర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆల్ ఇండియా కోటా పరిధిలోని 30 శాతం సీట్లకు పోటీ పడే అవకాశం లభిస్తుంది.

పీజీ కోర్సులు ఇవే

ప్లాంట్ బయో టెక్నాలజీ, ప్లాంట్ సైన్స్, ఫిజికల్ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్, స్టాటిస్టికల్ సైన్స్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/ఆగ్రో ఫారెస్ట్రీ అండ్ సిల్వి కల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, వాటర్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, ఆగ్రోనమీ, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, హోంసైన్స్, సోషల్ సైన్స్ తదితర విభాగాల్లో దాదాపు 70 స్పెషలైజేషన్స్‌లో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఏఐఈఈఏ (పీజీ) అర్హత

సంబంధిత విభాగంలో బీఎస్సీ అగ్రికల్చర్/బీటెక్/బీవీఎస్సీ అండ్ ఏహెచ్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

480 మార్కులకు పరీక్ష

ఏఐఈఈఏ(పీజీ) పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఈ పరీక్ష మొత్తం 120 ప్రశ్నలు-480 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 120 నిమిషాలు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష ప్రశ్న పత్రం ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.

స్కాలర్‌షిప్ సదుపాయం

ఐసీఏఆర్-ఏఐఈఈఏ స్కోర్ ఆధారంగా.. ఐసీఏఆర్ అనుబంధ అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన వారికి ఉపకార వేతనం లభిస్తుంది. నెలకు రూ.12,640 చొప్పున రెండేళ్ల పాటు ఐసీఏఆర్-పీజీ స్కాలర్‌షిప్ అందిస్తారు. ఆరు వందలకు పైగా ర్యాంకు సాధించిన విద్యార్థులకు నేషనల్ టాలెంట్ స్కాలర్‌షిప్ (పీజీ) పేరిట నెలకు రూ.5వేలు చొప్పున రెండేళ్ల పాటు ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుంది.

ఉజ్వల కెరీర్‌కు మార్గం

ఐసీఏఆర్-ఏఐఈఈఏ (పీజీ) ఎంట్రన్స్‌తో పీజీ ప్రోగ్రామ్‌లో చేరి పూర్తి చేసుకున్న వారికి చక్కటి కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. ఇటీవల కాలంలో జాబ్ మార్కెట్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫార్మింగ్ సెక్టార్ ఉద్యోగాల కల్పనలో ముందంజలో నిలుస్తోంది. దీంతో.. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నైపుణ్యం ఉన్న మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. వ్యవసాయ విద్యను అభ్యసించిన వారికి కెరీర్ పరంగా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ప్రభుత్వ కొలువులు

అగ్రికల్చర్ అనుబంధ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ప్రధానంగా.. వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్స్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ప్లాంటేషన్స్, ఫెర్టిలైజర్ కంపెనీలు, అగ్రికల్చరల్ మెషినరీలు, అగ్రికల్చరల్ ప్రొడక్ట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల్లో కొలువులు దక్కించుకోవచ్చు. ఎఫ్‌సీఐ, నాబార్డ్‌తోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూరల్ బ్యాంకింగ్ విభాగాల్లోనూ ఆఫీసర్లు, మేనేజర్లుగా కెరీర్స్ సొంతం చేసుకోవచ్చు. పీహెచ్‌డీ పూర్తి చేస్తే ఐసీఏఆర్, ఐఏఆర్ఐ వంటి అగ్రికల్చర్ రీసెర్చ్ కేంద్రాలతోపాటు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిధిలోని రీసెర్చ్ కేంద్రాల్లో సైంటిస్ట్ హోదాలో స్థిరపడొచ్చు.

డిగ్రీ స్థాయి పుస్తకాల అధ్యయనం

ఏఐఈఈఏలో విజయానికి అభ్యర్థులు.. తాము దరఖాస్తు చేసుకున్న పేపర్‌ను అనుసరించి డిగ్రీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా కోర్ అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా డొమైన్ విభాగంలో కీలక భావనలు, సిద్ధాంతాలు, వాటి ఉద్దేశం వంటి వాటిపైనా దృష్టి పెట్టాలి.

ఐసీఏఆర్-ఏఐఈఈఏ (పీజీ) ముఖ్యాంశాలు

- ఐసీఏఆర్ అనుబంధ ఇన్‌స్టిట్యూట్‌లలో ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఏఐఈఈఏ(పీజీ)
- ప్రస్తుతం జాతీయ స్థాయిలో 74 యూనివర్సిటీలు, నాలుగు ఐసీఏఆర్ డీమ్డ్ యూనివర్సిటీలు, మూడు సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలు, నాలుగు సెంట్రల్ యూనివర్సిటీల్లో అమలవుతున్న ఏఐఈఈఏ ఆల్ ఇండియా కోటా. ■ ఏఐఈఈఏ (పీజీ)లో ప్రతిభ ఆధారంగా అగ్రి యూనివర్సిటీస్‌లో ప్రవేశం.
- కోర్సు చదివే సమయంలో ప్రతి నెలా స్కాలర్‌షిప్ సదుపాయం. ■ కోర్సులు పూర్తి చేసుకున్నాక ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 11
- దరఖాస్తుల సవరణ: 2024, మే 13 – 15
- ఎంట్రన్స్ తేదీ: 2024, జూన్ 29
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్, వరంగల్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://exams.nta.ac.in/ICAR

టీచర్ కెరీర్‌కు మార్గం.. ఎడ్‌సెట్!

విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది. ఇలాంటి ఉపాధ్యాయ వృత్తిలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సు.. బీఈడీ! ఈ కోర్సులో ప్రవేశానికి మార్గం.. ఎడ్‌సెట్. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం తెలంగాణలో టీఎస్ ఎడ్‌సెట్ 2024 ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఏడాది ఈ పరీక్షను నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ ఎడ్‌సెట్ 2024కు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» టీఎస్ ఎడ్‌సెట్ 2024 ప్రకటన విడుదల



తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశం పొందాలంటే.. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఏదైనా డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణత సాధించినవారు టీఎస్ ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు

కనీసం 50 శాతం మార్కులతో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ(హోంసైన్స్), బీసీఏ, బీబీఎం, బీఏ (ఓరియంటల్ లాంగ్వేజ్), బీబీఏ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు/ఫైనల్ పరీక్షలకు హాజరైన వారు దరఖాస్తుకు అర్హులు. బీఈ/బీటెక్ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులను సాధించాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ ఇతర ప్రభుత్వ రిజర్వేషన్లు కలిగిన అభ్యర్థులకు ఉత్తీర్ణత శాతంలో సడలింపు ఉంది. వీరు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి.

వయసు

జూలై1, 2024 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

వీరికి అర్హతలేదు

ఎంబీబీఎస్, బీఎస్సీ(అగ్రికల్చర్), బీవీఎస్సీ, బీహెచ్ఎంటీ, బీఫార్మసీ, ఎల్ఎల్‌బీ వంటి జాబ్ ఓరియెంటెడ్, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు టీఎస్ ఎడ్‌సెట్ పరీక్ష రాసేందుకు, బీఈడీ కోర్సులో చేరేందుకు అనర్హులు. డిగ్రీ లేకుండా పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు కూడా ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కాదు.

పరీక్ష ఇలా

ఎడ్‌సెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా నిర్వహిస్తారు. సబ్జెక్టు/కంటెంట్-60 మార్కులకు(మ్యాథమెటిక్స్-20 మార్కులు, సైన్స్-20 మార్కులు, సోషల్ స్టడీస్-20 మార్కులు), టీచింగ్ అప్టిట్యూడ్-20 మార్కులు, జనరల్ ఇంగ్లిష్-20 మార్కులు, జనరల్ నాలెడ్జ్ అండ్ ఎడ్యుకేషనల్ ఇష్యూస్-30 మార్కులు, కంప్యూటర్ అవేర్‌నెస్-20 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

కనీస మార్కులు

ఎడ్‌సెట్‌లో అర్హత పొందేందుకు కనీసం 25 శాతం మార్కులు అంటే.. మొత్తం 150 మార్కులకు 38 మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు కనీస అర్హత మార్కుల నిబంధన లేదు.

ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చివరి తేదీ: 06.05.2024.
- ఆలస్య రుసుముతో 13.05.2024 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- హాల్ టికెట్ల డౌన్‌లోడ్: 20.05.2024
- టీఎస్ ఎడ్‌సెట్ పరీక్ష తేదీ: 23.05.2024
- వెబ్‌సైట్: https://edcet.tsche.ac.in

ప్రిపరేషన్ ఇలా..

ఫిజికల్, బయోలాజికల్ సైన్స్

ఆహారం, జీవులు, జీవన ప్రక్రియలు, జీవ వైవిధ్యం, కాలుష్యం, పదార్థం,కాంతి, విద్యుత్, అయస్కాంతత్వం, వేడి, ధ్వని, కదలిక, మార్పులు, వాతావరణం, బొగ్గు అండ్ పెట్రోల్, సహజ సిద్ధమైన దృగ్విషయం, నక్షత్రాలు, సౌరవ్యవస్థ, లోహశాస్త్రం, రసాయన ప్రతిచర్యల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. వీటికి సమాధానాలు గుర్తించేందుకు స్కూల్ స్థాయి పాఠ్యపుస్తకాలను చదవాలి.

సాంఘిక శాస్త్రం

భౌగోళిక శాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం అంశాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. ఇందుకోసం తెలంగాణ స్టేట్ కరిక్యులం ప్రాథమిక స్థాయి నుంచి పదోతరగతి వరకూ పుస్తకాలను సమగ్రంగా చదవాలి. నిర్దిష్టమైన టైమ్ టిబుల్ సిద్ధం చేసుకొని.. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ కొనసాగించాలి.

మ్యాథమెటిక్స్ సిలబస్

సంఖ్యావ్యవస్థ, వాణిజ్య గణితం, బీజ గణితం, జ్యామితి, కొలతలు, త్రికోణమితి, సమాచార నిర్వహణ(డేటా హ్యాండ్లింగ్) అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం పదోతరగతి వరకూ గణితం పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నలను వీలైనన్ని ఎక్కువసార్లు ప్రాక్టీస్ చేయాలి.

టీచింగ్ అప్టిట్యూడ్

అప్టిట్యూడ్‌కు సంబంధించి బోధన అభ్యసన ప్రక్రియ, తరగతి గదిలో పిల్లలతో వ్యవహరించే విధానం, విశ్లేషణాత్మక ఆలోచన, జనరల్ ఇంటెలిజెన్స్ వంటివి వాటిపై ప్రశ్నలు ఉంటాయి.

జనరల్ ఇంగ్లిష్

రీడింగ్ కాంప్రహెన్షన్, స్పెల్లింగ్ ఎర్రర్, వొకాబ్యులరీ, ఫ్రేస్ రీప్లేస్‌మెంట్, ఎర్రర్ డిటెక్షన్ అండ్ వర్డ్ అసోసియేషన్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. దీనికోసం హైస్కూల్ స్థాయి ఏదైనా ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాన్ని చదవాలి. పాత ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ నాలెడ్జ్, ఎడ్యుకేషనల్ ఇష్యూస్

కరెంట్ అఫైర్స్‌లో ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, సమకాలీన విద్యాసమస్యలు, జనరల్ పాలసీలు, సైంటిఫిక్ పరిశోధనలు, తాజా ప్రాంతీయ పరిణామాలు, అవార్డులు, వాతావరణ పరిస్థితులకు సంబంధించిన అంశాలుంటాయి. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ కోసం పత్రికలను చదవాలి. దినపత్రికల్లో ముఖ్యమైన వార్తలను నోట్స్ రూపంలో సిద్ధం చేసుకొని ఎప్పటికప్పుడు రివైజ్ చేస్తుండాలి.

కంప్యూటర్ అవేర్‌నెస్

కంప్యూటర్, ఇంటర్నెట్, మెమొరీ, నెట్ వర్కింగ్, ఫండమెంటల్స్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.

క్లుప్తంగా...

ఆఫ్‌లైన్‌లో గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షను ఆఫ్‌లైన్‌లో ఓఎంఆర్ ఆధారంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్‌-1 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ ఈ ఏడాది ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్ష (ఆబ్జెక్టివ్ టైప్)ను జూన్ 9న నిర్వహించనున్నట్లు ఇప్పటికే కమిషన్ వెల్లడించింది. తాజాగా ఈ పరీక్షను ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు కమిషన్ కార్యదర్శి నవీన్‌నికోలస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈమేరకు సన్నద్ధం కావాలని సూచించారు.

ఎన్‌ఐఎన్‌లో ఎమ్మెస్సీ న్యూట్రిషన్‌కు నోటిఫికేషన్ విడుదల

లాలాపేట: ఐసీఎంఆర్‌-నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్‌లో) అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్, భారత ప్రభుత్వం అనుబంధంగా 2024-25 విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ ప్రోగ్రాం ఇన్ అప్లైడ్ న్యూట్రిషన్ అండ్ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. డిగ్రీ బీఎస్సీ అభ్యర్థులు ఈ కోర్సుకు అర్హులని అధికారులు వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు న్యూఢిల్లీ, కోల్‌కతా ప్రాంతాల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్టు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఐసీఎంఆర్‌-ఎన్‌ఐఎన్ వెబ్‌సైట్ www.icmr.nic.in ను సందర్శించాలని సూచించారు.

ఉచిత నీట్, ఐఐటీ గైడెన్స్

సాక్షి, హైదరాబాద్: టెన్త్ ఉత్తీర్ణులకు ఐఐటీ, నీట్ పరీక్షలపై ఉచిత గైడెన్స్ ఇవ్వనున్నట్టు మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఎ.మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ హైదరాబాద్‌లోని అకాడమీలో ప్రముఖ ఐఐటీయన్స్, వైద్యులు ఈ కెరీర్ గైడెన్స్ ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు 9090898928 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


హెచ్‌సీయూలో పీజీ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ షురూ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి 41 పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులలో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ వర్సిటీ దేశంలోనే టాప్‌టెన్ వర్సిటీలలో ఒకటిగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. హెచ్‌సీయూలో దేశవ్యాప్తంగా ఉన్న వారందరికీ అవకాశం కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్‌-2024 స్కోర్ కార్డుల ఆధారంగా అడ్మిషన్లను కల్పించేందుకు విశ్వవిద్యాలయ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. వాటిని ఆన్‌లైన్ ద్వారానే పంపాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి మే 15 చివరి తేదీ. వివరాలకు వెబ్‌సైట్ http://acad.uohyd.ac.in సంప్రదించాలని హెచ్‌సీయూ అధికారులు కోరుతున్నారు.

టీఎస్ ఐసెట్ దరఖాస్తు 7వ తేదీకి పొడిగింపు

టీఎస్ ఐసెట్ కన్వీనర్ నర్సింహాచారి వెల్లడి

కేయూ క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం (2024-2025)లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈనెల 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి బుధవారం తెలిపారు. గత నెల 30న గడువు ముగియడంతో మరోసారి పెంచినట్లు పేర్కొన్నారు. రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 17 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 27 వరకు ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు, పొరపాట్లు సరిదిద్దుకునేందుకు ఈనెల 17 నుంచి 20 వరకు అవకాశం ఉందని, 28వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నర్సింహాచారి వెల్లడించారు. టీఎస్ ఐసెట్ రెండు సెషన్‌లలో ఉంటుందని, జూన్ 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందని తెలిపారు. జూన్ 6న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మరో సెషన్‌లో కూడా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. జూన్ 15న ప్రాథమిక 'కీ'ని విడుదల చేస్తామని చెప్పారు. 'కీ'పై అభ్యంతరాలు జూన్ 16 నుంచి 19 వరకు స్వీకరిస్తామని వెల్లడించారు. టీఎస్ఐసెట్ ఫలితాలను జూన్ 28న విడుదల చేస్తామని పేర్కొన్నారు. టీఎస్ఐసెట్‌కు ఇప్పటివరకు 73 వేల వరకు దరఖాస్తులొచ్చాయని సమాచారం. గడువు పొడిగింపుతో ఈ సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.



నల్లగొండ జిల్లా గుడాపూర్‌లో అత్యధికంగా 46.6 డిగ్రీలు నమోదు

పదేళ్లలో ఇవే అత్యధికం

గత పదేళ్ల వేసవి సీజన్ ఉష్ణోగ్రతలతో పోలిస్తే ప్రస్తుతం నమోదవుతున్నవే అత్యధికమని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా మే ప్రారంభంలో నమోదయ్యే సాధారణ ఉష్ణోగ్రతలతో పోలిస్తే.. ఈసారి రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా నమోదవుతున్నాయని అంటున్నారు. ఎప్పుడూ కూడా హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్త అటుఇటుగా నమోదయ్యేవని.. ఇప్పుడు మాత్రం 2 నుంచి 4 డిగ్రీల మేర అధికంగా కొనసాగుతున్నాయని వివరిస్తున్నారు.

- రాష్ట్రవ్యాప్తంగా దంచికొడుతున్న ఎండలు
- చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటేసిన గరిష్ట ఉష్ణోగ్రతలు
- ఉత్తర ప్రాంత జిల్లాల్లో కొన్నిచోట్ల వడగాడ్పులు
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణశాఖ
- రాష్ట్రంలోని 11 జిల్లాలకు రెడ్ అలర్ట్.. మిగతా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- పగటిపూట ఇంట్లోంచి బయటికి వెళ్లొద్దని సూచన

నిప్పుల కొలిమి!

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది.. దంచికొడుతున్న ఎండలతో కుతకుతలాడుతోంది. చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కుపైనే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్నిచోట్ల 46 డిగ్రీలు కూడా దాటిపోయాయి. బుధవారం అత్యధికంగా నల్లగొండ జిల్లా గుడాపూర్‌లో 46.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ములుగు జిల్లా మంగపేటలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5, నల్లగొండ జిల్లా చండూరులో 46.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు అత్యధికంగా కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఖమ్మం జిల్లాల్లో సాధారణం కంటే ఏకంగా 5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు తెలిపింది.

11 జిల్లాలకు రెడ్ అలర్ట్..

ఎండలు పెరిగిపోయిన నేపథ్యంలో.. రాష్ట్రంలోని 11 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయని.. వడగాడ్పులు వీస్తాయని హెచ్చరించింది. మిగతా జిల్లాలన్నింటికీ కూడా ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆ జిల్లాల్లోనూ కొన్నిచోట్ల వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. మొత్తంగా వచ్చే నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వడగాడ్పులు వీయవచ్చని హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని.. తక్షణ సహాయక చర్యలు తీసుకునేలా సమాయత్తం కావాలని సూచించింది. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. మరోవైపు అక్కడక్కడా తేలికపాటి వానలు పడే అవకాశం కూడా ఉందని తెలిపింది.

ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ (సెల్సియస్‌లలో)

కేంద్రం	ఉష్ణోగ్రత
ఖమ్మం	45.0
భద్రాచలం	44.2
నిజామాబాద్	44.0
రామగుండం	44.0
మహబూబ్‌నగర్	43.9
నల్లగొండ	43.5
మెదక్	43.2
హనుమకొండ	42.8
హైదరాబాద్	42.8
ఆదిలాబాద్	42.3
విజయవాడ	43.0
విశాఖపట్నం	37.4

సబ్‌స్టేషన్లకు సన్‌స్ట్రోక్

ఎండలతో పేలుడు.. మంటలు



పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాకర్లపల్లి సబ్‌స్టేషన్ ఫీడర్‌లో చెలరేగుతున్న మంటలు

మంథని/పాలకుర్తి(రామగుండం): పెద్దపల్లి జిల్లా మంథని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ సామర్థ్యంగల కాకర్లపల్లి ఫీడర్ సిటీ బుధవారం ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లోని అయిల్ బయటకు వచ్చి మంటలు చెలరేగాయి. ఫైర్ ఆఫీసర్ సదానందం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. పాలకుర్తి మండలం వేంనూర్ పంప్‌హౌస్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 220 కేవీ విద్యుత్ హైటెన్షన్ లైన్ వదులవడంతో దానికింద 11కేవీ విద్యుత్ తీగలను తాకి ఒక్కసారిగా మంటలు లేచాయి. అదే సమయంలో మారేడుపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేసి వస్తున్న పాలకుర్తి ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ ఈ దృశ్యాలను చూసి పుట్నూర్ సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.. పలువురి ఇళ్లలో గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి.



రాణి (ఫైల్)



యశ్వంత్(ఫైల్)



సరోజన(ఫైల్)



నర్సయ్య (ఫైల్)

ఎండదెబ్బకు 8 మంది మృత్యువాత

మృతుల్లో ఓ స్కూల్ హెచ్ఎం, ఐదేళ్ల బాలుడు

సాక్షి నెట్‌వర్క్: విపరీతమైన ఎండల ధాటికి వడదెబ్బకు గురై మత్యువాత పడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. బుధవారం ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఎనిమిది మంది చనిపోయారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన వస్త్ర వ్యాపారి పత్తిపాక రమేష్ (55), జనగామ పట్టణం గుండ్లగడ్డకు చెందిన రోజువారి కూలీ మహ్మద్ మోహినొద్దిన్ (52) వడదెబ్బకు గురై మృతి చెందారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఎన్నికల శిక్షణకు హాజరైన బషీరాబాద్ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హెచ్ఎం రాణి(45) వడదెబ్బతో సొమ్మసిల్లి కన్నుమూశారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పోలేపు శంకర్ (36), కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రొడ్డ నర్సయ్య(46), జమ్మికుంట పట్టణానికి చెందిన నిమ్మ సరోజన(50), రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దివ్యాంగ బాలుడు యశ్వంత్(5), రాజన్న సిరిసిల్ల జి ల్లా గంభీరావుపేట మండలం దమ్మన్న పే ట గ్రామానికి చెందిన చిప్పకూర్తి బాబు (49) వడదెబ్బకు తాళలేక చనిపోయారు.

వైఎస్ జగన్.. ఆ పేరే ఓ స్ఫూర్తి

- పేదల ఎదుగుదలకు సంక్షేమ పథకాలు అవసరం
- ఏపీలో అటు సంక్షేమం... ఇటు అభివృద్ధి కొనసాగుతోంది
- ప్రధానంగా వ్యవసాయం, విద్య, వైద్యంలో ఎన్నో మార్పులు జరిగాయి
- వలంటీర్ల వ్యవస్థ సరికొత్త సక్సెస్‌ఫుల్ కాన్సెప్ట్

సాక్షి ఇంటర్వ్యూలో ప్రముఖ సినీ నటుడు రాజా రవీంద్ర

ఇంటర్వ్యూ



'పేదలు ఎదగాలంటే ప్రభుత్వ సాయం కావాలి. అందుకు సంక్షేమ పథకాలు చాలా వరకూ తోడ్పడతాయి. ఒక వైపు సంక్షేమం... మరోవైపు అభివృద్ధి ఏపీలో సమపాళ్లలో జరుగుతోంది. అందుకు కారకుడైన జగన్ అంటే అందుకే నాకు ప్రత్యేకమైన అభిమానం' అంటున్నారు సినీ నటుడు రాజా రవీంద్ర. వ్యక్తిగతంగా తనకే కాదు చాలా మందికి ఆయన స్ఫూర్తి అంటూ కొనియాడారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై తన అభిప్రాయాల్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

పేదలు ఎదగాలంటే... ప్రభుత్వ ఆసరా కావాలి..

పేదలు, దిగువ మధ్య తరగతి వర్గాలు ఎదగాలంటే.. మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతికి చేరాలంటే అది వారి కాయకష్టం మీద అయ్యేపని కాదు. కాబట్టి తప్పకుండా సంక్షేమ పథకాలు అవసరమవుతాయి. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు రూపాల్లో ఆసరా అందిస్తోంది.అన్నివర్గాల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలంటే వారికి ప్రభుత్వం తప్పనిసరిగా అందివ్వాల్సింది విద్య, వైద్యం. ఈ విషయంలో చాలా మార్పులు జరిగాయి.

ఖరీదైన వైద్యానికీ సర్కారు సాయం

ప్రస్తుతం రోగాలు వస్తే దానికి వైద్యం ఎంత ఖరీదైపోయిందో మనందరికీ తెలిసిందే. ఇప్పుడు ఏ రోగం వచ్చినా లక్షలకు లక్షలు మంచినీళ్లలా ఖర్చుచేయాల్సి వస్తోంది. ఒక కిడ్నీ పాడైనా చికిత్సకు రూ.20 లక్షలపైనే ఖర్చవుతోంది. ఈ పరిస్థితుల్లో అనుకోని వ్యాధి వస్తే ఎగువ మధ్యతరగతి కుటుంబాలు ఎలా తట్టుకోగలవు? ఇక నిరుపేదల సంగతైతే వేరే చెప్పనక్కర లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ పథకం వారిని ఎంతగానో ఆదుకుంటోంది. ఇప్పుడు వైద్య పరిమితిని రూ.25లక్షలకు పెంచారు. ఇది నిజంగా ఎక్స్‌ట్రార్డినరీ స్టెప్.

దళారీలు లేకుండా చేరుతున్న లబ్ధి

సంక్షేమ పథకాల అమలు విషయంలో గ్రామ వలంటీర్ల విధానం చాలా మంచి కాన్సెప్ట్. వీరి వల్ల మధ్యలో ఎవరికీ ఎటువంటి లంచాలు, పైరవీలతో తావు లేకుండా పేదలకు పథకాలు అందుతున్నాయి. ఈ వ్యవస్థ ఎంత గొప్పదో... ప్రయోజనాలు పొందుతున్నవారికి బాగా అర్థమవుతుంది. ఈ సంక్షేమ పథకాలన్నీ ఎటువంటి ఆటంకం లేకుండా అమలు చేయడం గొప్ప విషయం. అధికారంలోకి రావడం కోసం పొత్తుల కన్నా ఒంటరిపోరుకే జగన్ సై అంటారు. ఆయన చాలా మందికి ఇన్‌స్పిరేషన్. ఆయన మీద అభిమానం చెక్కు చెదరలేదు. ఈ ఎన్నికల్లో జగన్ విజయం తథ్యం.

విద్యతోనే విజయం

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు నాడు నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలల్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. కొన్ని తరగతుల విద్యార్థులకు ట్యాబ్స్ అందిస్తున్నారు. అంతటితో ఊరుకోకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఇంగ్లిష్ మీడియం కూడా అందుబాటులోకి తెచ్చారు. ఇది ఒక సమగ్ర విద్యావికాస మార్గంగా చెప్పాలి. వీటన్నింటివల్లా పాఠశాలల్లో చదివే వారిలో కనీసం 10శాతం మంది వృద్ధిలోకి వచ్చే అవకాశం కచ్చితంగా ఉంటుంది. అలా వచ్చిన వారు రూ.లక్షల్లో జీతాలు తెచ్చుకోగలుగుతారు. అప్పుడు తప్పకుండా పేదల జీవన ప్రమాణాల స్థాయి మారిపోతుంది. నిజంగా జరగాల్సింది అదే. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అదే జరుగుతోంది.

– సాక్షి, అమరావతి

సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు ఇస్తున్న ముఠా గుట్టురట్టు



సాక్షి, హైదరాబాద్: బ్యాంకు ఖాతాల వివరాలు ఇస్తూ సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముఠాగుట్టు రట్టు అయ్యింది. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం...నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన ప్రణయ్‌షిండే కొందరితో కలిసి ఓ గ్యాంగ్ ఏర్పాటు చేశాడు. సైబర్ నేరగాళ్ల కోసం భైంసా మండలంలోని గ్రామీణులు, రైతులు, పేదల నుంచి బ్యాంక్ అకౌంట్స్‌కు అవసరమైన డాక్యుమెంట్లు సేకరించారు. కమీషన్ ఆశ చూపి వారి పేర్లతో 125కు పైగా బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కొరియర్‌లో పంపించిన సిమ్కార్డులతో బ్యాంక్ అకౌంట్స్ లింక్ చేశారు. ఎస్ఎంఎస్ అలర్ట్ సహా పాస్‌బుక్స్, చెక్‌బుక్స్, డెబిట్ కార్డులు ఇతర డాక్యుమెంట్లను సైబర్ నేరగాళ్లకు సప్లయ్ చేసేవాడు. ప్రణయ్‌షిండే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టుబడులు పెట్టేవాడు. టెలిగ్రామ్ యాప్ ద్వారా సైబర్ నేరగాళ్లతో కలిసి బెట్టింగ్‌కు ప్లాన్ చేశాడు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ప్రమోట్ చేస్తూ కస్టమర్లతో బెట్టింగ్ నిర్వహించేవాడు. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ అకౌంట్స్ అందించడం ప్రారంభించాడు. ప్రణయ్ సప్లయ్ చేసిన బ్యాంక్ అకౌంట్స్‌తో సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలుకు పాల్పడ్డారు. బెట్టింగ్ సహా ఇతర సైబర్ నేరాల ద్వారా దోచేసిన డబ్బును ఆ అకౌంట్స్‌లో డిపాజిట్ చేసి ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసుకునేవారు. రాష్ట్రంలో నమోదైన సైబర్ క్రైమ్ కేసుల్లో నిర్మల్ జిల్లా బ్యాంక్ అకౌంట్స్‌ను పోలీసులు గుర్తించారు. అనంతరం ప్రణయ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి పేరిట ఉన్న 3 బ్యాంక్ అకౌంట్స్, 43 చెక్‌బుక్స్, 30 ఏటీఎం కార్డులు, 2 మొబైల్ ఫోన్స్, 8 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.



గ్రామ సింహాలకు పరుగు పందెం

జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని బల్గెరలో గ్రామసింహాలకు పరుగు పందెం నిర్వహించారు. దిగంబర స్వామి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఈ పోటీలు నిర్వహించగా.. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీస్థాయిలో తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 14 జతల గ్రామ సింహాలు పాల్గొన్నాయి. కర్ణాటకలోని మందాపురం ప్రాంతానికి చెందిన యల్లప్ప గ్రామసింహాలు విజేతగా నిలవగా.. అయిజకు చెందిన గోపాల్ గ్రామసింహాలు రెండోస్థానంలో బల్గెరకు చెందిన నర్సయ్య గ్రామసింహాలు రెండోస్థానంలో నిలిచాయి.

– గట్టు (జోగుళాంబ గద్వాల జిల్లా)

'రైతుబంధు' సొమ్ము వెనక్కి రావడంపై చర్యలు

వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్ రైతుబంధు సొమ్ము వెనక్కి రావడంపై చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రైతులకు వేసిన డబ్బు మళ్లీ సర్కారు ఖాతాలోకి...' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ సీజన్‌లో 19,029 మంది రైతుల డీబీటీ విఫలమైనట్టు తెలిపారు. ప్రస్తుతం జిల్లాల వారీగా విఫలమైన కేసుల లోపాలను సరిచేస్తామని తెలిపారు. సరిచేశాక అర్హులైన రైతుల ఖాతాల్లోకి తిరిగి రైతు బంధు సొమ్ము జమ చేస్తామని పేర్కొన్నారు. కాగా, లబ్ధిదారులు వినియోగంలో లేని బ్యాంకు ఖాతా, పంట రుణ ఖాతా నంబర్ ఇవ్వడం వల్ల రైతుబంధు సొమ్ము జమ కాలేదని స్పష్టం చేశారు. గతంలోనూ ఇలాంటి కేసులు నమోదయ్యాయని ఆయన వెల్లడించారు.

ప్రాణం తీసిన రుణయాప్


వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్య



విష్ణువర్ధన్ (ఫైల్)

ఖిలా వరంగల్: రుణయాప్ నిర్వాహకుల బెదిరింపులతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం వరంగల్ నగరంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌కు చెందిన కమ్మంపాటి యాకయ్య, స్వరూప దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ (23) డిగ్రీ చదువుతున్నాడు. అతను తన స్నేహితుడి కోసం మొబైల్ యాప్ ద్వారా రుణాన్ని తీసుకున్నాడు. తిరిగి చెల్లించే క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. యాప్ నిర్వాహకులు తరచూ కాల్ చేసి బెదిరింపులకు పాల్పడుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం తెల్లవారుజామున బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏదో పడిపోయిన శబ్దం రావడంతో తండ్రి లేచి చూడగా విష్ణువర్ధన్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. తలుపులు తెరిచి గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

టుడేస్ గ్రాఫిక్



- సీఈవో వరల్డ్ మేగజీన్ రూపొందించిన ఈ హెల్త్ కేర్ ఇండెక్స్ కోసం ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు, యంత్రాలు ఉన్నాయా? నైపుణ్యం ఉన్న వైద్యులతోపాటు మందులు అందుబాటులో ఉన్నాయా? వాటి ధరలు, అలాగే ప్రభుత్వ సన్నద్ధత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

పిల్లలు పట్టించుకోవట్లేదు.. ఆస్తంతా అంజన్నకే

- కుమారుడు, కూతుళ్లు చూడటం లేదని ఓ తండ్రి ఆవేదన
- కొండగట్టు అంజన్న పేర తన ఆస్తి రాయాలని నిర్ణయం



అల్లీపూర్‌లో బాపురెడ్డి నివాసం

చిన్నకోడూరు(సిద్దిపేట): భార్యతో విబేధాలు.. పట్టించుకోని పిల్లలు.. దీంతో తననెవరూ పట్టించుకోవట్లేదని విసుగుచెందిన ఓ తండ్రి తన ఆస్తినంతా కొండగట్టు అంజన్న పేరిట రాసేయాలని నిర్ణయించుకున్నాడు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన కప్పెర బాపురెడ్డికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నాలుగెకరాల సాగు భూమి ఉంది. పిల్లలు ముగ్గురికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు ప్రవీణ్‌రెడ్డి భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. 2003లో భార్యతో గొడవపడిన బాపురెడ్డి హైదరాబాద్ వచ్చి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య అల్లీపూర్‌లోనే ఉంటుంది. ఈ క్రమంలో తననెవరూ పట్టించుకోవట్లేదని మనస్తాపానికి గురైన బాపురెడ్డి తన ఆస్తిని కొండగట్టు అంజన్న దేవాలయానికి రాసివ్వాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం ఆస్తిపత్రాలను హుండీలో వేయబోయాడు. పూజారులు అడ్డుకుని హుండీలో వేస్తే చెల్లుబాటు కాదని, ఆలయం పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. దీంతో గురువారం తన ఆస్తిని ఆలయం పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తానని బాపురెడ్డి చెబుతున్నారు. అయితే, కొండగట్టులో రామాలయం నిర్మిస్తేనే తన ఆస్తినంతా రాసిస్తానని బాపురెడ్డి బుధవారం ఫోన్‌చేసి చెప్పారని ఆలయ ఈవో అంటున్నారు.

బాపురెడ్డికి ఆరోగ్యం బాగాలేదు..

బాపురెడ్డి భార్య లక్ష్మి, కుమారుడు ప్రవీణ్‌రెడ్డి బుధవారం కొండగట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్‌ను కలిశారు. బాపురెడ్డికి ఆరోగ్యంగా బాగాలేదని, ఆయన రాసిస్తానన్న భూమి తమకు జీవనాధారమని ఈవోకు వివరించారు. తమకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.